UNIVERSAL
LIBRARY
OU_204587
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T83/P27V Accession No. T48'09

Author

Title 1950

This book should be returned on or before the date last marked below.

# వేంకటరావు

(సాంఘిక నిరూపక నవల)

శ్రీ మంజిపాక పార్వతీశ్వరశాస్త్రి బి. ఏ. గారిచే
రచింపఁబడినది

పబ్లిషర్సు
కొండపల్లి వీరవెంకయ్యా అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.

1950

# "మనలోపమాట—మనసులోమాట!"

మిత్రులారా!

నేనిప్పుడు చెప్పఁదలఁచుకొన్న కథను వినుటకు మీరందఱును వచ్చినారు. మీరిదివఱ కెందఱెందరో చెప్పిన యెన్నెన్నో కథలను వినియున్నారు. నేనును గొందఱు కొందఱు వినుచుండఁ గొన్ని కథలను—కొద్దియో, గొప్పయో—చెప్పియేయున్నాను. మీలో నందఱో యిందఱో యాకథలలో నంతయో, యింతయో వినియే యున్నారు. విన్నవారిలోఁ గొందఱు ఊఁ యనిరి, కొందఱు ఆఁ ? యనిరి కొందఱు ఆఁ ఆఁ ! యనిరి. కొందఱు—ఉఁ ఊఁ—యనిరి. కాని, నేనుమాత్రము ఊఁ యన్నను పొంగలేదు, ఆఁ? యన్న భయపడలేదు. ఆఁ ఆఁ! యన్న నులికిపడలేదు. ఉఁఊఁ—న్న గోపింపలేదు. ఆమాట తెలిసినవారి కందఱకును దెలిసియే యున్నది. దానిమాట కేమిగాని, దీనిమాట వినుఁడు.

"ఈకథ నీవు కల్పించినదేనా?" యని మీరడిగెదరేమో! ఔనని నేను దప్పక జవాబు చెప్పెదను.

"నిజముగా నేనా?" యని తర్కించి యడిగినఁ గాదని చెప్పెదను. "కాదా? ఏమేమి?" యని మరల నడిగినఁ "కొంత యౌను—కొంతకాదు." అని మరల జవాబు చెప్పెదను.

"ఏమి యీ యల్లర ? ఉన్నది యున్నట్లు చెప్పఁగూడదా" యని మీరనెదరేమో. అట్లయిన, నున్నది యున్నంతవఱకును, లేని

ది లేనంతవఱకును జెప్పెదను. వినుఁడు. కాని—అన్నట్టు—అదిమన లోమాట—కాదుకాదు, మనసులో మాట—సుఁడీ—. అది—వారి పురాణమువలె మీకును నాకును దప్ప—ఇతరుల కెవ్వరికిని దెలియఁగూడదు. మరచియైన—పీకలైనంతవరకు దాచిపెట్టుఁడు—కాదు—బయటపెట్టకుఁడు. ఇందు, "ఐత్తం కైత్తం—పైత్తం—", అని పామరులాడుకొనునట్లు, మూఁడురకములు కలిసినవి. "ములగ కూరకు మూఁడు పాకములా" యందురేమో! తోటకూర తొమ్మిది పాకములు చేయువారుకూడఁ గలరని నేఁ జెప్పగలను. మేమైనను—మీరైనను వారైననుఅప్పుచేసినప్పుకూడు తినుచుండియునాస్త్రి(అస్త్యై బ్బె యేమి వికారపు సంధి)—ఆస్త్రిపైఁగూర్చున్నట్లు డంబములు కొట్టఁగూడదు. ఇందలి సామాలకషి సీమదేశపు కామధేనువు—పుస్తకరూపమున—దయచేసినది—కాఁచి, చల్లార్చి యాపాలలోఁ దోడు కలిపి పెరుగుచేసితిని. ఆపెరుగులో మాయింటి నీళ్ళను—జాస్తిగానే సుఁడీ—పోసి, గిలకరించితిని. మజ్జిగ యైనది. ఒకరినడిగి యొకటియు, మఱియొకరి నడిగి మఱియొకటియు, నింకొకరినడిగి యింకొకటియు, వేఱొకరి నడిగి వేఱొకటియు—నేమేమో పనికివచ్చునని తోచిన వన్నియుఁ గలిపితిని. పలుచని తేట తయారయినది. ఇచ్చకువచ్చిన మేరకుఁ ద్రాగి—తేటగాని మఱి యేమియుఁ గాదుసుఁడీ—త్రాగి యానందింపుడు.

బాగుగా నున్నదని మంచిపాకమునఁ బడినదని—మీలో నందఱును—గొందఱైనను జాలు లెండు—తలఁచినచో—మా అడిగినచో—మఱియొకసారి—అనగాఁ దయారు—మరేమియునుగాదు — చేసి యిచ్చెదను. దయయుంచుఁడు. అన్నట్లు మఱియొక చిన్న దేవరహస్యము—స్వదేశ వస్తువులకన్న సీమదేశపు వస్తువులపై—ఏకాంత

ముగాఁ జెప్పుచున్నాను సుఁడీ—సీమదేశపు వస్తువులపై మనవారి కభిలాష మెండు. అది జ్ఞాపకముంచుకొనుఁడు. ఈమాట వీధిలో మాత్ర మనవద్దు—విన్నవారికి—వినని వారికిఁగూడ కోపమువచ్చును. తరువాత వారిపోరు పడలేము. జపము విడిచి—వేయుచున్నట్లు మన కేల యీ యవసరములేని—ఉన్నది—లేకేమి?— ఈ అవసరము లేని ప్రసంగము ! కథవినుడు.

గ్రంథకర్త.

# మొదటి ప్రకరణము

## భోజనశాల

రాత్రి యెనిమిదిగంటలైనది. ఇంటిలోఁ బనివాండ్రందఱును జప్పుడుచేయక మెల్లఁగా జాగ్రత్తగాఁ దమ పనులను జేసికొను చుండిరి. భోజనశాల విశాలముగను బరిశుభ్రముగ నుండెను. ఒక్క ప్రక్క పెద్ద పీఠముండెను. అందు శ్రీకృష్ణుని విగ్రహమును శ్రీదక్షిణామూర్తి విగ్రహమును ఇతర దేవతల విగ్రహములు చిన్నవి కొన్నియును బ్రతిష్ఠింపఁబడియుండెను. పీఠము మెట్లపై వరుసకు మూఁడేసి చొప్పున చిన్న ఇత్తడిదీపపు 'సెమ్మె'లు కలవు. అడుగుమెట్టున అవసర నైవేద్యమునకుఁ జిన్న వెండిపళ్లెమును దీపధూపము లొసంగుటకుఁ దగిన ఇత్తడిచెంబును మంగళహారతి యిచ్చుటకై పద్మములు చెక్కిన వెండిపళ్ళె మొకటియు నుండెను. ఆగదిలో రెండువరుసలుగా వేయఁబడిన చేవపీటలును పీట కొక్కొకటిచొప్పున నెడమప్రక్క నుంచఁబడిన వెండి మరచెంబులును పీటల కెదురుగా వేయఁబడిన లేజిగురుటాకులును అరటియాకుల కెడమప్రక్క నుంచఁబడిన వెండి గిన్నెలును జూచిన ధనికులకును నాశ్చర్యమగుచుండెను. నాటిరాత్రి కృష్ణాజీపంతులుగారియింట విందు భోజనానంతరము కొంతసేపుదాక పేకయాట. పంతులుగారి యింటి వంటబ్రాహ్మణుఁడు మిక్కిలి తెలివి తేటలు గలవాఁడగుటచే నెక్కడెక్కడ యేయేపదార్థము లెట్లుంచవలయునో యవి యట్లా సిద్ధముచేసియుంచెను, సిరికొద్దియును జిన్నెలును మగనికొద్దియును వన్నెలనునట్లు పంతులుగారి ధనమునకుఁ బరిచారకుల పనిపాట్లు తోడై క్రొత్తయందముం గలిగించెను.

దేవునిపీఠమునకుఁ బ్రక్కను వేయఁబడిన పెద్దపీటపై కృష్ణాజీ పంతులుగారు కూర్చుండిరి. వారెక్కడినుండివచ్చిరో వారి పూర్వపు చరిత్రమేమో యెవ్వరికిని దెలియదు. శుభాశుభములయందు వారి యింటికి వచ్చుచుఁ బోవుచుండు పురోహితులమూలమున వారు ఘూర్జరదేశపు బ్రాహ్మణులని యూరివారందఱు నెఱింగిరి, వారు రత్నవర్తకులనియు బరోడా, మైసూరు మొదలగు గొప్పగొప్ప సంస్థానములతో రత్నవర్తకముచేసి యొకటి రెండు లక్షలరూపాయలు సంపాదించిరనియు, వర్తకమున్నయే బ్రహ్మపురమునకువచ్చియందు గాపురముండి పోయిరనియు బ్రహ్మపురమునం దంతటను బ్రతీతికలదు. మొదట ధనముకలవారు తరువాత ఆంధ్రభాష నిస్పష్టముగా మాటలాడఁగలరు. ఆపైని పురోహితులందఱును వారియింటికి వచ్చుచుఁ బోవుచుందురు. కావున వారి కులగోత్రములను యథార్థముగాఁ దెలిసికొనవలసిన యవసరముగాని, కుతూహలముగాని, లేకయే యూరిలోని బ్రాహ్మణులందఱును వారియింట విందులకుఁ బోవుచుండిరి.

నాటిరాత్రి విందునకు వచ్చినవారందఱును ధనికులేగాని యం దొక్కడుమాత్రమే సామాన్యకుటుంబములోనివాఁ డుండెను. ఆయన పేరు వేంకటరావు వేంకటరావుగారితండ్రి బీదవాఁడు. ఊరివారిని మంచి చేసికొని యెట్లో యాయన కుమారునకుఁ బ్రథమశాస్త్రపరీక్షలోఁ గృతార్థుఁడగువఱకును జదువు చెప్పించెనుగాని ఆపైని మఱి చెప్పింపలేక పోయెను. కుటుంబస్థితిగతులనుబట్టి యాతఁ డంతటితోఁ జదువు చాలించి, ఛత్రపురమునఁ గలక్టరు కచేరిలో నిరువది రూపాయల భరణముపైఁ బ్రవేశింపఁ వలసియుండెనుగాని, భగవంతుఁడాతనికి మఱియొక వృత్తి వ్రాసిపెట్టియుండెను. బాల్యమునుండియును వేంకటరావుగారికి సంఘసంస్కరణమునందభిలాష మెండు. కావున, సం

ఘసంస్కరణమునఁ బనిచేయుచున్న యెవ్వఁడో యొకమహానుభావునితో నాయనకుఁ బరిచయముకలిగెను, ఆమహానుభావుఁ డాయన నెవ్వరో యొక జమీందారునియొద్దకుఁ దీసికొని పోయి "సిఫారసు" చేసెను. ఆసిఫారసు నంగీకరించి, యా జమీందారుగా రాయనను చెన్నపురి "మెడికల్ కాలేజి" లోఁ బ్రవేశపెట్టి, "ఖర్చు" లను దామే భరింపుచుండిరి. ఆ సహాయమువలన వేంకటరావుగారు "యల్. యమ్. యస్." తరగతిలోఁ గృతార్థుఁడై యింటికిఁ దిరిగి వచ్చెను. తనస్నేహితులందఱును ఆయనను రాజకీయోద్యోగమునఁ బ్రవేశింపవలసినదని బలవంతపెట్టిరిగాని, "తల యమ్ముకొని" జీవించుట కాయన కిష్టములేక, బ్రహ్మపురములోనే "ప్రైవేటుప్రాక్టీసు" ఆరంభించెను. వృత్తికిఁ గ్రొత్తవాఁడగుటచేతను, పెట్టిన "మందుల మదుపు" తక్కువగుటచేతను, "బాల్యజ్యోతిషము, స్త్రీవైద్యము" అను నమ్మకము ప్రజలకింకను విడువకుంటచేతను, "నేటివ్ వైద్యుల" ప్రభుత్వమింకను మిక్కుటముగా నుండుటచేతను, వేంకటరావుగారి యాదాయ మప్పటికిఁ దక్కువగానే యుండెను.

సహజముగ సౌందర్యముగలవాఁడు. ఆపైని క్రొత్తరకము ముస్తాబులయం దభిరుచిగలవాఁడు. దానికిఁదోడు "టెన్నిస్" ఆట యందు నేర్పుగలవాఁడు. కావున, సమజోడగు వారిందఱికి నాతనిపై నొకవిధమగు గౌరవముకుదిరి, వారంతని నాటపాటలకై లాగుకొని పోవుచుండిరి. కానిరోగులమంచములయొద్ద కనిపెట్టుకొని వృత్తిధర్మము చేసికొననీకుండిరి.

భోజనములైనతరువాత చేతులు గడిగికొని, తాంబూలము వేసికొనుటకై వారందఱును, మఱియొకగదిలోనికిఁ బోయిరి. గదిలో నడిమిదూలమున కొక పెద్ద 'హాంగింగ్ లైటు' వ్రేలగట్టఁబడియుండెను. రవివర్మచే వ్రాయఁబడిన వింతవింత చిత్తరువులతో గోడలలంకరింపఁ

బడెను. నేలపై జపానువారిచే చిత్రింపఁబడిన రంగులచాపలు వేయఁబడియుండెను. ఆచాపలపై నతిథులందఱును గూర్చుండి తాంబూలము వేసికొనుచుండిరి. ఆసమయమున నొకగదిలోనుండి మఱియొకగదిలోనికిఁ బోవుచు నొక యౌవనవతి వేంకటరావుగారిని జూచి చిన్న చిఱునవ్వు నవ్వెను. ఇతరులెవ్వరును దన్ను గనిపెట్టలేదని యామె యనుకొనెనేమోకాని, వేంకటరావునకుఁ బ్రక్కనున్న యొకఁడుమాత్ర మది కనిపెట్టెను. 'ఆమె యెవ్వతె? కృష్ణాజీగారి కుమార్తెవలెఁ గన్పట్టదే! నీవామెనెఱుఁగుదువా?'' అని యాతఁడడిగెను.

'అవును. నిజమే. నేనామెను జాలకాలమునుండి యెఱుఁగుదును' అని వేంకటరావు మెల్లగా జవాబుచెప్పెను.

ఆటపాటలలోఁ గలసిమెలసి తిరుగుచున్నను, శ్రీనివాసునిపై వేంకటరావున కంత యిష్టములేదు.

శ్రీనివాసుఁడు మొదట పల్లాకిమిడి కాపురస్థుఁడు. అక్కడనే ఎస్. ఏ లోఁ గృతార్థుఁడై మదరాసునకుఁ బోయి నాలుగేండ్లలో బి. ఏ, బి ఎల్. పరీక్షలలో నుత్తీర్ణుఁడై, ''హైకోర్టు వకీలు'' అను పట్టాపుచ్చుకొని, బ్రహ్మపురమున బల్లకట్టి ''ప్రాక్టీసు'' ఆరంభించెను. వాని తండ్రితాతలు ధనికులని ప్రతీతి కలిగియుండుటచేతను, వాఁడు చేయుచుండు ''ఖర్చు'' మామూల్లుసకన్న హెచ్చుగా నుండుటచేతను, వాని యాదాయమునందలి మంచిచెడ్డలను లోకు లెవ్వరును విచారింపలేదు.

''కాని ఆమె యెవ్వతె? నిన్నుఁజూచి యేల నవ్వెను'' అని శ్రీనివాసుఁడు నొక్కి యడిగెను. వేంకటరావునకు విసుగు పుట్టెను. ఆఁడువారినిగూర్చిన ప్రశ్నలుగాని, హాస్యములుగాని, యాతనికిష్టము లేదు కాని, నొక్కియడుగుచుండుటచే జవాబు చెప్పక తప్పదయ్యెను.

"ఆమె విశ్వనాథశాస్త్రిగారి కుమార్తె, విశ్వనాథ శాస్త్రిగారు మొదట మిక్కిలి భాగ్యవంతు లగుటచే వేయినూట పదియారు లెదురిచ్చి బి. యే. లో జదువు చున్న యొక బాలునకు వివాహము చేసిరి. ఆతఁడు బి. యెల్. పరీక్షలో కృతార్థుఁడైన కొద్దిరోజుల లోనే కాలవశమున మరణించెను. ఇంతలోనే విశ్వనాథశాస్త్రి గారి యైశ్వర్యముకూడ క్షీణించెను. కుటుంబ కష్టములచేతను, ఐశ్వర్యనాశనముచేతను ఆతఁడు పిచ్చివాడయ్యెను. తల్లి చిన్నప్పుడే చనిపోవుటచేతను, భర్త కాపురమునకు వెళ్ళకుండగనే చనిపోవుట చేతను, తండ్రి వెఱ్ఱివాఁడగుటచేతను పాపము, కమలకు దిక్కులేక పోయెను. కృష్ణాజీగారి కుమార్తయగు కృష్ణవేణికిని, కమలకును మిక్కిలిస్నేహము కలిగియుండుటచే కృష్ణవేణి యామెపైఁ గరు ణించి తండ్రిని ప్రోత్సాహముచేసి, కమలను దమయింటనుంచి దనతో సమముగాఁజూచుచు పోషించుచున్నది."

శ్రీనివాసు నెవ్వరో పిలచిరి. ఇదిగో వచ్చుచున్నానని యాతఁడులేచి వెళ్ళిపోయెను. పెరటితలుపు తీసియుండెను. వేంకట రావు పెరటిలోనికి బోయెను. కార్తికమాస మగుటచే వెన్నెల యందముగాఁ గాయుచుండెను. చల్లని మందమారుతము వీచుచుం డెను. గులాబిపూవుల గుత్తి చేతఁబట్టుకొని, తెల్లనిచీర కట్టుకొన్న యొక స్త్రీవిగ్రహ మాతనివైపునకు వచ్చుచుండెను. "ఓహో! కమలా! నీవేనా" యని వేంకటరావు పలుకరించెను. చుట్టుప్రక్కల మనుష్యుల యలకుడేమియును లేదు.

'నీకిక్కడ సుఖముగానున్నదా?" అని వేంకటరా వడిగెను.

'కొంతవఱకు సుఖముగానేయున్నది, కాని, నాతండ్రి కేవలము నిరాధారుఁడుగా నున్నాఁడు. నీకుఁ దెలియదు కాఁబోలు. వార్తాపత్రి కలకుఁ జిన్న కథలనువ్రాసి పంపి నేలకు మూడురూపాయ లొన్ను

సంపాదించి మాతండ్రి కిచ్చుచున్నాను. ఆతని యవస్థచూడ నాకు విచారమగుచున్నది. నేనిక్కడ అన్నము తినుచున్నను, ఆయన్నము నానోటికి సరిగాఁ బోవుచుండుట లేదు. కాని, యేమిచేయఁగలను!'

'అంత ధనవంతుఁడగు మీతండ్రి ఆకస్మికముగా నింత బీద వాఁడగుటయు, మతిపోయినవాఁడగుటయు నాశ్చర్యముగ నున్నది. నీవు కనిపెట్టితివో లేదోగాని, మఱియొక విశేషముకలదు. ఏదైన నొకదినమున నొక్కసారి యాతని మతి తిరిగివచ్చును. ఆదినమున నాతఁడు ఊరంతయును 'కులాసా' గాఁదిరిగి, సాయంకాలమునకు దన బసకువచ్చి, మఱల 'చెడిపోతిని-చెడిపోతిని.' అని మతిపోయిన మాటలాడుచుండును. ఆతని యీదురవస్థకు కారణ మెవ్వరై యుందురో నీ వెప్పుడైనఁ దెలిసికొనుటకుఁ బ్రయత్నించితివా ?'

'లేదు. నాకెవ్వరిపైఁగూడ ననుమానము లేదు. నాతండ్రి వ్యవహారములో నెవ్వనినైన నమ్ముచుండుట లేదు. అంతయును స్వయముగానే చూచుకొనుచుండెను. కావున నాతనిపై నెవ్వరైన కుట్రలు పన్నిరని నే ననుకొనను. రేయింబవళ్ళు నిద్రాహారములుమాని యాతఁడు పనిపాట్లు చేసికొనుచుండుటచే, మతి చెడిపోయెనేమోయని నే ననుకొందును. వింతలలో వింత యేమనగా, మొట్టమొదట నాతడెంత కఠినుఁడై యుండెనో, ఇప్పుడంత మెత్తనివాఁడై పోయెను. చిన్నపిల్లనివలె చీటికిమాటికి నేడ్చుచుండెను. నీకు జ్ఞాపకము లేదా? నాఁడా నీవు——'

'అవునవును, జ్ఞాపకమున్నది. నాలుగేండ్లక్రిందట చెన్నపట్టణములోఁ జదువుచున్న క్రొత్తఱికములో నే నొకసారి మీతండ్రిదగ్గఱకు వచ్చి, 'కమలకు బునర్వివాహము చేసినచో నేను దప్పక పెండ్లి చూడెద' నని చెప్పితిని. అప్పుడాతఁడు తోకత్రొక్కిన పామువలె బుసకొట్టుచు నన్ను దరిమివేసెను. మీయింట నెప్పుడు ధనము విస్తా

రముగా నుండుటచే నీ ధనమునకై యాశించి నిన్నుఁ బెండ్లియాడఁ దలచితినని నీవనుకొనవద్దు. ఆనాడు నీపై నాకెంత ప్రేమముకలదో నేఁడును నంతేకలదు. కాని, నీధనము క్షీణించినట్లు నాప్రేమము క్షీణింపలేదు. ఇప్పుడు నాకీయూరిలో చాలమంది స్నేహితులుకలరు. నిన్ను నేను బెండ్లియాడినచో వారందఱు నాకు దూరమగుదురు. నేను బెండ్లియాడినచో వారందఱు నాకు దూరమగుదురు. కాని నే నది లక్ష్యముచేయను.'

'అంతయును నిజమే-అయినను, నీకుఁ గోపమురాకున్న నేనొ క్కమాట చెప్పెదను. నీకు వృత్తిధర్మము చేసికొనుటకన్న ఆటపాట లలో నెక్కువ మక్కువకలదు. అదికాక, నీస్నేహితులలో జాల మంది మంచివారుకారు. వీరందఱును ధనికులు. ఈ ధనికులతో నేటి రాత్రి నీవు చీట్లాడవద్దు.' వేంకటరావొక్కసారి యామెముఖము వైపు చూచెను. వెన్నెలలో నామెకన్నులు స్పష్టముగా గన్పట్టు చుండెను. 'కూడదు' అనుమాట లామెకన్నులనుండి పైకివచ్చుచు న్నట్లుండెను. వేంకటరావన్నివిధముల మంచివాఁడేగాని, వానియొక్క నొక్కలోపముమాత్ర ముండెను. తన స్నేహితులందఱికన్న నాతఁ డన్నివిధముల నుత్కృష్టుడను పేరు సంపాదింపవలెనని యాతని యుద్దేశము.

'కమలా! నేను మంచి యాటగాఁడనుసుమా.' ఆతడు జవాబు చెప్పెను. 'ఆటలో నప్పుడప్పుడు వచ్చుచుఁబోవుచున్నను, ముగించు నప్పటికి నేనేతప్పక గెల్చుచుందును. అయినను, నీమాటపైని మిక్కిలి జాగ్రత్తగానే యుందును.'

'నీవు తప్పక అట్లాచేయవలెను. ఇప్పుడాటకు వచ్చినవారిలో కొందఱిని నేను నమ్మను. ఆశ్రీనివాసరావుసంగతియాలోచించుకొమ్ము నన్నాతడు బాగుగా నెఱిఁగియున్నను, ఏమియు నెఱుఁగనివానివలె

నటించుచుండును. ఒకటి రెండు సారులు నేనొంటిగానున్నప్పుడు నా యొద్దకువచ్చి నన్ను హాస్యమాడెను. అప్పుడు నేను వానికిఁదగినట్లు జవాబు చెప్పితిని. అప్పటినుండియు వాఁడు నన్నెఱుఁగనట్లే పైవారితో ముచ్చటించుచుండును, వాఁడు నాకంటబడినప్పుడు నా దేహము కంపమెత్తుచుండును.'

కమల యెప్పుడు నంతచనువుగా వేంకటరావుతో మాటాడి యుండలేదు. పైనా రెవ్వరు సమీపమున లేరనునమ్మకమున నామె తనమనస్సులో నున్నదంతెయు జెప్పుచుండెను. ఇదియంతయు వినుటతోనే వేంకటరావునకుఁ గోపమువచ్చెను శ్రీనివాసునిపై నసహ్యము కూడఁ బుట్టెను. 'వానిమూలమున నీకెప్పుడైనఁ జిక్కు కలిగినచో నాకుఁ దెలియఁజేయుము. తగిన ప్రాయశ్చిత్తము చేసెదను. నీవునీతండ్రినిగూర్చి పడుచున్న శ్రమకు సంతోషమగుచున్నది. ఆతఁడు నిన్నెప్పుడును దయతోఁజూడలేదు. కూతులపై దండ్రులకు గలప్రేమకొంచమైన నాతనికి నీమీఁద లేకుండెను. అయినను వానిదురవస్థలో నీవు వానిని నలక్ష్యముచేయలేదు. నీకుఁ జేతనైనసాయము చేయుచున్నావు నీయుపదేశమువలన నామనస్సు త్రిప్పుకొనెదను. సాధ్యమైనంతవఱకు ఆటలలోనికిఁ బోకుండుటకుఁ బ్రయత్నించెదను. నీవు మాత్రము—'

'అదినాచేతిలోనేయున్నది. మాపినతండ్రికి ఇప్పుడిప్పుడు నాపై దయకలుగుచున్నది మఱిపోయినవాఁడైనను, నాతండ్రిని నేను విడిచిపెట్టివేసినచోఁ దన యాస్తియంతయును నాకువ్రాసి యిచ్చివేసెదనని చెప్పుచున్నాడుకాని, ధనాశచే నాతండ్రిని విడిచివేయుట నా కిష్టములేదు. నాతండ్రిపై నాపిన తండ్రికేల యింతకోపమో నాకు దెలియకున్నది.'

వేంకటరావు కొంచెముసేపూరకుండి విశ్వనాథశాస్త్రిగారికిని శంకరశాస్త్రిగారికిని గలవైరము బ్రహ్మపుర మాబాలగోపాలమెఱు

గుదురు. కారణముమాత్రము బ్రహ్మకైనను దెలియదు. 'మా పినతండ్రి ఎవ్వనినిగూడఁ దనయింటికి రానీయఁడనుమాట నీకుఁ దెలియునుగదా. ఇప్పుడిప్పుడు నన్ను రానిచ్చుచున్నాఁడు నేనప్పుడప్పుడు పోవుచుందును. నావంటి—'కమల యేమేమోచెప్పఁ బోయెను. ఇంతలో నొకప్రక్కనుండి యెవ్వరో తమమాటలను వినుచున్నట్లు కన్పట్టెను. ఎవ్వరును సమీపమున లేరనుభ్రాంతిచే వారు స్వేచ్ఛగా మాటాడుకొనుచుండిరి. పరులు తమ మాటలను వినుచున్నారని తెలియుటతోనే వారిద్దఱును చెఱియొక ప్రక్కకును వడివడిగాఁ బోయిరి.

గదిలోఁ జీట్లాడుచుండిరి. వేంకటరావుకోసము శ్రీనివాసుడు కనిపెట్టుకొనియుండెను. త్రోవలోనే వారిద్దరును గలిసికొనిరి. 'బహుశః నీవు—'అని శ్రీనివాసుడేమో యనఁబోవుచుండెను. వేంకటరావు ప్రసంగాంతరముపెట్టి వానిని గదిలోనికి దీసికొనిపోయెను.

'నీతో ఆటయన్న సరదాగానేయుండునుగాని, నీవు దమ్మిడీ అన్న ప్రాణముపోవును. పెద్దపందెమన్న పిరికిపందవగుదువు.'

చాలుచాలు. రూపాయి రూపాయిపందెముతో నాడెదను రమ్ము. నన్ను జడిపించెదవాయేమి? అని వేంకటరావు నిర్లక్ష్యముగా జవాబుచెప్పెను.'

---

## రెండవ ప్రకరణము

### చీట్లాట

క్షణకాలమున ధనికుని దరిద్రునిగాను, దరిద్రుని ధనికునిగాను జేయు సామర్థ్యము భగవంతునికిఁ గలదని పెద్దలు చెప్పుదురు. అట్టి

సంపూర్ణసామర్థ్యము భగవంతునకుఁ గలదోలేదో జెప్పలేముగాని అందు సగము సామర్థ్యము చీట్లాటకుఁ గలదనిమాత్రము చెప్ప గలము. ఆటలోఁ గూర్చున్న దరిద్రులు ధనికులుగా మారుట యబద్ధము. ధనికులు దరిద్రులుగా మారుటమాత్రము వాస్తవము. భూభారమంతయును వహించుచున్న యనంతునకైనను వేయిముఖములు గలవని చెప్పవచ్చునుగాని చీట్లాట కెన్నిముఖములు కలవో యథార్థముగా నెవ్వనికిని దెలియదు. డబ్బువేసియాడు చీట్లాటలలో మొట్టమొదట మన మెఱిగినది 'నొక్కాసా' ఆపైని 'ఎత్తుడము'అను నొక యాట పుట్టినది. తరువాతిది 'కంపేరు' ఇప్పుడిప్పుడు నూతనముగా లండనునుండి బయలుదేరి స్టీమరు దిగినది. 'బ్రిడ్జి' నాటిరాత్రి కృష్ణాజీగారింట్లో నిదియే యాడుచుండిరి.

వేంకటరావును, శ్రీనివాసుడును, చెఱియొకప్రక్క గూర్చుండిరి. 'రూపాయి రూపాయి వేసి యాడుదమని వేంకటరావు అనుచున్నాఁడు. అని శ్రీనివాసుఁడనెను.

'వెధవరూపాయి—ఒక్కొక్క వరహాయైన లేకపోయిన నేమి యాట? ఇట్టి పిల్లలయాటకా నన్ను బిలుచుకొనివచ్చితివి?'అని కూర్చున్నవారిలో నొక్కఁడు 'ధాటి'గాఁ బలికెను. ఆటకుఁ గూర్చున్న వారిలో వేంకటరా వొక్కఁడే బీదవాఁడుగాని మిగిలిన ముువ్వురును ధనికులే. అయినను ప్రతివిషయమునను ఇతరులకన్నఁ దానే 'మేలు చేయువాఁడ'నిపించుకొనవలెనని వేంకటరావు ఉద్దేశము. కావున పందెములో వెనుకదీయుట కాతనికిష్టములేదు.

'మీకందఱకు నేదియిష్టమో నాకు నదియేయిష్టము. కావలసినయెడల నైదేసి రూపాయలచొప్పున నాడుదుఁడు. నేనేమి జడిసిపోవుదు ననుకొనుచున్నారా?'అని వేంకటరావుకూడ 'ధాటీ'గానే జవాబు చెప్పెను.

ఆట యారంభమైనది. మొట్టమొదటి యాట నుండియును వేంకటరావుచేతిలో ముక్క పట్టలేదు. అతఁడు జాగ్రత్తగాను, నేర్పుగాను, ఆడుచుండెను; గాని యాతని 'యెదుటివాఁడు'మాత్రము కొందరపాటువాడుగా గన్పట్టెను. తన చేతిలోని ముక్క లెట్లున్నను తనయాట గెలుపులోనున్నను వీఁగులోనున్నను, గొంచెమైన లక్ష్యము లేక, ఆటలను జెప్పుచుండెను. వేంకటరావు 'నోట్రంపు' చెప్పెను. శ్రీనివాసుడు 'డబుల్' చేసెను. వేంకటరావు వంతు దారుఁడు 'రీడబుల్ చేసెను.' శ్రీనివాసుడు దానిని మరల 'డబుల్, చేసెను. 'ఆగుమాగుము. పారిపోవద్దు' వేంకటరావు తన యెదుటివాని నాపనెంచెను. 'ఇది వట్టిజూదము. జూదమునకు తగిన ధనము నా యొద్ద లేదు.' ఎదుటివాఁడు దానినంగీకరింపక హుంకరించుచు, మరల "డబుల్" చేసెను. ముక్కలు వేయుట నారంభించిరి. శ్రీనివాసుఁడు ఇస్పేటు ఐదుదెబ్బలు వరుసగాకొట్టెను. తరువాత రెండు ఆసులుఆడెను. వాని యెదుటివాని యొద్ద మఱియొక యాసుండెను. ఆట వారే గెలిచిరి. లెక్క పంపకము చేసికొన్న తరువాత చూచుకొనఁగా ఆటలో వెచ్చించుటకయి తా నేర్పాటుచేసికొన్న సొమ్ము కాక, నలుబదిరూపాయలు 'జేబు'లోనుండి తీసి యీయ వలసినట్లు కన్పట్టెను.

'ఈవంతు దారునితో నాడుటకు నాకిష్టములేదు. నే నాట మాని వేసెదను.'' అని వేంకటరావనెను.

'ఛి. ఛి' శ్రీనివాసుఁడు గద్దించెను 'ఏమి యీ తెలివితక్కువ రామయ్యవంటి వంతుదారుఁడు ఆటలో మఱియొక్కనైన దొరకునా? సమయమైనపుడల్ల లంచమిచ్చియైన నాతనిఁ బ్రతికష్టగాఁ దెచ్చియాటలో నేఁ గూర్చుండఁ బెట్టుకొందును.'

'నేను తప్పాట యాడితినా?' అని రామయ్య యడిగెను 'చేతిలో ముక్క లేనప్పుడు చిన్నపిల్లవాడైన నీవలె ఆటచెప్పునా?

నాకు విడిచిపెట్టినచో, ఆఠీనుమైదు దులిపివేసి, ఆటగెల్చుకొందును. నీవలె నేను డబ్బువిరజల్లలేను. నన్ను జూచియైనఁగొంచెము జాగ్రత్తగా నాడుము' అని వేంకటరావు జవాబిచ్చెను. 'నీయిష్టమువచ్చినట్లే యాడెదనని రామయ్య యంగీకరించెను. ముక్కలు మరల పంచఁబడెను. రామయ్య మామ్మూలు పారాయణమే యారంభించెను. 'డబ్బుల్‌ను, రీడబుల్‌నును' అనేక పర్యాయములు తిరిగినవి. ఆటమరల శ్రీనివాసుఁడే గెలిచెను. వేంకటరా వేబది రూపాయిలు మరల వీగిపోయెను. రామయ్యపై మఱియొకసారి విసుగుకొనెను. ముక్కల మరలపంచిరి. యథాప్రకారమే జరిగెను. వేంకటరావునకాటపై నసహ్యము కలిగినది. లేచి నిలువఁబడెను. 'వెళ్ళిపోయెదవా యేమి?' అని శ్రీనివాసుఁ డనుమానముతో నడిగెను. 'లేదు. కొంచెము ఉక్కగానున్నది. చల్లగాలిలోని కొక్కసారి పోయివచ్చెదను.'

'నాబాకీ మాత్రమిచ్చి వేసి వెళ్ళిపొమ్ము.' శ్రీనివాసుఁడు తొందరపెట్టెను. 'రెండు వందలరూపాయల మాత్రమే. మందులిచ్చి యూరివారి సొమ్ము దోచుకొను నీ వంటిడాక్టరుకు ఇదియొకలక్ష్యములోనిదికాదు. కాని, జూదమాడి యోడిపోవు చుందునని మాత్ర మెవ్వరితోను జెప్పకుము. అది నీవృత్తి ధర్మమునకు భంగము కలిగించును.' అని హితోపదేశము చేసెను. ఆమాటవలన వేంకటరావునకుఁ గోపమువచ్చెను. కొద్దిరోజులలో నిచ్చి వేసెదనని మొట్టమొదట చెప్పఁదలఁచుకొనెను గాని, బుద్ధిమార్చుకొని, 'ప్రోనోటు వ్రాసియిచ్చెద నని చెప్పెను.

'ప్రోనోటా! చీట్లాట బాకీలకు ప్రోనోట్లు కటా! ఆలాంటి బేరములు నాకిష్టములేదు. సొమ్ము చేతిలోఁబెట్టి—'

వేంకటరావుముఖ మగ్నిహోత్ర మయ్యెను. వారిద్దఱును గలియఁబడుదురేమో యనునట్లు కన్పట్టుచుండెను. వేంకటరావు

శాంతించెను. 'వాచి జేబులో చేయిపెట్టి యందుండి యొకతోలు సంచిని పయికిఁదీసెను.

'సరే నీయిష్టమే కానిమ్ము. నామర్యాద వీధిలోఁ బెట్టుటకు నీవు ప్రయత్నించినావు. నావంటి యల్పాదాయము గలవాఁడు ఇంత పెద్దమొత్తము నెప్పుడును దగ్గఱనుంచుకొనలేఁడు. అదృష్టవశమున నేఁడు నాయొద్ద ధనమున్నది. కావున నా పరువు నిలిచినది.' వేంకటరావు సంచినుండి కొన్ని యచ్చుకాగితములు పయికి తీసెను. అవి కరెన్సీనోట్లు రెండువందల రూపాయిల విలువగల నోట్లను బయికిఁ దీసి, లెక్కబెట్టి శ్రీనివాసునిచేతిలోఁ బెట్టెను. బాకీ తీరుమానమయ్యెను. 'సంతోషమైనది' శ్రీనివాసుఁడనెను. 'కాని, నీనష్టమునకు నీవంతుదారుఁడే కారణము. నేనే మైనచో వానిపై దావా తెచ్చియుందును' సబబును సందర్భమును లేని యామాటలను లక్ష్యము చేయక, వేంకటరావాగదిలో నుండి బైటకువచ్చి ప్రక్కనున్న యొక 'హాలు' లోఁ బ్రవేశించెను. భయముచేతనో విచారముచేతనో, ఆతని యొడలు కంపమెత్తుచుండెను. మతిపోయి కొన్ని పేకముక్కలను జేతితో తీసికొనివచ్చెను.

'ఎంత తెలివితక్కువ పనిచేసితిని?' ఆతఁడు పశ్చాత్తాప పడసాగెను. 'తెలివితక్కువయే కాదు. ద్రోహము గొప్పద్రోహము చేసితిని. సూర్యారావుసంగతియేమరచి పోయినాను. నలువదియెనిమిది గంటలలో నాతనికిచ్చెద నన్న వాగ్దాన మంతయును ద్రోసిరాజుచేసితిని. ఈద్రోహము వలన నాతని పురోభివృద్ధికెంతయో భంగముకలుగును. ఆయుసురు నాపై బడును, వాఁడు నాజీవమున కేడ్చును. అయ్యయో జూదపుమాటలో నేనేలప్రవేశించితిని? కమల వద్దని బలవంతపెట్టినను ఆమాటయేల లక్ష్యముచేయక పోయితిని!— అయ్యో కమలా—' ఇంతలో కమల మెల్లఁగా నక్కడకువచ్చెను, ఆ

హాలులో మఱియెవ్వరును లేరు. ఇంటివారందఱును నిద్రపోవుచున్నట్లు కన్పట్టుచుండెను. హాలులో దీపము వెలుగుచుండెను. అంత రాత్రి యప్పుడాహాలులోని కాతనితో మాటాడుటకు వచ్చినందుకు కమలకు విచారముగానే యుండెను. చీట్లాడుచున్న వారిలో నెవ్వరైనఁ దటాలున వచ్చి వారి మాటలను విన్నచో పుట్టిమునిఁగి పోవును. దానికిఁదోడుగ వేంకటరావు ముఖముచూచినతోడనే యామెకు మరింతభయము కలిగెను. క్షణక్షణమును భయవిచారమును సూచించుచు నాతనిముఖకళ మారిపోవుచుండెను. 'ఏమిది! ఏమియాపదవచ్చినది?' అని కమల భయముతో నడిగెను. 'అంతయును జెప్పివేసెదను. గాని, పిల్లా నీవంటి యుత్తమురాలితో మెల్లగా ననుచుండెను. 'పేకయాడనని నీతోఁ జెప్పితిని. కాని, యింతసేపును జూదమే యాడుచుంటిని. నావంతు దారుఁడు నన్ను మోసపుచ్చెను. కాని, ఆతని నేల నిందింపవలెను. నిందయంతయును నా నెత్తి పయినే గలదు. పెద్దపెద్దపందెములు వేసి యాడితిని. ఇన్నూఱు రూపాయిలు శ్రీనివాసునకోడిపోయితిని.' కమల తెల్లఁబోయెను. కాని, యొక నిందావాక్యమైన నామె నోటినుండి రాలేదు. అది యెట్లుజరిగెననియు, అంతసొమ్ము తనకెట్లువచ్చెననియు మాత్రమామె యడిగెను. 'నేనీ నడుమ మిగిల్చిన సొమ్మంతయు నంతే. అదిసూర్యారావునకప్పించెదనని యుద్దేశించి, సేవింగ్సుబ్యాంకినుండి యీసాయంత్రమే తీసితిని. సూర్యారావు తమ్ముఁడు మారుతాళముపెట్టి యాతని పెట్టిలోని డబ్బంతయు నెత్తుకొనిపోయినాఁడు. అదిసూర్యారావుది కూడ కాదు ఒక 'పార్టీ' దారుని సొమ్మును తన పెట్టెలోఁ జాచియుంచెను. ఎల్లుండి యా సొమ్ము నాతఁడు శ్రీనివాసుని బంధువుల కియ్యవలసి యున్నది. శ్రీనివాసునకు సూర్యారావన్నఁ గోపము. [illegible] కొనఁడు. బందుగులకుఁ బిల్లలుపెట్టి చిక్కు [illegible]

పార్టీలు మరి యెవ్వరును సూర్యారావుదగ్గరకురారు. వాఁడు జెయిలుకు, గూడఁ బోవలసి వచ్చునేమో! పాపము వాఁడు నన్నే నమ్ముకొని యున్నాఁడు. ఆటలో నున్నంతసేపును వాని సంగతియే మఱచి పోయితిని. వానిని మోసపుచ్చి వాని పరువు తీయుటకు బదులు నా పరువునే నేను మఱచిపోయినచో బాగుండియుండును. ఆట తమక మున మతిపోయి వ్యర్థమైనది. గదినుండి బయిటకు వచ్చినప్పుడు జ్ఞాపకమువచ్చి గుండెలపయి గ్రుద్దిన ట్లయినది.

కమలకు పెదవులదరెను. 'అవునవును. నిజమే కాని ఇప్పుడు నిన్నేల నిందింపవలెను. ఆసొమ్ము మరల నెట్లయిన జాగ్రత్తపెట్ట వలెనా వ్యవధి లేదు. నీవిప్పుడేమి చేయఁగలవు? నేను యాసొమ్ము జాగ్రత్తపెట్టవలెను.'

వేంకటరావునకు విస్మయము కలిగెను. నిజముగా నామాటలు తన చెవిలో పడెనా యను సందేహము కూడ నాతనికిఁ గలిగెను. కమల తనకు సహాయము చేయఁగలదని కలలోనైన నాతఁడను కొనలేదు.

'అసాధ్యము. అసాధ్యము.'

'లేదు. లేదు. నేను సొమ్ము కాకున్న ఆ విలువగల నగ యయినఁ దెచ్చెదను. ఇప్పుడేవచ్చెదను. రెండు నిముసములు కని పెట్టుకొని యుండుము. ఏనష్టమునకైన నొప్పుకొనెదను గాని నీ గౌర వమునకు భంగముకలుగు నన్నను నెంతమాత్ర మిష్టములేదు.' కమలయంనుండి వెడలిపోయెను. ఆశ్చర్యముచేతను, భయముచేతను, విచారముచేతను, అనుమానముచేతను. వేంకటరావునకుఁ గనులు జీఁకటి గ్రమ్మెను.

---

## మూఁడవ ప్రకరణము

### జి గి నీ

పోకుండ గమల నాపివేయవలెనని యాతఁడనుకొనెను గాని మెఱుపు మెఱసినట్లు కమల మాయమగుటచే నాతని కాపని సాధ్యము కాలేదు. కమల వాగ్దానము వేంకటరావునకుఁ గొంతవఱకు హాస్యాస్పదముగాఁ గూడ గన్పట్టెను. దిక్కులేక పొట్టపోసికొనుటకై యొకరిపంచను జేరిన కమల—ఎంతయో కష్టపడి నెలకు మూఁడు రూపాయలకన్న మతిపోయిన తండ్రిని బోషించుటకెక్కువగ సంపాదింపలేని కమల—అట్టి కమల—ఇన్నూరు దమ్మిడీలకన్న నీరసముగాఁ దలఁచి యిన్నూరు రూపాయిల నొక్కనిముసములో దన యొద్దకుఁ దీసికొని రాఁ బ్రయత్నించుచున్నది. మానుషప్రయత్నము వలన నిది సాధ్యమైన ట్లాతనికిఁ గన్పట్టలేదు. కృష్ణవేణియొద్ద బదులు తెచ్చునేమో యను నూహ మొకటి యింతలో నాతనికిఁ గల్గెను. ఆతని కేమియును దోచకుండెను. తామరాకుమీఁది నీటిబొట్టువలె మనస్సు పరిపరివిధములఁ జలించుచుండెను.

మొట్టమొదట నీయవస్థకే వేంకటరావు మనఃపూర్వకముగా సిగ్గునొందుచుండెను. బాల్యస్నేహితుడును సహపాఠియు నగు సూర్యారావున కాపత్కాలమున సహాయము చేసెదనని వాగ్దానము చేసెను. అందుకే సేవింగ్సుబ్యాంకునుండి యిన్నూరురూపాయిలు తీసికొనెను. అట్టియవసరమైన కార్యమునకై యుద్దేశింపఁబడిన ధనమును జేబులోనుంచుకొని వీధిలోని కేలవచ్చెనో కారణమాతనికిఁ బోడకట్టకుండెను. ఏదియెట్లున్నను, ప్రస్తుతము ధనము పోయినది. తనకు మతిపోవుటవలన నొకానొక తరుణవయస్కుని పరువు పోవలసియున్నది. వేంకటరావున కేమియును దోఁచలేదు.

'ఎంతద్రోహము చేసితిని!' హాలున నీమూలనుండి యామూల కుఁ దిరిగి ఎంతద్రోహముచేసితిని! రానని నేనేల చెప్పలేక పోయితిని! దుర్మార్గుఁడగు శ్రీనివాసునితో నేల ప్రగల్భములు పలికితిని! పోనిమ్ము బాకీపడినప్పుడైన, తరువాత నిచ్చెనని యేల చెప్పలేకపోయితిని! శ్రీనివాసునినోటినుండి తిట్లును, పదిమందిలో నామర్యాద పోవుటయు మాత్రమే తలంచుకొంటినిగాని, నామర్యాదకన్న నెక్కువయగు నా స్నేహితునిమర్యాదను గూర్చి యేల యాలోచింపకుంటిని! మించి పోయినది. మించిపోయినది. ఏమిచేయగలను. మించినది!

ఈ మాటలు కేవలము యథార్థములగుటచే, పశ్చాత్తాపా గ్నిలో మండుచుండెను. చుట్టుప్రక్కల నేమిజరుగుచున్నదో తెలిసి కొనక, వేంకటరావు, తదేకధ్యానముతో నుండెను. కమల తిరిగి వచ్చెను. వేంకటరావు నీవుపైఁ జేయివైచెను. వానికిఁ దెలివివచ్చెను తన మనోనాథుని మర్యాదను గాపాడుటకై కమల స్వలాభమంతయు మఱచిపోయెను. తానిప్పుడు చేయుచున్న పనిని కృష్ణవేణిగాని, కృష్ణా జీ[illegible]గాని చూచినయెడల నవ్వు[illegible] కమలకొంతసేపు మాటాడలేదు. ఆమె మొగము నా[illegible], కాని యామె కంఠస్వరము మాత్రము విజయమునే సూచించుచుండెను.

'నేను తేఁగలనని చెప్పలేదా? ఇదిగో తెచ్చితిని. హృదయే శ్వరా, దీనిని తీసికొమ్ము. నాకు మారుగ నీవు దీని నమ్మి వేయుము దానివలనవచ్చు సొమ్మును సూర్యారావున కిచ్చివేయుము ఈ జిగినీ విలువగలదని నేననుకొనెదను నాపినతండ్రితన నగలపెట్టిలో నుండి తీసి యిదినాకిచ్చెను. ఆపత్కాలమున నిది పనికివచ్చునని నేను దాచి యుంచితిని. దీనివలన నీకిప్పుడు కావలసినంత ధనము దొరకునా?'

కమలచేతినుండి వేంకటరావు జిగినీబిళ్ళ అందుకొనెను. అది మేలిమిబంగారముతో జేయఁబడినది. ఒకప్రక్కనున్నగానున్నదిగాని

మరియొకప్రక్క చక్కని లతపనియును, రెండువరుసల కెంపులును గలవు తాను చెన్నపురిలోఁ జదువుకొనుచున్నప్పుడు కంపెనీలలో నుండి స్నేహితులకు విలువగల యిట్టివస్తువులు నాడెముచేసికొని యిచ్చుచుండుటచేత, వానివాని విలువలను కొంచెము హెచ్చుతక్కువగా నాతఁడుఁ బోల్చఁగలఁడు 'ఈజిగినీ మంచిరకముది. ఇది యమ్మినచో నాలుగు వందలరూపాయిలు రావచ్చునని తోఁచుచున్నది. అంత సొమ్మువచ్చునా!' కమల గట్టిగానను. 'అంతసొమ్మువచ్చునని నేననుకొనలేదు. అట్లయినచో దానినమ్మివేసి యిన్నూరురూపాయిలు సూర్యారావునకిచ్చివేసి, మిగిలిన యిన్నూరు రూపాయిలును, నీయొద్దనే దాచియుంచుము. నాకుఁ గావలసినప్పుడు పుచ్చుకొందును.'

ఒక్కనిమిసమువరకు వేంకటరావు మాటాడలేదు. జిగినీ బిళ్ళపైఁగల కుందనపుపనియొక్క క్షణకాలమాతని నైహికవ్యాపారములనుండి మరపించెను. ఆతఁడు మరల తెలివితెచ్చుకొనెను. జిగినీని కమల యరచేతిలోఁ బెట్టి ఆమెవ్రేళ్ళను ముడిచివేసెను. 'నీయుపకారమునకు నాకు మనఃపూర్వకమైన యానందము కలిగినది. నాయందునీకుఁగల విశ్వాసమునకు నాహృదయమున నెట్టియానందము కలుగుచున్నదో నేనువర్ణింపలేను. నీవింతయభిమానము చూపించుటకు నేను పాత్రుఁడనుకాను. నీవింతటి ఋణమును నానెత్తిపైఁ బెట్టుచున్నావు. నేనెంతకాలమో కష్టపడినఁగాని యింతసొమ్ము మిగల్చలేను. నీతండ్రి మతిపోయి తిండిలేకయున్నాఁడు. ఆరోజున కృష్ణాజీగారు నిన్నింటినుండి పంపివేసినచో నీవేమిచేయగలఁవు? ఎట్లు జీవింపగలవు? నీభావికష్టములకుగూడ నేనే కారకుఁడనైనచో—' వేంకటరావిక్కడ నాగిపోయెను. కమల కన్నులనుండి యొక్కసారి నీళ్లువచ్చెను. తనమాటను త్రోసివేయుచున్నను, వానిపై నామెకుఁ గోపమురాలేదు. ఆమె మనసుమాత్రము నొప్పిఁజెందెను.

'స్వలాభమును జూచుకొనుటకిది కాలముకాదు. పరోపకారమునకై స్వార్థత్యాగము చేయవలసిన తరుణము మనుష్యమాత్రున కెప్పుడయిన సంభవించిన, నది యింతకన్న వేఱుగా నుండదు. ఇప్పుడు నీమర్యాదకును, నీస్నేహితుని మర్యాదకును భంగము కలుగవలసియున్నది.'

వేంకటరావు తలవంచుకొనెను. పుచ్చుకొనవలయునను నభిలాషమును పుచ్చుకొనకూడదను నిశ్చయమును, నాతని మనస్సులో పెనుగులాడఁజొచ్చెను. కొంతవరకాతఁడు మనస్సు దిట్టముచేసికొనెను. 'నాభారమును నేనే మోసికొని పోవలెను. నీధనమును నీయనురాగమును నావంటి దుర్మార్గునిపైఁ జల్లియేల వ్యర్థముచేసికొందువు?'

కమల జవాబు చెప్పలేదు. ఆమెముఖమునుండి చిన్న నెడనవ్వొకటి వచ్చి, మరల వెంటనే మాయమయ్యెను. ఆచిన్ననవ్వే వేయిమాటలకన్న నెక్కువ బలము కలిగియుండెను. జిగినిబిళ్ళను బల్లపై నామె యుంచెను. కొన్ని నిముసములవరకు నిద్దఱును దానివైపే చూచుచుండిరి.

'ఏల పుచ్చుకొననని త్రోసివేయుచున్నావు? నాకు విచారముగానున్నది. మర్యాద కాపాడుకొనవలసిన సమయమునఁ బట్టిపట్టి కూర్చుండుటతగునా?' మనుష్యుల యలుకుఁడు వినబడినట్లయ్యెను. ఇద్దఱును త్రుళ్ళిపడిరి. వెనుకదిరిగి చూచిరిఁ వింతయేమియును గనుపడలేదు. ఎవ్వరో హాలులో నాఁగియుండి తమమాటలను వినుచున్నారేమో యని వారనుమానించిరి. వేంకటరావు నాలుగు ప్రక్కలును తిరిగిచూచెను. మనుష్యులున్నజాడ కన్పడలేదు.

'పట్టియని [illegible]మే పడినాము. నీవు దానిని దాచుకొమ్ము. రాత్రియైనది. పోయిపండుకొమ్ము. నీవు నాతో నిట్లు మాట్లాడు

చుండుట యెవ్వరైనఁ గనిపెట్టినయెడల నది నీకును నాకును గూడ నష్టము కలుగఁజేయును.' కమల ముఖము మిక్కిలి యెఱ్ఱగా మారిపోయెను.

'భయమేమి? నీవునన్ను బెంగ్లియాడఁదలఁచినావు. దానివలన కలుగబోవు నష్టము లనుభవించుటకు మనమిద్దఱముగూడ సిద్ధముగా నున్నాము. నీమర్యాదను నేనిప్పుడు కాపాడ నెంచియున్నాను. తన హృదయమంతయును సమర్పణచేసిన పురుషుని గౌరవము కాపాడుటకు స్త్రీమాత్రురాలు చేయదగిన సాహాయ్యమును జేయుచున్నాను. నన్నుగుఱించి నీవు విచారింపవద్దు. నీస్నేహితునిగూర్చి నీవు నిర్వర్తింపవలసినధర్మమునుగూర్చి యాలోచించుకొమ్ము.' యుక్తియుక్తములైన కమల మాటలకాతఁడు లొంగిపోవలసివచ్చెను. కాని, హృదయము నాతడు మఱియొకసారి పదిలముచేసికొనెను. ఈసంభాషణయంతయును గలయో భ్రాంతియో యైనట్లాతనికి బొడకట్టుచుండెను. చుట్టుప్రక్కల నిశ్శబ్దముగానున్నది. పేకాటగదిలోనుండి యొక్కొక్క మాట యప్పుడప్పుడు వినఁబడుచుండెను.

'నాకక్కర లేదని మఱియొకమారు చెప్పుచున్నాను, నీ జిగినీ నీవేదాచి—' వేంకటరావు త్రొళ్ళిపడి, మాటనాపివేసెను. ఎవ్వరో పైనుండి తన్నుగట్టిగాబిలుచుచుండిరి. అడుగులచప్పుడు వినబడుచుండెను. పేకాటలో నేదో జట్టివచ్చినట్లు కనుపట్టెను. కోపమువచ్చిన యాటగాండ్రొకరిద్దఱు హాలులోనికిఁ ద్రోసికొనిరాఁ జొచ్చిరి. కమల యిక నక్కడనుండగూడదు. పైనుండి మనుష్యులల్లరచేయుచు దలుపును బిగ్గరగా దట్టసాగిరి. వెంటనే యొకతలుపు తెరచి, కమల పెరటిలోనికిఁ బోయెను. తలుపువైచి, వేంకటరావు హాలుద్వారము తెరచి పైకిబోయెను. మనుష్యులు గడబిడగా వానివద్దకువచ్చిరి

'ఏమి. ఏమి. జట్టియేమి?' వేంకటరావు తొందరగా నడిగెను. పదిమంది యొక్కసారియే మాటాడజొచ్చిరి. ఆటలో రామయ్య

యేదియో పొరపాటుచేసినట్లు కన్పట్టెను. అప్పుడు రామయ్య నిండు 'నిషా' లో నుండెను. శ్రీనివాసరావు తన్ను మోసపుచ్చెనని యా తడు ఫిర్యాదు చేసెను.

'వాడిప్పుడు తెలివితప్పి యుండనియెడల'—శ్రీనివాసుఁడనెను. 'వానిని దన్ని తగిలివేసియుండును. నాబాకీ నాకిప్పించి, వేంకటరావుగా వానినిఁ బంపివేయుము.'

శ్రీనివాసుఁడు తనతో నెప్పుడు నింత యనురాగముతో మా టాడలేదు. వానిపై వేంకటరావునకు గోపమువచ్చెను. కోపమాపి కొని, యాతడిట్లనెను, 'పేకాట శాస్త్రమునుగుఱించి వాక్యార్థ ములు చేయుటకిది సమయముకాదు. రామయ్య తప్పాడి యుండవ చ్చును కాని, సారాయిత్రాగి యొడలు తెలియని వానిటలోఁగూ ర్చుండ బెట్టుటయే మొదటితప్పు. ఆపైని తప్పాడెనని వానిమీద నేరము మోపుట రెండవతప్పు. తప్పాడినను, వానిడబ్బులాగికొని, పంపివేయుట మూడవతప్పు. న్యాయమూ యన్యాయమూ యను మాట నేఁ జెప్పలేనుగాని, నేనే యైనయెడల, తెలివితప్పియున్న వానిని ఫకీరునుజేసి పంపుట నాకిష్టములేదు.' అని నిర్భయముగాఁ బలికెను.

కాలిక్రిందఁ బాము పడినవానివలె శ్రీనివాసుఁడదిరిపడెను. వానిమొగము తెల్లఁబోయెను. వేంకటరావు చెప్పినది వాస్తవమే యైనను, నిందాపూర్వకమై యుండెను. శ్రీనివాసునకుఁ గోపమువ చ్చెను. 'అందఱును నీవంటివారే యనుకొందువా? ఇట్టి సత్యకాలపు వ్యవహారము లీకాలమునఁ బనికిరావు. రావలసినచోట ముక్కుపై గ్రుద్ది పుచ్చుకొనవలసినదే. నీవు చేతగానివాఁడవు కాఁబట్టి, యన్యా యముగా నిన్నితఁడు పాడుచేయుచున్నప్పుడు——'

'అది యంతయును వేఱుసంగతి. మొట్టమొదట జూదమాడు టకు వచ్చుటయే నాతప్పు. ఆపైని రామయ్య నెదుటఁబెట్టుకొని

యాడుట యంతకన్నతప్పు. ఇన్ని తప్పులను నానెత్తిపై బెట్టుకొని రామయ్యనేల నిందింపవలెను?' 'సెబాష్-సెబాష్' అని మూకలోఁ గొందఱనిరి. శ్రీనివాసుడు వెనుకదిరిగిపోయెను. వానివంకరచూపులు వేంకటరావున కపశకునమును సూచించుచుండెను.

ధన పిశాచావిష్టుఁడు గావున, నెట్లో ధనాకర్షణము చేయుటయే యీతని యుద్దేశము. న్యాయమైనసరే. యన్యాయమైనసరే. అందఱును పేకాటగదిలోనికిఁ బోయిరి. ఆటలోనికి రావలసినదని కృష్ణాజీగారు వేంకటరావును బిలచిరి. పేకాటకు మఱిరానని యాతఁడు ఖండితముగాఁ జెప్పెను. ఆతడు మరల హాలులోనికిబోయి తలుపువైచి, పెరటితలుపు తెరచెను. కమల మరల లోపలప్రవేశించెను. ఆమె ముఖమున జిరునవ్వున్నను, విచారసూచకములగు కళలుమాత్రము విడువలేదు సమీపముననున్న తోకబెంచీపై వారిద్దఱును గూర్చుండిరి. 'నీవు మనస్సు త్రిప్పుకొన్నందుకు నా కానందమైనది. జిగినీబిళ్ళ భద్రముగా నున్నదా?' 'ఏదీ! నీవేతీసికొనిపోతివి?' 'ఆ, నేను వెళ్ళినప్పుడు ఈ బెంచీపైనేగదా అదియుంచి వెళ్ళితిని. నీవుతీయలేదా?' వేంకటరావు తెల్లబోయి మొదట బెంచీవైపుచూచి తరువాత కమలవైపు చూచెను.

'కమలా, నిజముగా నీవద్ద జిగినీ లేదనియే చెప్పుచున్నావా?' 'లేదు. నిజముగానే నావద్ద లేదు. నాకు తీయుటకు వ్యవధియేదీ? నీవు తీసెదవనితలఁచి వడివడిగా బారిపోయితిని. నీవు నిజముగా దానినిఁ దీసి దాచినయెడల—'

'లేదు, లేదు. నేను తీయలేదు.' ఆతనిగొంతుక యెలుగు రాసెను. 'నీవునునేనును దీయకపోయియున్నప్పుడు మఱియెవ్వరో యెత్తుకొనిపోయి యుండవలెను.'

---

# నాల్గవ ప్రకరణము

## ఏ మి గ్ర హ చా ర ము!

వింతవానివైపు చూచినట్లు కమల వేంకటరావు వైపుఁజూచుచుండెను. కెంపుల జిగినీ మాయమయ్యెనను సంగతి విన్నప్పటినుండియును నామెకు మనస్సులో నొకవిధమైన యాందోళనము కలుగసాగెను. పైవారెవ్వరో వచ్చి జిగినీ యెత్తుకొనిపోయిరనుమాట నామె యింకను నమ్మలేకుండెను.

'తొందరలో నీవు జిగినీ లాగుకొనిపోలేదా?' అని వేంకటరావు మరల నడిగెను.

'లేదు. ముమ్మాటికిని లేదు.' ఆమె జవాబుచెప్పెను. 'నీపని పాడుచేయుటకును, మన రహస్యమునకు భంగము కలిగించుటకును గూడ నాకిష్టములేక, నీవు దానినితీసి దాచెదవని యెంచి, యక్కడనే విడిచిపెట్టి తొందరగా వెళ్ళిపోయితిని. నేను పెరటిలో నూతియొద్దను గూర్చున్నంతసేపును నీకును సూర్యరావునకును గూడ మేలుచేయఁగలిగితిని గదాయని సంతోషించుచుంటిని. ఏమి గ్రహచారము! ఏమి గ్రహచారము!'

'అయినచో నది దొంగిలి పఁబడియే యుండవలెను.' ఆతఁడు నిశ్చయముతోఁ జెప్పెను. 'నీవు పెరటిలోనికి బోయినప్పు డెవ్వరో హాలులోనికిఁ జొరఁబడి యుండవలెను.

'అది సాధ్యముకాదు. నూతియొద్దఁ గూర్చున్నంతసేపును నేను పెరటి ద్వారమువైపే చూచుచుంటిని. ఆ త్రోవ నెవ్వరును జొరఁబడలేదు. నీవు తలుపు తెరచుకొని తొందరగా బోయినప్పు డెవ్వరైన నాత్రోవను జొరఁబడి యుండవలెను.'

'అదికూడ నసాధ్యమని వేంకటరావు దృఢముగాఁ జెప్పెను. 'నేను వారితో మాటాడుచున్నంతసేపును నిన్ను గుఱించియే యాలోచింపుచుంటిని. తలుపుతీసి యెవ్వరైన లోనఁ బ్రవేశింతురేమో యని తలపువైపే చూచుచుంటిని. మనము తలఁచినదానికన్న నెక్కువయైన కమల ముఖము వాడిపోయెను. ఆమె చూపులలో నెంతయో యాతురత కనుపడుచుండెను.

'నేనుకూడ నట్లే యనుకొనుచున్నాను. మన మాటల నెవ్వరోవినుచుండిరి. కాబోలు. గోడలకు చెవులున్నవేమో. మన రహస్యము వారికిఁ దెలిసిపోయి యుండవచ్చును. అయ్యయో! నాకు భయమగుచున్నది.'

వేంకటరావున కింతవరకు నాసంగతి సస్ఫురింపనేలేదు. కమల యెట్టియవస్థలోఁ బడిపోయినదో యిప్పుడాతనికి యథార్థముగా గోచరించెను. చేతగాని చికాకొకటి యాతనికి హఠాత్తుగాఁ గలిగెను. మరల కొంచెము శాంతినొందెను.

'మనయూహ లవసరములేకయే, చాలదూరము పోవుచున్నవేమో! జిగినీ నాలుగువందల రూపాయీలు చేయునని విని యెవ్వడో ధనాశచే దానిని దొంగిలించి యుండవచ్చును. ఏదియైనను గ్రహచారమే,'

కమల వినుచున్నట్లు కనపడలేదు. తన రహస్యభంగమును గూర్చి యామె యాలోచించుట మానివేసెను. తన హృదయేశ్వరుని వాగ్దానమునకును, నాతని స్నేహితుని మర్యాదకు కలుగఁబోవు భంగమును గూర్చియే యామె యాలోచించుచుండెను. క్షుద్రమైన ధనాశచేఁ జోరుఁ డెవ్వఁడో యాభరణము నెత్తుకొనిపోయెనని యామె యెంతమాత్రమును నమ్మలేదు. ఆవిషయమై యామెకు వేఱు విధమగు భయము కలిగియే యున్నది. కాని యా భయముఁ

తరువాత నామెయొకమూలకుఁ ద్రోసివైచెను. మనోనాథుని వాగ్దాన మెట్లు నిలపఁగలనను నొక్కయాలోచనయే యామె మనస్సులో నుండెను.

'వీరందఱు నింక నెంతసేపు పేకాడెదరు?' అని యామె యడిగెను. వేంకటరావు జవాబు చెప్పలేకపోయెను. అప్పటికే పన్నెండు గంట లయ్యెను. బహుశః వారు రెండుగంటలదాక నాడెదరేమో? కాని, కమలకా 'భోగట్టా' యేల?

కమల యీసంగతి మఱి యెత్తలేదు. ద్వారమువైపు బోసాగెను. వీరందఱికన్న ముందుగా నీవు పోవద్దు. కొంచెము పనియున్నది. నీతో నిప్పుడెక్కువగా మాటాడలేను. నాకుఁ దలనొప్పిగా నున్నది. నే బోయెదను. సెలవు.' తలుపు తీసికొని కమల వెళ్ళిపోయెను.

వేంకటరావు మనస్సు చక్రమువలె తిరుగసాగెను. అతఁడు పేకాటగదిలోనికి బోయెను. రామయ్య యొకమూల నేలపైఁ బండుకొని గుర్రుపెట్టుచుండెను. మిగిలిన వారాటలో మునిగి తేలుచుండిరి. కాల్చువారి చుట్టపొగకంపుతో గది యంతయు నిండియుండెను. రమ్మని వారందరును వేంకటరావును బిలిచిరి. ఆటలోఁ గూర్చుండుటకు వానికిష్టము లేకపోయెను. కృష్ణాజీగారు లేచి నిలువఁబడి యొడలు విరుచుకొని రమ్మని వేంకటరావువైపు సంజ్ఞచేసిరి. 'రండి నాకు బదులుగా కూర్చుండి యాడుచుండుఁడు. నాచేయి యిప్పుడు గెలుపులోనే యున్నది.' అని కృష్ణాజీ యనెను.

'వద్దు వద్దు నేను మఱి యెప్పుడును పేకాడనని యొట్టుపెట్టుకొన్నాను.'

'వృద్ధనారీ పతివ్రతా అన్నాఁడు పోనీయండి. వట్టినే కూర్చుందురా? చిన్నచుట్ట యొకటి కాల్చుఁడు.'

'నేను చుట్టకాల్చను.'

'ఎప్పుడు మానివేసినారు? నిన్నటినుండియేనా?'

'లేదండి. నేను చిన్నప్పుడే యొట్టుపెట్టుకొన్నానండి.'

'అట్లయిన బోనిందు. ఇక్కడ వట్టినే కూర్చుండండి. బంట్రోతులు నిద్రపోవుచున్నారు. వచ్చువారికిని బోవువారికిని తలుపు తీయుచు వేయుచుండుడు.' వేంకటరావు కూర్చుండెను. ఆట జోరుగాఁ బరుగెత్తుచుండెను. అందరును నిశ్శబ్దముగా నాడుచుండిరి. వీగిపోయినవారు నష్టము పూర్తిచేసికొనఁ గోరుచుండిరి. గెల్చినవారు మఱింత గెల్చుట కుద్దేశించుచుండిరి. ఇంతలో వీధిలోనుండి యెవ్వరో గట్టిగా బిలువసాగిరి. వేంకటరావు లేచి వడివడిగాఁ బోయి చేరవైచి యున్న వీధితలుపు తెరచెను. నెత్తిమీదనుండి ముసుగువేసికొని యొక మనుష్యుడు గుమ్మములో నిలిచియుండెను. 'ఎవ్వరు మీరు?' అని వెంకటరావడిగెను.

'ఎవ్వరయిన నేమి? కృష్ణాజీగారితో మాటాడవలెను. వారెక్కడనున్నారు?'

'వారితో మాటాడుట కిప్పుడు వీలులేదు. వారు పేకాడుచున్నారు.'

'మాటాడక తప్పదు.' ఒక కాగితపు ముక్కపయి నాతఁ డేదో వ్రాసెను. ఇది తీసికొనిపోయి వారికిఁ జూపుడు. వారు తప్పక వచ్చెదరు.'

కాగితపుముక్క నందుకొని వేంకటరావు పేకాటగదిలోనికిఁ బోయి కృష్ణాజీగారి చేతికిచ్చెను. కృష్ణాజీగారి ముఖము బూడిదెవలె యొక్కసారి మాడిపోయి వెంటనే కుంకుమమువలె నెఱ్ఱఁ బాఱెను. ఒక్క నిట్టూర్పువిడిచి యాతఁడు లేచి నిలువఁబడెను.

'వేంకటరావుగారు ఈమాటు మీరు చూచుచుండుఁడు. రెండు నిముసములలోఁ దిరిగివత్తును.' కృష్ణాజీగారు వీధిగుమ్మము

వద్దకుఁ బోయి మరల కొన్ని నిముషములలోనే తిరిగివచ్చిరి. 'నేటి కాట ముగింతము. రేపు ఉదయము ఎనిమిదిగంటల మెయిలులో నూరికిఁ బోవలసియున్నది. రాత్రియంతయును నిద్ర లేకపోయినచో రేపు గ్రామాంతరమునకుఁ బోయి నాపని చేసికొనలేను. పెద్దవాడ నై తినిగదా క్షమించుఁడు.'

ఆట విధిలేక చాలింపఁబడినది. మేకులకు దగిల్చిన కోటుల నొక్కొక్కఁడుఁ దొడుగుకొనసాగిరి. సెలవుపుచ్చుకొనుటకయి కృష్ణాజీగారికి దగ్గరగా వేంకటరావు పోయెను. 'వీరందఱు వెళ్ళిపోవువరకును గొంచమోపికచేయుఁడు వైద్యసంబంధమైనధర్మసందేహమొకటి కలదు' అని కృష్ణాజీగారు ఏకాంతముగా నసిరి. అందఱును వెళ్ళి పోయిరి. వారిద్దఱుమాత్రమే మిగిలిరి 'డాక్టరుగారూ నేనిదివరకెప్పుడు వైద్యునిచే జేయి చూపించుకొనలేదు. ఒకనాడైనను జ్వరమనిచీద లేదు. వానలోఁ దడిచినను ఎండలో ఎండినను శైత్యపైత్యములు లేక కాలక్షేపము చేసితిని. అదియేమోగాని, బాగుగాలేదు. భయముగానున్నది.

'శరీరతత్త్వమెప్పుడు నొక్కలాగేయుండదు. మనుష్యునకు రోకపోయినను మానుకువచ్చునా? సంగతియేమో చెప్పండి' ఈనడుమవ్యవహారంలోఁ జాలకష్టపడినాను. అప్పటినుండియును గుండెలలో నేదోజబ్బుప్రవేశించినది. ఉన్న పాటుననే యొక్కొక్కప్పుడుతటతట కొట్టుకొని, కనులు చికటిక్రమ్మి, మూర్ఛవచ్చి నట్లగుచుండును. ఈ రోజునను బాధజాస్తిగా నున్నది. కొంచెముచేయిచూచెదరా?'' వేంకటరావు 'స్టెతస్కోపు' దగ్గఱలేకుంటచే, గుండెలపయిఁ జేయివైచి సాధ్యమైనంత జాగ్రత్తిగాఁ బరీక్షించెను 'కృష్ణాజీగారూ, నిజము చెప్పెదను. కోపగింపకుఁడు. మీగుండెలు చెడిపోయినవి. మెదడు చెడినట్లు తోచుచున్నది. ఆరుమాసములు విశ్రాంతి తీసికొనవలెను.

తప్పదు అయారుమాసములు మీ రేపనియును జేయకూడదు. కులా సాగాఁదినుచు దిరుగుచుండవలెను. వ్యవహారవిషయమైన చింతయే కూడదు. అట్లుచేయక పోయిన యెడల తప్పక బాధించును.

కృష్ణాజీగారు వెడ నవ్వునవ్విరి. 'అంతకాలము వ్యవహారము మానివేసి యుండుటకు వీలులేదు. పోనిందు మీరు చెప్పినట్లొక మాసము మాత్రము చేసెదను. మీయింటికిఁబో యెదరా? మీతో నేనుగూడ కొంతదూరము వచ్చెదను. ఒకస్నేహితుని యింటికిఁ బోయి మాటాడవలసి యున్నది.'' కృష్ణాజీగారు దీపములన్నియు నిద్రపోవుచున్న సేవకునెవ్వనినో లేపి వీధితలుపు వేయించి, వేంకటరా వుతోఁ గలసిపోయిరి.

వారిద్దఱును గొంతదూరము పోయినతరువాత, యొక యింటి యరుగుపయి నుండి యెవరో తనవయిపు రమ్మని సైగ చేయుచు న్నట్లు వేంకటరావుకుఁ బొడకట్టెను. ఆతఁడు రెండడుగులు వెనకకు నిలచెను. పనితొందరచే కృష్ణాజీగారు వెనుకకు తిరిగి చూడక ముం దుకు వడివడిగాఁ బోవుచుండిరి. నల్లని బట్టముసుగు వేసికొనిన యొక స్త్రీవిగ్రహము వేంకటరావు సమీపమునకు వచ్చెను. కమలా?' ఆతఁడు నిట్టూర్పువిడచెను. 'కమలా, ఏమి యీఘోరము! ఇంత రాత్రి యిప్పుడు—'కృష్ణాజీ వెనుక దిరిగి చూడకుండుటకు కనిపెట్టి, వెంకటరావునుఁ గమలకొంచెము ప్రక్కకు లాగుకొనిపోయెను. ఎగ యూపిరిచే నూపిరియాడక యామె యెట్టెట్లో మాటాడసాగెను.

నేనువీధిలోనికిఁ బోవలసివచ్చెను. వారు తెల్లవారు వరకును పేకయాడెదరని తలఁచియుంటిని గాని, యింతలోనే యాపివేయుదు రని యనుకొనలేదు. తలుపులన్నియు వేసియున్నవి, నేనుమాయిం టిలో కెట్లుపోవుదును? పోలేకున్నవీధిలో నెట్లు తెల్లవారు వరకును నిలిచియుందును? మరియొకరి యింటఁబండుకొని యున్నదియును మానాస్పదము కాదా? ఏమిచేయుటకును దోచకున్నది.'

'వెంకటరావుగారూ, వెనుకఁబడిపోయిరా' యని దూరము నుండి కృష్ణాజీగారు కేకలు వేయసాగిరి.

'నాకేమి యుపాయము చెప్పెదవు? వేగము వేగము' అని కమల వెనుకకు లాగఁజొచ్చెను.

---

## ఐదవ ప్రకరణము.

### క్షమింపుము.

ఒకప్రక్క కృష్ణాజీగారు గట్టిగా కేకలు పెట్టిరమ్మని పిలుచు చుండిరి. ఒకప్రక్క కమల యుపాయము చెప్పుమనితొందర పెట్టు చుండెను. వేంకటరావునకు గొప్పచిక్కు వచ్చెను. కాని యాతని మతి చలింపలేదు. వచ్చుటకుఁ గొంచెమాలస్యముపట్టునని కృష్ణాజీ గారితోఁ జెప్పుటకుఁగాని, యేలయింతరాత్రి యప్పుడెత్రోవల నీవుం డవలసి వచ్చెనని కమల నడుగుటకు గాని యాతని కప్పుడువీలు కాలేదు. అంతలోనే యింతవీలుకలుగఁజేసికొని 'చాలసేపునకు ముందే నీవు నిద్రపోయినావని నేననుకొనుచుంటిని. కమలా, నీకేమి పిచ్చిపట్టినదా? ఏలయింత తెలివి మాలిన పనిచేసితివి?' అని యామె నడిగెను,

'మిక్కిలి తొందరపయి విధిలేకపోయితిని. మఱియొక విధ ముగా నాలోచింపకుము. వారు తెల్లవారువరకును పేకాడుచుందు రని తలఁచితిని. ఇంతనోనే మాని వేయుదురని నేననుకొనలేదు. అదిగో, కృష్ణాజీగారు మరల పిలుచు చున్నారు.' 'డాక్టరుగారూ, ఏమి యాలస్యము? రారేమి!'

'ఇదిగో ఇప్పుడేవచ్చుచున్నాను, ఒక వస్తువుచేతిలో నుండి జారిపడిపోయినది. వెదకుచున్నాను. కొంచెమోపిక చేయుడు.' కృష్ణా

జీగారి వెనుకఁబోవుట కన్న, ఆపదలోనున్న కమలకు సహాయము చేయుట యావశ్యకమని యాతనికిఁ దోచెను. అప్పుడే 'వారిజాక్షు లందు' అను పద్యము కూడ జ్ఞాపకమువచ్చెను.

'వచ్చెదనుగాని, కొంచెమాలస్య మగును. మీరుఁ దొందరగా నున్న దయచేయుచుండుఁడు, నా జేబులోనుండి ఒకమందుసీసా ఇక్కడనో యెక్కడనో పడిపోయినది. అది వెదకుచున్నాను. దొరకినఁగాని రాలేదు. మీరు కూడవచ్చి నాకు సాయముచేసిన సంతోషించెదను.' కృష్ణాజీగారు రారని యతనికిఁ దెలియును. "అయినసరే మీరు వెదకుకొనుచుండుఁడు. నాకు జాలమగుచున్నది. నేఁబోయెదను., అని చెప్పి కృష్ణాజీగారు వెళ్ళిపోయిరి. వేంకటరావునకు గుండె దిట్టపడెను. అసత్యమెన్నఁడు నాడు వాఁడుకాఁడని తోడివారిలో మెప్పొందుచున్న తాను నేఁడసత్యమాడవలసి వచ్చినదిగా యని యాతఁడు విచారించెను. గాని, యాయసత్యము కష్టమున నున్న యొకయనాయకురాలి యుపకారముననే యగుటవలన వెంటనే యాతనికి మనశ్శాంతికలిగెను. వెన్నెలలో కమల ముఖముస్పష్టము గాఁగన్పట్టుచుండెను. ఆముఖము తెల్లఁబోయి యుండెను. ఒక విధ మగు మహాభయమును సూచించు చుండెను.

కృష్ణాజీగారు వెళ్ళిపోయినట్లేనా?' అని యామె యాత్రముతో నడిగెను. 'అవును. వెళ్ళిపోయినారు. కాని నేనేల యాగి పోయితినో ఆయన పోల్చుకొనలేఁడులే.'

'హృదయేశ్వరా, నేను నీకొరకే—'

'అవును. నాకొఱకే యింత తెలివి తక్కువ పనిచేసితివి. నీపయినాకుఁ గోపమువచ్చు చున్నది. ఇంతరాత్రి యప్పుడిల్లువిడచి యేలవచ్చితివి?

'కోపమువద్దు. ప్రాణేశ్వరా, కోపమువద్దు,' వాడిపోయిన యామె చెక్కుటద్దములపయి కన్నీళ్ళుజలజల రాలసాగినవి. 'ఇంత

రాత్రి యప్పుడు నేనిల్లువిడిచి వెళ్ళుట నీకొఱకే. నీగౌరవము కాపాడుటకే. వారు తెల్లవారు వరకును బేకయాడు చుందురని నేనను కొంటిని. తరుచుగా వారట్లు చేయుచుండుట చూచి యుంటిని. నేఁడు గూడ నట్లే చేయుదురని తలంచితిని. మొట్టమొదటనే యాసంగతి నీతో జెప్పుటకు నేను నుద్దేశింపలేదు. కార్యము సానుకూలము చేసికొన్నపయిఁ నీవు తలవని తలంపుగా, నీతో 'నీవాగ్దానము రేవు జరిగించు కొనవచ్చు' నని చెప్పి నీకానందముకలుగఁ జేయవలెనని యనుకొంటిని. నేనిట్లువచ్చుట నీకొఱకేయని యిప్పుడైన నమ్మెదవా?' జాలిని బుట్టించు కమల మాటలును, అమాయికములయిన యామె చూపులును, గని పెట్టి, వేంకటరావు మనస్సు మెత్తనయ్యెను. ఆమె నిర్దోషురాలని నిశ్చయించు కొనెను.

'నీవు తలఁచినపనియెట్లు చేయవలెనని యనుకొంటివి?' అని యాతఁడడిగెను.

'నీతో నిప్పుడది చెప్పవలసినది కాదు. క్షమించుము. నామాట నమ్ముము. నిర్హేతుకముగా జిగినీ యదృశ్యమయ్యెనని మనమెఱిఁగిన తక్షణమే, నామనస్సు పరిపరివిధములఁ బరుగెత్తసాగెను. నాకొక క్రొత్తయాలోచన పొడకట్టెను. నాప్రయత్నము వట్టి గొంతెమ్మకోరికయని, నాకిప్పటికి గాని తోఁచలేదు. ఆప్రయత్నము నిష్ఫలమైనది. ప్రాణేశ్వరా, తన హృదయమంతయు నర్పణచేసిన మానమును గాపాడుటకు స్త్రీ మాత్రురాలెంత శ్రమపడగలదో యంత శ్రమయును నీకొఱకు పడితిని. మరి నేనేమి చేయఁగలను?'

వేంకటరావునకుఁ జిత్తభ్రమ కలిగెను. మతిమాలి తాను చేసిన యపరాధమువలనఁ దనకుఁ గలిగిన యాపదనుండి తన్ను తప్పించుట కనుకూలముగాఁ బ్రయత్నించుచు చిక్కులలోఁ బడు చున్న యొకకన్యను దాను నిందించుచున్నాఁడు. వేంకటరావున కేమియుఁ దోఁచక యొకనిముస మూరకుండెను.

'ఇంతగన్న నే నేపాపమెఱుఁగను. హృదయేశ్వరా, క్షమింపుము.' 'క్షమింపుమందువా! కమలా' అతఁడు పూర్తిగాఁ దెలివొందెను. క్షమింపుమందువా! నాకొఱకై యింతశ్రమపడుచున్నావు నీకు నేనేమి ప్రత్యుపకారము చేయఁ గలను? మనమింక నిక్కడ నాలస్యముచేయుటకు వీలులేదు. ఇంటికి నిన్ను దిగఁబెట్టెదను. పద. ఏదో యొకవిధమునఁ గనుపడి నీగదిలో నిన్నుఁబ్రవేశపెట్టి నేను నాబసకుఁ బోయెదను' తాను చేయవలసిన కార్యక్రమమంతయుఁ దనకు నిశ్చయముగాఁ దెలిసినట్లే యాతని కంఠధ్వని సూచించుచుండెను. కాని తాను చేయవలసినపని మహాకార్యమై యుండెను.

కమల వీధిలోనున్నది. ఆమె తనగదిలోనికి పోవుటకుమూడు ద్వారములు తెఱువవలసియున్నది. ఆపని రహస్యముగాను, నిశ్శబ్దముగాను జరుగవలసియున్నది. తలుపులు తెఱచు స్నేహితులెవ్వరునులేరు. దొంగతనముగాఁ దలుపు లూడఁదీయవలెను. ఆపని యెట్లు సాధ్యమగును.

'కమలా! అందాఁక నీవీ బాదముచెట్టువద్దఁ గూర్చుండుము' —వీధిగుమ్మమువద్ద బాదముచెట్టొకటి కలదు—'కీడెంచి మేలెంచవలెను. ఒకవేళ నీవింటిలోనికి పోలేకపోయినయెడల, రాత్రియంతయు నిక్కడనేయుండి, 'తెల్లవారు జామునపైకి వచ్చితి'నని యబద్ధమాడవచ్చును. కాని, యంతవరకు రానీయనులే.' కమల గుండెలు తటతట కొట్టుకొనుచుండెను. వేంకటరావు తలుపుతెఱచు ప్రయత్నమున నుండెను. మొట్టమొదట వీధివైపుననున్న పెరటి తలుపు పరీక్షించెను. అది లోపున గడియపెట్టి యుండెను ఎట్లైన దెరచుటకు సాధ్యమగునా యని మరలఁ బరీక్షించెను. తలుపు చెక్కలలోఁ గొంచెము సందుకలదు. జేబులోనుండి చేతికత్తిని దీసెను. దానినా సందులోదూర్చి గట్టిగానెత్తెను. గడియ జాఱ

పోయెను. తలుపు తెరువఁబడెను. పెరటిలోఁ బ్రవేశించెను. నూతి యొద్దనఁ జేరబడి నలుదిక్కులఁ బరీక్షించెను. మొట్టమొదట కృష్ణవేణి సామానుంచుకొను గదియును, దానికుడిప్రక్కను గనులతోఁ దాను మాటలాడిన హాలును, దానికుడిప్రక్కను కమలగదియు నుండెను. కమలగదికి రెండుకిటికీలు కనుపడెను. ఒకటి తాను నిలచి యున్న పెరటివైపుననున్నది. మఱియొకటి యింటికి వెనుకప్రక్కనున్న పెరటివైపునున్నది. వేంకటరావు రెండుకిటికీలను బరీక్షించెను కిటికీతలుపులు చెక్కతలుపులు. వానికి 'షట్టర్సు' కూడ గలవు. షట్టర్సులోఁ జేయిదూర్చి గడియతీయుటకు వీలగునేమోయనియాతడు పరీక్షించెను. కాని యవి లోపునుండి గడియ వేయఁబడి యుండుటచే నది వీలులేకపోయెను. మరల నాతఁడు కమలవద్దకు వచ్చెను. ఆమెనుపాయమడిగెను. కొంచెముసేపామె యాలోచించెను. ఏదియోసంగతి యామెకు జ్ఞాపకమువచ్చెను. తనగదికి హాలువైపుననున్న కిటికీ 'షట్టర్సు' లోపలినుండి గడియపెట్టుట మామూలులేదని యామెకు స్ఫురించెను. వెంటనే యాతనితోఁ జెప్పెను. ఆతఁడు మరల పెరటిలోనికిఁబోయి పరీక్షించెను. హాలులోనికిఁ బోవుటకుపాయ మాలోచించెను. ద్వారము తెరచుటకు వీలులేదు. కిటికీలు రెండుకలవు. వానితలుపుల పైభాగములు అద్దములు. వాని చేతికత్తితో నొకయద్దమును జప్పుడుకాకుండ కోసెను. చిన్నముక్క తెగెను. చేతితోఁ గొంతవరకు విఱిచివేసెను. చేయి దూరుపాటి సందు కలిగెను. చేయిదూర్చి గడియతీసెను. హాలులోఁ బ్రవేశించెను. కమలగది కిటికీయొద్దకు వెళ్ళి 'షట్టర్సు' లాగెను. విడిపోయినవి. చేయిదూర్చి గడియతీసెను. హాలుతలుపు తీసికొని పెరటిలోనుండి వీథిలోనికివచ్చెను. కమలను దోడ్కొని మరల పెరటిలోనికిఁ బోవుచుండెను. ఇంతలో పెరటి వెనుక ప్రక్కనుండి దొంగ

లాంతరు వెలుగుకనపడెను. హాలుతలుపు వేసికొని కిటికీలోనుండి గదిలోనికిఁ బొమ్మని కమలతో మెల్లఁగాఁజెప్పి, ఏమివచ్చినను రానిమ్మని వేంకటరావు ధైర్యముతో నక్కడనే నిలుచుండెను. కమల గదిలోనికిఁ బోయి తలుపువేసికొనెను. దొంగలాంతరు సమీపించెను. గంటక్రిందట ముసుగు వేసికొని కృష్ణాజీగారియొద్దకు వచ్చినవాఁడే తనయెదుట నిలువఁబడెను. ఆతఁ డింకను ముసుగు వేసికొనియే యుండెను. 'డాక్టరుగారూ మరల తిరిగివచ్చిరా? ఏదియైనఁ బారవేసికొని వెదకుచున్నారా యేమి? ఇప్పుడు మీరు పడుచున్న శ్రమయంతయును నేను గనిపెట్టితిని. వెనుక పెరటిలోనే నేను గనిపెట్టుకొనియుంటిని. నావద్దకు వచ్చియున్న శ్రమలేకయే నేను తలుపు తీయించియుందును. పోనిండు. ఐనది యైనదే కాని హాలులోనికిరండు. ఇద్దరును బోయిరి. ఇదియేమి యీ బెంచీప్రక్క? చేరుమాలుముక్క. ఇది మీదేనా?

'కాదు' 'అయినచో నెవ్వరిదో యింటివారిదై యుండును.' ఆడువారి చేరుమాలై నట్లు తోచుచున్నది. ఇది నేనిందాకనే చూచి పనికిమాలిన వస్తువని యశ్రద్ధచేసితిని. 'ఎందుకైనను మంచిదే. ఇది తీసి దాచియుంచుఁడు. మీరు ఇందాక పారవేసికొనిన వస్తువు నెవ్వరు దొంగిలించిరో తెలిసికొనుట కిది పనికిరావచ్చును. జాగ్రతగా జేబులోపెట్టి దాచుకొనుఁడు. మరచిపోకుఁడు.'

---

## ఆఱవ ప్రకరణము

'తా నొకటితలఁచిన దైవ మొకటి తలఁచును.'

వింతవాఁడు మాటాడుచున్నంతసేపును దల యూచుచుండెను. వాఁడాడుచున్న మాటలు 'శాతాఖాని' మాటలవలె విలువలేనివాని

వలె పైకిఁ గనుపడుచున్నను లోననేమియో ముఖ్యాంశ మున్నట్లు స్ఫురించుచుండెను. చేరుమాలు ముక్క వలనఁ దనకేమి యుపయోగమో వేంకటరావునకు బోధపడలేదు. కాని యది తీసి దాచవలసిన దని వాఁడాతని దొందరపెట్టి బలవంతముగ జేబులో పెట్టించెను.

'నే నెవ్వఁడనో తెలియక నీవు నావైపు వింతగఁ జూచుచున్నావు. నీకా విషయమైన సందేహమక్కరలేదు. నే నెవ్వఁడనైనను నీకు శత్రువునుగాను కొన్నిదినములలో నీకొక గొప్ప స్నేహితుఁడను కాఁగలను. నీ కాలస్యమగుచున్నది కాఁబోలు. కృష్ణాజీగారు రాత్రి తిరిగి యింటికిరారని యనుకొనుచున్నావేమో! వారు శీఘ్రముగానే తిరిగివత్తురు. నీకిక్కడ నేమికావలసినను దెచ్చి యిత్తును. చెప్పుము. జాగుచేయరాదు.'

వింతవాఁ డెవ్వఁడైనను దా నేకారణమున దొంగపనిచేసినో యది వానికిఁ దెలియలేదని యెంచి వేంకటరావు తృప్తినొందెను.

'నీవుచేసిన యుపకారమునకు సంతోషించితిని.' వేంకటరావు చెప్పెను. 'నేను చేయవలసినపని చేసివేసితిని. ఇక్కడ నాగవలసిన యవసరము మఱిలేదు. చేరుమాలుముక్క—'

'జాగ్రత్తగా దాచియుంచుము. నీకది యెంతో పనికివచ్చును. కృష్ణాజీ యతి శీఘ్రముగావచ్చును. వాఁడు తిరిగివచ్చువరకును నీ విక్కడ నుండఁగూడదు. వేగము పొమ్ము. పెరటితలుపు వేసెదను. నీవు చప్పుడు చేయలేదని యనుకొనుచున్నావు. కాని చేసితివి. అది వినియే నేను నీవద్దకు వచ్చితిని. నేను నీకు శత్రువును కానని మఱియొకసారి చెప్పుచున్నాను.' వేంకటరావు చెప్పవలసిన దేదియును లేదు. కమల సుఖముగా నింటికిఁ బోయినది. తానుగూడ వడివడిగా నింటివైపు నడువ సాగెను.

క్రొత్తవాడు పెరటితలుపును, హాలుతలుపును వేసికొనెను. వేంకటరావు ఇంటికిఁ బోయెను. నిద్రరాలేదు. కమల నాపదనుండి

తప్పింప యత్నముచేయునప్పుడు సూర్యారావుసంగతి మఱచిపోయెను. ఇంటికి వచ్చుటతోనే యొక్కసారి జ్ఞాపకమువచ్చి వీపుపైఁ గ్రుద్దెను. సూర్యారావున కేమిసమాధానము చెప్పవచ్చును? ఈప్రశ్న మీరు పదిపర్యాయములు తన్నుఁదానే యడుగుకొనెను. సమాధానము తోచలేదు. అడిగిన ప్రశ్నయే మఱల నడుగుకొనుచుండెను. ఇంతలో సూర్యారావు వచ్చి వడివడిగా లోనఁ బ్రవేశించెను. వేంకటరావు తెల్లఁబోయి చూచెను. 'తెల్లబోయి చూచెద వేమి? మీయింటికిదివరకే రెండుమూడుసార్లు వచ్చితిని. గాని నీవింటివద్ద లేవు. నాయాత్రముచే నింతరాత్రియప్పుడు మరల వచ్చితిని' 'నీకు నేనిచ్చెదనన్న ధనముకొఱకేనా?'

జరిగిన సంగతియంతయును యథార్థముగాఁ జెప్పవలసి వచ్చెను. దాచినప్రయోజనము కన్పడలేదు. అంత యాతురతతో నడుగుచున్నవానితో 'లేద' ని యెట్లు చెప్పవచ్చును? ఏండ్లకొలఁదిగ వారిద్దఱును స్నేహితులు. చెన్నపట్టణములో తమతమ కాలేజీలలోఁ జదువుచున్నప్పుడు వారొక్కగదిలోనే బస చేసియుండెడివారు. ఒండొరులు రహస్యములను యథేచ్ఛగాఁ జెప్పుకొనుచుండెడివారు. అట్టివానికి సహాయముచేయక యుండుట యెట్లు? చేయలేనని చెప్పుట యెట్లు? 'ఏమి యట్లాలోచించుచున్నావు? వింతయేమైన జరిగినదా యేమి?' వేంకటరావింకను మాటాడలేదు.

'ధనము పోయినదా యేమి?' సూర్యారావు మఱియొకసారి యడిగెను. ఏదో యొక యబద్ధపుగథ యల్లి చెప్పివేయవలసినదని మనస్సు ప్రోత్సాహము చేసెను. అట్టిపని కూడదని మనస్సాక్షి గట్టిగా నాజ్ఞాపించెను. మనస్సాక్షికిని మనస్సునకును దేవాసుర యుద్ధము కొన్నినిముషములు జరిగెను. చివరకు మనస్సాక్షియే గెల్చెను. సత్యము చెప్పివేయుట కాతఁడు నిశ్చయించెను. కూర్చుం

డువాని సంజ్ఞచేసి, కుర్చీపైని వానిఁ గూర్చుండఁబెట్టి చెప్పనారంభించెను.

'నేను చెప్పినదివిని నీవేమిభావించెదవో నాకుఁ దెలియదుగాని వాస్తవమునే చెప్పుచున్నాను. ఉదయమున నీకీయవలయునని సాయంత్రమే సొమ్ము బాంకినుండి తీసితిని. ఈనడుమ దొంగతనములు జాస్తీగానుండుటచే ఇంటిలో నుంచుటకన్న దగ్గరనుంచుకొనుటనే మేలని తలఁచి, నోట్లు జేబులో పెట్టుకొని, కృష్ణాజీగారియింటికి భోజనమునకుఁ బోయితిని.'

ముందుగాఁబోవునదేమో యాలోచింపక, సూర్యారావు అశ్రద్ధగా వినుచుండెను. సొమ్ముపోయినదిమాత్ర మాతఁడప్పుడే యూహించియుండెను.

'శ్రీనివాసుఁడుకూడ వచ్చెను. వాదమునకై నన్ను పురికొల్పెను. జరుగవలసినది జరిగినది.' సూర్యారావునకు మనస్సులో నేవేవో భావములుపుట్టెను. బలవంతముగ వాని నాతఁడడచికొనెను.'

సూ—'బహుశః పెద్దపెద్ద పందెములు వేసి యోడిపోయియుందువు. అవసరమైనప్పుడు తప్పక శనిదేవతయేకదా వెంటవచ్చుచుండును?'

వేం—'శనిదేవతకు రామయ్యగాఁడు తోడుపడినాఁడు వాఁడు నాకు వంతుదారుఁడైనాఁడు ఏదో మాయ కమ్మినట్టయి డబ్బంతయు దగులఁబెట్టితిని. శ్రీనివాసునకు నోటువ్రాసియిచ్చెదనంటిని వాఁడొప్పుకొనలేదు. పరువు నిలువఁబెట్టుకొనవలెనని, నోట్లు వాని మొగమునఁ బారవైచితిని నాకుఁ జాల విచారముగ నున్నది సూర్యారావూ, దేవుని ముఖముచూచి చెప్పుచున్నాను. నాకుఁ జాలవిచారముగ నున్నది. నీవు నాకేదైన త్రోవచూచినయెడల—' వేంకటరావాగిపోయెను. నోట మాట రాలేదు.

నా—"నూ—నాకేమియుఁ గనుపడదు. శ్రీనివాసుఁడు కోంచె మోపిక చేయవలసియుండెను. వానికి నామీఁదకోపము. నీవునాకు సొమ్మిచ్చెదవని యాతని కెట్లో తెలిసి, మాయపన్ని నీసొమ్ములాగి కొన్నాఁడు కృష్ణాజీయును వాఁడునుగలసియే యేదో పాతాళహోమము చేయుచున్నారు. అందులో నన్ను గలపవలెనని శ్రీనివాసుఁ డూహించెను, నేనుమాత్రము వాని మాటవినలేదు. అప్పటినుండియు నెట్లయినను కోంపముంచవలె నని వాడు ప్రయత్నించుచున్నాఁడు కావున నెట్లయిన జాగ్రత్తపెట్టి వానిసొమ్మిచ్చి వేయవలెను.'

వేం—'ఎట్లు జాగ్రత్తపెట్టవచ్చును?' వేంకటరావు చెప్పలేక చెప్పెను. ఎట్లు. ఎట్లు నీకు నేనేమిచేయగలను?'

"విచారించుట తప్ప నీవు మఱియేమి చేయఁగలవు? నాకు మాత్ర మొక్కత్రోవ కనుపించుచున్నది. అనుమానమైనదే, కాని, చేయక విధిలేదు. ఈరాత్రియే చేసెదను.' 'అదియేమి?'

'శంకరశాస్త్రిగారి యింటికిఁబోయెదను.' కమలపినతండ్రియింటికా! కమల కాతడుసమముగా పినతండ్రి కాడు వ్రేలువిడిచినపినతండ్రియని నీవెఱుఁగుదువుగదా. ఆయన రాత్రులయందెప్పుడును నిద్రపోఁడు ఈలోభివాండ్రెప్పుడునునింతే ఎంగిలిచేతితోఁగాకినయిన గొట్టడు. అప్పుడప్పుడు నేను వాని యొద్దకుబోయిబదులు తెచ్చుకుందును. ఎట్లెట్లో వాని దయసంపాదించితిని గావున, తక్కువ వడ్డికి నాకు బదులిచ్చును వేంకటరావనుమానముతో వినుచుండెను. బదులిచ్చుటలోఁ గర్కోటకుఁడని శంకరశాస్త్రికిప్రఖ్యాతికలదు. వానియొద్ద తక్కువవడ్డి అంత సొమ్మొక్కసారి సూర్యారావెట్లు తెచ్చునో యాతనికిఁ దోఁచకుండెను. 'శంకరశాస్త్రితోమాట్లాడి, యేమయ్యెనో నాకుఁదెలియఁజేసెదవా? నేను నీకబురునకయియే కనిపెట్టుకొని యుందును.'

సూర్యారావు వెళ్ళిపోయెను. వేంకటరావు వీధియరుగుపయి గూర్చుం

డియాలోచించుకొనుచుండెను. ఆలోచించిన కొలఁదియు నాతని విచారము మెండగుచుండెను. తన్నుతానే నిందించుకొనుచుండెను.

ఇంతలో నెవ్వడో యొకడు తనగుమ్మము వద్దకువచ్చెను వేంకట రావుగారున్నారా యని యడిగెను. చినిగిపోయి పీలికలుగానున్న బట్టనాతఁడుకట్టుకొనియుండెను. అట్టివారుముష్టియెత్తుకొనుచు రాత్రింబవళ్ళువీధులలోఁదిరుగుచుండుటచేననుమానింపలేదుగాని, 'ఏలవచ్చితి వని గట్టిగానడిగెను' 'ఆవీధిలో నొకపంతులుగారొకయింటిలో పైకివచ్చి యీయుత్తరము మీకిచ్చి నాలుగణాలు మీయొద్దపుచ్చుకొమన్నారు' అని వాఁడు జవాబిచ్చెను. వేంకటరావు గదిలోనికిఁబోయి యుత్తరము చదువుమనెను. వెంటనేనాలుగణాలుతీసి వానిమీద బారవైచి, జవాబులేదు పొమ్మని వానిని బంపివేసెను. వెంటనే కోటును జోడును దొడుగుకొని బయలుదేరెను. ఆయుత్తరము సూర్యారావే వ్రాసెను. 'ఇక్కడవింతయొకటి జరిగినది. శంకరశాస్త్రి యింటిలోనుండి వ్రాయుచున్నాను. నీవిది చూచిన వెంటనే యాలస్యముచేయక పరుగెత్తి రావలెను. త్రోవలో నెవ్వరితో నేమియును మాటాడవద్దు.' అని దానిలో వ్రాసియుండెను.

వేంకటరావునకేమియును బోధపడలేదు. ఏదోయొకవిధమైన యనుమానముకూడఁ గలిగెను. వడివడిగా శంకరశాస్త్రిగారి యింటి వైపు నడచిపోయెను. కిటికీలోనుండి లాంపు వెలుగుచుండెను. చప్పుడు చేయక లోనప్రవేశించెను. ఆయింటిలో నొక్కటే గదియుండెను. పుస్తకములును కాకితములును విరజల్లబడియుండెను. ఒకమూల ధనము దాచుకొను 'సేఫు' పడియుండెను. అది తెరచియేయుండెను. అందుకొన్ని దస్తావేజు కాగితములు ఎఱ్ఱదారముతో కట్టబడియుండెను వస్తువులట్లు విరజల్లబడియుండుటనుజూచిన నెట్టివాఁడు కాపురమున్న యిల్లువలె కన్పట్టునుగాని, బుద్ధిమంతుడు కాపురమున్నయిల్లువలెఁగ

న్పట్టలేదు. ఆగదికి మీఁద బల్లసరంబీ కన్పట్టెను. సూర్యారావూ, మీఁదిగదిలోనున్నావా? అని వేంకటరావు దిగువనుండి గట్టిగా నడిగెను. అవునని యొకమాట వినఁబడెను. వెంటనే మెట్లెక్కియాతడు మీఁదకుఁబోయెను. మేడమీఁద రెండు పడకగదులు గలవు. ఒకటి ఖాళీగానున్నది. రెండవదానిలో నొకమంచమును పరుపును గలవు. ఒకమేజాబల్లపై నొక యద్దపుముక్క యుండెను. మంచముపై నొక పురుషవిగ్రహము వెనుకదిరిగి పండుకొనియుండెను. గడ్డముదాక బూర్నీసుతో కప్పియుండెను. సూర్యారావు మాటలాడక గాళ్ళతట్టున నిలిచియుండెను. వేంకటరావు మెల్లిగ దగ్గరకుఁబోయిచూచి, త్రుళ్లిపడెను.

'చనిపోయినాఁడు! చనిపోయినాఁడు' బూర్నీసు కొంచెము పైకిలాగెను. చేతికేదో జిగటవలె నంటుకొనెను.

''రక్తము రక్తము!' గట్టిగాననెను.

రక్తము! ఇక్కడ ఘోరముజరిగినది.'

---

## ఏఁడవ ప్రకరణము.

### మీఁదు మిక్కిలి

మంచముపై బండుకొనియున్నవాఁడు నిశ్చయముగా మరణించియేయున్నాఁడుగాని వానినిగూర్చి విచారించుట కవసరము కనబడలేదు. శంకరశాస్త్రి ముసలివాఁడు. లోభి. ఒకనాఁడైనఁ దిన్నగాఁ దినడనియే బ్రహ్మపురమునందంతటను బ్రతీతి. పరిచయముగా మాటాడినచో నప్పునప్పులు తక్కువ వడ్డీలకుఁ గోరునేమోయని, బందుగులతో మాత్రమేకాక యిరుగు పొరుగులవారితోఁగూడ

నెన్నడును చక్కగా మాటాడియుండలేదు. ఆకారణమున నెవ్వరును వానిగుమ్మము తొక్కి చూడరైరి. ఇంటిలోదొంగలు చొరబడినను సాయము చేయుట కెవ్వరును రారని యాతఁడెఱిఁగియుంటచే నాతఁడు రాత్రులయందుఁ దెల్లవారువరకును మేలుకొని యుండును. వంటబ్రాహ్మణుని బెట్టినచో జీతమీయవలసియుండునని యాతఁడే రెండుజాముల కింతముద్ద యుడుకఁబెట్టుకొని తినుచుండును. అట్టి మూర్ఖుల కిట్టి దుర్దశ ప్రాప్తించుట వింతగాదు. ఊరిలోనివారు విన్నను దాని కాశ్చర్యపడరు.

న్యాయవాదివృత్తి నవలంబించియున్న సూర్యారావున కిది యాశ్చర్యముగా నున్నదిగాని వృత్తిధర్మమువలన దఱచు కొరడు బారిన శవములను జూచుచున్న వేంకటరావునకు వింతయేమియుఁ గన్పట్టలేదు.

'లోకమున మరణకాలమున నెవ్వరైన బంధుగులో స్నేహితులో కనిపెట్టుకొనియుండుట సహజమైయున్నది. ఈ లోభి యెవ్వని గూడి దగ్గరఁ జేర్చకపోవుటచే దిక్కుమాలినచావు చావవలసి వచ్చెను. పోనిమ్ము. ఆయూసు మనకేల? నేను వైద్యుడను కాబట్టి ఈతఁ డెట్లు మృతిఁజెందెనో కొంచెము పరీక్షించెదను. బహుశః మఱియొక వైద్యుఁడు వచ్చియుండడు' అని వేంకటరా వనెను.

సూర్యారావు దీపమును గొంచెము పెద్దదిచేసెను. శవముపై గప్పియున్న బూర్నీసును భుజములవరకును లాగుటతోనే వింత యేమో వేంకటరావునకు గనుపడెను. త్రుళ్ళిపడి యొక్క యడుగాతఁడు వెనుకంజ వేసెను.

'హత్యయే జరిగెను. సూర్యారావూ చూచితివా!' శవము గడ్డమువరకును గప్పఁబడియును, వీధిలోనికిఁ బోవునప్పుడు తొడుగుకొను దుస్తులు తొడుగుకొని యుండెను, లోన లాల్చీయును, పైని

కోటును, మల్లుపంచయును గలవు. చేతులు రెండును మొగలినార త్రాళ్ళతో గట్టిగా కట్టఁబడి యుండెను. ఆత్రాడు మంచముదండెల కీప్రక్కను నా ప్రక్కయును కట్టఁబడియుండెను. త్రాళ్ళతో కట్టుటకు కొంత వ్యవధి యగుటచేతను, నిండుజీవములతో నాతఁడప్పుడుండుటచేతను, గింజుకొనుటచేత గాఁబోలు ముఖమునందు కోపరస చిహ్నము లింకను విడువలేదు. ఎడమప్రక్క నొక గాయముండెను. అందుండి రక్తము పైకివచ్చి కోటంతయు దడిసినది.

'ఇది ఘోరము. నేనింతవరకును గనిపెట్టనేలేదు.' అని సూర్యారావనెను.

'నాకుగూడ దోచలేదు. ఇట్టిఘోరము లిదివర కెన్నియో సారులు చూచియున్నాను. నాకుగూడ మొదట దోచలేదు. కాని యీతఁడేల మృతినొందెనో స్పష్టముగానే తెలియుచున్నది. ఇదిగో కత్తి తిన్నగా గుండెలలోనికిఁ బోయినది. గాయము తగిలినవెంటనే ప్రాణము పోయియుండును.'

'త్రాళ్ళతోఁ గట్టుటకు ముందుగా నేనా లేక తరువాతనా ?' అని సూర్యారావడిగెను.

'ఆసంగతి చెప్పలేను. చిక్కుగానేయున్నది. చంపివేసిన తరువాత త్రాళ్ళతో గట్టివేయుటకు నంతశ్రమ ద్రోహియైనవాఁ డెవ్వఁడైన తీసికొనునా? త్రాళ్ళతో గట్టినతరువాత చంపియున్నచో గింజుకొని నట్లేల కనుపడుచున్నది?'

'విషమేదైనఁ బ్రయోగింపఁబడినదా ?' అని సూర్యారావడిగెను.

'అదికూడ నాలోచింపవలసిన విషయమే' వేంకటరావు జవాబిచ్చెను. 'కాని, యిప్పుడు మన మెఱిఁగిన దానికన్న నెక్కువ తెలిసికొన నవసరములేదు. ఇంక నిక్కడ జాలముచేసిన నింద మననెత్తి

పైనే బడునేమో, నీవుపోయి వేగముగాఁ బోలీసువారినిఁ దీసికొని రమ్ము. నేనిక్కడనే కనిపెట్టుకొని యుందును.' సూర్యారావు వెంటనే బయలుదేరిపోయెను. పోలీసు ఇనస్పెక్టరుగారిని, ఇద్దఱు కానిస్టేబిల్సును దీసికొనివచ్చెను. ఇనస్పెక్టరుగారు తోఁచినంతవరకు తణిఖీ చేసిరి.

'సూర్యారావుగారూ, కొన్ని ప్రశ్నలడుగవలసియున్నది.' ఇనస్పెక్టరుగారనిరి. 'మీా రీశవము నెన్నిగంటలప్పుడు చూచిరో సమముగాఁ జెప్పగలరా?'

'సమముగా ఇరువదినిముసముల క్రిందట' యాతఁడు జవాబిచ్చెను. 'కొందరపనిచే, శంకరశాస్త్రిగారితో మాటాడుటకు నింతరాత్రి యప్పుడు వచ్చితిని.'

ఇనస్పెక్టరుగా రొక్కసారి సూర్యారావు వైపు తేరిచూచిరి,

'ఇంతరాత్రియప్పుడా? మీారు ఇక్కడకుఁ బోవుచున్నామని యెవ్వరితోనైనఁ ద్రోవలో చెప్పియున్నారా?'

'చెప్పితిని. నాస్నేహితుఁడు డాక్టరు వేంకటరావుగారితోఁ జెప్పితిని, ఈరాత్రి నేను వారియింటినుండియే యిక్కడకు వచ్చితిని. శంకరశాస్త్రిగారి నొకసారి చూచుటకుఁ బోయెదనని వానితోఁ జెప్పియుంటిని. ఆయన తెల్లవారువరకును జాగరణచేయుచు, బగటిపూట నిద్రించుచుండునని నే నెఱుఁగుదును. నాకును నాయనకును జాలపరిచయము కలిగియుండుటచే, రాత్రులయందు నేనాయనయింటికి వచ్చుచుఁ బోవుచుండు నాచారముకలదు.'

'తలుపేమియైనను విరుగఁ గొట్టఁబడినట్లుండెనా?'

'లేదు. తలుపు మూసియే యుండలేదు. శంకరశాస్త్రి పరమలోభియైనను, వీధితలుపెప్పుడును వేయునాచారము కలవాఁడుకాడు'

'మీారు చూచినదంతయు వాస్తవముగాఁ జెప్పుడు.'

'కాకపోయిన నిన్నేమి యసత్యములను గల్పించి చెప్పు మంటినా? ఈ గుమాస్తాగాళ్ళకు బుద్ధి యెన్నటికినిరాదు.' అని కృష్ణాజీ గారు కోపపడిరి. గుమాస్తా పాపము చిన్నబోయి 'ఛీ' యీ నౌఖరీ యెందుకువచ్చెనురా?' యని కొంచెము విచారించి కడుపు తడవు కొని, 'చావకతీరదు గూనివంపు' అని తలంచి, విచారమును దిగమ్రింగును.

'చిత్తము. కల్పించి చెప్పినదికాదు. నలుగురు ననుకొను చున్నారు. శంకరశాస్త్రిగారు పోయినారట!'

'అయ్యో!' యని కమల యేడ్చెను. ఆమె మొగము తెల్లఁ బోయెను. కన్నులనుండి నీరు జలజలరాలెను. తనపినతండ్రి చని పోయినాఁడనియే యామె యేడ్చుచున్నట్లు మన మనుకొనలేము. వేంకటరావునకు గావలసిన ధనమెట్లయిన నాతనియొద్దనుండి సంపా దింపవచ్చునని యామె యుద్దేశము. అది యిదివరకు వ్యర్థమైనది గాని, యెట్లయిన సాధింపవచ్చునని యాశకలదు.

'ఇంత హఠాత్తుగానా? ఆమె యనెను. 'నిన్నరాత్రి నేను చూచినప్పుడు దృఢముగానే యున్నాఁడే!'

'నీ వెప్పుడుచూచితివి? కృష్ణాజీ కఠినముగా,ధాటిగాజెప్పెను. నిన్నరాత్రి నీవిల్లుకదలి యెక్కడకును పోలేదే?'

కమల నోరుమూసికొని యూరకుండెను. గుమాస్తా మరల మాటాడెను. 'రోగమువలన నాతఁడు చనిపోలేదఁట. రాత్రియో, తెల్లవారుజాముననో, సూర్యారావనునతఁడా యింటికిబోయి చూచు నప్పటికాతఁడు చచ్చిపడియుండెనఁట. వెంటనే యతఁడు డాక్టరు వేంకటరావుగారికి కబురంపి, యిద్దరునుఁ దణికీచేయగా, శవము నరుకఁబడి యుండెనఁట'

కమల నిట్టూర్పువిడిచెను. మాటాడలేదు. కలగని యప్పుడే సగము మేలుకొన్నవాఁట్టి యవస్థలోనుండునో, యామె యట్టియవ

డు జిగినీ తగుల్చు గరుకులమధ్యమును క్రొత్తగానున్నది. మిగిలిన దంతయును మురికిదైనది. జిగినీ క్రొత్తగానే—' ఇక్కడ వేంకటరా వాగిపోయెను. ఇంతలో నాతనికేదో జ్ఞాపకము వచ్చినది. ముఖకళ మారిపోయినది. తన ముఖమప్పు డిన్స్పెక్టరుగారు చూచుటకిష్టము లేక వెనకకుఁ ద్రిప్పుకొనెను. బహుశః పొరబడుచున్నానేమో యని యాతఁ డనుకొనెను. రెంపులును, లతపనియును జూచి, పొరపాటుకా దని మరల నిశ్చయించుకొనెను. ఇంతలో కనిస్టేబొకడు కాగిత మొకటి పట్టుకొని మీఁదకు వచ్చెను.

'దీనివలన గొంత తేలవచ్చును' కనిస్టేబు ననెను. ఈయుత్తరము నాకుఁ గ్రిందగదిలో బల్లపైని దొరకినది. అది యీరాత్రి వ్రాయఁ బడినట్లే కనుపించుచున్నది.

ఇన్స్పెక్టరుగారు ఉత్తరము నందుకొని విప్పిరి. అందఱును దానిని చూచిరి. తారీకు ఆదివారము వ్రేయు యుండెను. పైవిలాసము 'సోమయాజులకు' అని యుండెను.

'ఆశీర్వచనములు తె॥ నీవు వ్రాసిన సంగతి యాలోచించినాను నీవుకోరినది నేసేయలేను. అట్టి వ్యవహారము మాని వేసి చాలకాల మైనది. క్రొత్తగా మరల నారంభింపలేను. సాధ్యమైనపని చూపి చేయుమన్నను జేసెదను. గ్రహింప వలెను.

సంతకము లేదు. కవరులోఁ బెట్టి పైవిలాసము వ్రాయకపోవు టచే, ఈసోమయాజు లేయూరివాఁడో తెలియదు. 'ఎవ్వరో అప్పి మ్మన్న, ఈయ లేనని వ్రాసిన యుత్తరమువలె కనఁబడుచున్నది. అచ్చనాన్న, అంతేనా, నీకు మరేమైనను తెలియుచున్నదా?' అని ఇన్స్పెక్టరుగా రనిరి.

'అంతేకాదండి మఱియొక సంగతికూడఁ దెలియుచున్నది. తారీకుక్రింద పండ్రెండు గంటలు అని వేసియున్నది. కావున, శంకర

శాస్త్రిగారు పండ్రెండు గంటలకు ముందు చని పోలేదని తెలియు చున్నది.'

'అవును. కాని, సంతకమేల చేయఁబడలేదు? బహుశః ఉత్తరము వ్రాయుచుండఁగనే యెవ్వరో దుర్మార్గులువచ్చి చంపివేసియుందురు. చిన్నప్పటినుండియును వ్యవహారములో మెలఁగుచున్న శంకర శాస్త్రిగారు వ్రాయవలసిన దస్తూరికాదు. గొలుసుకత్తులేదు. విరళముగా నున్నది. ఆడుదాని దస్తూరీవలె నున్నది' అని ఇన్స్పెక్టరుగారనిరి.

సూర్యారావు ముందుకువచ్చెను. ఇదివరకాతఁడా యుత్తరమును జూడనేలేదు. 'ఏమేమీ! శంకరశాస్త్రిగారు మారుదస్తూరీ వ్రాసెనని చెప్పుచున్నారా? ఏదేదీ—చూతము' అని సూర్యారావు ఉత్తరమందుకొని పరీక్షించెను.

'అనుమానము లేదు. నిజమే. ఇది శంకరశాస్త్రి దస్తూరీ కాదు. ముసద్దీగిరిలో తయారయినవాని దస్తూరీవలె లేదు. అచ్చుకు గ్రంథములు వ్రాయువాని దస్తూరీవలె విరళముగా నున్నది. కత్తు ఆడుదాని దస్తూరీవలె నున్నది.' అని సూర్యారావనెను.

'ఆడుది యిట్టి ఘోరముచేయుటా! ఇంతేసి త్రాళ్ళను ఇంత గట్టిముళ్ళు వేసియుండుట ఇదివరకెన్నఁడు నెఱుఁగము. ఉత్తరము వ్రాసిన స్త్రీ దొరకినయెడల భోగట్టా కొంత తెలిసియుండును' అని వేంకటరావనెను.

ఇన్స్పెక్టరుగారి యుద్దేశముకూడ నంతే. చేయవలసిన పని యప్పటికి పూర్తియైనది. ఇల్లు తాళమువేసి యందఱును బోయిరి. సూర్యారావును దోడ్కొని వేంకటరావు తన యింటికిఁబోయెను. వేంకటరావు ముఖము తెల్లఁబోయి యున్నట్లు సూర్యారావునకుఁ గన్పట్టెను.

'ఏమీ! నీకిదియంత విచారమును గలిగించుచున్నదా?' అని యాతఁ డడిగెను.

'అదిగో—ఆయుత్తరము. అదియే నాకు విచారము కలిగించుచున్నది.'

'ఎవ్వరు వ్రాసిరి? నీవెఱిగినవారేనా?'

వేంకటరావు నిట్టూర్పువిడిచెను. గద్గదస్వరము పడెను. 'కమల—కమల ఆయుత్తరము కమల వ్రాసెను. అది దాని దస్తూరియే.'

---

## ఎనిమిదవ ప్రకరణము

### 'ఎరెస్టు చేయఁబడెను'

గొప్పవారియింటి యాఁడుబిడ్డ కావున కృష్ణవేణి యింకను లేవలేదు. వంటబ్రాహ్మణుఁ డెనిమిదిగంటలకు గాని రాఁడు. కావున కమల యేరోజును కృష్ణాజీగారికి ఉదయము కాఫీచేసి యిచ్చుచుండును. కమల కాఫీకప్పును కృష్ణాజీగారి బల్లపైనుంచి నిలచి యుండెను. కృష్ణాజీగారు ఉత్తరములను జూచుకొనుచుండిరి. ఇంతలో వారిగుమాస్తా యక్కడకు వచ్చెను. గుమాస్తాచేసిన నమస్కారమందికొని 'ఏమి మీవీధిలో విశేషములేమైన గలవా?' అని కృష్ణాజీగారు ప్రశ్నచేసిరి.

గుమాస్తా నిదివరకెప్పుడు నిట్టిప్రశ్న యడుగుట కృష్ణాజీగారికి మామూలులేదు. తా బేదారులను బానిసవాండ్రవలె చూచుచుండు యజమానుల కిది వింతకాదు. గుమాస్తా చిన్నబోయి చూచి, 'అనఁగా దమయుద్దేశము నలుగురును జెప్పుకొనుచుండు భోగట్టా యనియేనా?' అని యడిగెను.

'కాకపోయిన నిన్నేమి యసత్యములను గల్పించి చెప్ప మంటినా? ఈ గుమాస్తాగాళ్ళకు బుద్ధి యెన్నటికిని రాదు.' అని కృష్ణశాస్త్రి గారు కోపపడిరి. గుమాస్తా పాపము చిన్నబోయి 'ఛీ' యీ నౌఖరీ యెందుకు వచ్చెనురా?' యని కొంచెము విచారించి కడుపు తడవు కొని, 'చావక తీరదు గూనివంపు' అని తలఁచి, విచారమున దిగమ్రింగును.

'చిత్తము. కల్పించి చెప్పినది కాదు. నలుగురు ననుకొను చున్నారు. శంకరశాస్త్రిగారు పోయినారఁట!'

'అయ్యో!' యని కమల యేడ్చెను. ఆమె మొగము తెల్ల బోయెను. కన్నులనుండి నీరు జలజల రాలెను. తన పినతండ్రి చని పోయినాఁడనియే యామె యేడ్చుచున్నట్లు మన మనుకొన లేము. వేంకటరావునకు గావలసిన ధనమెట్లయిన నాతనియొద్దనుండి సంపాదింపవచ్చునని యామె యుద్దేశము. అది యిదివరకు వ్యర్థమైనది గాని, యెట్లయిన సాధింపవచ్చునని యాశ కలదు.

'ఇంత హఠాత్తుగానా? ఆమె యనెను. 'నిన్న రాత్రి నేను చూచినప్పుడు దృఢముగానే యున్నాఁడే!'

'నీ వెప్పుడుచూచితివి? కృష్ణశాస్త్రి కఠినముగా, ధాటిగా జెప్పెను నిన్నరాత్రి నీవిల్లుకదలి యెక్కడకును పోలేదే?'

కమల నోరుమూసికొని యూరకుండెను. గుమాస్తా మరల మాటాడెను. 'రోగమువలన నాతఁడు చనిపోలేదఁట. రాత్రియో, తెల్లవారుజాముననో, సూర్యారావను నతఁడా యింటికిబోయి చూచు నప్పటికాతఁడు చచ్చిపడియుండెనఁట. వెంటనే యతఁడు డాక్టరు వేంకటరావుగారికి కబురంపి, యిద్దరును దణికీచేయగా, శవము నరుకఁబడి యుండెనఁట'

కమల నిట్టూర్పువిడిచెను. మాటాడలేదు. కలగని యప్పుడే సగము మేలుకొన్నవాఁట్టి యవస్థలోనుండునో, యామె యట్టియవ

స్థలో నుండెను. కృష్ణాంగారి ముఖమున నొకవిధమయిన యాందో ళనము కనుపడుచుండెను. దానినాతఁడనుకొన్నట్లు కూడ గను పడెను. అది యంతయును గమల కనిపెట్టెను. ఏమో యనుమాన పడుచుండెను. కృష్ణాంగారి మాటలలో మాత్రమా యాందోళన మేమియుఁ గనుపడలేదు.

'జరుగవలసినట్లే జరిగినది. వింత యేమున్నది? ఆతఁడు ధని కుఁడు. ఒంటరి కాపురము చేయుచున్నాఁడు. ఇంటిలో విలువఁగల నగలున్నవి. వీధితలుపెప్పుడును గడియ వేయు నాచారము లేదఁట. అప్పుడప్పుడు దీపముకూడ నార్పి వేయఁడఁట. దొంగ యెవ్వఁడో చొరఁ బడి లూటీ చేసియుండును. పోలీసువారికి సమాచారము తెలియు నాధారమైన లేదు. అట్టి యసందర్భపు పనులు చేసిన వానికట్టి మర ణము వచ్చెనన్న వింతయేమి?'

కృష్ణాంగారు చెప్పినదంతయును యుక్తియుక్తముగ నున్నది కాని, యాతఁడవి పట్టిపట్టి చెప్పుచున్నట్లు కన్పట్టుచుండెను. కమల యేమో చెప్పఁబోయి 'దోపిడిచేసిన గుఱుతులేమైనఁ గలవా?' అని యడిగెను. 'అమ్మా, నేను చెప్పలేను. శాస్త్రిగారిని తాళ్ళు వేసి కట్టిరఁట. బహుశః అట్లు లేకుండ లూటీ చేయవలెనని దొంగ వాని యుద్దేశము కాఁబోలు, ఆ సమయమున నాతఁడు కేకలు వేసి యుండును. అప్పుడు దొంగ యతనిని నరికివేసియుండును. పోలీసు వారు వెళ్ళి తణిఖీ చేయఁగా, రగిసిలేని నాణెకటి కనుపించినదట. పోలీ సువారికింతన్న భోగట్టా యెక్కువ తెలిసినట్లు కన్పడదు.'

కమల తలయాడించుచు వినుచుండెనుగాని, యామె మొగము తెల్లబోయియుండెను. వెంటనే వేంకటరావు వద్దకుఁబోయి యామె మాటాడఁదలఁచెను. కాని, తానెట్లు ఆడువారులేని యింటికిఁ బోఁగ లదు? తాను జెప్పవలసినమాటలు రాత్రియే యేల చెప్పి వేయ లేదని

విసుగుకొనుచుండెను. గుమాస్తా చెప్పవలసినదంతయును ముగిసెను. కృష్ణాజీ యుత్తరములు చూచుకొనుట యారంభించెను. ఇంతలో వేంకటరావుగారి కంఠధ్వని వినఁబడెను. కమలముఖము వికసించెను. 'నీతో కొంచెము మాటాడవలసియున్నది. నీపని మిగిలినతరువాత నాగదిలోనికి రమ్ము' అని మెల్లఁగా వానితోఁజెప్పి కమల తనగది లోనికిఁ బోయెను. కొన్ని నిముసములలోనే వేంకటరావు తనపని ముగించుకొని, కమలయొద్దకుఁ బోయెను.

'ఘోరమైనవార్త యొకటి 'కమలా' నీకుఁ జెప్పుటకు వచ్చితిని' అని యాతఁడు చెప్పెను.

'అప్పుడే నేను విన్నాను. మాపినతండ్రి చనిపోయినాఁడు కాదు. చంపివేయబడ్డాఁడు. వాని యాస్తియంతయును మాతండ్రికే గదా చేరును. అయినను, నిష్కారణముగా నాతఁడేలచంపఁబడ వలెను? సూర్యారావున కీసంగతి మొట్టమొదట తెలిసెననివింటిని.'

'అవును. నేనిచ్చెదనన్న ధనముకొఱకాతఁడు నాయొద్దకు వచ్చెను. నాయవస్థంతయును విని, విచారించి, మీపినతండ్రియొద్ద బదులు తెచ్చెదనని చెప్పి యక్కడకుఁబోయెను. తరువాతసంగతి విన్నావుగదా.' కొంతవరకు విన్నాను. కృష్ణాజీగారి గుమస్తా యిప్పుడె చెప్పినాఁడు. పాప మాతనిఁద్రాళ్ళు వేసి కట్టిరఁట. దోపిడి యని నేననుకొనుచున్నాను. వస్తుప్రలేమైనను బోయినవా?'

'ఆసంగతియే చెప్పఁబోవుచున్నాను. కెంపులు తాసిన సానొ కటి కనుపడినది. జిగినీలేదు. నీవు నిన్నరాత్రి నాచేతికిచ్చిన జిగినీ యదియేనని యనుకొనుచున్నాము.'

'కొన్నిరోజులక్రిందట మాపినతండ్రియింటికిఁ బోయినప్పుడు ఆనానే మంచముపై బడియుండెను. ముచ్చటగా నుండుటచే నేను దానినితీసి క్రిందకును మీదకును ద్రిప్పి యొకసారి మెడలోఁ బెట్టు

కొని, మరలఁ బడవేయుచుంటిని. అప్పుడు సీలజారి జిగినీ నేలఁబడి పోయెను. ఎత్తి వానిచేతిలోఁ బెట్టితిని. నీయొద్ద నుంచుకొమ్మని నాకాతఁడిచ్చివేసెను. కొంగున మూటగట్టుకొని దాచుకొంటివి.'

తెల్లఁబోయినముఖముతో వేంకటరావు వినుచుండెను. ఈ సంగతి యంతయును బోలీసువారితో రాత్రియే చెప్పవలసియుండెను

'కమలా, నిన్నరాత్రి నీవు మీపినతండ్రియింటికిఁ బోయియుంటివా?' అని యాతఁడడిగెను.

కమల వేంకటరావుముఖమును జూచెను. ఔను. పోయి యుంటిని. ఆమాట రాత్రియే నీతోఁ జెప్పకపోయినందుకు నన్ను నిందించుకొనుచున్నాను. నాజిగినీ పోయినవెంటనే నాకాయుద్దేశము పుట్టినది. నేనుపోయి పండుకొంటినని నీవుతలఁచితివి. నీతో చెప్పిన, వద్దని నన్నాపివేతునని చెప్పలేదు. ఎంతవరకు వారందఱును బేకా డెదరని నిన్నడిగితిని. జ్ఞాపకమున్నదా?'

'ఔను జ్ఞాపకమున్నది. అప్పుడది సందర్భములేనట్లు కనుపడినది.'

'తెల్లవారువరకును వారు ఆడుచుందురని యనుకొంటిని. మా పినతండ్రి రాత్రి నిద్రపోడనియును నాకుఁ దెలియును. ఆతనియొద్ద బదులు తెచ్చుటకుఁ బోయియుంటిని, అదినాకు సాధ్యముకాకుండెను. నీవువచ్చి నన్నప్పుడు కాపాడకపోయియుండిన, నాపరువు పోయియుండునుగదా.'

'నీవక్కడకుఁ బోయినతరువాత నేమిజరిగినది?'

'అప్పుడాతఁడు కొంచెము జబ్బుగానున్నట్లు కన్పడెను. మంచముపైఁ బండుకొనెను, నామాట చెప్పితిని. ఇయ్యనని యాతడు చెప్ప లేదు. ఈరోజుసాయంత్రము రమ్మని చెప్పెను. తిరిగి వచ్చితిని.'

'కాదు. కొంచెము దాచివేసితివి. అంతయును చెప్పివేయుము.' అని యాతడు గద్దించెను. 'ఒకయుత్తరము వ్రాసితివా, లేదా?'

'అవును. మరచితిని. నాలుగైదు ఉత్తరములువ్రాసితి. అవి త్రోవలోనున్న యొకతపాలడొక్కులోఁ బడవేసితిని.

'నీవువ్రాసిన యన్నియుత్తరములును తపాలడొక్కులో పడవేసితివా ?'

'లేదు. ఒకటిసంతకముకాలేదు. అదివ్రాసినతరువాత, ఆతడు బుద్ధిమార్చుకొని, 'తరువాత ఆలోచించవను, అట్లే యుండనిమ్ము' అని చెప్పి యంపించివేశెను. దానిని బల్లపై విడచితిని. మఱికొంచెము సేపు మాటాడి, మిక్కిలి రాత్రియగుటచేఁ దిరిగివచ్చితిని.'

'విలువగల వస్తువేదియును గనుపడలేదా?'

'లేదు. సేఫ్ మూసియుండెను. బహుశః తాళము వేసియుండవచ్చును. కార్యభారమును, విచారభారమును గలదానను గావున, ఇతరవిషయములు నేను గమనింపలేదు. ఏమి, దానివలన బాధయేమైన గలిగినదా?'

'విస్తారము లేకపోవచ్చునుగాని, ప్రస్తుతము కలుగునేమో. పోలీసువారాయుత్తరమునుజూచిరి. సాక్ష్యము దానిపైనే బలపుచేసియుంచిరి. నీవు వాస్తవమును చెప్పవలసియున్నది. నేనే యాయుత్తరమును మొట్టమొదట చూచియుండినయెడల నదిచింపివేసియేయుందును. కాని, అది పోలీసువారిచేతిలోఁ బడ్డది.'

కమల మొగము మరలఁ దెల్లఁబారెను. ఆమె యేమేమో మాటాడబోయెను. కాని, నోట మాటరాలేదు. ఇంతలోఁ గ్రొత్తవాడెవ్వడో త్రోసికొనివచ్చినట్లయ్యెను. 'కమలా' యనుపిలుపు వినఁబడెను. కమల పైకివచ్చెను. 'నీపేరేమి?' అని క్రొత్తవాడడిగెను. 'కమల' యని యామెచెప్పెను, 'నిన్ను అరెస్టుచేసితి' నని వాఁడనెను. వేంకటరావు పరుగెత్తుకొనివచ్చెను. ఏల యామెను అరెస్టుచేసిరని యడిగెను. 'నేరముననుమానముగాఁ జెప్పకను ఆమె పినతండ్రి మరణ

మున కామె కారకురాలని యనుమానము తోచినందున అరెస్టు చేసితిని' అని పోలీసు ఇన్స్పెక్టరు జవాబుచెప్పెను.

---

## తొమ్మిదవ ప్రకరణము

### మేజస్ట్రేటుగారు.

వేంకటరావు కమలపక్షమున నవశాస్త్రుగ కొన్ని మాటలాడ బోయెను. 'అయ్యా, కమల యిట్టినేరము చేసియుండెనని మీరు నమ్ముదురా?' అని ఇన్స్పెక్టరుగారి నడిగెను.

'దీనికి సమాధానము చెప్ప లేను హెడ్ కానిస్టేబిల్ కొంతభో గట్టా తెచ్చెను. కమలను అరెస్టుచేసినగాని నేరము ఋజువుకాదని యాతఁడు చెప్పెను. కావున ఎరెస్టుచేసినాను. తాను నిర్దోషినని యామె ఋజువుచేయఁగలిగినచో విడిచివేసెదను.' అని యాయన జవాబుచెప్పెను. జరిగినసంగతి యథార్థముగాఁ జెప్పివేసి. యాపైని దేవునిపైనే భారము వేసి నమ్మియుండవలెనని కమల యుద్దేశించెను. నేను మా పినతండ్రిగారియింటికి నిన్నరాత్రి పోయియుంటినని మీకెట్లు తెలిసెను?' అని కమల యిన్స్పెక్టరుగారి నడిగెను. 'కొంచెముసేపు క్రిందట నొక టెలిగ్రాం జెనరల్ ఆఫీసునుండి సిటీ ఆఫీసుకు వచ్చినది అది యెవ్వరుపంపిరో తెలియదు. మీ పినతండ్రిగారియింట దొరికిన ఉత్తరము దస్తూరీ నీది అని వ్రాసియున్నది. నిన్నటిఁగినవారొకరిద్ద ఱికి ఆయుత్తరము చూపితిమి. దస్తూరీ నీదేఅని వారు పోల్చిరి. నీవు అబద్ధముమాత్రము చెప్పకుము.'

'నేనేల యబద్ధము చెప్పవలెను? మంచిచెడ్డలకు భగవంతుఁడు కలఁడుగదా.' ఆమె చెప్పసాగెను.

'గడచినరాత్రి యింటివారందఱును పేకాడుచుండగా నేను మా పినతండ్రియింటికిఁ బోయితిని. నాకుఁ గొంతసొమ్ము మిక్కిలి యవసరముగా కావలసివచ్చె. ఆయనయొద్ద బదులుపుచ్చుకొనుటకుఁ బోయితిని. ఇచ్చెదనని గాని, ఈయనని కాని, యాతడు నిశ్చయముగా జెప్పలేదు. తనకుశరీరమున గొంచెమాయాసముగా నున్నదనియుఁ గొన్నియుత్తరములు వ్రాయవలసినదనియు, నాతోఁజెప్పెను. వ్రాసితిని కొన్ని తపాలులో వేసితిని. ఇప్పుడు మీరుచూచిన యుత్తరము తపాలులో వేయలేదు. దానిసంగతి యాలోచించవలయునని చెప్పి యంపించివేసెను. తరువాత నింటికివచ్చితిని.

ఇన్స్పెక్టరుగారు కొంచెమాలోచించిరి. కమల కంఠస్వరమునను చూపులలోను, అమాయికత్వము కనుపించుచుండెను.

'ఇక్కడకు నీ వెన్నిగంటలకు దిరిగివచ్చితివి?' అని వారడిగిరి.

'పావుతక్కువ ఒంటిగంట' అని జవాబిచ్చెను.

కృష్ణాజీగారు పైకివచ్చిరి. కమల యాగిపోయెను.

'ఇది చిత్రముగానున్నది. మాయింటిలోనున్న యొకస్త్రీ అంతరాత్రియప్పుడు వీధిలోనికిఁబోయి వచ్చుటా! పావుతక్కువ ఒంటిగంటకు నీవు ఇల్లుచేరితివని ఋజువుచేయఁగలవా? ఆఁ.'

తెల్లబారియున్న కమల మొగమొక్కసారి యెఱ్ఱఁబారి, మరల తెల్లబాఱెను. ఋజువుసేయుట సులువేగాని, దానివలనగొంప మునిగిపోవును.

ఇంతలో వేంకటరావామె పక్షమునఁ గొంచెముమాటాడెను.

'ఏమండీ—ఆడుపిల్లలతో మీరంత మోటుగా మాటాడెదరా? ఆమె సత్యమే చెప్పుచున్నట్లు కన్పట్టుచున్నదే? ఆమెచేసినపని పొరపాటు కావచ్చును గాని, చెప్పినమాట యసత్యము కాదుగదా.' అని యాతఁడనెను.

'ఔ నౌను—ఏమి సత్యకాలము! ఇప్పుడామె చెప్పినదంతయు నిజమే! మీరే చెప్పవలెను. పాపము! పన్నెండుగంటల వరకు వీధి తలుపుగడియ పెట్టించితిని. మీరును నేనును గలసి వీధిలోకిఁ బయలుదేరితిమి, 12 గంటల 45 నిముషముల కామె యెట్లు ఇంటిలోనికి రాఁగలుగును? ఇట్టి యసత్యములు చెప్పి యేమి సంపాదించుకొనవచ్చును?' అని కృష్ణాజీగారు గుఱుపెట్టెను. వేంకటరావునకుఁ జేతులు వణఁకినవి. తలుపులు బ్రద్దలుచేసి తాను ప్రవేశపెట్టితినని చెప్పుటకాతని కిష్టములేదు. కమల మానము కాపాడవలెను. ఏమియును దోఁచలేదు. ఇంతలో నేమో జ్ఞాపకమునకు వచ్చెను.

'కావలసిన యంశము ఋజువుచేయుట కవసరములేని పాట్లు పడుచున్నాము. రాత్రి మీయింటికివచ్చిన ముసుఁగువాఁడు కావలసిన భోగట్టా చెప్పఁగలఁడేమో' అని మరల వేంకటరావనెను.

కృష్ణాజీ యులికిపడెను. ఎఱ్ఱగనున్న యాతనిముఖము మసివలె మాడిపోయెను? నీకేమి తెలియును? నీకిందుఁ బ్రసక్తియేమి? జోలిమాలినపనులకుఁబోకుము.' అని కృష్ణాజీ గంభీరముగాఁ బలికెనుగాని, ఆ గాంభీర్యము ప్రయత్న పూర్వకముగాఁ దెకివచ్చినదై, లోలోపల భయమునే సూచించుచుండెను. తానువేసిన బాణము గుఱికి సరిగానే తగిలెనని వేంకటరావు పోల్చుకొనెను.

'కమలా, ముసుఁగువాఁడొకఁడు రాత్రి నీకు తలుఁపుతీసెనా?' అని కృష్ణాజీ యడిగెను.

'అవును. అట్టివాఁడే తలుపుతీసెను. నేను మిక్కిలి యలసిపోయి యుంటిని. నాగదిలోనికిఁబోయి పండుకొంటిని. ఇంతకన్న నెక్కువగ నాకేమియుఁ దెలియదు.'

'ఇది సాధ్యమేనా, కృష్ణాజీగారూ,' ఇన్స్పెక్టరుగారడిగిరి.

'ఇప్పుడు మీరనుకొనుచున్నవాఁడు రాత్రి యిక్కడనే యుండెనా?'

కృష్ణాజీ కొంచెమాలోచించెను గాని వేంకటరావందుకొనెను. 'ఔను. నిజమే. లేకున్న కమల లోనికెట్లు పోఁగలుగును? మొట్టమొదట వీరందఱును బేరాడుచున్నప్పుడు నేనే వానికిఁ దలుపుతీసి లోనఁ బ్రవేశించితిని. కృష్ణాజీగారును, నేనునుగలసి వెళ్ళిపోయినప్పుడు వాఁడు ఇంటిలోనే యుండిపోయినాఁడు. మావెంట రాలేదు.'

'కృష్ణాజీగారు. రాత్రి మీరుపైకి బయలుదేరినప్పుడు క్రొత్తవాఁడెవఁడో మీవెంట రాలేదనుట నిజమేనా? మీరెన్నిగంటలకుఁ దిరిగి వచ్చితిరి?' అనిఇన్స్పెక్టరుగారడిగిరి.

'అవు నాతఁడుండిపోయెను. నేను రెండుగంటలపావుకుగాని తిరిగిరాలేదు. కాని, యవసరములేకుండ యేల నన్నిట్లు ప్రశ్నలు వేయుచున్నారు?'

'వేళ తెలిసికొనుటకు. అంతే. మఱేమియును లేదు.'ఇన్స్పెక్టరుగారు జవాబిచ్చిరి. 'మీయింటికివచ్చిన యాయతిథి యెవ్వరో ఆయనతో నేను మాటాడవచ్చునా?'

కృష్ణాజీ మరల తెల్లఁబోయెను. రెండడుగులు వెనుకకుఁ బోయెను. 'అతఁడెప్పుడు కావలసినప్పుడు దొరకవలసినవాఁడు కాఁడు అతఁడెప్పుడును దేశసంచారముచేయుచుండును. మీకు కావలసినయెడల వానికి వ్రాసి తెప్పించెదను. అంతకన్న నెక్కువ చేయలేను.'

వేంకటరావుగుండెఝల్లుమనెను. ఇన్స్పెక్టరుగారు బయలుదేరిరి కమల వెంట నడుచుచుండెను. ఆమెముఖము చూచినవారికి గుండె నీరగుచుండెను. ఇన్స్పెక్టరుగారికికూడ మనసుకరగెను. సమీపమున నున్న కాన్‌స్టేబులు చేత బండి తెప్పించిరి. కమల యందుఁ గూర్చుండెను. అందఱును నేరముజరిగిన స్థలమువైపు పోసాగిరి.

'కమలా, నీవు మఱిమాయింటికి రానక్కరలేదు. నీయిచ్చవచ్చిన చోటికిఁ బోవచ్చును' అని కృష్ణాజీగారు ఖచ్చితముగాఁ జెప్పి

కమల కన్నులనుండి యొక్కసారి నీరుకారెను వేంకటరావుగుండె జల్లుమనెను. దగ్గరనున్నవారికి జాలివేసెను. అందఱును శంకరశాస్త్రి గారియింటికిఁ బోయిరి.

ఆయింటిలోపలికి కొందఱు రాజకీయుద్యోగస్థులును, కొందఱు వార్తాపత్త్రికల రిపోర్టరులును మేజస్ట్రేటుగారును, ఉండిరి. వెలుపల ఊరివారందఱును మూఁగియుండిరి. వింతయేమో మాడవలెనని యొకరినొకరు త్రోసికొనుచుండిరి. పది పదునైదుగురు కనిస్టేబుల్సు ఇటనట దిరుగుచు మూకపై నధికారము చెలాయించుచుండిరి. ఇన్స్పెక్టరు వచ్చుటతోనే, లట్టీలతో నిటునటు సర్ది, వారికి త్రోవ యిచ్చిరి. స్థలమును స్వయముగా బరీక్షించి స్థలమువద్దనే విచారణ జరిగించిన కేసు బాగుగా బోనపడునని,। నేరముజరిగిన స్థలమువద్దనే మేజస్ట్రేటుగారు విచారణమారంభించిరి.

మొదటిసాక్షి సూర్యారావు నేరమును మొదటకనిపెట్టినవాఁడ తఁడు. ఆతఁడు తానుచూచినది యథార్థముగాఁ జెప్పివేసెను. 'వ్యవహారముకొఱకు వానియింటికిబోయితిని. పోవుసరికి వాఁడు చచ్చిపడి యుండెను.' ఇదియే సూర్యారావు చెప్పినది.

'వీధితలుపు తీసియున్నదా? అని మేజస్ట్రేటుగారడిగిరి.

'అవును కాని ఆతలుపువేయుట యెప్పుడు నాతనికి మామూలులేదు. ఊరిలోని వారందఱును ఆసంగతి తెలియును.'

'తరువాత డాక్టరు వేంకటరావుగారికి మీరు కబురంపిరా?అని మరల నడిగిరి.

తరువాత సంగతి యంతయును సూర్యారావు పూసగ్రుచ్చి నట్లుచెప్పెను. తరువాతసాక్షి వేంకటరావు. నేరమును గుఱించిన సమాచారము వానిసాక్ష్యమునఁగూడ నేమియును దేలలేదు. తరువాతసాక్షి పోలీసుఇన్స్పెక్టరుగారు. వారుకొంత దూరముచెప్పినతరు

వాత, నేరస్థునియుద్దేశ మేమైయుండును?' అని మేజస్ట్రీటుగారడిగిరి. సభ్యులకందరకును ఒళ్ళు అదిరెను.

'పైన నున్న సేఫు తెరచియుండెను. కాని, నేనుచూచినంతమట్టుకు కాగితముల కట్టలు దిట్టముగానే యుండెను. బహుశ నగలుజాస్తిగానుండవచ్చును. అవిపోయియుండవచ్చును. శంకరశాస్త్రి గారికి స్నేహితు లెవ్వరును లేరు. వారి వ్యవహారమునుగూర్చి సమముగాఁ దెలిసినవారు లేరు కావున పోయిన వస్తువులవిలువయెంతో యెవ్వనికిని దెలియదు. దొంగతనముజరిగినని మనిమనుకొనుటకుతగిన కారణమొక్కటికనుపించుచున్నది. అది నాను. అదిశంకరశాస్త్రిగారిమంచముపైదొరికినది. జిగినీలేదు. క్రొత్తగానానునుండిపైకితీసివేసినట్లుకనుపించుచున్నది. ఇదిగో చూడుడు' అని ఇన్స్పెక్టరునానును మేజస్ట్రీటు గారియెదుటఁ బెట్టిరి. కొందరు దానిని బరీక్షించిరి. సీలపెట్టు గుండీలు క్రొత్తగనున్నవి. నాను పాతగిలి యున్నది. 'జిగినీ దొరకలేదా?' అని మేజస్ట్రీటుగా రడిగిరి.

'లేదు' ఇన్స్పెక్టరుగారు చెప్పిరి. 'ఇదే వింతగానున్నది. ఎక్కువ విలువగల నామ విడిచివేసి, తక్కువ విలువగల జిగినీ యెత్తుకొనిపోవుట.'

కమల నేమేమో చెప్పఁబోయెను. వేంకటరావామె ముఖముపైపు చూచెను. 'వద్దని' యాచూపులో వినఁబడుచుండెను.

---

## పదియవ ప్రకరణము

### ఆపత్కాలము

చూచుటకు వచ్చినవా రందఱును గుసగుసలాడఁ జొచ్చిరి. వింతయేమో జరుగఁబోవునని యనుకొనుచుండిరి. నానంతయును

విడిచి యొక్క జిగినీమాత్రమే యెత్తుకొనిపోవుట యేకారణముననో యెవ్వరికిని బోధపడలేదు.

'జిగినీ ఆయింటిలో నేమూలనైనను గనబడలేదనుట నిశ్చయమేనా?' మేజస్ట్రీటుగా రడిగిరి. 'ఈప్రశ్న అవసరము లేకపోయినను అడుగక విధిలేదు. కావున అడిగితిని.'

ఇన్స్పెక్టరుగారు ఇల్లు నాలుగుమూలలును జాగ్రత్తగానే వెదకిరి. ఏమూలనైనను విడిచిపెట్టలేదు. ఇన్స్పెక్టరుగారీ సంగతియే నొక్కిచెప్పిరి. ఇంతలో బేదిరేసుమీద ఉన్న కానిస్టేబి లొకడు మూకను ద్రోసికొనుచు లోనఁ బ్రవేశించెను. వానిముఖమునందు జయసూచకములగు కళలు కనుపడుచుండెను. వాఁడు తిన్నఁగా ఇన్స్పెక్టరుగారియొద్దకుఁ బోయి యేమేమో చెవిలోచెప్పెను. ఇన్స్పెక్టరుగారు కమల ముఖమువైపు చూచిరి. మేజస్ట్రీటుగారితో మరల మాటాడిరి.

'జిగినీ దొరికినదని మా కానిస్టేబిలు చెప్పుచున్నాఁడు' సభ్యులు నిట్టూర్పువిడిచిరి. అందఱును ఆక్రొత్త డిటెక్టివ్ వైపుననే చూడసాగిరి. కమల లేచి నిలువఁబోయెను. తన కింకను గొప్పయాపద రాఁబోవుచున్నదని యామె యనుకొనెను. లేనున్న క్రొత్తవాఁడు వచ్చినవెంటనే ఇన్స్పెక్టరుగారు తనమొగమే యేల చూడవలెను?'

'అప్పుడే అంతయును జెప్పివేసినచో నెంత బాగుగ నుండియుండును. మించిపోయిన పైనిజము చెప్పవలసివచ్చునేమో' యని యామె విచారించెను. వేంకటరావు క్రొత్త పోలీసువానివైపునకే చూచుచుండెను. వాఁడు తన జేబులోనుండి జిగినీనితీసి మేజస్ట్రీటుగారి చేతికిచ్చెను. వారు నానుకు తగిలించిచూచిరి. సమముగా రెండును సరిపోయినవి. 'ఈ జిగినీయే.' 'ఇదియే మన మనుకొనుచున్నది' వారనిరి. 'ఇది నీకెక్కడ దొరికెను.'

'అదికృష్ణాజీగారియింటిలో దొరికినది.' డిటెక్టివ్ చెప్పెను. 'అక్కడకు నేనొక సోదావారంటును తీసికొనిపోయితిని. కమలగారి గదియంతయును వెదకితిని. పనికత్తె యొకతె అందుఁగల ట్రంకు వెదకుమని సమాచారము చెప్పినది. వెదకితిని ఆట్రంకులోని యొక చిన్నపెట్టెలో నిది దొరకినది.'

కమలకేమియును బోధపడలేదు. మొగము నివ్వెఱపాటునొందెను. హృదయమున భయమును,కోపమును,విచారము ముప్పిరి నొందుచుండెను. తాను వేంకటరావుతో మాటాడుచున్నప్పు డెవ్వరో పొంచుండి విని, సమయము చిక్కినప్పుడు జిగినీ దొంగిలించియుందురని యామె యనుకొనెను.

అప్పటికి శంకరశాస్త్రిగారు చనిపోవలేదుగదా, జిగినీ యేల దొంగిలింపఁబడెనో, తిరిగి, తనపెట్టెలోనే యేల పెట్టబడెనో బోధపడలేదు. బహుశః అది తరువాత యుద్దేశమైయుండును అని యామె యనుకొనెను.

కమలనిలువఁబడెను. నిజము చెప్పివేసి, యేమివచ్చి నను భరింపవలెనని యామె నిశ్చయించుకొనెను. 'నేనుగూడ నాసంగతి కొంచెము చెప్పుకొనవలసియున్నది.' ఆమె ధైర్యముతోఁ జెప్పెను 'ఆజిగినీనాదే. అది మాపినతండ్రి నాకిచ్చెను. హత్యజరిగిన రాత్రియే నాయొద్దనుండి యెవ్వరో యెత్తుకొనిపోయిరి. హత్యజరుగుటకుముందే అది పోయినది. ఆతరువాతనే నేను మాపినతండ్రి యొద్దకుబోయితిని'

చూచుటకు వచ్చినవారిలో చాలమంది కిది కేవల మబద్ధము వలె గన్పట్టెను. కమల ముఖమునందు మాత్రమసత్యలక్షణములు కనుపడలేదు. ఆమెముఖమును జూచుచున్నప్పుడు మేజస్ట్రేటుగారికిఁ గూడ నామెమాటలు నమ్మవచ్చునని తోచెను. 'నీవుప్రమాణము చేసి చెప్పెదవా?' అని మేజస్ట్రేటుగారడిగిరి. చెప్పెదనని యామె

చెప్పెను. కోర్టుగుమస్తా ప్రమాణము చేయించెను. తానెఱిగిన దంతయును కమల ప్రమాణముగఁ జెప్పెను.

'నీవు చెప్పినది న్యాయముగానే కనబడుచున్నది. గాని నిన్ను కొన్ని ప్రశ్నము లడుగవలెను.' అని మేజస్ట్రేటు గారనిరి.

చిత్తము' అని యామె చెప్పెను.

'ఆ జిగినీ మీపినతండ్రి నీకిచ్చియుండిన, నామాట మొదటనే యేల చెప్పలేదు?' అని మేజస్ట్రేటుగారడిగిరి.

'మాపినతండ్రి నాకు జిగిని యిచ్చెననియు, అదిపోయినదనియు చెప్పినచో నది కోర్టువారికి కావలసిన సాక్ష్యమునకుఁ బనికిరాదనియు యుద్దేశించి చెప్పలేదు.'

ఈమాట మేజస్ట్రేటుగారికి తృప్తికరముగా లేదు. నీవుప్రమాణము చేసితి వనుమాట జ్ఞాపకమున్నదా?' వారడిగిరి. 'ఇది నీ ట్రంకులోనే దొరికినప్పుడు ఇతరులది నీయొద్దదొంగిలించిరని యెట్లుచెప్పుచున్నావు?'

ఎట్లైనను, అది నాయొద్దనుండి దొంగిలింపఁబడినది. ఆదొంగ భయపడి నాట్రంకులో మరల పెట్టి వేసినాడేమో, నేఁజెప్పలేను. నేను నాపినతండ్రి యింటికిఁబోవుటకు ముందే జిగినీ నాయొద్దనున్నదని నేను ఋజువుచేయగలను.'

అట్టిసాక్ష్యమున్న యెడల, దానివలనఁ జాలప్రయోజనముండును. అని మేజస్ట్రేటుగారనిరి.

'నిన్న రాత్రి పదునొకండు గంటలప్పుడు నేనాజిగిని కమల యొద్ద జూచితిని' అని వేంకటరావు చెప్పెను.

సభ్యులు మరల గుసగుసలాడసాగిరి. కేసు విచిత్రముగా మారుచుండెను. అల్లరచేయవద్దని గట్టిగాకోపపడి, మేజస్ట్రేటుగారు మరల మాటాడసాగిరి.

'వేంకటరావుగారూ, ఈపిల్ల చెప్పవలసిన దంతయును పూర్తి కానిండు. తరువాత మీరు చెప్పవచ్చును. మధ్యమధ్య మీరట్లు మాటాడకూడదు.'

కమల చెప్పసాగెను. 'వేంకటరావుగారు సూచన చేసిరి. కావున ఆసందర్భమున నేఁజెప్పుచున్నాను. నేను చెప్పవలసిన దంతయును విన్నపయి, మొదట నేనేల చెప్పలేదో మీకే తెలియును. రాత్రి పదునొకండుగంటలప్పుడు నేనును, వేంకటరావుగారును కృష్ణాజీగారి హాలులో మాటాడుచుంటిమి కృష్ణాజీగారును, మఱికొందఱును పేకాడుచుండిరి. మిగిలినవారు నిద్రపోవుచుండిరి. 'అప్పుడు మీరు మాటాడవలెనని మొదటనే యనుకొంటిరా?' అని మేజస్ట్రీటుగారడిగిరి.

'అవును. వేంకటరావుగారితో మాటాడవలసిన యవసరము కొంత యుండెను.'

'కమలను నేను పెండ్లియాడ నిశ్చయించుకొన్నాను.' అని వేంకటరావు మరల చెప్పెను. సభ్యులు మరల గుసగుసలాడిరి. స్త్రీ పునర్వివాహ మీకాలములో వింతసంగతి కాకపోయినను, ప్రజలకు దానిని గురించిన యసహ్యమును. ఎగతాళియును, బాగుగా విడువ లేదు.

'వేంకటరావుగారూ, మధ్యమధ్య మీరు మాటాడకుండ దని చెప్పలేదా? కొంచెము సేపూరకుండుఁడు' అని మేజస్ట్రీటు గారు గద్దించిరి.

వేంకటరావు క్షమాపణ వేడుకొనెను. తాను చెప్పవలసినది చెప్పివేసెను గదా ఆతని కంతేచాలును.

అప్పుడప్పుడు వేంకటరావుగారితో మాటాడవలెనని యను కొందును గాని, నాకు సమయము చిక్కలేదు. ఆరాత్రి యాతఁడు పేకాటలోచాల సొమ్ము ఓడిపోయి విచారముగా నుండెను. ఒకు

స్నేహితునకిచ్చెద నన్నుసామ్ము తానోడిపోయినందు కాయన ధైర్యము చెడియుండెను. నాయొద్దకు వచ్చెను. అంతయును నాతోఁజెప్పెను. అతనికది మిక్కిలికష్టకాలమైయుండెను. నాపినతండ్రి యిచ్చిన జిగినీ జ్ఞాపకమునకు వచ్చినది. వెంటనే గదిలోనికిఁ బోయితిని. జిగినీ తెచ్చితిని. వేంకటరావుగారి చేతికిచ్చితిని. అది చాలాఖరీదు పట్టునని యాయన చెప్పిరి. కాని ఆయన పుచ్చుకొనలేదు. కొంతసేపు వాదించితిమి.

'ఎవ్వరును మీసంభాషణవిన లేదు. కాఁబోలు' మేజస్ట్రేటు గారడిగిరి. 'లేదని' కమల చెప్పెను.

'హాలులో మఱియెవ్వరును లేరు. మేమువాదించుచుంటిమి. ఇంతలో పేకాడుచున్న వారెవ్వరో వేంకటరావుగారిని పిలిచిరి. హాలులోనికిఁ ద్రోసికొనిరాసాగిరి. వారెవ్వరును మాసంభాషణ వినఁ గూడదని మాయుద్దేశము. తమకుఁ దెలియదా. వేంకటరావుగారును నేనును—' కమల యాగిపోవును.

'సరే— తెలిసినది. తరువాత యేమిజరిగినది.' 'వేంకటరావు గారు తలుపుదీసి నన్ను పెరటిలోనికిఁ బంపిరి. తలుపువేసి, వారావలకు బోయిరి. ఐదునిమిషములలోనే మేము మరలతిరిగివచ్చితిమి. మేము పోవునప్పుడు జిగినీ బల్లపయినిడచితిమి. తిరిగివచ్చునరి కదియక్కడ లేదు. నేనెఱిఁగినదంతయు నింతే'

హాలులోనికిఁ బోవుటకు మఱేదయినను త్రోవకలదా' యని మేజస్ట్రేటుగారడిగిరి.

'కృష్ణవేణి సామానుగదిలోనుండి యొకకిటికీకలదు. గాని యది మూయఁబడి యుండెను తీసిన జాడయేమియును గనుపడలేదు. పెరటిద్వారమునుండి యెవ్వరునుపోలేదు. నేను చూచుచుంటిని. అంగణపుద్వారమునుండి యెవ్వరును బోలేద' ని వేంకటరావుగారు

చెప్పిరి. 'ఇంతవింతగా జిగినీపోయినదని చెప్పెదవా?' అని మేజస్ట్రీటు గారడిగిరి. పిమ్మట జిగినీపోల్చుటకై యామె చేతికీయబడెను. ఆమె దానిని జాగ్రత్తగాఁ బరీక్షించి, తలయాడించెను. తనతండ్రికి యామె కిచ్చిన జిగినీ యదే.

'అవునిదే, నేను పోల్చఁగలను. అనుమానములేదు.'

'కావున, నీయొద్దనుండి యది యెవ్వరో దొంగిలించి, నీపెట్టెలోనే పెట్టివేసిరని చెప్పుచున్నావా?' మేజస్ట్రీటుగారనిరి.

'అసాధారణముగానున్నది ఈకథ. నీకెవ్వరైన శత్రువులు కలరా?'

కమల మేజస్ట్రీటుగారి ముఖమువైపు తన పెద్దకన్నులతోఁ జూచెను. 'నేను జెప్పలేను. నాకెవ్వరు శత్రువులు లేరు. బహుశః దొంగభయపడి మరల నాపెట్టెలోఁనే బెట్టి యుండును. పిమ్మట డిటెక్టివ్ దానిని నాపెట్టెలోఁనే బెట్టి యుండును. పిమ్మట డిటెక్టివ్ దానిని నాపెట్టెలోనుండి తీసియుండును. అంతకన్న మఱియేమియును నేను జెప్పలేను.'

'ఇదియంతయును నీవు ప్రమాణముచేసి చెప్పినదేనా?'

'అవును, అని ఆమెనొక్కి చెప్పెను. ఆమె బోనులోనుండి పైకివచ్చినవెంటనే, వేంకటరావు బోనులోనికిఁ బరుగెత్తి నిలుచుండెను. ప్రమాణముచేయింపుడని కోరెను. కాని యాతఁడు చెప్పవలసినది విస్తారములేదు. కమలయే చెప్పివేసెను ఆమెచెప్పినది యను మోదించుటయే యాతని పనియైయుండెను; ఇందు నేనేనిందాపాత్రుఁడను' అని అతఁడు చెప్పసాగెను. నేనే పొరపాటుచేసియుండినయెడల ఇంయంతయును జరుగకయేయుండును. నన్ను కాపాడవలెననియామె కోరెను. ఈచిక్కంతయు నందువలన వచ్చెను. నానుకోర్టులోచూపి నప్పుడే అంతయు నామె చెప్పియుండును. కాని, వద్దని నేనాపివేసి

తిని. నే నేలవద్దంటినో, ఇక్కడ నున్నవారందఱికిని దెలిసియే యుండ వచ్చును' సభ్యులలోఁ గొందఱు జాలిబడిరి. కొందఱు తిట్టిరి.

'నేనే యడగవలసినప్రశ్న మొకటికలదు. కోర్టువారి సెలవైన అడిగెదను.' అని వేంకటరావడిగెను. కోర్టు సెలవయ్యెను. 'ట్రంకులోనున్నదని పనికత్తె నే యేలయడుగ వలెనో, ఆపనికత్తెకీ సంగతి యెట్లు తెలిసెనో' అడిటెక్టివ్ చెప్పినయెడల, మఱికొంత సాక్ష్యము తేల వచ్చును. అని యాతఁ డడిగెను. డిటెక్టివ్ ముందుకువచ్చెను.

ఇది స్వల్పసంగతి నేను పనివాండ్ర నందఱ ననేకసంగతుల డిగితిని. జిగినీ గుఱించి యెవ్వరికైనఁ దెలియునా? అని వారినడిగితిని పనికత్తె యొకతె బహుశః పరిచారికయైయుండును. కమలవద్ద నట్టి దొకటి కలదని చెప్పెను.' అని డిటెక్టివ్ జవాబు చెప్పెను.

ఆపనికత్తె సంగతి యెట్లు తెలిసెను?' అని వేంకటరావడిగెను

'వేంకటరావుగారూ, ప్రశ్నలు మీరడుగకూడదు. నాతో మీరు చెప్పినయెడల, నేనాతని నడుగుచుందును.' అని మేజస్ట్రేటు గారిని, డిటెక్టివ్ను చూచి, కమలయొద్ద జిగినీ యుండుట చూచెనా?'

'నేను చెప్పలేను. కృష్ణవేణిగారామెతో చెప్పినదని యామె యామె చెప్పినట్లుజ్ఞాపకము. అంతకన్న నెక్కువభోగట్టా చేయలేదు'

వేంకటరావేదో క్రొత్తసిద్ధాంతమును జేసి కొనుచుండెను. సూర్యారావింకను రాలేదు. మఱియేమైన నడుగవలసి యున్నదా' అని మేజస్ట్రేటుగారు వేంకటరావు నడిగిరి. ఆలోచనలో మునిఁగి పరధ్యానముననున్న వేఁకటరావు ఉలికిపడి. 'ఒక్కటిమాత్రమే కలదు. ఆపనికత్తెను కోర్టుకు బిలిపించినచో, వకీలు కొన్ని ప్రశ్నములడుగవలసియున్నది. కేసు వాయిదా వేసిన బాగుగనుండును.' అని యాతఁడనెను.

ఇన్స్పెక్టరుగారుకూడ కేసువాయిదా వేయుఁడని కోర్టువారిని కోరిరి. ఇంతలో సూర్యరావు తొందరగా ముందుకు వచ్చెను. ఆతని చేతిలో మార్బిలుఅట్టవేసిన యొక పుస్తకముండెను.

'అప్పుడే కోర్టు ముగింపుచేయవద్దు నేను కమలగారి తరపున వకీలును. మఱికొంత విచారణకావలసియున్నది. నాయొద్ద బలమైన సాక్ష్యములుకలవు. ఇది శంకరశాస్త్రిగారి దినచర్యపుస్తకము ఇది మిక్కిలి బలమైన సాక్ష్యము.'

అని యాతఁడు చెప్పెను.

---

## పదునొకండవ ప్రకరణము.

### చచ్చినవాని సాక్ష్యము.

సభ్యులకు గుండెలు జల్లుమనెను. అందఱిదృష్టియును మార్బిలు పుస్తకముపైనే పడెను.

'దినచర్యపుస్తక మెట్లుదొరికిన' దని మేజస్ట్రీటుగారడిగిరి.

'శవమును రుద్రభూమిఁ గొనిపోవుటకు ముందు కొంతకర్మ చేయవలసియుండెను. వాహకులు నన్ను లోవలికి రమ్మనిరి. వారు శవమును నేలదింపినతరువాత, పరుపును దిరుగవేసి తిని. తలవైపుజే ఈపుస్తకము దొరికినది. ఇందువిశేషములు కలవు, అని సూర్యా రావు చెప్పెను.

'చివరవరకును వ్రాసెనా?' అనిమేజస్ట్రీటుగా రడిగిరి. చిట్ట చివరవరకును వ్రాయబడినది. కొసనువ్రాసిన కొన్ని మాటలు చదువుదునా?'అని యాతఁడడిగెను.

సభ్యులందఱు నాత్రముగా చూచుచుండిరి. మేజస్ట్రీటుగారు సులోచనములను మరల తగల్చుకొనిరి. సూర్యారావు చూపినపేన

చూచుచుండిరి. వింతయేమో యందాతనికిఁ గన్పట్టెను. ఇన్స్పెక్టరు గారి ముఖమువైపు చూచిరి.

'ఆశ్చర్య మాశ్చర్యము! ఇన్స్పెక్టరుగారూ, మీరిదిచూచి నారా? గమ్మత్తుగానున్నది' వారుముప్పురును, దినచర్యపుస్తకము వైపును, ఒండొరుల ముఖములవైపు జూచుకొనుచుండిరి.

నిజముగానే విచారణ యాపివేయవలసియున్నది. వారము దినములు వాయిదా వేయింపుఁడు' అని ఇన్స్పెక్టరుగారనిరి.

సభ్యులు గుసగుసలాడి చప్పుడుచేయుచుండిరి. మేజస్ట్రేటు గారు తలయూచిరి. మిక్కిలిచమత్కారమైనసంగతి దాచిపెట్టు చున్నారని సభ్యులు మొఱమొఱలాడిరి. వారికిదియంతయు నొక నాటకమువలె కన్పడుచుండెను. నాటకము మూడవయంకము మధ్య నాపివేయఁబడెను.

'వచ్చెడువారమున ఈదినముననే పదిగంటలకు మరల విచారణ అంతవరకు వాయిదా' అని మేజస్ట్రేటుగారనిరి. 'కమల సంగతి యేమి? అని వేంకటరావడిగెను.

ఇన్స్పెక్టరుగారును, మేజస్ట్రేటుగారును ఒకరి వైపొకరు చూచుకొనిరి. వారిద్దఱికిఁ గూడ నేమియు బోధపడలేదు. నేను 'నేను కమలపక్షమున మాటాడుచున్నాను' సూర్యారావనెను. సాక్ష్య మింతబలముగాఁ గనుపడుచున్నను, వాయిదా వేయుటకు విచారము గానున్నది. కాని, ఈకొత్తసంగతులుచూచి, జామీను అడుగుటకు భయముగా నున్నది. కమలకు గావలసిన సదుపాయములు మర్యాద ననుసరించి కోర్టువారు జరిపెదరని తలఁచెదను. అనుమానము పైని ఆమెను అరెస్టులో నుంచుటయేగాని నేర మామెపైఁ గను పడదు' వేంకటరావేమో చెప్పఁబోయెనుగాని, సూర్యారావు బల వంతముగ నాపివేసెను. కమల మొగము వ్రేలవైచెను. కాని,యామె

చూపులు అమాయకముగానుండెను. తనహృదయేశ్వరున కుపకారముచేయఁబోయి చేయలేకపోయెను. ఈచిక్కంతయును వచ్చెను. ఆమెయెవ్వరిని నిందింపలేదు. ఆమె గ్రహచారమని యూరకుండెను

'ఇందు నేనేమియును నేరముచేయలేదు. భగవంతుఁడొకఁడు లోకమునుబాలించుచున్నయెడల, నిజమెన్నటికైన బయలుపడును. నేనెవ్వరిని నిందింపను' అని యామె గట్టిగా ననెను.

పోలీసువారు గదిలోనున్నవారినందఱిని క్రిందికిఁ బంపివేయుచుండిరి. సూర్యారావు మరికనపడలేదు. ఇన్స్పెక్టరుగారు వీధిలోనికి వచ్చి నిలచిరి. కమలయును, వేంకటరావును మాటాడసాగిరి. సూర్యారావేల యింత తెలివిలేనిపనిచేసెను? కూలిపనిచేయువాండ్రవలె వెట్టిపని చేసెనుగాని, అభిమానించి పనిచేయలేదు' అని వేంకటరావనెను

'సూర్యారావును, బోలీసువారుకొ రహస్యాంశమును దాచియున్నారుకాఁబోలు ఇప్పుడు మించినదేమి?, అని కమల చెప్పెను.

వేంకటరావామెమొగము చూచెను.

'నీవేమి చెప్పదలఁచుకొంటివో నేనెఱుఁగుదును. నిన్ను నీవు నిందించుకొనవద్దు' ఆమె చెప్పెను. 'డబ్బుతగులఁబెట్టుట నీపొరపాటగునుకాన, యిదియంతయు నిట్లగునని నీవు కలగంటివా? నాకేమియును భయము లేదు. ఒక్కదానికి మాత్రము నాకు విచారముగానున్నది.

'అవును నేనెఱుఁగుదును. మీతండ్రి ఆతనిగూర్చియే నీవు విచారించుచున్నావు నీకు జరిగినసంగతి యాతనితోఁ జెప్పెదను. కాని మతిపోయిన వానికీసంగతి యెట్లుబోధపడును? వానికిఁ గావలసినదేదయిన నేనిచ్చెదను. నేను ధనికుఁడనుగాను గాని నాకుఁజేతనైన సాయముచేసెదను. మఱియేమైనఁ జెప్పవలసియున్నదా?' ఒక్క నిముసమాలోచించి, మఱియేమియును లేదని కమలచెప్పి ఇన్స్పెక్టరు

గారువచ్చిరి. 'అమ్మా క్షమింపుము. కొంతసాహసమింకను చాలక పోవుటచేత నిన్నువిడిచిపెట్టలేక పోయితిమి. అయినను నీకేమియును భయములేదు. నీకుఁ గావలసిన సదుపాయములన్నియును జేసెదము నిన్ను నాకుమార్తెతో సమముగా జూచెదను. భయపడకుము.' అని యామెతోఁజెప్పిరి. కమలవీధిలోనికిబోయి బండియెక్కెను. వేంకటరావు తన బసకుఁబోయెను. అంతయు నాతనికంధకార బంధురమై యుండెను. దారియును, తెన్నును గనపడకుండెను. సాయంకాల మైదుగంటలకు సూర్యారావతని యొద్దకువచ్చెను. కార్యభారము నెత్తిపై బెట్టుకొన్న వాని చిహ్నములాతని ముఖమునందేమియును గన్పడలేదు. కలకలలాడుచుండెను. చిఱునవ్వునవ్వుచుండెను. కార్యమును మూఁడునిముసములలో సాధింపగలవాని మనోధైర్యము మూర్తీభవించి యుండెను. వేంకటరావు మనస్సులోని కోపము తుపాకిమందువలె పాలుగూడి సిద్ధముగానుండెను. అగ్నిస్పర్శతగిలినంత మాత్రమున ప్రజ్వరిల్లునట్లుండెను. సూర్యారావు ముఖమును జూచుటవలన నా యగ్నిస్పర్శ కలిగెను. కోపాగ్ని 'బుస్సు'మని యుండెను.

'ఏముఖముతో మరల నాయొద్దకు రాసాహసించితివి?' ఆతఁడు కసరసాగెను. 'సైంధవునివలె నీవప్పుడడ్డు రాకుండిన, కమలను విడుదలచేసియే యుందురు. దినచర్యపుస్తకమప్పుడే చదివినయెడల—,

కావలసిన యెడల కమల నిప్పుడే విడుదలచేయింపఁగలను.' సూర్యారావు చెక్కుచెదరక చెప్పెను. 'కాని తరువాత నామె యెక్కడ నుండగలదు?'

వేంకటరావు చెప్పుటకు జవాబులేదు. సూర్యారావు మనసులోని యర్థమేమో యాతఁడు గ్రహించెను.

'నీకది మొదట స్ఫురించినది. కాదు' సూర్యారావే చెప్పసాగెను

'కమలకృష్ణాజీగారి యింటిలోనున్నది. వానితండ్రి మతిపోయి యున్నాఁడు. కృష్ణాజీగారామె నింటిలోనుండి వెడల, గొట్టినారు. ఇప్పుడామెను విడుదలచేసినయెడల, నెవ్వరియింటికిఁబోవను? అర్ధ రాత్రి నీతో నొంటిపాటునమాటాడినందుకు ఊరిలోని వారందఱును పరిపరివిధముల అనుకొనుచున్నారు. లోకులు కాకులుగదా. ఎవ్వ రామెను దగ్గరకుఁజేర్చు కొందురు?'

'అవునవును. నిజమే' అతఁడొప్పు కొనెను. 'నేనాసంగతి మొదట నాలోచింపలేదు. ప్లీడరు కాఁబట్టి అందులో 'లాపాయింటు నీకుఁ దెలిసినది. కాని యామె నిర్దోషియని యందఱియెదుట నీవు చెప్పవలసినది.'

'చెప్పియుందును.' సూర్యారావు చెప్పెను. 'చెప్పియుందును. కాని కమలయిప్పుడు విడుదలకాకపోవుటయే నీకును, నాకును, ఆమెకును అందరికిని మంచిది. నిజము తెలిసిన తరువాత ఆమెలో క్షేత్రగుణము నకులోకులందఱును సంతోషించెదరు కాని, నీవిదివర కూహింపని దుర్మార్గులు కొందఱిందుఁగలసి యున్నారు. వారి దుర్మార్గమును' బయలు పెట్టుచున్నాను. దినచర్యలోని కొన్నివ్రాతల వలన కమల నిర్దోషియని స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది కాని, యీ ద్రోహము నీవు తలఁచునట్లు చిన్నదికాదు. బీరకాయ పీచువలె చిక్కు చిక్కుగనల్లుకొని యున్నది.'

'వ్యాకరణ సూత్రములవలె గూఢముగ మాటలాడెద వేమి? వేంకటరావనెను, 'వెంటనే భాష్యము చెప్పివేయరాదా?' 'నేను జెప్పఁదలఁచుకొలేదు. నిన్ను నేను నమ్మను. నీ నోట నూవుగింజ నానదు. కాని, యొకసంగతి నిన్నడిగెదను. ఇప్పుడు హత్యఎవ్వరు చేసిరోవారి యొద్దకు నిన్నడిగెదను. ఇప్పుడు హత్య ఎవ్వరు చేసిరో వారి యొద్దకు నిన్నుఁ దీసికొనిపోయినయెడల నీవేమిచేయుదువు?' అని సూర్యారావడిగెను.

'వానిని నిలువుఁగాఁ జీల్చి వేసెదను' అని వేంకటరావు చెప్పెను. 'అవును నేనెఱుఁగుదును. నీవు తప్పక అలాఁగే చేసెదవు. అందుకే నేను నీకేమియుఁ జెప్పఁదలచుకోలేదు. కొద్దిరోజులవఱకును శాంతించి కని పెట్టుకొని యుందుము. మఱియొక సంగతి ప్రొద్దున, పరిచారిక యొద్దకొంత భోగట్టా సంపాదించితినని డిటెక్టివ్ చెప్పినాఁడు జ్ఞాపకమున్నదా?' అని సూర్యారావనెను.

'అవును జ్ఞాపకమున్నది. ఆసమాచారమామె కెట్లు తెలిసెనని నేనడుగలేదా?' అని వేంకటరావు చెప్పెను.

'అవును అడిగితివి గాని, ఆతఁడు చెప్పలేక పోయెను. నేను చెప్పెదను వినుము. ఆసమాచారము కృష్ణవేణి చెప్పెను.'

అది యెట్లు సాధ్యమగును? 'కృష్ణాజీగారి కుటుంబము తా బేదారులతో నెప్పుడును టన్నఁగా మాటాడరే.'

'నిజమే. కాని, అందిన సిగయును, అందకపోయిన కాళ్ళు పట్టుకొను బేరము వారిది. అవసరమైనప్పుడంట్లుతోము మన్నఁదోమెదరు.'

'సరేగాని కారణమేమై యుండును?'

'ఆసంగతియే చెప్పఁబోవుచున్నాను. నీవును కమలయును మాటాడుచుండుట కృష్ణవేణి యెప్పుడైనఁ గనిపెట్టినదా?'

'పేకాటనాటి రాత్రి మేము మాటాడుచున్నప్పుడు చాటున వినుచున్నట్లు నేననుమానించితిని.'

'కమలను బెండ్లియాడుదునని నీవు ఉదయము కోర్టులోఁ జెప్పినందుకు నాకు విచారముగా నున్నది. సరేపోనిమ్ము, ఈరోజున మనము కృష్ణాజీగారి యింటికి విందుకుఁ బోవలసి యున్నదిగదా, ఒకవేళ రహస్యముగ కృష్ణవేణి నీయొద్దకువచ్చిన, దానిని మంచి మాటలాడుము. క్రొత్తసంగతులు కొన్ని నీకు గోచరించును.'

కృష్ణాజీగారి యింటివిందు సంగతి మఱచియే పోయినాను. నేను వారియింటికి వెళ్ళను. రానని కబురంపెదను.'

'వద్దువద్దు. అట్టిపని యెన్నటికిని చేయకుము. పోయినందు వలన కొన్ని సమాచారములు తెలియఁగలవు. నీకెంతయిష్టము లేక పోయినను రాకతప్పదు.'

---

## పన్నెండవ ప్రకరణము

### సంతోషమో? విచారమో?

వేంకటరా వేమియో యాలోచించుకొనుచుఁ గూర్చుండెను. ఇంతలో బంట్రోతు చిన్నయుత్తర మొకటి తెచ్చియిచ్చి యిది యెవ్వరో యిచ్చిరనియు, జవాబున కాగక వెళ్లిపోయిరనియుఁ జెప్పెను. వేంకటరావువిప్పి చదువుకొనెను. అందుఁ గొంచెమే వ్రాయఁబడెను.

'వేంకటరావుగారికి—మీరు రాత్రి కృష్ణాజీగారి యింటికి, ఎన్ని పనులు ఉన్నను, భోజనమునకు రావలెను. తప్పవద్దు చేరుమాలు ముక్క మరచిపోవద్దు. ముమ్మాటికి మఱచిపోవద్దు.'

సంతకము లేదు. సూర్యారావునకుఁ జూపెను. ఏమియును బోధపడలేదు. ఆశమాత్రము కలిగెను. చేరుమాలు కోటు జేబులోఁ బెట్టుకొనెను. వేళయైనది. ఇద్దఱును బయలుదేరిపోయిరి. భోజనశాల మామ్మాలుగానే యలంకరింపఁబడెను. పట్టుపంచలు కట్టుకొని యందఱును పీటలపైఁ గూర్చుండిరి. ఎవ్వరో రావలసియున్నదని కృష్ణాజీగారు కొంచెముసేపు కనిపెట్టుకొనిరి. వేళ మించినందున రారని భోజనము లారంభించిరి. భోజనములు ముగిసెను. చేతులు

గడిగికొనిరి. అంగణమునఁ జాపలపై దాంబూలము వేసికొనుట కందఱును గూర్చుండిరి. ఇంతలో నెవ్వఁడో యొక క్రొత్తమనుష్యుడు వడివడి వారిలోఁ జొరఁబడి మధ్యకువచ్చి కూర్చుండెను. నాటిరాత్రి తనకుఁ గనుపడినవాడేమోయని వేంకటరా వనుమానపడుచుండెను. అందఱును వింతగఁ జూచుచుండిరి. 'ఏమి యీ యసందర్భము? పిలువని పేరంటముగ వచ్చినారు మీరెవ్వరు' అని కృష్ణాజీగా రడిగిరి.

'భయములేదు. భయములేదు.' క్రొత్తవాఁడు పలుకసాగెను. ఏల యంత తందరపడి మాటాడుట లక్ష్మణరావుగారు రాలేమన్నారు. ఆ కబురు చెప్పుటకు నేను వచ్చితిని. నేను వచ్చినందుకు మీరంద ఱును సంతోషింపవలసినదే. కృష్ణాజీ యేమి శ్రీనివాసమూ, మాటాడ వేమి! ఆహాహా. ఈ తమలపాకులు నెల్లిమరల ఆకులవలెనున్నవి. విజయనగరమునుండి తెప్పించినారా యేమి? లవంగాలుఉన్నవి. ఏలకీ పళ్ళు లేవేమి? గింజలాపెట్టినారు! గింజలు బాగుండవు. పళ్ళు కావలెను. అమ్మా కృష్ణవేణీ. ఏలకీ పళ్ళు కొన్ని పెట్టెలోనివి తీసి కొనిరా?' అందఱును తెల్లఁబోయి చూచుచుండిరి. కృష్ణాజీగారును శ్రీనివాసరావును సమ్మోహనాస్త్రము వైచినట్లు మౌనముద్ర వహించి చూచుచుండిరి. క్రొత్తవాడు తనమాటలను మానలేదు. 'అయ్యా యేల నావేపు వింతగా చూతురు? కృష్ణాజీయును శ్రీని వాసమును నన్నెఱుగనట్లు నటించెదరు. దానికేమిలెండు నాపేరు పుల్లయ్య నేను చాలాదూరము దేశయాత్రచేసి వచ్చితిని.' ఇంకను ఎవ్వరును మాటాడలేదు. వేంకటరావు మొట్టమొదట మాటాడెను. 'మీరు బరంపురమువిడిచి యెన్నాళ్లైనది?' 'ఇరువదియేండ్లైనది.' కాశీ, గయా, ఢిల్లీ, ఆగరా, మొదలైన స్థలములు తిరిగితిరిగి వచ్చితిని. ఇంటి వద్ద కూర్చున్నవారికి ప్రయాణపుకష్టములు తెలియవు. ఏమి కృష్ణాజీ! శ్రీనివాసరావూ! ఏమందురు?' కృష్ణాజీగారేమో గొణుగుకొనిరి. శ్రీని

వాసునిముఖము నల్లఁబారెను. 'ఏమి యీతని సమ్మోహనశక్తి'యని వెంకటరావాశ్చర్యపడెను, గృహమునకంతటి నాతడేయజమానుఁడై నట్లును, తక్కినవారందఱు నాతని తాబేదారులైనట్లును అతనికి వశులైరి. మరల నాతఁడు మాటాడసాగెను. 'ఎన్నో దేశములుతిరిగి నానుకాని, ఆదేశముల నాగరికతకును మనదేశపు నాగరికతకును జాలభేదముకలదు. మనదేశము వారు స్త్రీలుగాని, పురుషులుగాని రోజుకొకతరహా. ఆదేశపువారు తాతలునాటితోనే తరతరములదాక విడువరు. అందుచేత వారిని చూచిన నాకుఁ గోపము. మనదేశపు వారి క్రొత్తతరహాలు చూస్తేనాకు ముచ్చట. దానికేమిగాని, ఈ మధ్య ఒకనాడు రాత్రి నేను కృష్ణాజినిచూచుటకు వచ్చితిని. మన దేశపు ఇళ్ళవంటి ఇళ్ళు ఆదేశాలలోఁ గనుపడవు. ఈలాంటి ఇల్లు కట్టించుకొందామని ప్లాను వేసికొనుచుంటిని. అన్నట్టు ఆరాత్రి ఈ యింటిలో !ఆడుపిల్లయొక్కతె ఏదోచిక్కులోఁ బడట్టు ఉన్నది. ఆ సంగతి యేమైనది.

'కొంతబుజువు దేలినది.' సూర్యారావందుకొనెను. 'కాని' కమల యిందుఁ గేవలము నిర్దోషురాలు. ఆమె నెఱిఁగిగినవారంద ఱును జిగినీవిషయమై యామెచెప్పినది. వాస్తవమేయని నమ్ముచు న్నారు.

'సరే! కావచ్చును. దానికేమిగాని—— ఆతఁడేమోమో మాటలాడబోయెను.

ఇంతలో 'ఏల వట్టియూఁకదంపు?' అని శ్రీనివాసరావును. కృష్ణాజీయునులేచి నిలువఁబడిరి. వచ్చినవారిలోఁ జాలమందిలేచి నిలువఁబడిరి. ఒక్కొక్కఁడును పేకాటగదిలోనికిఁ బోసాగిరి. వేంకట రావున కేమియో జ్ఞాపకమునకువచ్చెను. హాలువైపుఁ బోసాగెను. వుల్లయ్య పెరటివైపునకుఁ బోయెను. వచ్చినవారందఱును బెదరి

పోయిరి. వేంకటరావొక్కఁడే హాలులోఁగూర్చుండి యాలోచించుకొనుచుండెను. సమయముచూచి కృష్ణవేణి యక్కడకు వచ్చెను.

ఆమె పట్టు పైటపరికిణీయొకటి కట్టుకొనుట వింత యేమని ముసలిపెండ్లాములుగల గృహస్థు లనుకొందురుగాని క్రొత్తగా కాపురమునకువచ్చిన పడుచు పెండ్లాములుగల గృహస్థులుమాత్ర మనుకొనరు. ఆమెదొరసానివలెఁ గన్పడుటకుఁ గాఁబోలు రైకకుమారుగా పట్టు తొడుగుకొనియుండెను. ఆమెకన్నులు పెద్దవిగాని, కొంచెము పచ్చగనున్నవి. మొగము పసిమిరంగుగానే యుండునుగాని, కొంచెము తెల్లవాకుగా నుండును. చిన్నప్పుడు ఆటలోఁ ఆటపిల్లలు 'దొరసాని' యనియే యామెను బిలుచుచుండిరి. ఆమె తల్లికొకదొరగారితోఁ బరిచయముండెనని తెలిసినవారు కొందరనుకొనుచుండిరి ఏదియెట్లున్నను ఆబుట్టలు కట్టుకొనుటలో దొరసానివలెనుండుట యామె కిష్టమనుమాట వాస్తవము. దానికి కన్నులును, మొగమును దోడైనవి. వేంకటరావున కెగురుగానున్న కుర్చీపై యామె కూర్చుండెను. 'నీతో నేను గొన్నిసంగతులు నిష్కర్షనగా మాటాడుటకు వచ్చితిని. కమల సంగతి యేమి?'

'నీవు చెప్పినది నాకు బోధపడుట లేదు. ఆమెకిప్పు డేమివచ్చెను కృష్ణవేణిమొగము కొంచెమెఱ్ఱఁబాఱెను.

'పైకిఁ గనుపించుచున్న వానిని బట్టి పోల్చుకొనవచ్చును' ఆమెచెప్పెను. 'నీవామెను గాపాడఁ దలఁచినందుకు సంతోసముగా నున్నది. కావున నీవు అవసరములేని శ్రమపడినావు.'

కృష్ణవేణికి కమలపైఁ గలకోపము కొంచెము కనుపడెను.

'అవసరములేనిపని యెట్లయ్యెను? అపాయమునున్న దిక్కులేని యమాయకు రాలికి సాయముచేయుట యవసరములేనిపనియా?

''నీవామె——'' ఇంతలో పుల్లయ్య లోనికిఁద్రోసికొని వచ్చెను. ఇద్దఱును లేచి నిలువఁబడిరి. వెళ్ళిపోఁజూచిరి. చెఱియొక

త్రొక్కి బట్టుకొని వారి నాపివేసెను. 'భయములేదు మీరహస్యములను నేనెఱుఁగనివాఁడను గాను. నావలన మీరహస్యమునకు భంగముకూడఁ గలుగదు. కూర్చుండుఁడు. మీరిద్దఱు నుండఁగనే కొన్నిసంగతులు మాటాడవలెను. అతలుపు వేసి వచ్చెదను. ఎప్పుడైనఁ జొరఁబడఁగలరు.'' తలుపులు భద్రముగా వేసెను.

మరల మాటాడసాగెను. 'ఇందాక నేను మాటాడుచుండ నడుమ నందఱును బారిపోయిరి. పోనిండు. మీరు పనుఁడు. నాఁటి రాత్రి అనఁగా, మొన్న పేకాడిననాటిరాత్రి నేనిక్కడనేయుంటిని. అనఁగా, ఈయింటిలోనే యుంటిని. కృష్ణాజీ నన్నువిడిచి యెక్కడికో పోయెను. ఇంటిస్లాను వేయుటకై నాలుగుమూలలును దిరిగితిని వెనుక పెరటిలోనికిఁ బోయితిని. పువ్వులచెట్లును, దొండపాదులును, అరటిపొదలును ముచ్చటగా నుండెను. ప్రబంధములలో వనవిహారములు జ్ఞాపకమునకు వచ్చెను. సీతయొక్కతె ప్రక్కలేదుగాని, నేను శ్రీరాముఁడనే యనుకొంటిని. కాదుకాదు. మేనక యొక్కతె లేకపోయినదిగాని, విశ్వామిత్రుఁడనే యనుకొంటిని. అదియును గాదు. మంచియుపమానము చెప్పెదను. ప్రబంధములు చదివి చాల కాలమైనది. జ్ఞాపకమురాలేదు. అఁపును. వరూధిని లేకపోయినది గాని'—కృష్ణవేణి ముఖముచూచెను. ఆమె తల వంచుకొనెను— 'వరూధిని లేకపోయినదిగాని, ప్రవరుఁడను— అబ్బె కాదు. గంధర్వుఁడనే యైతిని. చంద్రుఁడు వేడిగా ఎండ కాయుచుండెను. మొగము చెమటక్రమ్మినది. తుడుచుకొనవలెనని యెంచితిని. చేరుమాలు దగ్గరలేకపోయినది. ప్రభావతీ ప్రద్యుమ్నములో పెద్దన్న—కాదు కాదు—సూరన్నబావ నాబలమని యేమేమో వ్రాసినాఁడు. అది జ్ఞాపకమువచ్చినది. కనపడ్డ ఆకంతయు చేరుమాలుగా భావింపసాగితిని. భావనాబలము చాలగొప్పది. ఒక ఆకు చేరుమాలువలెఁగన్పడి

నది. కాని, భావనలో పొరపాటుచేసితిని. అప్పుడు భావనలోపడినది నిండుఆకు గాదు. సగముఆకు. అనగా ఆకుముక్క కావున ఒక చేరు మాలు ముక్కయే కనుపడినది. వెన్నెలలో—కాదు కాదు.ఎండలో —మీదఁకెత్తి చూచితిని. నేనుభావించిన ఆకు పసుపుపచ్చదికాఁ బోలు అదియును పసుపుపచ్చసి పట్టుచేరుమాలు అయినది. చూచి సంతోషించితిని. దానిపైసి పూలుతోకుట్టియున్నది. బహుశః ఆకు నరములే అట్లు మారియుండును. ఆకుఁలుపని మహాచమత్కార ముగా నుండెను. ఆపని యెవ్వరు చేసిరోయని నే నాశ్చర్యపడితిని. అప్పుడు జేబులో తడివితిని. అందొక ముత్యపుచిప్పడబ్బీ యుండెను. దానివజ్రములు వెన్నెలలో తళతళలాడెను. ఆకుఁలుపని చేసినవారికి ఈడబ్బీ బహుమాన మిచ్చివేసినదని యనుకొంటిని. కాని యప్పటి నుండియును నాకెవ్వరును గనుపడలేదు. చేరుమా లెవ్వరిదో తెలి సినదికాదు. కృష్ణవేణి రిచ్చవడి వినుచుండెను. చేరుమా లాతఁడు పైకితీసి చూచెను. 'కృష్ణవేణీ చూచితివా? ఇది యెవ్వరిదో పోల్చఁ గలవా? పోల్చఁగలిగినచో ఈ ముత్యపుచిప్ప డబ్బీ వారికి తీసికొని పోయి యిచ్చెదను. నావెఱ్ఱికి మీ రాశ్చర్యపడ వద్దు.'

'అదినాది. ఆ చేరుమాలుముక్క నాది. ఈబహుమానము నాకేవచ్చును' అని కృష్ణవేణి తొందరగాఁ జెప్పెను.

'ఋజువు. ఋజువు. మిగిలినముక్క చూపినయెడల బహు మానము నీదే' పుల్లయ్య యనెను. 'ఆరెండును కలిపి, మరల పూలుతో కుట్టినయెడల సొగసైన చేరుమాలగును' 'ఇది యెట్లు సాధ్యమగును? నిన్న పెరటిలో చెట్టుకొమ్మతగిలి చేరుమాలు నడి మికి చిరిగిపోయినది. ఒకముక్క అక్కడనే పడిపోయినది. రెండవ ముక్కను నాచేతిలోఁ గొంత వరకుండెనుగాని, ఎక్కడనో పార వేసితిని. జ్ఞాపకములేదు.' 'పెరటిలోనే పారవేసితివా?' 'ఏమో

చెప్పలేను. ఇంటిలోనికిఁ దీసికొనివెళ్ళినట్లు జ్ఞాపకము.' 'హాలులో బారవేసితివా?' 'అయియుండును' 'హాలులోని కేలపోయితివి?' 'జ్ఞాపకములేదు'

ఇదిగో రెండవముక్కయని వేంకటరావు, చూపెను. 'ఏదీ చూతము' అని పుల్లయ్య అందుకొని రెండుముక్కలును కలిపెను. సమముగ సరిపోయినవి. 'ఇదే. ఇదే' నిర్ధారణగాఁ జెప్పెను. ఎక్కడ దొరికెను వేంకటరావూ?'

'జిగినీబిళ్ళ పెట్టినదగ్గరి' అని యాతఁడనెను. ఇద్దఱును కృష్ణ మొగము చూచిరి. వాడిపోయియుండెను. 'జిగినీ బిళ్ళకొఱకుఁబోయి కృష్ణ యక్కడఁ బారవేసినదేమో' అని పుల్లయ్య దృఢముగాఁ బలికెను. 'జిగినీరహస్యము కృష్ణకుదప్ప మరియెవ్వరికిని దెలియదు. అని పుల్లయ్య మరలచెప్పెను.

కృష్ణమొగమున గంటుపెట్టినను నెత్తురులేదు. పెదవు లదరెను. మరల మొగమెత్తిచూచెను. 'దురాత్ముఁడా! అసందర్భము లాడుచున్నావా? యని యరచెను. 'కొంచెము శాంతించుఁడు' అని వేంకటరావనెను. 'సరే' యని పుల్లయ్య మరల నారంభించెను.

'బహుశః నీవు జిగినీ దొంగిలించితివని నేననుకొనను. వట్టి యనుమానము నీవేలపడెదవు? ఎవ్వరో దొంగిలించు చున్నప్పుడు విధివశమున నీవక్కడనుండ వచ్చును. జిగినీపెట్టిన స్థలము, నీ చేరుమాలుముక్క పడిపోయిన స్థలమును ఎట్లు సరిపడును?

కృష్ణవేణిమొగము కొంచెము కలకఁబాఱెను. దేహము మాత్రము కంపమొందుచుండెను.

'జిగినీ అక్కడనుండెనని నే నొకసూత్రమును నమ్మను. శంకరశాస్త్రిగారియింటినుండి యెత్తుకొనివచ్చి, [illegible] కాదు పోలీసువాఁడు వెతికితీసిన పెట్టె [illegible] బడెను

వేంకటరావునకుఁ గోపమునచ్చెను గాన, ఆపుకొనెను. కృష్ణవేణి మాటలు కఠినములుగా నుండెను. జిగినీతీసిన దొంగ ఆమెయే.కొం చెము హెచ్చుతక్కువగా ఆమెయే యొప్పుకొనెను. ఆనేరము కమలపైఁ ద్రోసివేయవలెనని యామెయూహ. 'ఏమి జిగినీ యెవ్వ రును జూడనేలేదని చెప్పుచున్నావా! ఆరాత్రి నేనిక్కడనే కూర్చు న్నాను. కమల గదిలోనుండ జిగినీతెచ్చి యిక్కడనే నాచేతిలోఁ బెట్టినది. యిక్కడనే కొంతసేపువరకును మేము తగవు లాడితిమి. యింతలో జిగినీ యిక్కడనుంచి వేసి మేము పైకిఁ బోయితిమి. మరలవచ్చుసరికది యిక్కడలేదు. ఈచేరుమాలు ముక్కయున్నది. జిగినీ యేమయినట్టు! ఈ చేరుమాలు ముక్కయున్నది. జిగినీ యేమ యినట్టు! చేరుమాలు ముక్క యెట్లువచ్చినట్లు?' కృష్ణవేణి కన్నుల నుండి నీరుకారెను. నేనుబోయెదనని యామె వడివడిపైకివచ్చెను. 'దొరికిపోయినది' అని వేంకటరావనెను. యిద్దరును గూడ పైకివచ్చిరి.

---

## పదమూఁడవ ప్రకరణము.

### అదా? ఇదా?

'పుల్లయ్యగారూ, మీరు రహస్యముగానే కృష్ణవేణి నేరము ఋజువు చేసినారు. సంతోషముగానున్నది.' అని వేంకటరావనెను.

'జిగినీ యెవ్వరు దొంగిలించిరో యిప్పుడు తెలిసినదా?' అని పుల్లయ్య యడిగెను. 'మరి యేమియనుమానము? మీరు వేసిన బోనులో ఆమె పడిపోయినది. మీరేయుద్దేశముతోఁ జెప్పుచు న్నారో తెలియక యంతయు నొప్పుకొన్నది. మీరాము త్తైపుచిప్పల

డబ్బీ యిచ్చివేయుదురా!' 'తప్పక యిచ్చివేయుదును. కా
నేరము బయలు పడినదిగదా!' 'అందుకే నాకు విచారము
నున్నది. పాపము! ఆడువాండ్రకుఁగూడ నిట్టి ద్రోహబుద్ధు లుం
నని నే ననుకొనలేదు. నాగుండెలు కొట్టుకొనుచున్నవి.' నా
మాత్రము కొట్టుకొనలేదు. ఆమె సంగతి నీకింకను బాగుగాఁ దె
యలేదు.' 'కొంచెము తెలియును' 'ఏమి తెలియును?' 'ఆమె నా
నప్పుడప్పు డోరచూపులు చూచుచుండును.' 'ఆమెచరిత్ర తె
యునా?' తెలియును. ఆమె మామగారు ఆమె తండ్రిపై నలి
కుమారునకు మరల పెండ్లిచేసినారు. ఆమె పెద్దపిల్లయై నాలుగేం
యినది. కాపురమునకుఁ దీసికొనిపోలేదు. తీసికొనిపోమన స్పష్
ముగా మొన్న కబురంపివేసిరి.' 'అట్లయిన మరల వివాహమ
చేయఁగూడదా?'

'తండ్రి కిష్టములేదు. తక్కినసంగతులు నీకే క్రమముగ
తెలియును.'

'ఏత్రోవను హాలులోని కామె రాఁగలిగెను?'

అది స్వల్పసంగతి. ఆమె సామాను గదిహాలునకు ప్రక్కన
గలదు. దానిలోనుండి హాలులోనికి కిటికీకలదు. మీరు ప్రేమా
శయముచే దానిసంగతి మరచిపోయినారు. ఆమె మాత్రము కిటి
ప్రక్కనుండి మీసంభాషణయంతయును వినుచుండెను. మీరు లే
సమయముచూచి కిటికీలోనుండిపోయి జిగినీ యెత్తుకొనిపోయెను
మీమాటలువిను సందడిలో చేరుమాలుముక్క చేతిలోనే యుం
పోయెను. జిగినీ తీసుకొను తొందరలో అక్కడ పారవేసుకొనెను.

'ఆమెయుద్దేశ మేమైయుండును.'

'నీపై కన్నువేసినది. కమలను మోసపుచ్చి, నిన్ను వలలో
వేసికొనవలెనని తలచినది.'

'ఎట్లు వలలో వేసుకొనవలెనని?'

'కమల జిగినీ నీచేతి కేలయిచ్చెనో యామెకుఁ దెలియును.' 'సూర్యారావుసంగతా?' 'అవునదే.' 'అన్నట్టు వానికొంప లేవుము లిగిపోవునేమో!' 'భయములేదు. అంతవరకురాదు.'

'జిగినీ తీసికొనుటలో ఉద్దేశమేమి?'

'మచ్చరము. మరేమియునులేదు. మొదట మచ్చరమే. ఆపైని ఆమెను అరెస్టుచేయుటకును. జిగినీలేనినాఁడు కనుపడినదని అందఱు ననుకొనుటయునువిని, ఆమెపై నేరము బలముచేయుటకై ఆ కృష్ణవేణియును బరిచారికయునుగలసి జిగినీ కమల పెట్టెలోఁబెట్టి సమాచారమిచ్చిరి. 'పరిచారిక—పరిచారిక సమాచారమిచ్చినది. నోరు తడబడి ఇందాక కృష్ణవేణి చెప్పివేసినది వినలేదా! ఇది గొప్ప ద్రోహము. ఇదియంతయును మీకుదెలిసినందు కాశ్చర్యమగుచున్నది మీరెవ్వరూ కొంచెము చెప్పరా?'

గదిలో శ్రీనివాసుఁడును, కృష్ణాజీయును గలసి యేమేమో యాలోచించుకొనుచుండిరి. వారివైపుచూచి 'ఆలోచించుఁడు—ఆలోచించుడు. దుర్మార్గులారా! మీ కాలము సమీపింపకపోదు.

అబ్బాయీ, నే నెవ్వఁడనో నీకిప్పుడు చెప్పకూడదు. కృష్ణాజీగారిదివరకు నేనెవ్వఁడనో పోల్చలేదు. కాని నీకు నేను గొప్ప సాయముచేసెదను.'

'నావలన మీకేమైన నుపయోగమున్నయెడల—'

కావలసినంతయున్నది. అతిశీఘ్రకాలములో కొన్నియద్భుతములు బయలుపడును. నీసాయము తప్పక కావలసియున్నది. బహుశః ఈరాత్రియే జరుగునేమో నీవీరాత్రి ఇంటికిపోవద్దు. ఇక్కడనే యుండుము. జాగ్రత్తగా కనిపెట్టియుండుము. ఒక్కచోట కూర్చుండుము. అటునిటు దిరుగుచుండుము. అనుమాన మేమితగిలినను గమనించు

చుండుము. రాత్రి వెన్నెల చల్లగానున్నది. గనుక తిరుగుచున్నానని చెప్పవచ్చును. నిద్రపోకుము. కన్నులు తెరచియుండుము.' మరి మాటాడక పుల్లయ్య యందుండి వెడలిపోయెను. వేంకటరావు పెర టివైపునకుఁ బోయెను. వెన్నెలలో నొక పూలచెట్టువద్ద నిలచియుం డెను. ఇంతలో కృష్ణవేణి యతనియొద్దకు వచ్చెను. ఆమె శాలువా కటి కప్పుకొనియుండెను.

'నీవు వెళ్ళిపోయినావని యనుకొన్నాను. మరల నిన్నుచూడ గలిగినందుకు సంతోషముగా నున్నది. వానితోఁగలిసి పేకాడలేదా?' 'నేను మఱి పేకయాడనని యొట్టుపెట్టుకొన్నాను. ఇక్కడనే యా నందముగా నున్నది.'

'అవును నిజమే. నేనునందుకే ఇక్కడకు వచ్చినాను.'

ఆతనివైపుచూచెను. 'ఇందాక నేనుచాల తెలివితక్కువ పనిచేసినాను.' 'ఆదోషమునాదే. అవసరములేని ప్రసంగములోఁబడి తిని. ఈనడుమ నాకు మనస్సు స్వస్థముగాలేదు. పాపము కమల—' 'ఆమెయూసు మఱియెత్తకుము.'

కృష్ణవేణి యాడినయీమాటలలో మాత్సర్యమును, మోహ మును మేళగించియుండెను. వేంకటరావది కనిపెట్టెను. ఆమె మరల చెప్పసాగెను. 'బహుశః ఆమె విడుదల చేయఁబడును. నీసాక్ష్యము బలమైయున్నది. కాని నింద తప్పదుగదా. ఊరిలోనివా రనేకవిధ ముల ననుచున్నారు.' 'ఎట్లనుకొన్న నాకేమి? ఆమె మంచిది నే నెఱుఁగుదును. చదువుకొనినది. చక్కనిది.' 'ఇన్నియున్నను నీకుఁ దగినదికాదు.' 'ఏల?' 'నీవు విద్యగలవాఁడవు. స్వతంత్రజీవనమునం దాసక్తిగలవాఁడవు. కాని బీదవాఁడవు. కాని కూడుదిన్నను, కడుపు నిండవలెనుగదా. ధనమున్న భార్య నీకు దొరికినయెడల—'

ఆమె యాతని ముఖమువైపు తేరిచూచెను. వేంకటరావున కాశ్చర్యము కలిగెను. 'ధనమున్నభార్య నీకు దొరికినయెడల నీవృత్తి

బాగుగా చేసికొనఁగలవు. కమలకన్న నేను తక్కువ కాను. వీనైన యెడల నన్నుఁ బెండ్లి గూడును. లేకున్న నా నగలన్నియును దీసి కొని నీయింటికివత్తును. నన్నాటంకపెట్టువా రెవ్వరును లేరు. నీవును స్వతంత్రుఁడవు.'

'ఛీ—ఛీ—అట్టి ప్రయత్నమువద్దు. నాకు ప్రేమములేని స్త్రీని నేను బెండ్లియాడను. ఎక్కువ తక్కువలకేమిగాని, ఒకరిధనము—అందులో ఆడుదాని ధనము—నాకక్కఱలేదు.

నా తెక్కలసత్తువవలన నేను జీవింతును. ఈ ప్రసంగము నాతో మఱియెప్పుడు నెత్తకుము.' అని చెప్పి యాతఁడు మఱియొక ప్రక్కకు నడువసాగెను. ఆమె కొంచెము వెనుకగ వెంబడించు చుండెను. కొంతదూరము పోయినపై నక్కడ నెవ్వారో స్త్రీపురుషు లిద్దఱు మాటాడుచుండిరి. కృష్ణకోపముతో, 'పైడీ, వీని నెందు కిక్కడకు రానిత్తువు? వద్దని నేనెన్నిసారులు చెప్పలేదు? ఇంటి లోనికిఁబో. పనివాండ్రందఱును మునిగిపోవుచున్నారు.' వారెంతో వీరంతే. అమ్మా, నేను చేయవలసినపని యంతయు నైనది. నీవు నిద్రపోవువరకును మఱియేమియును లేదు. ఈరాత్రి మహాసుఖముగా నున్నది. అమ్మా, కాదూ!' అనిపైడి జవాబుచెప్పెను. ఆమెతో మాటాడుచున్నవాఁడు సిగ్గుపడిలేచి పోఁబోయెను. పొదలచాటునకు మెల్లఁగ నాతఁడు జారిపోవు చున్నట్లుకూడ వేంకటరావునకుఁ గను పడెను. కృష్ణవేణి పైడిపై గోపపడుచుండెను. నెలాఖరున జీతమిచ్చి పంపివేసెదనని చెప్పెను. పైడిటిరుగబడెను, 'నన్నెవ్వరు పంపివేయఁ గలరు? అంత ధైర్య మెవ్వరికిఁగలదు? నాకు కావలసినప్పుడు వత్తును. అక్కఱలేనప్పుడు పోదును. మీరు భరింపవలెను. మీకన్న పెద్దవారి యిండ్లలో నేను పనిచేసినాను. నాకు చెప్పనక్కఱలేదు. నిముసములో నిన్ను నేను నలిపివేయఁగలను. నీప్రాణములు నాపిడి

కిటిలో నున్నవి—' కృష్ణ మాటాడలేదు. పైడి యక్కడనుండి వెళ్లిపోయెను. 'పైడి మంచిదే—కాని' కృష్ణ యనుకొనెను. 'అప్పుడు మితిమీరిన కోపము దానికి వచ్చును. అప్పుడు ఒళ్లు తెలియక మాటాడును. తరువాత మరల కాళ్ళుపట్టుకొనును' కృష్ణవేణి యెక్కడకో పోయెను. వేంకటరావీ మాటను వినీ వినని' యట్లూరక యక్కడనుండి మరియొక ప్రక్కకుఁ బోయెను.

ఒకచోట చెట్టువారును పైడితో మాటాడుచున్న మనుష్యుఁడు కన్పడెను. 'ఏల నీవిక్కడ నిలచియున్నావు? కృష్ణవేణి యిప్పుడిప్పుడే యేమన్నదో వినలేదా? నీవిక్కడ నున్నను బోయినను నాకు నష్టములేదుగాని, యవసరములేక యొకరియింటిలో నీవుండకూడదు.'

'డాక్టరుగారూ, నేనుగూడ పనిమీఁదనే వచ్చినాను. ఇదిగో నేనెవ్వఁడనో చూడండి?' అని యాతఁడు తనముసుఁగును దీసివైచెను. ఇన్స్పెక్టరుగారితోఁ గలసివచ్చిన పోలీసువానివలె నాతఁడు గన్పట్టెను. 'అచ్చన్నా, నీవేనా? ఏమిది? నీవేల యిక్కడికివచ్చినావు?' అని వేంకటరా వాశ్చర్యముతో నడిగెను. 'ఇక్కడ పైడితో స్నేహముచేయుచున్నాను. పైడిమొగుడు రంగము పోయినాడట. అది రెడ్డికిది నేనురెడ్డివాడనే మాలో మారుమనువులు కలవు. అందుచేత పైడిని పెళ్లాడుదమని దానితో స్నేహము చేయుచున్నాను.'

'నీవిప్పుడు చెప్పినదంతయును నిజమేనా?'

'నిజమో అబద్ధమో ఇన్స్పెక్టరుగారికే తెలియును.'

'ఓహో! దానిగుట్టంతయును దెలిసికొనుటకా?'

'ఇదివరకే కొంత తెలిసిపోయినది. ఇది పెద్దజాణ అనేక పర్యాయములు అనేక దొంగతనములకు కారకురాలైనది దొంగలకు గుట్టిచ్చినది. పోయినచోట నౌఖరీకి మరీపోదు. పెట్టినపేరు మరిపెట్టు

కోవద్ద ఇక్కడవీరియింట పైడియని పేరు పెట్టుకొన్నది. ఇక్కడవీరి యింటికి యేపనిమీఁదవచ్చెనో తెలియదు కాని, గుట్టు తెలిసినట్లు నటించి మాటాడుచున్నచో నన్నియును జెప్పివేయుదానివలెఁ గన్పడుచున్నది.'

'శంకరశాస్త్రి హత్యతో నేమైన సంబంధమున్నదా?'

'కొంచెమున్నట్లే కన్పడుచున్నది. అదిగో- ఆజిగిసీ-దానిని గుఱించి కొంత యామెకుఁ దెలియును.'

'ఎంతవరకు దెలియును?'

'ఇల్లు సోదాలో భోగట్టా యిదేనాకిచ్చినది. ఇప్పుడు కొంత వింతసంగతి నేను దెలిసికొన్నాను. మీరుకూడ గ్రహించి యుండ వచ్చును.'

'ఇక్కడ మగవాఁడొకడును ఆడుదియొక తెయును నేవో తెసగా షగ మాటాడుకొనుచున్నారని నేను గ్రహించితిని.'

'అంతేనా?'

'అంతకన్న నెక్కువ మఱియేమున్నది?'

'ఇదే పోలీసువారికిని తక్కనవారికిని భేదము.'

నీవు గనిపెట్టిన వింతయేమి?'

'ఇందాక పైడి కృష్ణవేణితో యేమననో వినలేదా?'

'విన్నాను. అవసరమైనయెడల నీప్రాణముల నలిపివేయగలను నీప్రాణములు నాపిడికిటలో నున్నవి అన్నది.'

'నిజముగా నౌఖరీకివచ్చినది యెప్పుడైన నట్లుమాటాడఁ గలదా? మాటాడినఁ, దన్నితగిలివేయక, యూరకుందురా?' దానిని బట్టి కృష్ణవేణి గుట్టొకటి యామెచేతిలో నున్నదని గ్రహింపవలయునుగదా? నేనుపైడితో స్నేహాముచేసి తెలిసికొన్నవానిలో ఇది యొకటి అయ్యా, ఆలస్యమగుచున్నది. నాకు పనిగలదు. మీరు

మీాపని చూచుకొనుఁడు. అవసరమైనయెడల పిలువుఁడు ఇక్కడనే యుందును.'

అచ్చన్న మరియొకమూలకుఁ బోయెను. వేంకటరావింటిలోనికిఁ బోయెను. పోవుసరికి వింతయేమో కన్పడెను.

---

పదునాలుగవ ప్రకరణము.

ఒకయూకెక్కువచదివిరి.

పేకాటగదిలోఁ బేకాడుచుండిరి. కృష్ణాజీగారును, శ్రీనివాసుఁడును ఆటలోఁగూర్చుండిరి. పుల్లయ్యయును, సూర్యారావును ఆడుచున్నవారిప్రక్కఁ గూర్చుండి చూచుచుండిరి. వారు కూర్చుండుట కృష్ణాజీగారికి ఇష్టములేదు గాని, పొమ్మని స్పష్టముగ జెప్పలేకపోయిరి. పుల్లయ్యా దాహముగానుండెనను చుండిరి. కొంతసేపైన తరువాత కృష్ణాజీగారును శ్రీనివాసమును బైకివచ్చిరి. వీధిలో నిలుచుండి, యేమేమో మాటాడిరి. మరల పేకాటగదికిఁ బ్రక్కనున్న గదిలోనికివచ్చి, కుర్చీలపైఁ గూర్చుండిరి. సేవకునొకనిఁబిలిచి రెండు 'లైమ్‌జ్యూస్' బుడ్లను కృష్ణాజీగారు తెమ్మని, 'పుల్లయ్యగారూ, కొంచెముసోడా తాగెదరా?' అని గట్టిగాఁజెప్పిరి. 'వచ్చుచున్నా' నని యాతఁడు కేకలువేసెను. పుల్లయ్యగారూ అను పిలుపు వినఁబడుటతోనే వేంకటరావుకూడ నక్కడకుఁ బోనెంచెను గాని, పిలువని పేరంటకము గావున లోనికిఁబోక, యేమి జరుగునోయని యక్కడనే నిలిచి చూచుచుండెను. రెండు సోడాబుడ్లనుగొట్టి మూఁడుగ్లాసులలో సరిదిరి. కృష్ణాజీ శ్రీనివాసులిద్దఱును చెరియొక గ్లాసు చేతఁబట్టుకొనిరి. 'పుల్లయ్యగారూ' అని మఱియొకసారి

కృష్ణాజీ పిలిచెను. ఆయన వచ్చెను. 'ఇదిగో సోడా తీసికొనుఁడు అని మిగిలిన గ్లాసునుజూపిరి. అతడందుకొనెను. ముగ్గురును త్రాగిరి. పుల్లయ్య కుర్చీకిఁ జేరఁబడెను. కన్నులు నులుముకొనెను. 'ఏమి అప్పుడే నిద్రా?' అని శ్రీనివాసుఁడనెను. 'ఏమోగాని అప్పుడె నిద్ర వచ్చుచున్నది.' అని పుల్లయ్య యనెను. 'పోనిందు భయములేదు. పరుపు వేయించెదను.' అని చెప్పి కృష్ణాపరుపొకటి నేలపై వేయించెను. పుల్లయ్య పండుకొనెను. శ్రీనివాసుఁడు వానియొద్దకుఁబోయి యొడలిపై జేయివైచెను. తెలివిలేదు. వానివాచీ గంటన్నర వెనుకకుఁ ద్రిప్పెను. గదిలోని క్లాకును కృష్ణాజీ గంటన్నర వెనుకకుఁ ద్రిప్పెను. 'బాగుగా నిద్రపోవుచున్నాఁడు. రెండుగంటలకుఁగాని లేవడు. ఇంతలో మనము తిరిగి రాఁగలము. వాఁడులేచి వాచీ చూచుకొనుసరికి అరగంటసేపు మాత్రము నిద్రపోయినట్లు కనుపడును. అనుమానమునకు వీలుండదు. మన పని పూర్తియగును.' అని కృష్ణాజీ శ్రీనివాసులు చల్లచల్లఁగా జారిపోయిరి. వేంకటరావిది యంతయును గనిపెట్టుచుండెను. అంత శీఘ్రముగా పుల్లయ్య నిద్రపోవుట యాతని కాశ్చర్యమయ్యెను. వానియొద్దకుఁ బోయెను. తెలివిలేదు. బల్లపైనున్న గ్లాసులను వాసనచూచెను. పెద్దవైద్యుఁడు గావున, నొకగ్లాసులో విశేషమొకటి యున్నట్లు గ్రహించెను. అందు నిద్రయందు కలిపినట్లనుమానించెను అపాయము కలుగదుగాని, ఆ దుర్మార్గులు తమపని సాధించుకొనుటకు వ్యవధి గలిగియుండును. జాగుచేయుటకు వీలులేదు. వెంటనే తెలివితెప్పించుట కుపాయము కనిపెట్టవలెను. ఒక్కనిముస మాలోచించెను. ఏదో యుపాయము తోచినట్లయ్యెను. వెంటనే వెనుక పెరటిలోనికిఁ బరుగెత్తెను. అచ్చన్నాయని పిలచెను. అచ్చన్న వచ్చెను. 'అచ్చన్నా, వ్యవధిలేదు. మిక్కిలి జరూరు. చేయుచున్నపని నేదైననుసరే,

విడిచివేయుము. శంకరశాస్త్రిగారి హత్యతో సంబంధించిన మరియొక ద్రోహమేదో కృష్ణాజీయును, శ్రీనివాసుఁడును జేయుటకుఁ బోవుచున్నారు. పుల్లయ్యగారికి మత్తుమందిచ్చిరి. వారు మరల శీఘ్రముగానే తిరిగివత్తురు. కావున జల్దుకొనవలెను. నీవుపోయి వారి నెట్లయిన కొంచెముసేపాపవలెను. ఈలోపున పుల్లయ్యగారికి తెలివి తెప్పింతును.' అని వానితోఁ జెప్పెను.

'ఫరవాలేదు. పరుగెత్తిపోయి త్రోవలో వారినిగలసి పోలీసు స్టేషనుకు తీసికొనిపోయి, బాతాఖానీలోఁబెట్టి గంటసేపు వారినాపె దను. ఈలోపున మీరు పుల్లయ్యగారికి తెలివితెప్పించి చేయవలసిన పనిచేయుఁడు.

'వేగముగా పరుగెత్తిపో-నీమాటపై నమ్మియుందును.'

'చిత్తము. ఫరవాలేదు కాని, తరువాతకూడ వారివెనుక నన్ను వెళ్ళుమని సెలవా?'

'అక్కఱలేదు. ఈలోపున పుల్లయ్యగారికి తెలివి వచ్చును. తరువాతపని మేము చూతము.'

'చిత్తము. సెలవు'

(అచ్చన్న పరుగెత్తిపోయెను.)

పుల్లయ్య పరుపుమీద నిద్రపోవుచుండెను. మరియొకసారి వేంకటరావాతనిఁ బరీక్షించెను. నిద్రమందు సామాన్యపుదేయైనట్లు తోఁచి, నవ్వెను. పేకాట గదిలోనికిఁబోయి రెండునిముసములు నిల చెను. ఇంతలో సూర్యారావేకారణముననో వెనుకదిరిగిచూచిన, రమ్మని చేతితో సైగచేసెను. ఆతఁడు వచ్చెను. పుల్లయ్యవద్ద కాని తనిఁదీసికొనిబోయి చూపెను. 'పుల్లయ్యగారు అప్పుడే నిద్రపోవుచు న్నారు?' అని సూర్యారావడిగెను. 'నిద్రకాదు-మందు దెచ్చి' వేంక టరావు జవాబిచ్చెను. 'నిద్రమందిచ్చి పుల్లయ్యగారిని పండుకొనబెట్టి,

ఆదుర్మార్గులిద్దఱు నెక్కడికోపోయినారు. ఆలస్యముచేయుటకు వీలు లేదు. వంటయింటిలోనికిఁ బరుగెత్తిపోయి ఆవాలు కొంచెము తీసి కొని రాఁగలవా?'' సూర్యారావు వంటయింటిలోనికిఁ బరుగెత్తి దోసెడు ఆవాలను దెచ్చెను. వేంకటరావొక రాతితో నేలపై వానిని నూరి, నీటిలోఁ గలిపివేసెను. 'సూర్యారావు, మెల్లగా పుల్లయ్యగారిని నిలువఁబెట్టి పైకీడ్చుకొనిరా. ఈడ్చుకొనివచ్చి, గట్టిగా వూపివేయుము. ఈండ్రగిలబడిన బలవంతముగ పట్టుకొని, రెండు చెంపకాయలు కొట్టుము. కొంచెము తెలివివచ్చును. అప్పుడు నేనీ మందు త్రాగించెదను. జాలిపడవద్దు.' గట్టిగాఁ దెబ్బలు తగులుటచేతను, చల్లనిగాని తగులుటచేతను, పుల్లయ్యకుఁ గొంచెము తెలివివచ్చెను. గాఢనిద్రనుండి యప్పుడే మేలుకొనినవానివలె యిటునటు దిగ్భ్రమ నొంది చూచుచుఁ బలవరించెను. దవడలు లాగి ఆవనీళ్ళు నోటిలో వేంకటరావు పోసి మింగించెను. ఒక్కపావుగంటలో నాతనికిఁ దెలివి వచ్చి యిటునటు చూచెను. బట్టతో వేంకటరావువిసరెను. బాగుగాఁ దెలివి వచ్చెను. ప్రశ్నలడుగ నారంభించెను. వేంకటరావంతయును చెప్పివేసెను. 'కుక్కలు నాకు మత్తిక్కించినారా? నేను కొంచమైన ననుకొనలేదు. నాకన్న మఱియొక ఆకు ఎక్కువ చదువుకొన్నారు. పోనీ వారుపోయి యెంతసేపైనది? మీరు జాగ్రత్తగాగుర్తించినారా? అని పుల్లయ్య యడిగెను. 'గుర్తించితిని. ఇక్కడ చెంతనే అచ్చన్న అనునమ్మకమైన పోలీసువాఁడు కనుపడినాడు, వారిని స్టేషనుకు దోడ్కొనిపోయి ఒక గంట ఆపెదనని చెప్పినాఁడు. వారుపోయి ఇరువది నిముసములైనది. నలువది నిముసములు మనకింకను వ్యవధి కలదు.'

'వేంకటరావూ, నీవు నేననుకొన్నదానికంటె నెక్కువజాగ్రత్తగానే పనిచేసినావు సంతోషముగాయున్నది. నీవును, సూర్యారావును నాకీసాయము చేయవలెను.' అని పుల్లయ్య యనెను.

'ఈరోజున ఘోరము జరుగునట్లు కన్పడుచున్నదా?' అని సూర్యారావు అడిగెను.' వారందఱును అందుకే పోయినారు. నాకు కడుపులో త్రిప్పుచున్నది. వంటయింటికిపోయి చింతపండు కొంచెము తీసికొనిరాఁగలరా?' అని పుల్లయ్య యడిగెను. సూర్యారావు పరుగెత్తిపోయి కొంచెము చింతపండు తెచ్చెను. అది తిని కొంచెము నీరు త్రాగి, పుల్లయ్య ధైర్యముగా నిలువఁబడెను. 'మీరిద్దఱు, పడుచువారు, బలముకలవారు నేను పోలీసుస్టేషనుకుఁబోయి వారెప్పుడుపోయిరో, యెక్కడికిపోయిరో తెలిసికొని, అచ్చన్నచేతనే మీకుఁ గబురంపెదను. పరుగుపరుగున నేను రమ్మన్నచోటికి మీరు రావలెను. వీధిలోనే కనిపెట్టుకొని యుండుఁడు.' అనిచెప్పి పుల్లయ్య పరుగెత్తి పోయెను. 'ఏమి వచ్చినను రానిమ్మని వారిద్దఱును వీధిగుమ్మములో చప్పుడుచేయక కూర్చుండిరి. కొన్ని నిముసములలో పోలీసువాఁడొకఁడు పరుగెత్తుకొని వచ్చెను. చీటియొకటి తెచ్చియిచ్చెను. 'వారిద్దఱును ఇంకను పోలీసుస్టేషనులో మాటాడుచున్నారు. మీరిద్దఱును శంకరశాస్త్రిగారి యింటికిరండు. నేను మేడమీఁదనుందును మీఁదనుండి యెఱ్ఱని వెలుతురు వచ్చినయెడల నేనుందునని తెలిసికొనుఁడు. అప్పుడు లోనికిరండు. లేకున్న రాకుఁడు. పుల్లయ్యవ్రాయు' అదిచూచి వారిద్దఱును శంకరశాస్త్రిగారి యింటివైపు పరుగెత్త సాగిరి. పోలీసువాఁడు తనదారిని బోయెను.

---

## పదునైదవ ప్రకరణము

### దురాలోచన

'చిట్టచివరకుఁ గష్టపడి పనిచేయవలసిన తరుణము వచ్చినది. ఏమైననుసరే, ఈరాత్రి మనము వెనుదీయఁగూడదు.' అని వేంకట

రావని, సూర్యారావు వైపు చూచెను. సూర్యారావేమియో యా లోచించుచుండెను. 'ఏమి సూర్యారావూ, ఏమి యాలోచించుచున్నావు? రేపు నీపని యేమగునో దానినిగూర్చియేనా? నీ కేమియు నాపదరాకుండ గాపాడెదనని పుల్లయ్యగారు చెప్పినారు. ఆయన సర్వజ్ఞునివలెఁ గన్పడుచున్నాఁడు. నా కాయనయందుఁ జాల విశ్వాసము కలదు. కాని, యాయన యెవ్వరో కొంచెమైనఁ దెలియకయున్నది., బాతాఖానీచేయుటకది కాలముకాదు. ఇద్దఱును వడివడి పరుగెత్తిరి త్రోవలో వారెవ్వరితోను మాటాడలేదు. ఒకరిద్దఱు వేంకటరావును బలుకరించిరిగాని, యెవ్వరో రోగికి కఠినముగా నుండుటచేఁ బరుగెత్తుచున్నామని చెప్పుటతోడనే వారు తృప్తినొంది మారుమాటాడకపోయిరి. వారు తిన్నగా వేంకటరావుగారి యింటికిఁబోయి బట్టలనుమార్చి, కావలసినట్లు తోచిన కొన్నివస్తువులను బట్టుకొని, శంకరశాస్త్రిగారి యింటివైపుఁ బోయిరి. ఆకాశమున మబ్బుపట్టియుండుటచేఁ జీకటిగానుండెను. వీధిలోని వారందఱును నిద్రపోవుచుండిరి. కొంచెము చలిగా నుండుటచేతను, దోమల బాధకుఁ జడియుటచేతను, మురికికాలువల కంపు భరింపలేకయును, వీధిలో నెవ్వరును బండుకొనలేదు. ఎదుటయింటి గుమ్మము నొద్ద నిలుచుండి చూచుచుండిరి. ఇంతలో యెఱ్ఱని దొంగలాంతరు వెలుతెరు మేడమీఁద నుండి కనుపడెను. 'వేంకటరావూ పద. ముసలివాఁడప్పుడే వచ్చినాఁడు. రమ్మని సైగచేసినాఁడు. ఆహా! అతడెంత చురుకైనవాఁడు!' అని సూర్యారావు చెప్పి పదమని తొందరచేసెను. 'తలుపు వేసియుండెనేమో' యని వేంకటరావనెను. తలుపు వేసియుండలేదు. తలుపుత్రోసికొని వారిద్దఱును లోనికిఁబోయిరి. లోపున గాఢాంధకారముగానుండెను. నిశ్శబ్దముగా నుండెను. ఐదు నిముషములు కనిపెట్టుకొనియుండిరి. ఏమియును శబ్దములేదు. తొంద

రపడసాగెను. ఇంతలో మేడమీఁదనుండి యొక గొప్ప వెలుతురు క్రిందకుఁ గన్పడెను. 'సెబాస్' అని పుల్లయ్యగారి కంఠధ్వని వినఁబనది. 'మీరు వచ్చినసంగతి నిశ్చయము చేసికొనవలెనని జాగుచేసితిని. మంచిపనిచేసితిరి రండు ఈలాగురండు చప్పుడు చేయక రండు.,

ఆవెల్తురులో వారిద్దఱును మెట్లెక్కి మేడపైకిఁ బోయిరి. మరల నంతయును జీకటియయ్యెను. మీరు నాకుఁ గావలసినంతయవకాశమిచ్చిరి. వారి నాపోలీసుస్టేషనులో వుంచివేయుట మంచి తెలివిగలపని నాకుఁ గావలసిన వస్తువులన్నియును సిద్ధము చేసికొంటిని.' అని పుల్లయ్యగా రనిరి.

ఇప్పుడు మనముచేయవలసిన పనియేమి?' అని వేంకటరావడిగెను. 'చెప్పలేను. వారుయేమిచేయుదురో దానిని బట్టి యుండును. ఒకవేళ మనపనియంతయు నీరోజునే పూర్తికావచ్చును. లేకున్న రేపుకూడా రావలసియుండును. మనము చేయవలసిన ముఖ్యమైన పని వారిద్రోహము నెట్లయినను బయలు పెట్టుటయే.' అని పుల్లయ్యగారు చెప్పిరి. ఊఁపిరి బిగబట్టి మెల్ల మెల్లగా పుల్లయ్యమాటాడుచుండెను. ఇంతలోనేమో చప్పుడు వినఁబడెను. అందరు నూపిరిబిగఁబట్టి చెవులు టిక్కబొడిచి వినుచుండిరి. క్రింద నెక్కడనో యెవ్వరో కదలుచుండిరి. పాదములు కదలిన చప్పుడైనది. తాళమున్నట్లున్నది. గొనుగుచున్నట్లు వినబడుచున్నది. 'వారు వచ్చుచున్నారు. అనుకొనినట్లే వచ్చుచున్నారు. వారు వీధినుండి రాలేదు. చూడుఁడు పెరటి తలుపు మారుతాళముతో తీసి లోనికివచ్చినారు. అదిగో రెండుగొంతుకలు వినఁబడుచున్నవి.'

వారుక్రిందగదిలోనిఁ బోయిరి. మిక్కిలి ఘాటైనచుట్టలు కాల్చుచుండిరి. అది తెలితక్కువ పని వీధిలోనికిఁ గూడటు వ్యా

పించవచ్చును తమ్మెరుగను జాడలేదని వారు భావించిరి. ఇట్లు వారు తిరుగుచుండిరి. చీకటిలోఁ బ్రోవలోనున్న వస్తువులను తడవుచుండిరి. నల్లనిగుడ్డయొకటి తెచ్చి కిటికీ కడ్డముగా మేకులు వేసి కొట్టిరి. దీపము వెలిగించిరి. ఇంటిలోనివస్తువులన్నియు నప్పటివలెనే విరజల్లుకొనియుండెను. ఇటునటు నొకసారి చూచిరి వారి దృష్టి దేనిపైని బడలేదు. పై సేవు తలుపు తెరచిరి కాగితములకట్టతీసిరి అవియేమియును వారికక్కరకు రాలేదు. 'ఇక్కడ నేమియులేదు. ఈ కాగితములు తిరుగవేయుట వట్టి శ్రమ' అని శ్రీనివాసుఁ డనెను. 'అవును ఆ ముసలిఘటము ఈలాటి చిక్కులలో డక్కాతీరిన దొక్క. ఆలోపలి సేవులో మనకు కావలసినది దొరకవచ్చును. నేనువచ్చినప్పుడప్పుడు దానితాళము ఇక్కడనే చూచుచుంటిని.' అని కృష్ణాజీయనెను. 'అవును తెలియును. నీవ్యవహారమంతయును దొంగదస్తావేజులు వ్రాసి బదులు పుచ్చుకొనుటయేగదా. కొసకు వానికి దొంగతనము బోధపడినదికదా.' అని శ్రీనివాసుఁడనెను. 'నీవే చెప్పవలెను. ఆవిద్యలో నీవుమాత్రము తక్కువవాఁడవా? అయినను, మన దొంగతనము వానికెట్లు బోధపడియెనో నాకాశ్చర్యముగా నున్నది. ఆదొంగ దస్తావేజులే పాప మూతఁడెంతో జాగ్రత్తగా దాచుకొనుచు రోజును జూచుకొనుచుండువాఁడు. నేను వానికి ఆశ పెట్టిన ఆకెంపుల గనుల నిజముగా దొరికియుండినయెడల వాని యప్పు తీర్చియుందును.' ఏదియో యయినది. నీదొంగతన మాతనికిఁ దెలిసిపోయినది. నీకు రత్నాల గనులు లేవనుసంగతి యీతనికి బోధపడినది. నీకు వారము రోజులువాయిదా యిచ్చినాఁడు. నీకొంప మునిగిపోవును. ఈలోపున ఆముసలివానిని జంపి నీమానము కాపాడిన నీ స్నేహితునులకు నీవు కృతజ్ఞుఁడవుగా నుండవలెను.' 'పుల్లయ్య వేంకటరావు భుజముమీఁద తట్టెను. ఆగ్రహా[illegible] కార

ణమున వచ్చియుండిరో వేరుగాఁ జెప్పవలసిన యవసరము లేకుండెను. దొంగతనముగ లోనఁ బ్రవేశించి తమ కపాయమును ముందు కలుగఁజేయుపదార్థముల నన్నిటిని నశింపఁజేయవలెనని వారు వచ్చినట్లు స్పష్టమైనది.

'ఇప్పుడు మనము చేయవలసిన పని ఆలోపలిసేపు తెరచుటయే' అని కృష్ణాజీ యనెను. 'అది యెట్లు సాధ్యమో నాకుఁ దోఁచలేదు. నేను చెప్పినమాట నీవు విన్నావుకావు.' శ్రీనివాసుఁ డనెను. 'నేను తీసికొనివచ్చిన వానిచేత కావలసినపని చేయించి వానికీయవలసినది వానికిఁ బారవేసినచో మనపని మూఁడునిముసములలో నైపోయి. మన కాగితములు మనకుఁ జేరియుండును. వాఁడు ఆపని చేయకపోయినను, మనపేరు బయటకు రాకపోయియుండును. ఒకరు చెప్పినమాట నీవువినవు. నీకొంప ముంచుకొందువు' అని శ్రీనివాసుఁ డనెను.

'అవసరములేకుండ నెయొకనికి గుట్టియ్యకూడదు. వాఁడు జయించినను, వానికొంప మునిగిపోయినట్లు మన వెనుక ప్రక్కనే వాఁడెప్పుడును తిరుగుచుండును. నేను కావలసిన ఆయుధములను దెచ్చియున్నాను. నే నిదివరకు ఈవిద్య కొంత అభ్యాసము చేసియున్నాను' అని కృష్ణాజీ యనెను. అభ్యాసముతోఁబాటు ఇనుపచేతులు వుండవద్దా. ఆమెర గొల్లవాని లోపలికొక్కసారి తెచ్చిన యెడల మనపని సులభముగానై యుండును, అనిశ్రీనివాసుఁ డనెను 'ఎందుకూ—అక్కరలేదు.' అని కృష్ణాజీ యనెను.

'మూఁడువంతుల ముప్పాతిక వాఁడు రాక మనపని కాదు' అని శ్రీనివాసుఁ డనెను. 'పిలిచినపుడు వాఁడు వచ్చునా?' అని కృష్ణాజీ యడిగెను. 'తప్పక తేఁగలను వానిని తెచ్చి యీవీధికి ప్రక్కనేయుంచితిని. అక్కడకుఁబోయి వానికి వినఁబడునట్లుగా

మూఁడుమార్లు దగ్గినయెడల వాఁడు గ్రహించ వచ్చురు. ఒంటిగంట లోపున వానిఁ బిలువకపోయిన యెడల వాఁడు వెళ్ళిపోవును.' 'అని శ్రీనివాసుఁ డనెను. 'సరే మంచిపనిచేసితివి. 'ఒంటిగంటకదా వాయిదా. ఇంకను జాల వ్యవధికలదు. నేను గొంచెము ప్రయత్నముచేసి చూసెదను' అని కృష్ణాజీ జేబులోనుండి యొక సంచిని పైకిఁదీసెను. అందు కన్నము వేయుటకుఁ దగిన యాయుధములు కొన్ని యుండెను. ఎన్నఁడును అభ్యాసము లేకపోవుటచే కృష్ణాజీకిఁ జేతులు వణకుచుండెను. 'కొంతవరకు ప్రయత్నముచేసి చూచెదను. ఎక్కడ యారంభించుటయో తెలియకున్నది. ఏఆయుధముముందు వుపయోగింపవలయునో, శ్రీనివాసాకొంచె ముపాయము చెప్పఁ గలవా?'

'గురువుగారూ, మీకన్నఁ దక్కువతిన్న ముండకొడుకు లెవ్వ రండీ' అన్నట్లు అజ్ఞానమున నీకన్న నేను దక్కువవాడ ననుకొన్నావా? నీకుసాధ్యమైన ప్రయత్నము చేయుము. సాధింప గలిగిన యెడల సరే. లేకున్న నేను చెప్పినట్లే వాఁడువచ్చి మూఁడునిము షాలలో ముక్కలు చేయును. ఇంతలో నేనొక చుట్ట కాల్చు చుండెదను.

మేఁడమీఁదనున్న ముగ్గురును మిక్కిలి జాగ్రత్తతోఁగని పెట్టుచుండిరి. కొంచెము చప్పుడు క్రిందవారే చేయుచుండిరి గనుక మీఁదివారు మెల్లగా మాటాడుటకు వీలుకలిగెను.

'కమలపక్షమున బలమైన సాక్ష్యము మఱియొకటి నాకుఁ గనుపడుచున్నది. ఆమె పోవునప్పటికి సేపు అంతయును తెఱచి యుండెనని చెప్పినది. ఏఏకాగితములు పైనుండెనాఆమె పోల్చఁగలుగు నని నేననుకొనెదను. ఇప్పుడు లోపలిసేపు మూయఁబడియున్నది. ఆమెయే నేరముచేయఁగలిగినయెడల లోపలిసేపు ఎవరు వేసిరి?' అని వేంకటరావనెను.

'పోలీసువారు వేసియుండగూడదా?' పుల్లయ్య చెప్పెను. 'లేదు.' వెంకటరావు మరల చెప్పెను. 'వారికి తాళములు దొరక లేదు. వాస్తవమున తాళములిప్పటికిని దొరకనేలేదు. ఇన్స్పెక్టరు గారు నాతోఁ జెప్పిరి. సేపులో మరయేమైన నుండునేమోయని వారు కొంతవరకు తంటాలుపడిరి. కాని, అదియునుసాధ్యము కాలేదు చెన్నపట్టణమునకు వ్రాసి స్పెషలిస్టును ఎవ్వనినైనను దెప్పించవలె నని వారుద్దేశించిరి.'

'నీవు చెప్పినది కొంతవరకు బాగుగానేయున్నది.' పుల్లయ్య చెప్పెను. నీయుద్దేశమున కమల వెళ్ళిపోయినతరువాత కొంతసేపు దాక శంకరశాస్త్రిగారు తిరుగుచుండిరనికదా? అనఁగా, తాళము వేసి యెవ్వరికిని దెలియనిచోట తాళములు దాచిరని. సరేకాని, ఈవెధ వ . . సేపు సమముగాతీయలేరు. దానిసంగతిసందర్భములు నాక తెలియును.'

'నేను మెల్లఁగాజారి పోలీసువారిని తీసికొనివచ్చిన బాగుగ ను . . .' అని సూర్యా . . వనెను.

' . . ద్దువద్దు. ఎప్పటికినివద్దు.' పుల్లయ్య చెప్పెను. నా యుద్దే శ . . . . ములు భగ్నములగును. వీరికి చెఱియొకయైదు సంవత్స ర . . . . నేయింపవచ్చునుగాని, అక్కడతో అదిఆగిపోవును. పెట్టె బ్ర . . లుకొట్టి సొమ్ము దోచుకొనిపోవుటకన్న వీరికడుపులో నెక్కువ ఘో . . రచింతకలదు. కొంచెము సేపు జాగ్రత్తగా కనిపెట్టినచో నది య . . తెయును బయలగును. అదిగో వినుము.'

'ఛీ ఛీ' కృష్ణాజీ యనెను. . ఒకగంటైనను పడలేదు. ఈ ఆ యుధములు తయారుచేసినవాఁడు తెలివితక్కువ వెధవ. ఇవి యెం దుకు బనికిరావు. శ్రీనివాసా, నీవుచూడు.'

'పాగాచుట్టలేక బుఱ్ఱ వంకరన్నాఁడట' శ్రీనివాసుడు చెప్పెను నీకుఁ జేతగాక కంసాలివానిని దిట్టెద వేమి?

ఈ ఆయుధములో నాకేమియును లోపము గనుపడదు.
అదియుపయోగించుట నీచేతగాదు.'

'అంతేగాదు' కృష్ణాజీయనెను. ఈ సేపు ఏదో కంత్రీలోహముతోఁ జేయఁబడినది నిజమైన ఇనుమైనను దెగక యుండునా?'

'బాగు! బాగు! దొంగలకనువైనట్లు మెత్తనిలోహముతో చేయుదురనుకొన్నావా? అదియెంతో జాగ్రత్తగా నుండవలెనని యో గట్టిలోహముతోఁ జేసిరి.' అని శ్రీనివాసుని, సేపు తడవిచూచెను. ఒక్కఅంగుళములో పదియవవంతైనను దెగలేదు. 'ఈలాంటి ఉడుత భక్తి లొంగవలసినదా ఇది? తాళముదగ్గిర కన్నములు పొడిచివేసి తివి ఇదియే నీవుచేసిన గొప్పపని రేపు ప్రొద్దున్న పోలీసువాఁడెవఁడైన జూచిన యెడల తాళము దొంగలెవరో అల్లరచేసిరని యనుకొనుట కా? ఒక్కసారి పోలీసువారది కనిపెట్టినచో రహస్యముగాఁ గావలి యుండి మనగుట్టు కనుగొందురు రేపు మరల రాలేము' అని గద్దించెను.

'కొంచెము ఆకుపచ్చరంగు ఉండెను—' అని కృష్ణాజీ గొణుగుకొనెను.

'ఆకుపచ్చరంగును కావలెనందువు, బంగారపు రేకును కావలెనందువు వ్యర్థముగ కాలయాపన చేయుచున్నాము. ఈపాటికి వాఁడైనయెడల రెండవకంటివానికి దెలియకుండ తీసి వేసియుండును.' శ్రీనివాసుఁడనెను. 'నీవు ఎఱ్ఱగొల్లవానికి భయపడినయెడల——'

నేను బ్రహ్మదేవునకైనను భయపడను. నేనే తీసివేయఁగలనని యనుకొన్నాను. రెండవకంటివానికిఁ దెలియఁగూడదని నా యుద్దేశము నాకుఁ జేతకాకపోయినది. పోనిమ్ము వానివలె పిలువుము అని కృష్ణాజీయనెను.

శ్రీనివాసుఁడు నోటిలోని చుట్టనుదీసి పారవైచెను. వీరిపనులనుకన్నములోనుండి కనిపెట్టుచున్న పుల్లయ్యయును సంతోషించెను.

'నాటకమున నొకయంకము ముగిసినది వాఁడుచుట్టకిటికీలోఁ బడవేసి నాఁడు అది కొంతసాక్ష్యము. ఈలాంటి స్వల్పసాక్ష్యములు వలననే అనేకులు జెయిలుకుఁ బోయినారు.'

---

## పదునారవ ప్రకరణము.

### దొంగపని.

శ్రీనివాసుఁడు సిద్ధముగానే యుండెను. జేబులో నుండి రెండు నల్లగుడ్డముక్కలను దీసెను. ఒకటి కృష్ణాజీకిచ్చి రెండవదితనయొద్ద నుంచెను. 'అదిమొగముమీఁదకప్పుకో. నేను ఈముక్కకప్పుకొందును ఎఱ్ఱగొల్లవాఁడు వచ్చునుగాని, ముసుగు వేసి యుండుటచేవాఁడు మనలను పోల్చలేఁడు. వాఁడు పనిచేయఁగలిగినయెడల రూపాయలు పుచ్చుకొని తనదారిని వాఁడుపోవును. ఈపని మొదటనే చేసినయెడల ఈపాటికి ఇంటికిఁ బోయియేయుందుము.' ఈ ఊఁకదంపుమాటలతో కాలక్షేపము చేయకుము. వేగముపోయి వానిని దీసికొనిరమ్ము. రెండవవాని గూడ జాగ్రత్తపెట్టినావా? అని కృష్ణాజీ కోపపడెను.

'వాఁడుగూడ సిద్ధముగానే యున్నాఁడు. భయములేదు. ఈ వీధికొసను కానాపైఁ బండుకొనియున్నాఁడు. వాఁడు పడ్డకష్టమునకు అర్థరూపాయి యిచ్చెదనని చెప్పితిని.' అని శ్రీనివాసుఁడనెను. వేగముపొమ్మని కృష్ణాజీ తొందరగాఁ జెప్పెను. శ్రీనివాసుఁడు పెరటిత్రోవను పోయెను. మేడమీఁదనున్న ముగ్గురును జాలసేపు కనిపెట్టుకొనియుండలేదు. పెరటిలో నొకదగ్గు వినఁబడెను. కృష్ణాజీ మొగముపైఁ నల్లగుడ్డ కప్పికొనెను. నల్లగుడ్డ ముసుగుతో శ్రీనివాసుఁడును వెనుకనొక యెఱ్ఱగొల్లఁడువాను వచ్చిరి.

'వీఁడెవ్వఁడో యనుకొన్నాను. అప్పుడప్పుడు నాకుఁ గనుపించుచుండును. ఈదగ్గరవాఁడే. వీని పేరుగూడ నాకుఁ దెలియును. కొంచెము ఆలోచించిన జ్ఞాపకమువచ్చును. వీఁడు ఎఱ్ఱగొల్లవాఁడని కొందఱనుకొందురు గాని, దండాసివాఁడు. ఎఱ్ఱగుంపులలోవాఁడు కాఁడు ఈదగ్గరనే ఏదో ఊరు వీడికాపురము. అవసరమైనప్పుడు వీనిని బట్టుకొనవచ్చును, అదిగో ఏదో మాటాడుచున్నాఁడు.' అని పుల్లయ్యయనెను. అందఱును వినుచుండిరి.

'మీ కేమికావలెను? సేఫు తీయవలెనా? మీరు ఈకుడిప్రక్క ఉండుడు. కన్నగానికి కుడిప్రక్క, వ్రాతవానికెడమప్రక్క నుండవలెనని యెఱుఁగరా?' అని కన్నగాఁడనెను.

వారిద్దఱు కుడిప్రక్క నిలచిరి కాని, నోట మాటాడలేదు. కంఠధ్వనినిబట్టి వాఁడు తమ్ముఁ బోల్చివేయునేమో యని వాని యుద్దేశము. కన్నఁగానికేమియును వింత కనుపడలేదు. కత్తినిపట్టుకొనుటలోనే వాని నేర్పంతయును గనుపడెను. 'డబ్బుమాట యేమి చెప్పెదరు?' అని యాతఁడడిగెను.

'ఇదిగో' అని శ్రీనివాసుఁడుచెప్పి, 'వ్యవహారము వ్యవహారమే మొగమాట ముండఁగూడదు. ఇదిగో నీకియ్యవలసిన యిరువది రూపాయలలో సగముసొమ్ము పదిరూపాయలు. రెండు ఐదురూపాయలనోట్లు మిగిలిన సగము నీపని పూర్తియైన వెంటనే ఇచ్చెదను. ఆరంభించుము' అని వానిని హెచ్చరిక చేసెను.

కన్నగాఁడు చిరునవ్వునవ్వి, నోట్లను జేబులోఁబెట్టి పనియారంభించెను. సేఫు గొప్పపనివాళ్ళచేఁ జేయఁబడియుండెను. కావున, కన్నగాడెంత నేర్పరియైనను, దానిని బ్రద్దలుచేయుట చాల కష్టమైన పనియై యుండెను. కాని, కొంచెము సేపటికి పటాల్ మన చప్పుడు వినఁబడెను. కన్నఁగాడు బుఱ్ఱపై కెత్తెను. చిఱునవ్వునవ్వెను. వాని

మొగమునిండ చెమటక్రమ్మి మెడలపై గారుచుండెను. 'ఎట్లో సాధించితిని. ఇదిచాల కష్టమైనపని. నేనెప్పుడు నింతగట్టిపని చూడలేదు. కాని, పడ్డకష్టమునకు తగినంత ఫలము లోనం గనంబడలేదు.' అని వాండనెను.

'ఏమియును లేదందువా?' అని కృష్ణాజీ మొరపెట్టెను. 'బొత్తిగా లేకపోలేదు. కొంచెమున్నది.' అనిచెప్పి, కన్నగాడు తోలుఅట్టగల చిన్న పుస్తకమొకటి పైకితీసెను. 'ఇదితప్ప మరి యేమియు నందులో లేగు.'

ఆపుస్తకము కృష్ణాజీ ఆత్రముతో అందుకొనెను. అతని చేతు లప్పుడు వణకుచుండెను. 'మోసపోయినాము. అనుకొన్నదానికన్న మఱియొకలాగైనది. పాపము నీవు పోయెదవేమో!'

'అవసరము దాటినపై నిలచునాచారము లేదు.' మావృత్తిలో గొప్పగొప్పవారు దానివలన మోసపోయినారు కన్నగాడనెను. నాబాకీ యిచ్చివేసినం బారిపోయెదను. శ్రీనివాసుడు మఱి రెండు ఐదురూపాయలనోట్లుతీసి వానిచేతిలోంబెట్టెను. కన్నగాడుపారిపోయెను. నల్లగుడ్డల సిద్దులును బారవైచిరి. 'వాండుమరి తిరిగిరాడు. ఇచ్చినకూలికి సంతోషించి పోయినాడు. సరిగా మనకుంగావలసినదే దొరికినది' అని శ్రీనివాసుం డనెను.

'అవును. ఇదేచిఠా.' కృష్ణాజీ అనెను. అతండాపాదముస్తకమును వడంకుచుండెను. నిలువలేకపోయెను. కూర్చుండబడెను. మొగము తెల్లబారియుండెను. గుండెలలో నొప్పిపుట్టెను. చేతితో గుండెలుపట్టుకొనెను. 'మరల మామ్మోలు జబ్బువచ్చినదా? శ్రీనివాసుండడిగెను. తలుపు తీయుదువా? గాలివచ్చును.'

'కాదు. కాదు. కొంచెముత్రాందీయున్నం గావలెను. ఈజబ్బుకు అదేమందు. మొదట ఎంతబలముగా నుండెడివాండనో ఇప్పు

డంత బలహీనమైపోవుచున్నాను. బ్రాందీ. బ్రాందీ. వేగము. వేగము.

శ్రీనివాసుఁడు జేబులోనుండి చిన్నసీసానుదీసెను. తనకొక వేళ నుద్రేకమువలన నీరసమైనప్పుడు పనికివచ్చునని కార్యభారము పై బోవునప్పు డెప్పుడును బ్రాందీ వెంటనే తీసికొనిపోవుచుండుట యాతనికభ్యాసము. చిన్నచిప్పలోఁ గొంచెము బ్రాందిపోసి కృష్ణాజీ కిచ్చెను. దానిని బలవంతమున మ్రింగిన కొంతసేపటికి వణకు నిలచి పోయెను. తోలుఅట్ట పుస్తకము చేతితోఁ బట్టుకొనెను. 'వానికిచ్చిన కూలి వ్యర్థముకాదు. ఈపుస్తకము సంపాదించుటకు నాప్రాణము లిచ్చివేయమన్న నిచ్చివేయవలసినదే.' కృష్ణాజీ యనెను. 'ఇది మనకు దొరికిపోయినతరువాత నెవ్వడును మనజోలికిరాలేడు. ఇఁక, శంకరశాస్త్రి లక్షరూపాయిల ఆస్తి ఎక్కడదాచెనో తెలిసిపోయిన యెడల—' ఆనందాతిశయముచేత కృష్ణాజీ గట్టిగా మాటాడ సాగెను.

'ఆగుమాగుము. జాగ్రత్త.' శ్రీనివాసుఁడు కసరెను. 'మతి పోయిందా? మరల జబ్బువచ్చినచో బాధపడుట కష్టము. ఏల కేకలు వేసెదవు?'

కృష్ణాజ ఆనందాతిశయమున పుస్తకము నెత్తిపైఁ బెట్టుకొనెను. 'ఈవెధవ పుస్తకము అదేదోభాషలో వ్రాయఁబడినది. అది కోమటి భాషట. అది వ్రాసినవారికిఁగాని తక్కినవారికిఁ దెలియదు.'

'దానికోసము అప్పుడే ఒకనినిజాగ్రత్తచేసినానని చెప్పలేదా? ఒక యర్థరూపాయి యిచ్చినయెడల వాఁడు వచ్చును. తీసికొనివచ్చెదవా?' అని శ్రీనివాసుఁ డడిగెను.

'ఇక్కడికేల తీసికొనిరావలెను? నాయింటివద్దకే తీసికొనిరా కూడదా?' అని కృష్ణాజీ యనెను.

'అబ్బో—అక్కడికా, ఆపిచ్చిపుల్లయ్య యెవడో మీయిల్లు నాలుగుమూలలు రాత్రింబగళ్లు రేచుకుక్కలాగు పారాతిరుగుచుం డునుగదా, అక్కడికిఁ దీసికొనిపోయిన మనపరువుదక్కునా? వాఁడె వ్వఁడో నిజముగా దెలిసిన వేయిరూపాయిలు దక్షిణయిచ్చుకొందురు.' అని శ్రీనివాసుఁడు చెప్పెను.

'అవును నిజమే. నేను న దేయనుకొనుచున్నాను. నీవన్నవానిని యిక్కడికి తీసికొనిరమ్ము. నేను కనిపెట్టుకొని యుందును.'

శ్రీనివాసుఁడు బయలుదేరెను. ఇంతలో మేడబల్ల సరంబీ చప్పుడయ్యెను. మేడపై నెవ్వరున్నారో యని వాఁడనుమానించి మెల్లమెక్కసాగెను. పైనున్న ముగ్వురును ప్రక్కనున్న గదిలోనికిఁ బోయి చప్పుడుచేయక కూర్చుండిరి. శ్రీనివాసుఁడు మేడగది నాలు గుమూలల వెదకి యెవ్వరినికానక 'అనుమానము పెనుభూతము కృష్ణాజివలె నీభయమువలన మతిపోవుచున్నదికాఁబోలు. అయిన నెందునకైన మంచిది' అనిచెప్పి గదిపైని గొళ్లెముపెట్టి మెట్లుదిగి మరల క్రిందగదికివచ్చెను. పుల్లయ్య ప్రాకుకొనుచు తలుపువరకువచ్చి తీయబోయెనుగాని యది రాలేదు. వానికిఁ గోపమువచ్చి కోపపడు నేమోయని తక్కినవారిద్దఱు ననుకొనిరిగాని, వాడు పళ్లుమాత్రమె కమూరు కొరికి యూరకుండెను.

'ఇది జరుగునని నేననుకొనలేదు. కావున దానికిఁ గావలసిన ప్రయత్నము చేయలేదు. ఇప్పటివరకును జాగ్రత్తగానే చేసినాము. కాని, అర్ధరూపాయి పుచ్చుకొని, అంత గొప్పపని చేయఁదలచిన మహానుభావుఁ డెవ్వఁడో వానిఁజూడవలెననియు యున్నది. కొంచెము నష్టమునకైన నొప్పుకొని చుట్టుప్రక్కల తనిఖీ చేయవలెను' అని పుల్లయ్య యనెను. లాంతరువెలిగించి చుట్టుప్రక్కల నొకమారు చూచెను. కిటికీకి అడ్డుగా వ్రేలుచున్న గుడ్డపై కిలాగెను. మీాలో

నెవ్వఁడైన నొకరు కిటికీలోనుండి క్రిందకు దిగవలెను. నేను ముసలి వాఁడనుకావున అంత సాహసము చేయలేను. విస్తారమెత్తుగాలేదు.'

'త్రాఁడెద్దియైననుండిన బాగుగ నుండునుగదా.' సూర్యా రావనెను. 'ఇందులోనేగదా శంకరశాస్త్రిని చంపివేసినారు. వానిని కట్టివేసిన త్రాళ్ళేమయ్యెను? పోలీసువారు తీసికొనిపోలేదే. వెదకిరి. త్రాడుచుట్టయొకటి దొరికెను. వేంకటరావు తన నడుమునకొక కొస కట్టుకొనెను.'

'వ్యవధిలేదు. నన్నుదింపుఁడు దిగెదను. శ్రీనివాసుఁడు తిరిగి వచ్చులోపుననే దింపవలెను. కృష్ణాజీ పుస్తకము తదేకధ్యానము తోనే చూచుచున్నాఁడు' ఒక్క నిముసములో వేంకటరావు త్రేలాడసాగెను. నేలకు దిగెను. పెంకునుతగిలి మోఁకులు చెక్కుకొని పోయెను. కాని విస్తారము బాధలేకుండెను. త్రాఁడు మరల మీఁదకు లాగబడెను. వీధిలోనుండి యతఁడు వీధి తలుపు తెరచెను. లోనికి వచ్చెను. కృష్ణాజీ పుస్తకధ్యానమున మునిఁగియుండెను. ఇటునటు చూడలేదు. మత్తెక్కినవానివలెనుండెను. మెల్లఁగా చప్పుడుచేయక మెట్లెక్కి మేడమీఁదకు వేంకటరావుపోయెను. మేడమీఁదిగదిగొళ్ళెము తీసి లోనికిబోయెను. ఇంతలో శ్రీనివాసుఁడుతిరిగి వచ్చెను. వానితో కాలీడ్చుకొనుచు నొక ముసలివాఁడుకూడ వచ్చెను. 'రా—లోపలికిరా' శ్రీనివాసుఁడనెను. వేగమురా. వ్యవధిలేదు. అర్థరూపాయి జ్ఞాపకముంచుకో. తలుపువేసిరా. అర్థరూపాయి యిచ్చెదననుమాట మరచిపోకు.' పైనున్న మువ్వురును యథాస్థానములను గూర్చుండి చూచుచుండిరి. ఇంతలో 'చచ్చితిని—చచ్చితిని' సాయముసాయము అను కేకలు వినఁబడెను. ఎవ్వరినో చంపివేయుచున్నట్లు కనుపడెను.

'వ్యవధిలేదు.' పుల్లయ్య చెప్పెను. మీరిద్దరును క్రిందకు బొండు. అవసరమైనచో నేనుగూడ వచ్చెదను. నేనురాకున్న మంచిది హత్యకన్న ఘోరమేగో జరుగుచున్నది.'

ఏడుపు మఱియొకమాఱు వినఁబడెను. వేంకటరావును, సూర్యారావును త్రాలకొట్టుకొనుచు మెట్లుదిగిపోసాగిరి. కాని వారు పోవుట కొంచె మాలస్యమయ్యెను. వారు వచ్చునపుడు వినఁబడెను. దీప మార్పివేయఁబడెను. ఇల్లంతయును జీకటి యయ్యెను. పరు గెత్తుచున్నవారిలో నొకనిఁ బట్టుకొనుటకు వేంకటరావును. మరి యొకనిఁ బట్టుకొనుటకు సూర్యారావును తడవు కొనసాగిరి. కొంత యల్లరయిన పిమ్మట తలుపుతీసికొని పారిపోయినట్లయ్యెను. వీధిలోని లాంతరు వెలుతురు ఇంటిలోనికి వచ్చెను. ఇంతలో పుల్లయ్యకూడ వచ్చెను. 'అనుకొనినట్లు పారిపోయినారు. మరల వీధితలుపు వేసి నాను భయములేదు. మరిరారు. దీపము వెలిగించిరండు. ఇదియేమి యిక్కడనున్నది?'

ఒకముసలివాఁడు తెలివితప్పి నేలపై పడియుండెను. వేంకట రావు వాని గుండెపై జేయివైచి చూచెను. మెల్లగా నీరసముగా కొట్టుకొనుచుండెను.

'దెబ్బ తగిలినట్లు కనపడదు. భయపడి పడిపోయినట్లు కను పడుచున్నది. ఏదీ దీపము అయ్యయో—విశ్వనాథశాస్త్రిగారు. పాపము వీని నెందుకు ఇక్కడకు లాగుకొనివచ్చినారు?' అని వేంకట రావరచెను.

---

## పదునేడవ ప్రకరణము

### తెల్లవారుజామున

కొన్ని నిముసములవరకు నెవ్వరును మాటాడలేదు. ముసలి వాఁడొకఁడు నేలనుపడియుండుటనుజూచి యాశ్చర్యముతో పుల్ల య్యను, వానిసహచరులును మౌనముద్ర వహించి యుండిరి. వాని

కేదియును గాయము తగులలేదని వైద్యుఁడగు వేంకటరావు స్పష్టముగాఁ జెప్పుచుండెను. రెక్కలు విరిచికట్టుట మొదలయిన చెడ్డపనులేవియును జేసినట్లు కనుపించదు. కాని, యాతఁడేల యంత గట్టిగా నఱచెను? 'మూర్ఛయేమైనను వచ్చెనా? వాడు చనిపోవునని తలఁచినచో—' అని పుల్లయ్య యడుగసాగెను. అట్టిదేమియును జరుగఁబోదు.' వేంకటరావు జవాబిచ్చెను. 'చాల కాలము నుండి తిండిలేకపోవుటచే నీరసముచేతఁ బడిపోయినట్లు కనుపించుచున్నది. దానికిఁ గావలసిన చిహ్నము లన్నియునున్నవి.'

'ఇప్పుడు కేకలు వేసినప్పు డాతని కేమియైన నపాయము జరుగ లేదని తలఁచెదవా?' లేదనియే నాయుద్దేశము. ఏదియో చూచి భయపడినట్లు తోఁచుచున్నది. కొంచెము బ్రాందియున్న యెడల ఇందాక శ్రీనివాసుఁడు బ్రాందీబుడ్డి యొకటి పట్టుకొనియుండెను. అది యేమయ్యెనో—ఇదిగో ఇక్కడనే యున్నది. నిజముగా నేవారు బ్రాఁదీబుడ్డి బల్లపైనుంచి వేసిపోయినారు. కొన్ని చుక్కలు దవడలులాగి నోటిలో వేంకటరావు పోసెను. వెంటనే కొంత యమలు జరిగెను. నేలఁబడియున్నవాఁడు కనులు తెరచెను. చుట్టు నొకసారి బుర్రత్రిప్పి చూచెను. చినిఁగిపోయిన గావంచా యొకటి కట్టుకొని యుండెను. అట్టిదే యొక లాల్చి తొడుగుకొనియుండెను. అట్టిదే మరియొక గావంచా ప్రక్కను బడియుండెను. తిండిలేకపోయినను, వృత్తిధర్మమును విడిచిపెట్టలేక దేవులాడుచుండు వైదికునివలె నాతఁడు కనుపడెను. వెర్రివెర్రిచూపులను చూచుచుండెనుగాని, కొంతవరకు చూచినది గుర్తించినట్లై కనుపడుచుండెను. శరీరము వడిలిపోయి, ముడతలుపడి వంగియుండెనుగాని, ఒకప్పుడు మిక్కిలి దృఢమై యుండెననియే సూచించుచుండెను. విశ్వనాథశాస్త్రిగారి వైపు పుల్లయ్య వంగి చూచుచుండెను. తెలివిదెచ్చుకొనండి—నా

వైపు చూడుడు.' పుల్లయ్య యెదుగసాచెను. 'నన్ను పోల్పఁగల రేమో చెప్పుడు. ఎప్పుడైన నన్నుమీరుచూచినట్లుజ్ఞాపకమున్నదా?

'లేద'ని విశ్వనాధశాస్త్రి బుర్రత్రిప్పు సంజ్ఞ చేసెను.

'లేదు—నిన్ను నేనెఱుఁగను. నిన్నెప్పుడును జూచినట్లు జ్ఞాపకములేదు' అతఁడు చెప్పెను. 'ఆమాటకేల సంతోషించు చున్నావు?' పుల్లయ్య త్రుళ్ళిపడి యొక్కయడుగు వెనుకకు వేసెను. నిజముగా ధనము యానందమునే సూచించు చుండెను గాని, విశ్వ నాధశాస్త్రి యదికనిపెట్టునని యీతఁడనుకొనలేదు.

'ఇతని మెదడు చెడిపోయినట్లున్నది.' పుల్లయ్య చెప్పెను. బహుశః ధననష్టమువలనఁ గాఁబోలు. వేంకటరావుగారూ, మీరు కొంచెము శ్రద్ధచేసినయెడల నీతనిజ్ఞాపకశక్తి తిరిగివచ్చునేమో 'అయ్యా, మీరెందుకు భయపడినారు?' ఈప్రశ్న వినుటతోనే విశ్వనాధశాస్త్రి వణక నారంభించెను. 'అదిగోఆభాష. ఆభాషనాకు వారు చూపినారు. నేను కొంత చదివితిని అంతయునుజదివియుందును గాని, భయము వేసినది. మాశంకరశాస్త్రియును నేనును కలిసి వ్యవహారము చూచుకొను చున్నప్పుడీభాషలోనే వ్రాసికొనుచుం డెడివారము. ఇదివరకంతయును మఱచిపోయియుంటినిగాని, అక స్మాత్తుగా జ్ఞాపకమువచ్చినది. నాధనము పోలేదని నాకుఁ బొడకట్టి నది. దానితోనాకు భయము వేసినది—కేకలు వేసితిని.'

'నేననుకొన్నదానికన్న భిన్నముగా నున్నది.' పుల్లయ్య చెప్పెను. 'ఒక్కొక్కనిముసము మతి తిరిగి వచ్చుట కూడఁగలదా? అయ్యా మీరు వచ్చినందుకు వారేమియిచ్చిరి?'

'ఒక యర్ధరూపాయి యిచ్చెదమని చెప్పిరి. ఇల్లు వాకిలిలేక బాధపడచున్నాను. అర్ధరూపాయియన్న నర్ధ నూటపదియారువలె నాకుఁ గన్పట్టెను. ఈభాష తర్జుమాచేసి చెప్పినఁజాలునన్నారు. కొన్ని

మాటలు తెలిసినవి. దానితో భయమువేసెను. ఏలభయము వేసినదని యడిగినచో నేఁజెప్పలేను. ఇంతలో నెవ్వరో పరుగెత్తు కొనివచ్చి దీపములార్పివేయఁ బడినవి. నన్ను తీసికొనివచ్చినవారు పారిపోయిరి నాకా యర్థరూపాయి దొరికినదికాదు. అది దొరికిన నిప్పుడు నాకది యెంతపనికివచ్చును?' అనివిశ్వనాథశాస్త్రి చెప్పెను.

'మీకర్థరూపాయి కావలసియుండెనా? సూర్యారావడిగెను. ఏమిచేయఁదలఁచియుండిరి?'

'నావద్దదమ్మిడీయైనను లేదుగనుక' అని యతఁడుజవాబు చెప్పెను. ఇప్పటి కాతనికంఠధ్వని యథాస్థితికి వచ్చెను. చూపులలో వెఱ్ఱితనముపోయెను. ఇప్పుడు జరుగుచున్న దంతయును సమముగానే తెలియుచున్నది. వెనుకసంగతి యాలోచించినప్పుడే నాకేమో భయమగుచుండును. అంతయును అంధకారబంధురమై కనుపడుచుం డును. నాకూతురు చిక్కులలోఁబడినదట. ఆశంకరంవెధవ యింటి లోనుండి యెప్పుడైన నాకూతురు జిగినీ దొంగిలించునా? ఊరిలోని వారందఱు నాలాఁగు చెప్పవలెనని యనుకొన్నారు. చెప్పినారు. ఆమెను వారింటిలోనుంచి తగిలివేసెదరు. దానిబ్రతుకే చూచుకొన లేదు. నాబ్రతుకేమగును? అది మంచిఆడపిల్ల— అంతమంచిపిల్ల మఱియెక్కడను లేదు. దానిగ్రహచారమును నాగ్రహచారమునట్లు పట్టుకొన్నవి. నేను తిన్నగా బ్రతికినరోజులలో నెప్పుడును దానిని తిట్టుకొట్టుచునే యుండెడి వాఁడను. మగడు చనిపోయిన ముండ ముసుగువేసి మూలఁగూర్చుండకుండ మరలఁ బెండ్లియేలయాడవలె నని దానిని తన్నుచుండెడివాఁడను. అప్పుడు ఎవడో వేంకటరావట వానిని బెండ్లియాడవలెనని యది తలచుచుండినను వానిని బెండ్లి యాడినచోఁ దలపగులవేసెదనని బెదరించుచుంటిని. పాపము ఇప్పుడా కష్టమంతయు శోకమూలద్రోసి, యొకరిపంచజేరియున్నట్లు నాకుగంజి

పోయుచున్నది. నాకు మగపిల్లలు లేకపోవుటచే, కులవిద్యగనుక రెండు కావ్యపుముక్కలు చెప్పితిని. అది యిప్పుడు పనికివచ్చినది. ఏవో పిట్టకథలు వ్రాసి నాకింత గంజిపోయుచున్నది ఇంటిఅద్దె బాకీపడిపోయినాను. ఇంటివాళ్ళు తరిమివేసినారు. ఉండుటకిల్లును, తినుటకు తిండియును లేక, వీధికానాపై పండుకొనవలసి వచ్చినది.'

విశ్వనాథశాస్త్రి చెప్పినదంతయును సత్యమై యమాయకమైనదై యుండెను 'ఆయింటివాఁడేల యంత దుర్మార్గుఁడు?' సూర్యారావరచెను 'మొదటివానిని జెయిలులోఁ బెట్టించవలెను.

'కాదు కాదు. వానివలన నేరములేదు. వాఁడేల నన్నింటిలో నుంచవలెను? డబ్బు సంపాదించువానికి దయయుండ గూడదు. నీవేయయినచో మాత్రమారీతిగాఁ జేయకుందువా? మనకొరకొకపై సాకీయున్నప్పుడు వారి ప్రాణములు పీల్చి పిప్పిచేసియైన నది సంపాదింపవలెను. అది వ్యవహారలక్షణము. నేను ధనమంతయు నట్లే సంపాదించితిని. దయాదాక్షిణ్యము లున్నవాఁడు ధనాకర్షణచేయలేఁడు' విశ్వనాథశాస్త్రి జవాబిచ్చెను. 'కాఠిన్యము మూర్ఖత్వము-దయారాహిత్యము' పుల్లయ్య యనెను. 'ఎప్పటియట్లే యున్నది. కొంచెమైనను తగ్గలేదు. తన విషయమైన నీబ్రాహ్మణునకు జాలిలేదు. కాని యీతని నిక్కడ నుంచివేయఁ గూడదు. పాపములేకమల చేసిన చిన్నపొరపాటు. ఈబ్రాహ్మణుని యాపదకుగూడ కారణమయ్యెను. ఈతనికెట్టియిన సాయముచేయవలెను.'

'తప్పక చేయవలెను. ఆపూచినాది.' వేంకటరావు చెప్పెను కమలకును, దానిమూలమున నితనికిని గలిగిన యాపదలకన్నిటికిని నేనే కారకుఁడను. కావున వారిద్దరి భారమును నాదే యైయున్నది పుల్లయ్యగారూ, మీకు మాయందరిపై నభిమానము కలదుకావున నేమి చేయఁదలచుకొన్నానో చెప్పెదను వినుడు.'

'నీవనుకొనుచున్నదానికన్న వీరి కుటుంబమునందు నాకెక్కువ యభిమానముకలదు. వీరికి నీవేమి యుపకారము చేసినను నాకు సంతోషమే.' అని పుల్లయ్య యనెను.

'విశ్వనాథశాస్త్రిగారిని నాబసకుఁ దీసికొనిపోవుదును. చనిపోవు వరకుగాని, లేక దృఢముగాఁ దిరుగఁ గలిగినంతవరకుగాని యితనిని నాయొద్దనే యుంచుకొందును. ఈతని రోగము కుదుర్చ వచ్చునని తోఁచుచున్నది. నేను సంపాదించినది స్వల్పమైనను ముగ్గురకుఁ జాలకపోదు.' అని వేంకటరావు చెప్పెను.

'మూడవవాఁ డెక్కడనుండి వచ్చెను?' పుల్లయ్య యడిగెను.

'నీవది గ్రహింతువని యెంచితిని.' వేంకటరావు చెప్పెను. 'కమల ఒకటి రెండు దినములలో నామె విడుదల చేయబడును. ఆమెనిర్దోషి యని రుజువు చేయఁబడును. ఆమెను కృష్ణస్వామిగారి యింటినుండి తరిమివేసిరి. నిలుచుటకు నీడలేదు. ఆమెను బెంగ్లి యూడెదను. నాయింటికి తీసికొనివచ్చెదను.' పుల్లయ్య శరీరము నీరువిడచెను. వేంకటరావు నొక్కసారి యాతఁడు కౌగలించెను. 'కమల యదృష్టవంతురాలు నీవు చేయదలఁచుకొన్న పని గొప్పది. నీవంటివారు కొందఱు బయలు దేరినచో దేశము బాగుపడయుండును. సభలును, ఉపన్యాసములును, కాన్ఫరెన్సులును, రిజల్యూషనులును జాస్తియగుచున్నవిగాని, నిజముగ నీవలె లోకోపకారము చేయఁదలఁచిన వాఁడెవ్వఁడు నీకాలమున లేఁడు. భగవంతుఁడు చిరకాలములోనే నీకు గొప్పలాభమును గలుగజేయును. నీవు లాభము కోరలేదు గాని, భగవంతుఁడిచ్చుటమాత్రము తప్పదు. ఇఁక నీసంగతి కట్టిపెట్టి ప్రకృతమునకు వత్తము. ఈరాత్రి మనము చేసినపని వ్యర్థముకాఁదు. ఆసంగతి ముందుముందు బోధపడును. నీవుచేయవలసిన పని నీవు పూర్తి చేయుము. నాపని నేను ముగించెదను. విశ్రాం

నాథశాస్త్రిని మీయింటికిఁ దీసికొనిపోయి తినుటకేదో యింత యిమ్ము నేను తిన్నఁగా కృష్ణాజీగారి యింటికిఁబోయెదను. కృష్ణాజీ గారింటికిఁ బోకుండనున్న యెడల, తలుపులు తీసియున్న యెడల, యథాస్థితిగాఁ బండుకొనిఁ యేమియు దెలియని వానివలె నటింతురు. నేను ఈరాత్రి చేసిన పని కృష్ణాజీకి కొంచెమైనను దెలియకూడదు.'

వేంకటరావు తలయూచెను. గొప్పసంగతి యేదో కనిపెట్టి నట్టు లాతనికిఁ బొడకట్టెను. ఒకటి రెండు నిముసములలో వారు దీపము లార్పివేసి, ఆయింటిని విడిచిపోయిరి. చుట్టుప్రక్కల నెవ్వరును లేరు. పుల్లయ్య కృష్ణాజీగారి యింటివైపు మరలెను.

'ఈతఁడెవ్వఁడో యద్భుతమైన మనుష్యునివలెఁ గన్పట్టుచున్నాఁడు.' సూర్యారావడిగెను. ఈతనికి మనయందేల యింత యభిమానమో తెలియదు. రేపు నాచిక్కునుండి నన్ను తప్పించెద ననుచున్నాఁడు ఇప్పటికా ప్రయత్నమేమియును జేసినట్లు కనుపడదు. నిట్లుచేయఁ దలఁచుకొన్నాఁడో!'

'దానిలోఁతు నాకును నందకున్నది.' వేంకటరావు జవాబు చెప్పెను.

'కాని యీాతనియందేదో యద్భుతమైన శక్తియున్నట్లు తోచుచున్నది. మాటయిచ్చిన తరువాత యెట్లయినను కార్యము సాధింపఁగలఁడని తోచుచున్నది.

'ఆకలి—ఆకలి—ప్రాణము పోవుచున్నది.' విశ్వనాథశాస్త్రి యరచెను. కొంచెమన్నము కావలెను.'

కొన్ని నిముసములలోనే యిచ్చెదనని వేంకటరావోదార్చెను. సెలవుదొరికినప్పుడు సంతోషించు స్కూలుపిల్లవానివలె విశ్వనాథ శాస్త్రి చంకలు గ్రుద్దుకొనెను. తరచుగా నీరసముగా కాలీడ్చు చునే నడచుచుండెనుగాని, యప్పుడప్పు డొక్కొక్కసారి బలము

తిరిగివచ్చి వడివడి వడచుచుండెను. అతని కెనుబదియేండ్ల వయస్సున్నట్లు కనుపట్టుచున్నను, ఏబది యరువదికన్న నెక్కువయుండదని వైద్యుఁడగు వేంకటరావను కొనెను.

త్రోవలోనున్న యొక దుకాణములోఁ గొన్ని యరటిపండ్లనుకొని వేంకటరావిచ్చెను. చంకలు గ్రుద్దుకొని ముసలి వాఁడొక్కొక యరటి యవి రెండుచేతులతోఁ దినివేసెను. 'నిద్రవచ్చుచున్నద' ని మరల కేకలు వేసెను. వేంకటరావు తనయింటికి వడివడి తీసికొనిపోయి, యొక గదిలో మంచముపైఁ బరుపువేసి, యాతనిఁ బరుండఁబెట్టెను. వెంటనే యీతనికి నిద్రపట్టిపోయెను. సూర్యారావును, వేంకటరావును గలిసి కొంతసేపు మాటాడుకొనిరి. 'నేను పోయెదను. నాకింటియొద్ద పనియున్నది.' సూర్యారావనెను. 'రేపు వుదయమే మరలఁ గలసికొనెదను. నీవునిద్రపొమ్ము' సూర్యారావు వెళ్ళిపోయెను. వేంకటరావునకు నిద్రపట్టలేదు. మనస్సులో నేవేవో యాలోచనలు పుట్టుచుండెను. ఉదయమాదిగ నప్పటివరకును జరిగిన సంగతులే మనస్సులో మరల తిరుగుచుండెను. యేమేమో యాలోచించుకొనుచుండెను. కొన్ని సిద్ధాంతములుచేసి కొనుచుండెను. కాదని మరల పూర్వపక్షములు చేసివేయుచుండెను. ఇంతలో నకస్మాత్తుగా క్రొత్తశబ్దమొకటి యాతని మనస్సు నాకర్షించెను. ప్రక్కగదిలో నేమో కదలుచున్నట్లుండెను. కిట్టనివాఁడెవ్వఁడైన విశ్వనాథశాస్త్రి యక్కడనుండెనని పోల్చుకొనునేమోయని వేంకటరావు ఉలికిపడిలేచి ద్వారమువద్దకుఁబోయి తొంగిచూచెను. ఆశ్చర్యకరమైన విషయమొకటి కనుపట్టెను. విశ్వనాథశాస్త్రి లేచి కూర్చుండి తెల్లనియట్టపుస్తకమును త్రిప్పుచుండెను.

'కలయేమో' ఆతఁడు సణగుకొనుచుండెను. 'ఎంతనిజమువలెఁ గన్పట్టును? అంతలోనే యంతయును మరచిపోయితిని. అయ్యయ్యో'

ఒక్కమారావులించి యాతఁడు మరలఁ బండుకొనెను. ఆతఁడు నిద్ర పోవుచుండెనో, మేలుకొనియుండెనో వేంకటరావు పోల్చుకొనలేక పోయెను. కాని యీతఁడు నిద్రపోవుచునేయుండెను. కాఁబట్టియే పుస్తకమాతని చేతిలో నుండి నేలకు జాఱిపడిపోయెను. ఆపుస్తకము చూడవలెనని వేంకటరావునకెంతో యుత్సాహము కలిగెను. ఆగది లోనికిబోయి పుస్తకమును మీఁదికెత్తెను. తీయుట తప్పేమోయని మొట్టమొదట యనుకొనెనుగాని, చూచినంతమాత్రమునఁ దప్పేమి యుండునని యనుకొని మరల నిశ్చయము చేసికొనెను. చూచుటకు దీపమువద్దకుఁ బోయెను.

ఆపుస్తకమున వరుసలకొలదిగ అంకెలునువాని కెదురుగ నేమేమో వ్రాతలును గలవు. కాని యాలిపిగాని, యావ్రాతగాని యెవ్వనికిఁ దెలియక బ్రహ్మవ్రాతవలె నుండెను. లక్షలకొలఁదిగఁ జేయఁబడుచున్న వ్యవహారమే యందుఁవలనో లేక మతిపోయిన వాఁడు వ్రాసిన కోఁతిబక్కురులే కలవో పోల్చుటకు వీలులేదు. ఎందుకైనను మంచిదని యీపుస్తకమును జాగ్రత్తపెట్టవలెననియు, పుల్లయ్యగారికి చూపవలెననియు నిశ్చయించుకొనెను.

పుస్తకము యథాప్రకారముగా ముసిలివాని ప్రక్కను బడవేసెను. ఇంతలో వీధితలుపు తట్టుచున్నట్లు వినఁబడెను. వేంకటరావు పరుగెత్తిపోయి తెరచెను. చిరునవ్వు నవ్వుచుఁ పుల్లయ్య లోనికిఁ బ్రవేశించెను.

'సాధించితిని.' ఆతఁడనెను 'వారుపోవుటకు ముందే నేనక్కడకుఁ బోయితిని కృష్ణాజీగారు నావద్దకు వచ్చు సరికి బరువుపైవారను కొనునట్లుగ నిద్రపోవునట్లుంటిని. నాకేమియును ననుమానము కలుగ నట్లే యాతనియొద్ద నటించితిని'

'ఏదోయొకపని నిర్వహించినవానివలె నాతఁడు గన్పఁడెనా యని వేంకటరావడిగెను,

'ముఖము శాంతముగాఁ గనుపడలేదు.' పుల్లయ్య మరల చెప్పెను లోననేదో గొప్పవిచారమున్నట్లు కన్పడెను అన్నట్టు రేపటి గురించి భయపడవద్దని సూర్యారావుతో చెప్పుము. శ్రీనివాసునఁ కొక యాపదవచ్చెను. వీధిలోనిద్దరును గలసి మాటాడుచుఁ బోవు చుండ నింతలో మోటారుబండి యొకటి త్రోసికొనుచు వచ్చి మీఁద బడి, త్రొక్కి వేసి పోయెననియు, ఆబండి యెవ్వరిదో పోల్చుకొనుటకు వీలులేకపోయెననియు కృష్ణాజీ చెప్పుచున్నాఁడు అది యబద్ధమే కాని, ఆతని ప్రక్క టెముక యొకటి బ్రద్దలయిపోయెననియు, కుడిచేయికి గాయముతగిలెననియు, నలుగురు ననుకొనుచున్నారు. అది యెట్లు జరిగినదో భగవంతునను తెలియును. కాని, శ్రీనివాసుడు మంచ మెక్కించఁబడియున్నాఁడు. కొన్నిరోజులు పోయినఁగాని దిగఁడు. 'ఒకవేళ చీకటిలో మనమును వారును గనబడుచున్నప్పుడు గాయ ములు తగిలియుండునేమో' అని వేంకటరావనెను.

'కావచ్చునుగాని, నేనేమియును జెప్పలేను.' పుల్లయ్యజవాబు చెప్పెను. నీకేమియును చెప్పలేను. మనకేమియును భయములేదు. అన్నట్లు—ముసలివాఁడేమి చేయుచున్నాఁడు' తెల్లనిపుస్తకమును వేంకటరావు తీసికొని వచ్చెను.

పుల్లయ్యతో నేమో చెప్పఁబోయెను. కాని యితఁడు జాగ్ర త్తగా వినుచున్నట్లు కనుపడలేదు. 'ఏదీ ఆపుస్తకము నాచేతికొక సారి యిచ్చెదవా? నేను పారవేయనులే—భయములేదు.' అని యాతఁడడిగెను.

'మీకన్న నాకాపు లెవరు? బ్రహ్మవ్రాతవలె కనుపడుచున్నది నాకేమియును బోధపడలేదు. చూడుఁడు.' అని వేంకటరావు పుస్తక మాతనికి కందిచ్చెను.

## పదునెనిమిదవ ప్రకరణము

### నిశ్చయము

తోలట్టపుస్తక మేమయ్యెనని విశ్వనాథశాస్త్రి వేంకటరావును మఱునాఁటి యుదయమున నడుగలేదు. ఆతనికిఁ నభ్యంజనము చేయించి, కట్టుకొనుటకు శుభ్రమైన బట్టలిచ్చి, మంచి భోజనము పెట్టించెను.

'సాధారణముగాఁ బగటిపూట మీరెట్లు గడపెదరు?' అని యాతని నడిగెను. 'పిల్లలచేత గాలిపటము లాడించుచుందును. నాకది చాల సరదా.' అని యాతఁడు సమాధానము చెప్పెను. సరేయని చెప్పి వేంకటరావు తనపనిపైఁ బోయెను. పదిగంటలకొకసారి కమలను జూడఁబోయెను. ఆమె 'నిర్బంధము'లో నున్నను, ఖైదీ కాదు. కావున వేంకటరా వామెతో రహస్యముగా మాటాడఁగలిగెను. ఇన్స్పెక్టరు గారు కేసు గడబిడలో నుండిరి. నాళ్లలో నొకఁడా సాయంతనమే యూరువిడిచి పోవలసియున్నందునను, క్రొత్తసంగతులు కొన్ని బయలుపడియున్నందునను, మొదటివాయిదా వేయఁబడియున్నందునను, విచారణ యాలోజన నే మఱికొంతవరకు జరిగింపవలెనని యాతఁడనుకొనెను. 'కమలమ్మకుఁ దెలియునుగాని, ఐనను, మీరుకూడఁ జెప్పుఁడు. క్రొత్తసాక్ష్య మైపోయినతరువాత యామెను విడుదల చేయుదుము. వాస్తవమున ఆమెను నిర్బంధమున నుంచుటయే యవసరములేదు. నేను పొరబాటుచేసితిని. మఱియొక యభిప్రాయమున నేనుండుటచే నట్లు చేయవలసివచ్చెను. కమలమ్మను నిర్బంధమున నుంచుటవలన నే నెవ్వరిపై సందేహము పడితినో వారికి మన శ్శాంతి కలుగఁగలదనియెంచి యట్లు చేసితిని. కాని నే ననుమానము గలిగినవారు నేరస్థులు కారనియే యిప్పుడు కనుపడినది. నేరము మాత్రము మునుపటికన్న తేలికగ కనుపడదయ్యెను.'

వేంకటరావు మఱియొకవిధమున ననుకొనెనుగాని, దాని గూర్చి మాటాడుట యాతనిపనికాదు. కమల యతిశీఘ్రముగ విడిచిపెట్టఁబడునని విని యాతఁడు సంతోషించెను. ఆతని ముఖమునఁ జిరునవ్వంకురించెను. ఇంతలోఁ గమల యాతనియొద్దకు వచ్చెను.

'వింతలేమి'యని యామె యడిగెను. కన్నులనుండి యొక్క-సారిగా వచ్చుచున్ననీళ్ళ నామె బలవంతముగ నాపివేసెను. ఒక్క-చిఱునవ్వు నవ్వెను. 'నానేరము తప్పినట్లున్నది. ఈ సాయంతనము నన్ను విడుదలచేసెదరని ఇన్స్పెక్టరుగారు చెప్పినారు.' ఆమె చెప్పసాగెను. 'కాని, విడుదలయైనతరువాత నే నెక్కడకుఁ బోవుటయో తెలియకున్నది. కృష్ణవేణిగారింటికి రావద్దనిరికదా.'

'వారింటికెన్నఁటికిని బోవద్దు. అక్కడ నుండుటకన్న యూరి బయట తోటలోఁ బండుకొనుటమేలు. కృష్ణవేణిచేసిన పని నీకుఁ దెలిసినయెడల నీవుమాఁడ నట్లే యనుకొందువు.' అని వేంకటరావు తన కథయంతయును జెప్పసాగెను.

కథ మిత్తమైనదేగాని, సంతోషకరమైనదిమాత్రము కాదు. ఎట్టిదియైనను చివరవఱకును బూర్తిగాఁ జెప్పఁబడినది. ఎంతయో యాత్రముగా కమల యాలకించుచుండెను. ముగియునప్పటికి నామె ప్రాణములు కుదుటఁబడినట్లు కనుపడెను 'నా తండ్రిని నీవింటికి దీసికొనివచ్చితివి. నాకు సంతోషముగానున్నది. రేయింబవళ్ళు వానిఁగూర్చియే నేను విచారించుచుంటిని. అద్దె యీయలేకుంటచే నింటివాఁడాతనిని దరిమివేయునని నేనప్పుడే యనుకొంటిని. కొద్దిరోజులు మాయింటిలో నీవాతని నుంచినయెడల...........'

'మీతండ్రి మాయింటిలోనే యుండును.' అతఁడు చెప్పెను. 'తప్పు మొదటినుండియును నాదిగదా, అది దిద్దుకొనవలసినభారము నాది కాదా? తప్పు నాదికాకపోయినను నే నాపని చేయుటయే విధియై

యున్నది. నీపై నాకు నిజమైన ప్రేమగలదేని, నేనాతని విడిచిపెట్టుట ధర్మము కాదు. నీ విక్కడనుండి విడుదలచేయఁబడినప్పుడు నీవు నా యింటికే రావలెను. గంజియో, కడుగో, మనం ముగ్గురమును గల సియే త్రాగుదుము అదితప్పనిపని. కమలా, నీవు నన్ను బెండ్లియాడ వలెను.' కమల కన్నులనుండి యొక్కసారిగా నీరుకారెను.

'నీకు నే నేల యగౌరవము తేవలెను ? ఆమె నిట్టూర్పుతో ననెను. 'నేను నిన్నుఁ బెండ్లియాడలేను.'

'ఆమాట నీవందువని నే ననుకొంటిని.' ఆతఁడు జవాబుచెప్పెను. నన్నుఁ బెండ్లియాడుటవలన నాకెంతమాత్రము నగౌరవము కలుగదు ఊరివారి యభిప్రాయములను నేను లక్ష్యపెట్టువాఁడను గాను. శంకరశాస్త్రిహత్య తుదమొదలు తెలియుటకు కొంతకాలము పట్టును. నెలయేయగునో, ఏఁడాదియగునో, పదియేండ్లగునో! ఈమధ్యకాలమున నీవెక్కడనుందువు? ఏమిచేయుదువు? ఎట్లుజీవింతువు? నీవు తిండిలేక, దిక్కులేక, మాడియుండుట నే జూడగలనా? నీవు చెంతలేకున్న, నే నొంటిగానున్నట్లే యుందును. మంచియిల్లొకటి యద్దెకుఁ బుచ్చుకొందును. జాగ్రత్తగా వెచ్చించినచో నాయాదాయము మనముమ్వురకును జాలును. నీతండ్రినిగూర్చి విచారింపవలసిన యవసరము నీకు మఱియుండదు. అది యిట్లు జరుగుటయే మేలని నీ వనుకొనవా? మఱియొకరీతిగా జరుగుట తగదని నీవాలోచింపవా?'

కమల యేమో మాటాడఁబోయెనుగాని. నోరు మూతవడియెను. దిక్కుమాలియున్న తనపై నాతఁడు చూపుచున్న నిర్హేతుకదాయమానకటాక్షమున నామెకు సంతోషము నాశ్చర్యము నొక్కసారియే కలుగసాగెను. 'నే చెప్పునది నీవు బుద్ధిగావిని యాలోచింపుము' ఆతఁడు మరల చెప్పెను. 'నీవీసాయంకాలము విడుదలచేయఁబడుదువు. సూర్యారావుతో నేను మాటాడెదను. ఆతనిభార్య మంచి

యుల్లాలు. ఒకటిరెండు వారములు వారియింటిలో నీవుండవచ్చును. ఇంతలో నేను కొంతసొమ్ము జాగ్రత్తపెట్టెదను. తగిన సమయము చూచి నేను నిన్ను పెండ్లియాడెదను.'

ఇంతలో ఇన్స్పెక్టరుగారు వచ్చిరి. వేళయైనదని చెప్పిరి. 'అపరాహ్ణ మెన్నిగంటలకు విచారణ ప్రారంభమగున'ని వేంకటరావడిగెను. 'మూడుగంటల' కని యాతఁడు చెప్పెను. కమల మాటాడుటకుముందే యాతఁడు వెళ్ళిపోయెను. కమల కొంచెము విచారించెనుగాని, నాఁ డామెహృదయమున నిదివరకెన్నఁడు నెఱుఁగని యొక వికాసముదయించెను. సంసారికకష్టములు కలుగవని చెప్పుటకువీలు లేదుగాని, భావిమాత్ర మానందసూచకముగా నున్నట్లు యామెకుదోఁచెను. ఆమె తదేకధ్యానమున మునుగుచుండెను. ఇంతలో ఇన్స్పెక్టరుగారు వచ్చిరి. కోర్టులోహాజరు కావలసినదని యామెతోఁ జెప్పిరి.

'ఇది కడసారియే. అమ్మా' అతడనెను. 'అమ్మా మఱి నీవు రానక్కఱలేదు. ఇప్పుడు మఱి చెప్పవలసినదికూడ లేదు.'

న్యూస్ పేపరు రిపోర్టరులు కూర్చుండువైపున దూరముగా కమలకొక బల్ల వేసిరి. ఆమె దానిపైఁ గూర్చుండెను. కోర్టుకు చాలా మంది వచ్చియుండలేదు. చాలామందికి ఫోటోగ్రాఫు తెలియలేదు. సూర్యారావు వచ్చియుండెను. ఆతనిఁజూచి యామెకు మఱికొంత నిబ్బరము కలిగెను.

సూర్యారావు లేచి నిలువఁబడి చెప్పెను. 'కమల పక్షమున నేను గొన్ని ప్రశ్నము లడుగవలసియున్నది. పోలీసువారి కేసులో క్రొత్తసాక్ష్యమేదో సంపాదించినారని విన్నాను.' అవునని మేజస్ట్రేటు గారు చెప్పిరి.

ఇన్స్పెక్టరుగారును మేజస్ట్రేటుగారును నేదో యేకాంతముగ మాటాడిరి.

డలాయితోఁకఁడు 'సొన్యాబెహారా' యని పిలచెను.

సాక్షిలావుగానుండి యుత్కళునివలె గన్పట్టెను.

'నాపేరు సొన్యాబెహారా' ఆతఁడు చెప్పెను. నేను శంకరాపురములో నుందును. నాకుఁ ద్రాళ్ళవ్యవహారముకలదు. నేను లావుగానుండు మొగలినార త్రాళ్ళనల్లెదను.'

'నీకిప్పుడు వ్యవహారము లేదుగదా.' అని ఇన్స్పెక్టరుగారడిగిరి

'చిత్తము లేదు నిన్ననే నావ్యవహారము ముగించివేసితిని. బరంపురములో వ్యవహారము నాకు కిట్టుబడిగా లేకపోయినది. కాబట్టి యిక్కడ బాకీలు సాకీలు తెరిపిచేసికొంటిని రంగంవెళ్ళిపోయెదను. అక్కడ మరి యేదైన వ్యవహారము చేసికొనెదను. నేనుపోవుటకు సిద్ధముగా నున్నాను. ఇంతలో ఈకేలు వచ్చినది.'

'ఇందులో నీకుదెలిసినసంగతి యేమి?' ఇన్స్పెక్టరుగారడిగిరి.

'త్రాడుసంగతి హత్యజరిగిననాఁటి రాత్రి నేను దుకాణము మీఁద కూర్చుండియుండగా నెవ్వఁడో త్రాడుకొరకువచ్చెను. లావుగా మెత్తగానున్న త్రాడు ఎనిమిది పదిమూళ్ళు కావలెనని యాతఁడడిగెను. నాయొద్దనున్న త్రాళ్ళు అన్నియునుజూపితినిగాని యవి వానికి బనికిరాలేదు. వాఁడు వెళ్ళిపోజూచెనుగాని, యింతలో నొక చుట్ట యాతనికిఁ గనుపడెను. అదికావలెనని కోరెను. అదినేను సాధారణముగా బరంపురములో అమ్ముచుండుట మామూలులేదు. పైచోట్ల కెగుమతి చేయుచుందును. ఆయొక్క కట్టమాత్రమెల్ల తక్కిన రకములలో గలసిపోయెను. అది కావలెనని యాతడు కోరెను. సరే యని పదిమూళ్ళముక్కకోసి యిచ్చితిని.

'కొన్నవానిని పోల్చగలవా?' అని మేజస్ట్రీటు వారడిగిరి.

'పోల్చలేను.' ఆతడుచెప్పెను. 'నాదుకాణము చిన్నది. చీకటిగానుండెను. రాత్రిపూట వచ్చినవాఁడు ముసుగు వేసికొని యుండెను నేను పోల్చలేను.'

'త్రాడు నీదగునో కాదో పోల్పఁగలవా?'

'తెండి' యని అందుకొని, రెండుమూర్లిటునటు త్రిప్పి చూచెను.

'ఇది నేనమ్మినదే. ఈమచ్చు త్రాళ్ళు నేను తప్ప మఱియెవ్వరును ఈగ్రామములోఁ జేయలేరు.'

'నిన్ను నేనొక ప్రశ్న మడిగెదను.' సూర్యారావనెను. 'నీవు త్రాళ్ళవ్యవహారము చేయుచున్నావు. త్రాళ్ళసంగతి బాగుగాఁ దెలియును. చంపివేయఁబడినవాఁడు ఈత్రాడుతో గట్టబడెనని విన్నావు. ఆడుపిల్ల యొకతె ఈత్రాడుతో అంత గట్టిముళ్ళు వేయఁగలదేమో నీవు చెప్పఁగలవా?' సాక్షి గట్టిగా నవ్వెను. అసందర్భపు ప్రశ్న యని యాతనికిఁ దోచెను 'ఎన్నటికిని గాదు. అసాధ్యము మీరే ప్రయత్నముచేయుఁడు. మీకు యింకను అనుమానమైనయెడల ఇన్స్పెక్టరు గారైనఁ బ్రయత్నము చేయవచ్చును.'

సూర్యారావు ప్రయత్నముచేసి చూచెను. ఆతనికిసాధ్యము కాలేదు. ఇన్స్పెక్టరుగారు ప్రయత్నముచేసిరి. శవమును కట్టివేసినంతట బలమైన ముళ్ళ నాతఁడుకూడ వేయలేకపోయెను.

'దీనినిఁబట్టి ముద్దాయి నేరము చేయలేదని స్పష్టమగుచున్నది. సూర్యారావనెను. 'హత్య యప్పటికప్పుడు బుద్ధిపుట్టి చేయఁబడినదికాదు. ముందుగా నాలోచించియే చేయఁబడినది. మిక్కిలి క్రూరమైనపనిగాఁ గనపడుచున్నది. మఱికొంత సాక్ష్యమునుగూర్చి భోగట్టాచేసెదను. నేను ఆదినమున జూపిన దినచర్య పుస్తకమును జూపవలెనని కోరుచున్నాను.'

వేంకటరావు ఇన్స్పెక్టరుగారి ముఖమువైపు జూచెను. దినచర్యనుగూర్చి యాతఁడు మఱచిపోయి యుండెను. ఇన్స్పెక్టరు

పుస్తకము తెచ్చెను. సూర్యారావువిప్పి, చివరపుటతీసి మేజస్ట్రేటు గారి కిచ్చెను.

'అయ్యా ఇది ఆయన దినచర్య' ఆతఁడు చెప్పెను. 'ప్రతి దినమున ఆయనచేసిన పనియంతయును జాగ్రత్తగా వ్రాయఁబడి నది. హత్యజరుగు దినమువరకును వ్రాయఁబడినది. ఆగంటలోఁ జేసినపనియంతయును వ్రాసెను. ఆతారీకుక్రింద వ్రాయవలసినదం తయును వ్రాసెను. కమలపేరు వ్రాయకపోయినను, తాను చెప్పుచు కొన్నియుత్తరములు వ్రాయించితినని యిందు వ్రాయఁబడినది. కమల వెళ్ళిపోయినతరువాత నిది వ్రాయఁబడినట్లు ఋజువు చేయుచున్నది కదా. ఆపేజి విడచి, తరువాతపేజీ తీయుఁడు. ఏమి కనుపించు చున్నది? మఱికొంతవ్రాత యున్నది. ఈ పన్నెండుగంటల తరువాత కూడ నాతఁడు జీవించియున్నట్లు దానివలనఁ గనుపడునుగదా. ఇదిగో చూడుడు. తారీకుమార్చి, మరుచటిదినముక్రింద మరల వ్రాసినాడు. 12 గంటలతరువాత వ్రాయకపోయిన నట్లులచేయును? ఇక్కడ నేమి వ్రాయఁబడియున్నదో చూడుఁడు.? 'శ్రీ— వచ్చెను. తనయుద్దేశము చెప్పెను.' ఈ 'శ్రీ—' యెవ్వఁడు మేజస్ట్రేటుగా రడిగిరి.

'ఎవ్వరైననేమి?' సూర్యారావు చెప్పెను. సందర్భముచూడుఁడు పన్నెండు గంటలతరువాత నెవ్వరో వచ్చిరనిగదా యది ఋజువు చేయును. ఆతఁడేదో యుద్దేశముకూడ చెప్పినట్లు కనపడునుగదా.' 'శ్రీ—వచ్చెను. తనయుద్దేశముచెప్పెను' మేజస్ట్రేటుగారు చదివిరి. 'ఆతఁడును కృష్ణాజీయును అడిగిన సంగతి నే నొప్పుకొనలేను.''

ఈవాక్యమును వినుచున్నంతసేపును సభ్యులందఱును చెవులు ఱిక్కించుకొని నిశ్శబ్దముగా నుండిరి.

## పందొమ్మిదవ ప్రకరణము

### గొప్పవింత

ఈ క్రొత్తసంగతి నూఁపిరిబిగబట్టి యందఱును వినుచుండిరి. అనుకొన్నదానికన్న భిన్నముగా జరిగినదని యందరును తలఁచిరి.

శంకరశాస్త్రులుగారి హత్యకు కమలయే కారణమని బ్రహ్మపురము వారందఱును నిశ్చయించిరిగాని 'ఆమెకురిదీయుదురోద్వీపాంతరవాసము విధింతురో యనుసంగతిలో మాత్రం భిన్నాభిప్రాయులై యుండిరి. ఇప్పుడామె నిర్దోషురాలని ఋజువైనది. కాని నేరము మాత్రము తుదమొద లేర్పాటుకాకయే యుండెను.

'ఈవ్రాతను దాము బరీక్షింపుఁడు.' సూర్యారావనెను. ఇది పన్నెండుగంటల తరువాత వ్రాయఁబడినది. శంకరశాస్త్రిగారు దినచర్య జాగ్రత్తగా వ్రాయుచుండిరి. పన్నెండుగంట లయినతరువాత పేజీత్రిప్పి తారీకు మార్చివేసెను. ఇంకొకసంగతి. ఈసిరా చూడుఁడు. మీఁదసిరాకన్న భిన్నముగా నున్నది. ఇది ఫౌంటెన్ పెన్‌లో పోయు సిరా. శంకరశాస్త్రిగారి సిరాబుడ్డి నేను తణిఖీచేసితిని. అందుసిరా లేదు. మఱియొక బుడ్డిలో ఫౌంటెన్ పెన్‌లో వేయుసిరా కావలసినంతయుండెను. ఆసిరాయే పరుపు దుప్పటిమీఁద చిన్న మచ్చలుకట్టి యుండెను. కాబట్టి మంచముమీఁద పండుకొని వ్రాసినదని పోల్చుకొనవచ్చును. అప్పుడే అతనివ్రాఁతకు భంగముకలిగి యుండవచ్చును. కావుననే కొసలక్షరములు గొలికిఁ వేయఁబడినవి. విషయము పూర్తి కాలేదు. 'త్రాఁడునుగుఱించి మీసిద్ధాంతమేమి సూర్యారావుగారూ?' అని మేజస్ట్రీటుగా రడిగిరి.

దానినిగూర్చి కోర్టువారు రికార్డుచేసిన సాక్ష్యమే చాలును. మఱియొక చిన్నసంగతి నేఁ జెప్పవలసియున్నది. అది స్వల్పసంగ

తియే గాని, ముందుకుచాల పనికివచ్చును. పోలీసువారి యనుజ్ఞపై పరుపంతయును జాగ్రత్తగా వెదకితిని. దానిపై—ఇదిగో, ఈచిన్న చర్మపుముక్క—దొరకినది. అదిఅర అంగుళముపొడవుకన్న ఎక్కువ లేదు. గోనుతగిలి చీల్చుకొనిపోయి పైకివచ్చినట్లు కనుపడుచున్నది. హత్యచేసినవాని చేయివెనుకప్రక్కనుండి చంపఁబడినవాఁడు చీల్చి వేసి యుండవచ్చును. నామాట సత్యమో, అసత్యమో నేఁ జెప్ప లేను. 'నాకు వైద్యములో విస్తారముగా జ్ఞానములేదు.' అని సూర్యారావనెను. నిజముగా నిది పైకిఁ జిన్నసంగతివలెఁ గన్పడినను, తక్కిన సాక్ష్యములకన్న బలమైన సాక్ష్యమగుటలో ననుమానము లేదు. ఆచిన్న చర్మపుముక్క మేజస్ట్రీటు గారియెదుట పెట్టఁబడెను. వేంకటరావక్కడనే కూర్చుండెను. వైద్యుఁడుకావున తాను జూడఁ గోరెను. అరచేతిలో దానినిఁబెట్టుకొని, చిన్న 'భూతఅద్దము'ను బట్టుకొని చూచెను. నాస్నేహితుఁడు చెప్పినది వాస్తవమే. 'ఇదిమనుష్యుని చర్మమగుటలో సందేహములేదు. కాని ఇది ఏభాగమునుండి చీల్చఁబడినదో చెప్పలేము.' సభ్యులందఱునత్యాశ్చర్యముతో వినుచుండిరి. 'ఇది చెడిపోకుండ దాచఁగలమా' యని మేజస్ట్రీటుగారడిగిరి. 'దాఁచవచ్చు' నని వేంకటరావు చెప్పెను. స్పిరిట్సులో ఉంచినయెడల నది చెడిపోదు. మేజస్ట్రీటుగారి యనుజ్ఞపై దాచిపెట్టెదమని పోలీసువారొప్పుకొనిరి. తరువాత కొంతసేపు నిశ్శబ్దముగా నుండెను.

ఈరోజున మఱివుచ్చారణచేయరని తలచెదను. సూర్యారావనెను. 'దినచర్యలో వ్రాయఁబడిన 'శ్రీ—' యెవ్వరో పోలీసువారు తెలిసికొనవలసియున్నది. అది తెలిసినతరువాత కేసు పూర్తికావచ్చును.' కేసు వాయిదా వేయించవలసినదని ఇన్స్పెక్టరుగారనిరి 'అట్లయినచో ఇప్పటిముద్దాయిని వెంటనే విడుదల చేయవలసి

నది' సూర్యారావడిగెను. 'శంకరశాస్త్రిగారి యింటినుండి కమల వెళ్ళిపోయినతరువాత కూడ కొంతసేపువరకు సంపూర్ణారోగ్యమైన స్థితిలో నుండెననియు, అట్టిబలమైన ముళ్ళు వేయుట స్త్రీలకు సాధ్యము కాదనియు, తిరుగులేని సాక్ష్యమువలన ఋజువయ్యెను. జిగినీబిళ్ళ హత్యకుముందే కమలయొద్ద నుండెననికూడ ఋజువయ్యెను. కావున ముద్దాయిపైని నేరము కనుపడలేదు. ఆమె విడుదలచేయఁబడవలెను' 'ఇన్స్పెక్టరుగారూ, మీరు చెప్పవలసినదేమైనఁ గలదా?' అని మేజస్ట్రీటుగారడిగిరి. 'విడుదలచేయుటకు నాకభ్యంతరములేదు. పోలీసువారు చేసినది పొరబాటు. మొదట నేరము కమలమ్మపైఁ గనుపడెను. కాని, యామెపక్షమున గనుపడుచున్న సాక్ష్యమును బట్టి యామెను విడిచివేయవచ్చును. ఆమెకు పోలీసువారన్యాయము చేసిరని యొప్పుకొనక తప్పదు.'

'నా యభిప్రాయముకూడ నంతే. కమలమ్మ విడువఁబడినది.' అని మేజస్ట్రీటుగారనిరి వేంకటరావును కమలయు నత్యానందభరితులైరి. రెండు దినములక్రిందట కమల యవస్థ నట్టేటిలోఁబడిన యోడవలెనుండెను. ముందుకు వెనుకకు నేమియును గనుపడకుండెను. పార్సీనాటకమునఁ దెఱమారినట్లు ఒక్కసారిగా నామెయవస్థ మారిపోయెను. సంతోషమును, ఉత్సాహము నామె హృదయమున నిండియుండెను. కాని, యామెకిల్లులేదు—వాకలిలేదు—ధనములేదు. ఎక్కడికిఁ బోవుటయో కూడఁ దెలియలేదు. ఆమె విడుదల చేయఁబడినవార్త వాయువేగ మనోవేగములతో నూరంతయు నల్లుకొనెను. ఆమెను చూడవలెనని జనులు గుంపుగుంపులుగావచ్చి కోర్టుముందు వీధిలోఁ గాచియుండిరి. ఆమెతో సానుభూతి నొందుటకు వచ్చిన వారిసంఖ్య తక్కువయేకాని, వింతచూచుటకువచ్చిన వారిసంఖ్య హెచ్చు. 'నేనేమి చేయఁగలను? ఎక్కడకుఁ బోగలను?' అని కమల వేంకటరావునడిగెను. 'నేను దిక్కుమాలిన దాననైతిని.'

'నేనుండఁగ నీవేల దిక్కుమాలవలెను?' వేంకటరావు చెప్పెను. 'ఇప్పుడు ప్రస్తుతము నాయింటికిరమ్ము. నీతండ్రిని జూడుము. అక్కడనుండి సూర్యారావింటికిఁ బోదము. ఆతని భార్య నీకుఁ గొన్నిదినములు సంరక్షణ చేసెదనని చెప్పినది. నీతండ్రి నీకొఱకుఁ గనిపెట్టుకొనియుండును. మొట్టమొదట యాతనిఁ జూడవలెను. పద పోదము.' వేంకటరావును కమలయునుబండియెక్కిపోయిరి. త్రోవలో నెట్లో యాపుకొనెను గాని, బసకుఁబోవుసరికొక్కసారి యామెకేడ్పు వచ్చెను. విశ్వనాథశాస్త్రిగారి కేమియును బోధపడలేదు. పాతబస కన్నక్రొత్తబసయనుకూలముగా నున్నదనియు' కడుపునిండభోజనము దొరకుచున్నదనియు, ఇద్దఱుకుఱ్ఱవాండ్రకు గాలిపటములు కట్టియిచ్చి యాడించుచున్నాననియు నాతఁడు చెప్పెను. రెండేండ్లక్రిందట నతికఠినుఁడుగానున్న యొకలతాధికారి నేఁడు చిన్న పిల్లవలె మారిపోవుట వింతలలోఁ గొప్పవింతయై కనుపట్టెను.

'ఆయనజోలి మనకెందుకు?' వేంకటరావనెను. 'ఆయనకేమియును దెలియదు. పాపము మనమును ధనమును గూడ నొక్కసారియే యాతని విడచి పారిపోయినవి.'

'హృదయేశ్వరా, నీనాతనిపై నెంత దయచూపుచున్నావు!' కమలయనెను. 'నీవుదగ్గరఁజేర్చుకున్న నాతనిబ్రతుకేమైయుండును? నేనాతని కెందుకును బనికిరాని యాఁడుదాననైతిని గదా. నేనుపుట్టక కుమారుడై పుట్టినచో నాతనికిఁ జేదోఁడును వాదోడునై యుండును గదా.' ఇప్పుడుమించినదేమి.' ఊరకవిచారించుచుండకుము. సూర్యారావు వారి భార్యయు నిప్పుడే యిక్కడకువత్తురు. నీతండ్రినిపోషించు భారమునాది. నేనెట్లైన నెలకు నూరురూపాయలు సంపాదింపగలను. రాజకీయోద్యోగమునఁ బ్రవేశించినచో నెక్కువరావచ్చును గాని, నాకది యిష్టములేదు. పసగత్తి పాలుద్రాగినకన్న నిలచి నీకుత్రాగు

టయో మేలు. నేనొంటి బ్రదుకుచున్నందున నాసొమ్మంతయును కాఫీహోటేలులకును, పట్టుకోటులకును, సోడాబుడ్లకును, పేకాటలకును ఖర్చయిపోవుచున్నది. సంసారమొకటియున్నచో నీఖర్చులన్నియును దగ్గిపోవును. విద్యావతియగు భార్యను బెండ్లియాడవలనని నేను చిన్నప్పటినుండియు నుద్దేశించితిని ఇప్పటి గర్ల్సుస్కూళ్ళ విద్య నేతిబీరకాయ వంటిది. మనపూర్వుల యాచారములలోఁ గొంత పవిత్రత్వముండెను. అవి పిచ్చియాచారములని విడువఁబడినవి. పురుషులకుఁ గావలసినవిద్య పాఠశాలలో నేర్పుచున్నారు. స్త్రీలకుగావలసిన విద్య నేర్ప లేదు. ఆపురుషవిద్యయైనఁ బూర్తిగా లేకపోవుటచేత ఉభయభ్రష్టత్వము ఉపరిసన్యాస మగుచున్నది ప్రాచీనాచారములు పోయినవి. నవీనాచారములు రాలేదు. స్త్రీలకుఁ బురాణవిద్యయును లేదు. స్త్రీవిద్యయును లేదు. మహాలక్ష్మిపూజయును నోములును వ్రతములును బోయినవి. సంగీతము సాహిత్యము, శిశుపోషణము, కుట్టుపని వంట మొదలైన వేవియును రాలేదు. మూఁడుపూటలఁ దిండితిని వీధియరుగులపై సాయంకాలమగువరకు బాతాఖానీ చేయుటతప్ప మన యాఁడువాండ్రకు మఱియొకపని చేతఁగాదు. మాకు హోమురూలు కావలెను, ప్రత్యేకరాష్ట్రముకావలెనని వ్యర్థమైన ప్రయత్నములు చేయుటకన్న, మొట్టమొదట తమ స్త్రీజాతినంతటిని బాగుచేసికొన్నచో నాంధ్రులున్నతస్థితికి రాఁగలరేమో. దానికేమిగాని, నీసంగతిచూడు, అన్నివిధముల గృహిణిగానుండుటకుఁ దగిన దానవు. నీకుఁ బూర్వకాలపువిధమున నీతండ్రి చదువుచెప్పినాఁడు. దానిని నవీనమార్గమున నీవభివృద్ధిచేసికొన్నావు. గృహనిర్వాహకత్వమంతయును నీకుఁ దెలియును కావున నన్నివిధముల నీవు నాకుఁ దగిన భార్యవు నన్నెవ్వరేమన్నను సరే. నిన్ను నేఁదప్పక పెండ్లియాడెదను నీతండ్రిరోగము బాగుచేయఁగలనను ధైర్యము నాకుఁగలదు. సిసహా

యమువలనను, నీతండ్రి సహాయమువలనను నేనొక గొప్ప సంసారిని కాఁగలను నమ్మకము నాకుఁగలదు.' 'నేను నీకవసరములేని భారమును కల్పించుచున్నానేమో?' కమలయనెను. 'జనులు నిన్నుఁజూచియేమందురు?' 'జనులను వారియిష్టమువచ్చినట్లనుకొననిమ్ము నాకేమి భయము? నాయవసరమువారే నాయొద్దకు వత్తురు.' అని యాతఁడు చెప్పెను. కమల ముఖ వికాసము నొందెను. ఆమె కన్నులకు క్రొత్తసౌందర్యము వచ్చెను.

'స్వర్గసౌఖ్యమన నింతకన్న వేఱుండునా? నేను నీచెట్టబట్టి బ్రహ్మానందమనుభవించ గలను. నేను బొడ్డునఁబొన్నపువ్వు పెట్టుకొని పుట్టినదానను కాను. కృష్ణాగారి యింటనున్నప్పుడు నాకెవ్వరు నడుగులకు మడుగులొత్తలేదు. మీఁదుమిక్కిలి నాతండ్రి తిండిలేక మలమలమాడుచుండెను. ఇప్పుడు నాకాచిక్కు లన్నియును వదలిపోయినవి భారమంతయును భుజములపయిఁబడినది.'

'నీసహాయము నాకుఁ జాలవరకుఁ గావలసియున్నది. నేను బద్ధకస్తుఁడను. ఇంటివ్యవహారమంతయును నీకొప్పజెప్పెదను నేను సంపాదించిన దేమున్నను నీమీఁదఁబడవయిచెదను. ఉన్నదియును లేనిదియును జూచుకొను చుండుము. ఈపనిపూర్తిగాజేసి కొన్నచో నీకు కావలసినంత పనికుదురును.' కమలకన్నులనుండి యొక్కసారి నీటి బిందువులు జలజలరాలెను. కొంగుతో వానిని దుడుచుకొనెను. వేంకటరావింత యుపకారము తన కొనర్చునని యామె యిదివర కనుకొనలేదు. ఆతఁడు చెప్పినదంతయును నిజమయియే యుండెను వారిద్దఱును గలసియున్నకుటుంబముకన్న స్వర్గ సౌఖ్యము సుఖతరముగా నుండఁబోదు. చెప్పినదంతయు నాతఁడు చేయునని యామె దృఢవిశ్వాసమునొందెను తన తండ్రికని యెంతో యుపకారకరముగ నుండెను.

'నేను చెప్పినదంతయు నీకిష్టమయ్యెనా?' అతఁడు మరలనడిగెను సూరమ్మగారి యింటికిఁబోయి మరలనాలోచించుకొమ్ము. నేను చెప్పినట్లుచేసినచో నీకును నాకును శ్రేయస్కరము' కమల మాటాడలేదు. గాని యామెచూపులు మఱింతకలకదేరెను మొత్తమునకు స్వలాభమును విడచినవాఁడు వేంకటరావే వేయినూటపదియారులిచ్చి యాతనికిఁ బిల్లనిచ్చెదరు కాని యాపని వానికిష్టము లేదు—ఏకారణమునవాఁడు కమలను బెండ్లాడఁదలఁచెనో యది పవిత్రమయిన కారణము అట్టికారణము మన యాంధ్రుల కందఱకును బోధపడినఁగాని దేశము బాగుపడదు. 'హృదయేశ్వరా, నాహృదయమున కప్పుడు నూతనోత్సవము కలిగినది. ఈరోజు గడచినదిగాని రేపేమగునో యనునంత దీనదశలో నిదివరకుంటిని. నాభావియంతయును విద్యుత్కాంతియో దివ్యముగ వెలుఁగుచున్నది. నీవుచెప్పినట్లు చేయక తప్పదని తోఁచినది సూరమ్మగారు వచ్చినచో నామెతోఁ గలిసివారియింటికిఁ బోయెదను. సమయము చూచి నన్ను నీవు పెండ్లియాడవచ్చును. భగవంతుఁడు ముందుకు నాకానందమే వ్రాసిపెట్టినాఁడు.'

వేంకటరావు మరేమియుననలేదు. కమలను బెండ్లియాడుట తప్ప రెండవకోరిక యాతనికిలేదు. ఎన్నియో యేండ్లనుండిదాని కొఱకు ప్రయత్నించుచుండెను. నేటికది నిశ్చయమయ్యెను. సూర్యారావును సూరమ్మయును వచ్చిరి. కమలయును సూరమ్మయునుగలసి పోయిరి. సూర్యారావు కూడఁబోయెను. పుల్లయ్యవచ్చెను.

'అబ్బాయీ, క్షేమముగా నున్నావా?'అని యడిగెను. 'కమలను బెండ్లియాడెదవా? అది మంచిపని యని నేననుకొనను.'

'నేనది మొదటి నుండియును జేయవలెనని యనుకొంటిని. చేయఁగలిగితిని. నయము కానీ నష్టముకానీ, నాకు బాధలేదు.'

'సరే, సంతోషమే, కాని నీవు చేయవలసినపని పూర్తి కాలేదు. మిక్కిలి చిక్కైనపని యొకటి చేయవలసియున్నది.'

---

ఇరువదియవ ప్రకరణము

అపూర్వముగా మాటాడెను

వేంకటరావున కేమో యాలోచన పుట్టెను. 'అయ్యా నీ వెవ్వఁడవు? ఈ కేసులో నేల యింతశ్రద్ధ తీసికొనుచున్నావు? నీపేరు పుల్లయ్యయగునా కాదా యని నేనెన్నోసారు లాశ్చర్యపడినాను.' 'సరే నీవు కాదన్నచోఁ గాదు.' ఆతఁడు చెప్పెను. 'నేనెవ్వఁడనని యడిగితివి. నీవేకాదు కృష్ణాజీమొదలగువా రనేకు లదే తెలిసికొనఁ గోరుచున్నారు. నీతో నేనతి రహస్యముగ మాటాడెదను. ఈసంగతులు రెండవకంటివానికిఁ దెలియకూడదు. ఇందొక గొప్ప ద్రోహము కలదు. అది దిద్దవలెను. ఆపని చేయగలవాఁడను నేనొక్కఁడనే విశ్వనాథశాస్త్రిగారి పయిగాని, శంకరశాస్త్రిగారి పయిగాని, నా కభిమానము కలదని నీవనుకొనవద్దు. నిన్ను నే నొకప్రశ్న యడిగెదను. జవాబు చెప్పుము. హత్యచేసినవాని చర్మముముక్క దొరికినదని నీవనుకొనుచున్నావు. శరీరములో ఏభాగమునుండి యాచర్మము చీల్చఁబడెనో చెప్పఁగలవా?' 'చెప్పఁగలను' వేంకటరావనెను. ప్రతి కేసులోను చెప్పలేను గాని ఇందుమాత్రము చెప్పగలను. 'నీవు దినచర్య పుస్తకము చూచినావుగదా. ఆ శ్రీ యెవ్వరో పోల్చినావా?' 'లేదు.'

దినచర్యలో శ్రీ—యును కృష్ణాజీయును గలిసిపోయినట్లు వ్రాయఁబడి యున్నది. కృష్ణాజీతో నీనడుమ కలసి తిరుగుచున్న శ్రీ యెవ్వడు? శ్రీనివాసుడు కాఁడా? వారిద్దఱును గలిసి తిరుగుచుండుట

యును, ద్రోహము చేయుటయును మనము కనిపెట్టలేదా? కృష్ణాజీ వ్యవహారము చితికిపోయినది. మనము చూచుచుండగా వారుచేసిన దొంగతనము బయలుపెట్టియుండినచో వారిపని యీసరికిఁ బూర్తియై యుండును. కాని నాకాయుద్దేశము లేదు. శ్రీనివాసుడును కృష్ణాజీయును గలసి హత్యచేసినారని ఋజువుచేయుటయే కాక నేడు చేయవలసినవి మఱికొన్ని పనులుకలవు.' 'అంతకన్న మఱియేమి కలదు?'

'ఉద్దేశము హత్యచేయుటలో వారి యుద్దేశమేమి? యను సంగతి' పుల్లయ్య యనెను. 'ఇట్టి నేరములలో ఉద్దేశము ఋజువు చేయుటయే కష్టము. వారిద్దఱి యుద్దేశమేమి? తోలట్ట చిరాపుస్తకము సంపాదించుటకు అది సంపాదింపవలెనని నేననుకొంటిని గాని, నాకసాధ్యమయినది కాదు. దానికొఱకు మఱియొక యస్త్రమును దాచియుంచితిని. అవసరమైనప్పుడు ప్రయోగించెదను. మొట్టమొదటి సారి కృష్ణాజీగారియింటికి నేబోయినప్పుడు నీవు నన్ను లోనికిఁదోడ్కొని పోయితివి. మేము కలిసికొని మాటాడిన తరువాత కృష్ణాజీని నీవు చూచితివా?' 'చూచితిని. కొంతతొందరపని యున్నది. కావున ఆటుముగింపుచేయవలెనని చెప్పెను.'

'నిశ్చయముగా నంతే. ఆతొందరపని నే నే ఊరిలోపనియున్నదనియు తెల్లవారువరకు రాననియు కృష్ణాజీ వెళ్ళిపోయెను. కాని రాత్రియంతయును. బయలనుండ లేదు. నాకొరకేదో తీసికొని రావలెనని యాతని యుద్దేశముకాని యది వానికి దొరకలేదు. వాని ముఖము నీకప్పుడెట్లు కనుపడెను ?

'వణకుచున్నట్లు కన్పడెను.' వేంకటరావనెను. 'భయముచే గుండెలుకొట్టుకొను చున్నట్లుండెను. మూర్ఛపడుటకుసిద్ధముగా నున్నట్లుండెను. నేనప్పుడాతనిఁ బరీక్షించితిని. ఆరుమాసములు విశ్రాంతి

తీసికొనవలెనని చెప్పితిని' 'ఇదియంతయును నాతో మాటాడి వారలు నీవద్దకు వచ్చినప్పుడేగదా' పుల్లయ్య యనెను. 'నేనుపిల్చుటకుముందు నీవీలక్షణములేమైనఁ గనుపెట్టితివా?' 'లేదు. ఏమియును గనుపడ లేదు.'

ఏమో తృప్తియైనట్లు పుల్లయ్య నవ్వెను. ఒక్కసారిగది యీమూలనుండి యామూలకుఁ దిరిగెను.

'కృష్ణాజీకది గొప్పహృదయశల్యమయ్యెను. ఈగ్రామములో ముసలిడాక్టరులకు బదులుగానప్పుడప్పుడు రోగులను జూచుట నీక భ్యాస మున్నదా— మాటకు అచ్యుతరావునాయుఁడుగారి తరపున-'

'అప్పుడప్పుడు పోవుచుందును. ముసలి డాక్టరులు పనిపై గ్రామాంతరములకుఁ బోవునప్పుడు రోగులనునాకొప్పఁజెప్పి పోవు చుందురు. అచ్యుతరావునాయుఁడుగారి తరపున తరచుగాఁ బోవు చుందును.'

సంతోషముగా నున్నది. శ్రీనివాసునకు అచ్చుతరావుగారు మందిచ్చుచున్నారు. ఆతడు కృష్ణాజీ యింటిలో మంచమెక్కించఁ బడియున్నాఁడు. నీవు శ్రీనివాసుని చూచుట మిక్కిలి యవసరమైన పని. అచ్చుతరావుగారు నేడో రేపో గ్రామాంతరమునకుఁ బోయిన యెడల, నీవు తప్పక యక్కడకుఁబోవలెను. అప్పుడు శ్రీనివాసుని కుడిచేయిమాత్రము తప్పక పరీక్షింపవలెను. ఇంతకన్న నెక్కువ చెప్పవలసినది యిప్పటికి లేదు. మిగిలిన సంగతులు తరువాత జెప్పె దను.'

పుల్లయ్య వెళ్ళిపోయెను. వేంకటరావాలోచించుకొనుచుం డెను. పుల్లయ్యసంగతి యేమియునుదెలియలేదు. ఎంతయో యమా యకమగు మాటాడుచున్నాఁడు. ఎన్నో క్రొత్తసంగతులను జెప్పు చున్నాఁడు. చెప్పినవానికన్న నెక్కువసంగతులు తెలిసినట్లు కనుపడు

చున్నాఁడు. తాను పుల్లయ్య చేతిలో కీలుబొమ్మయే యయ్యెనని తలంచుకొనెను. కాని, యాతనియొద్ద నద్భుతశక్తి గలదని విశ్వసించెను. విశ్వనాథశాస్త్రిగారువచ్చి ఆకలివేయుచున్నదని చెప్పిరి. అన్నము పెట్టించెను. తిని యాతఁడు నిశ్చింతగాఁ జిన్నపిల్లవలె నిద్రపోయెను. ఇంతలో నొక క్రొత్తవాఁడు లోపలికి ద్రోసికొనివచ్చెను. 'వేంకట రావూ, నాకొక యుపకారము చేయవలెను. ఇచ్ఛాపురమునుండి యొక టెలిగ్రాం వచ్చినది. తొందరపనియగుటచే నే బోకతప్పదు. రాత్రి యుండిపోవలసి వచ్చునేమో. ఈపట్టలో వ్రాయఁబడిన పేరు గల రోగుల నొకసారి యారోగ్యజూనఁ బరీక్షించెదదా?'

'అచ్చుతరావునాయుఁడుగారూ, తప్పక చూచెదను' అని వేంకటరావు చెప్పెను. నాయుఁడుగారు వెళ్ళిపోయిరి.

వేంకటరావు పట్టి యొకసారి మీఁదనుండి క్రిందకుఁజూచెను శ్రీనివాసుని పేరడుగున నుండెను. 'పుల్లయ్య చెప్పిన పని చేయుటకింత వేగము వీలయ్యెను.' అని యాతఁడాశ్చర్యపడుచుండఁ నింతలో పుల్లయ్యయే లోనికివచ్చెను.

'నాయుడుగారు వచ్చినారా? రోగులను జెప్పినారా? చిత్రముగ నున్నదికదా' పుల్లయ్య నవ్వుచుండెను.

'ఏల నవ్వుచున్నారు' అని వేంకటరావడిగెను.

'బాబూ, నేను బ్రతికనన్నిరోజులు నీవుకూడ బ్రతికి డబ్బులు తీరినతరువాత, ఇట్టిగమ్మత్తు లనేకములు చేయగలుగుదువు. నాయుడు గారిని గురించి భోగట్టా చేసితిని—ఇచ్ఛాపురములోనున్న యొక రోగివద్దనుండి యప్పుడప్పుడు టెలిగ్రాములు వచ్చుచుండుననివింటిని. బైసికిల్‌తో ఇచ్ఛాపురముపోయి, నాయుడుగారిపేర టెలిగ్రాము నేనే వేసితిని. రాత్రియిక్కడ నాతనినాపివేయవలెనని నాయంత్రము వేసితిని టెలిగ్రాము క్రింద నేనుసంతకము చేయలేదు. కాబట్టి నిజము బయలుపడినను నాకేమియును భయములేదు.'

'చిత్రమే కాని, ఇట్టి యబద్ధపుపని చేయవలసిన యవసరమేమివచ్చెను?'

'వేగమే నీకు బోధపడును. ముఖ్యముగా పోయి శ్రీనివాసుని బరీక్షింపుము. తరుణమువచ్చినది. ఎంత శీఘ్రముగాఁ జేసిన నంతమంచిది. కొంతదూరము వరకును గావలసినయెడల నీతోఁగలసి వచ్చెదను. ఆచర్మము ముక్క నీ జేబులో జాగ్రత్తగా దాచుము దాని యవసరము తప్పకవచ్చును.' ఇద్దఱునుకలిసిపోయిరి. కృష్ణాజీగారి యింటివీధి ద్వారమువద్ద పుల్లయ్య యాగిపోయెను. వేంకటరావు లోనికిఁ బోయెను. కృష్ణాజీగారింటిలో లేరు. కృష్ణవేణి లోన నేదియో చేయుచుండెను. త్రోసికొనిపోవుట కిష్టములేక, నడవలో కొంచెము సేపు నిలుచుండెను. లోపల నిద్దఱు దెబ్బలాడు చున్నట్లు వినబడెను.

'నాయిష్టము వచ్చినట్లుచేసెదను. నన్ను నీ వాటంక పెట్టవద్దు' అని యొక స్త్రీకంఠస్వరము వినబడెను.

'పైడీ. ఒక్క నిముసములో నిన్నింటిలోనుండి పంపివేయగలను. నీమాట నెవరును నమ్మరు' అని రెండవకంఠము వినఁబడెను. అది కృష్ణవేణిదని వేంకటరావు పోల్చెను. 'నమ్మరా? ఏలనమ్మరు? ఋజువుచేసినప్పుడు నమ్మకపోవుట కూడదా? ఇదిగో చూడుము. నీతండ్రియొద్దకుబో——'

'అది అబద్ధము. పట్టయబద్ధము. ఇట్టి యబద్ధములు కల్పింపకుము.'

'అవునవును అన్నియు నబద్ధములే కమలమ్మ జగిసి నీవెత్తుకొనిపోవుటయు నబద్ధమే. ఆమెను నిర్బంధములో నుంచుటయు నబద్ధమే. పాపము ఆమె దొడ్డయిల్లాలు కాఁబట్టి నీపరువు నిలిచినది—'

వాదులాడుచు నిద్దఱును అంగణములోనికి వచ్చునప్పటికి నడవలో గనిపెట్టుకొని యున్న వేంకటరావు వారికంటఁబడెను. ఆతఁడు

మొగము ముడుచుకొని యుండుటచే వారిసంభాషణ వినెనోలేదో వారు పోల్చుకొనలేకుండిరి. కృష్ణవేణిముఖము తెల్లఁబారి కలఁకఁ జెంది యుండెను. ఏమియును జరుగనట్లే పైడిహాలులోనికిఁ బోయెను.

'ఏమి యిట్లు దయచేసినారు?' కృష్ణవేణి యనెను. 'ఎన్నఁడు ననుకొనలేను. మరల దయవచ్చెనా?'

'దయకేమిగాని, దాసివాండ్రకు యింత చనువిచ్చెదరు?' అని వేంకటరావడిగెను.

'ఏమియునులేదు. దానికిఁ గొంచెము ప్రథమ కోపము. తరువాత కాళ్ళు పట్టుకొనును.'

'కంఠస్వరముచే వినిపడియుండునుగాని, యాతఁడేమియును బోల్చుకొనలేదని యామె యనుకొనెను. వేంకటరావు ప్రసంగమును మార్చివేసెను. ప్రస్తుతము అచ్యుతరావు నాయుఁడుగారి తరపున వచ్చినాను. వారు ఇచ్ఛాపురము పోయినారు. రాత్రి బహుశః తిరిగి రాలేమన్నారు. శ్రీనివాసరావు నొకసారి చూడమన్నారు.' 'ఆగదిలో నున్నారు మీకేమి యభ్యంతరము? పోయి చూడవచ్చును. మరల పోవునప్పు డొకసారి వత్తురా? కొంచెము మాటాడవలెను. ఇంకను నాపైని కోపమేనా?'

మారుమాటాడక వేంకటరావామె చూపిన గదిప్రక్కకు బోయెను. శ్రీనివాసుఁడు మంచముపై బండుకొని యుండెను. గాఢ నిద్రలో నున్నట్లుండెను. మంచము ప్రక్కనే లాంతరొకటి వెలుగు చుండెనుగాని, రోగికివెలుగు కనపడకుండ యడ్డపెట్టఁబడి యుండెను.

ఆవెల్తురులో వేంకటరావు శ్రీనివాసునిఁ బరీక్షించెను. అసాధారణమైన గాఢనుషుప్తిలో నాతఁడున్నట్లుండెను. 'నల్లమందు వేసికొనువానివలెఁ గన్పడుచున్నాడు. గొప్పగాయముతగిలిన వానివలె కనుపడడు. ఇక్కడ చేతికి కట్టున్నవి. విప్పిచూచెదను.' కుడిచేతిపై నున్న కట్టు విప్పెను—ఆహా—

కట్లు అనాయాసముగా విడిపోయెను అంటికొనలేదు. వేంకట రావులికిపడెను. కుడిచేతిని గాయములేదు. ఒక్క వేలికి మీఁదను మచ్చయొకటి యుండెను. దెబ్బతగిలి మానిపోయినట్లుండెను. జేబులో నున్న చర్మమును బైటకు తీసెను. మచ్చపై నుంచెను. మచ్చయును చర్మమును సరిపోయినవి. కట్లు మరలఁ గట్టివేసెను. క్రొత్తసంగతి బయలుపడినది.

'ఇది గొప్ప సాక్ష్యము, నాకు సాధ్యమైనయెడల' గదిలో నెవ్వరో గట్టిగా నూపిరి తీయుచుండిరి. ఆయూపిరి మంచముక్రింద నుండి వచ్చుచుండెను.!

---

## ఇరువదియొకటవ ప్రకరణము

### గుట్టు తెలిసికొనుటకు

రోగము పరీక్షించుచున్న వానివలె రోగిపైపు వంగిచూచుచు వేంకటరావు నిలిచియుండెనుగాని, 'ఏమి చేయవచ్చునని' మనస్సులో నాలోచించుకొనుచునేయుండెను. 'మంచముక్రిందఁ జొరఁబడి, యిక్కడ దాఁగియున్న వానిని బైకీడ్చి, తన్నుదునా' యని కొంతసే పాలోచించెను. దాగియున్న వాఁడు కృష్ణాజీకిగాని, శ్రీనివాసునకు గాని మిత్రుఁడు కాఁజాలఁడు. లేకున్న, మంచముక్రింద దాగియుం డుట యెట్లు తటస్థించును?' అని మరికొంతసేపాలోచించెను. కాని వేంకటరావు చాలసేపాలోచించుకొనవలసిన యవసరము లేక పోయెను. 'తలుపు వేసిరమ్ము' అని దాఁగియున్నవాఁడు కొంచెము గట్టిగాననెను. వేంకటరావు తలుపువేసి వచ్చెను. చిరునవ్వునవ్వుచు నమస్కారము చేయుచు నెవ్వఁడో యొకఁడందుండి బైటకు వచ్చెను

'అచ్చన్నా, నీవేనా? పోల్చుకొనలేకపోయితిని' వేంకటరావనెను. 'చిత్తము మొగట నేనుఁగూడఁ మిమ్ముఁబోల్చుకొన లేకపోయితిని. అచ్చుతరావు నాయుఁడుగారు వచ్చిరేమోయనుకొంటిని. కావున చప్పుడుచేయక దాగియుంటిని. 'నాయుఁడుగా రిచ్ఛాపురమునకుఁ బోయినారు. పోయిచూచిరమ్మని నాతోఁ జెప్పినారు. కాని, నీవేల యిక్కడకు వచ్చినావు?' అని వేంకటరావడిగెను.

'గుట్టు తెలిసికొనుటకు వచ్చితిని. పైడితో నేస్తముకట్టు చున్నానని మీకుఁ దెలియునుగదా. ఎఱ్ఱగొల్లవారి జట్టులోవాడనియు, నిక్కడ కన్నము వేయుటకుఁ బ్రయత్నించు చున్నాఁడనియు నామెతోఁ జెప్పితిని. ఎప్పుడు కావలసినప్పు డింటిలోనికి వచ్చుచుఁ బోవుచుండుటకు నాకది సాయముచేయు చుండును.' 'నీవేలవచ్చితివి కారణము సమముగాఁ జప్పవేమి?' అంతయును బూర్తిగాఁ జెప్పలేను. శంకరశాస్త్రిగారి హత్యనుగురించి మీకుఁ గొంత సమాచారము తెలియును. గదా. నేనుచేయుచున్న పనియంతయును దానికొరకే. నాకుఁ దెలిసిన సమాచారమంతయును గలిపి చెప్పుటకు నడుమ నడుమఁ గొన్ని యంశము లింకను తెలియలేదు. ఇప్పుడు నేను తెలిసికొనవలసినసంగతి శ్రీనివాసరావు జబ్బెంతవరకు సత్యము? అతనికి నిజముగా జబ్బుగానున్నదా, లేక జబ్బుగానున్నట్లు నటించుచున్నాఁడా? యనునది. నేనువచ్చుసరి కాతఁడు చచ్చినట్లు పడియుండెను.' అని అచ్చన్న చెప్పెను.

'అతని కేమియును జబ్బులేదు. అతని కుడిచేతికి గట్టిగకట్టు అబద్ధపు కట్టు. అక్కడ గాయములేనేలేదు. అది చిదికిపోయినది యనుకొనుచున్నాఁడు.'

'అయిన నాతఁడేల గొంగవలె పడియున్నాఁడు? త్రాగియున్నాఁడా. 'కొంచెము హెచ్చుతగ్గగాఁ ద్రాగియున్నట్టు ఈతని కేనో

గముకూడ నున్నట్లు కనుపడదు. ఇదివట్టి మోసము. నల్లమందు పెద్ద మోతాదు వేసియున్నాఁడు. వెదకినయెడల డబ్బీ కనుపడును.'

'సరే—గుట్టు తెలిసిపోయినది. జబ్బు మిషగాని సత్యము కాదని నేననుమానపడితిని.

చెన్న పట్టణములోనున్న యొక కంపెనీవానికి శ్రీనివాసుఁడు సొమ్ము బాకీయట. వాని యేజంటు వారంటుపట్టుకొని వచ్చినాఁడు. ఎరుస్టు చేయవలసియున్నది. అభయముచేత జబ్బుగా నున్నట్లు మిషపెట్టెను. రోగముతో నున్న వానిని ఎరెస్టుచేసిన ప్రయోజనము లేదుకదా. కావున అతనికి కొంచెము నెమ్మదిగా నుండు వరకును గనిపెట్టుకొందురు. ఇప్పుడు బాకీనిగురించి ఎరెస్టుచేయఁబడినచో నతనికి గొప్ప చిక్కు వచ్చును. ఏనుగు కుంభస్థలమును గొట్టుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. అది సాధ్యమైనచో బాకీలన్నియును మూఁడు నిమిషములలోఁ గొట్టిపారవేయఁగలడు.'

'ఆయేనుగు కుంభస్థలమేది?'

'నేను యదార్థముగాఁ జెప్పలేను. దానిసంగతి యటుండనిండు. నేనిరోజున పైడికోసము పోగా నామె నాతోఁ గ్రొత్తసంగతి యొకటి చెప్పెను. శ్రీనివాసునియొద్దఁ గనిపెట్టుకొనియున్న వాని బంధుగురాలెవ్వతో వెళిపోయినదట. ఆవీధిలోనున్నవాని మేనత్త కూతురును నరసమ్మ యను నొక వితంతువును బ్రతిమాలి తీసికొని వచ్చుటకు కృష్ణాజీగారు ప్రయత్నించిరట. ఈసంగతి వినుటతోనే నాకనుమానము కలిగినది. కావున, రహస్యముగా కృష్ణాజీగారి ప్రవర్తనను గనిపెట్టుచుంటిని. ఇంతలో నావితంతు వెవ్వతో యామె కృష్ణాజీగారియొద్దకు వచ్చెను. వాని పినతల్లి వానికి సంరక్షణచేయుచుండెననియు నామె యెక్కడికో పనిపైఁ బోయియుండెననియు, మఱునాఁటికి వచ్చుననియు, నీరాత్రిమాత్రము కనిపెట్టుకొనియున్నఁ

జాలుననియు, నాతఁడామెతోఁ జెప్పుచుండెను. కావున, దాని యదార్థమును దెలిసికొనుటకై మంచము క్రిందదూరి కనిపెట్టుచుంటిని. కొన్ని నిముసములలోనే యేదో వింత జరుగవలసియున్నది. కొంచెమోపికచేసి కనిపెట్టుచుండుఁడు.'

'నేను పైనుండి చూచుచుండవచ్చునా?' యని వేంకటరావడిగెను. 'సరే అలానే చేయవచ్చును, మీకు వేలుపడు లేకపోయినచో—' పైకి రావలెనని వేంకటరావు ప్రయత్నించుచుండెను.

ఇంత పైనుండి కొన్ని కంఠధ్వనులు వినఁబడుచుండెను. వానిలో నొకటి కృష్ణాజీదని యతఁడు పోల్చెను. అచ్చన్న మరల మంచము క్రిందకు దూరెను. ప్రక్కగోడ కొక మంచము జేరఁబెట్టబడియుండెను. ఆమంచముచాటుకుఁ బోవలెనని యచ్చన్న వేంకటరావునకు సంజ్ఞ చేసెను. వేంకటరావు మంచము చాటుకుఁబోయెను. దాగుండుట కంతని కావశ్యకము లేదు. నాయుడుగారి తరఫున దాను వచ్చెనుగదా. అయినను, గుట్టు తెలిసికొనుటకు వచ్చినవాఁడు కావున, యాతని మనస్సాక్షియే మూలకు దీసికొనిపోయెను. అంతలోఁ గృష్ణాజి లోపలికి వచ్చెను. వెనుక నల్లని తాను పంచ ముసుగు వేసి కట్టుకొని యొక పూర్వ సువాసిని కూడ వచ్చెను.

'బుచ్చమ్మగారూ, మీరు చేయవలసిన పనియేమో తెలిసినదా?' కృష్ణాజీ యడిగెను. 'లోపలి కెవ్వరిని రానీకూడదు. ఎవ్వరును రారనియే నేననుకొనెదను. అయిన నెందుకైన మంచిది. ఎవరు వచ్చినను లోపలికి రానీకూడదు.'

'తెలిసినది' బుచ్చెమ్మ చెప్పెను. 'సరే—ఏమిచేయుమన్నను జేసెదను'

'నీవుగట్టిగా మాటాడినచో గొంతుక పట్టియిచ్చును. కీచు గొంతుకతో మెల్లగా మాటాడవలెను, తెలిసినదా?'

'తెలిసినది.' 'వానిని లేపుము'

'బుచ్చెమ్మ శ్రీనివాసుని గట్టిగా నూచెను. అతఁడులుకను లేదు. పలుకనలేదు. మంచముపైనున్నవాఁడు చనిపోయెనేమోయను ననుమానమును బుట్టించునట్లుండెను. కృష్ణాజీకూడ నూపుట యారంభించెను. లేవలేదు. కృష్ణాజీ తిట్టసాగెను. 'వెధవవని మరల నారంభించినాఁడు. విడిచివేసెదనని నాయొద్ద ఒట్టుపెట్టుకొన్నాఁడు. ఎక్కడ—'

మంచముపై నాలుగుమూలలను వెదకుచుండెను. ఒకమూల నుండి డబ్బియొకటి నేలపై రాలినది. గట్టిగా నొక్కసారి తిట్టివైచి కృష్ణాజీ డబ్బి పైకిఁదీసెను. 'వెధవడబ్బి మరల నెక్కడ తెచ్చినాఁడో ఇదివరకున్నది తీసిపారవైచితిని. ఈ యలవాట్లు దయ్యములవలెఁ బట్టుకొని మఱి విడువవు. బుచ్చెమ్మా వానిని నేలకుఁ ద్రోసివేయుము.' బుచ్చెమ్మ వానిని మంచముపైనుండి నేలకుఁ ద్రోసివైచెను. 'అమ్మా'యని యొక్కమూలుగు మూలిగి, శ్రీనివాసుఁడీప్రక్క నుండి యీప్రక్కకు నేలపై నేయొత్తిగిల్లెను. మఱియు నదిలేక [illegible]ర్చుండబెట్టి చెంబెడు చలినీళ్ళను నెత్తిపై బోసెను. కార్తికమాసపురాత్రి యగుటచే నదివరకే కొంచెము చలిగానున్నది. కావున శ్రీనివాసుఁడు వణకుచుండెను. చలినీళ్ళదెబ్బతో శ్రీనివాసునకుఁ గొంచెము తెలివివచ్చి 'ఎవరు నీవు' అని యడిగెను. 'నేనెవఁడనా'యని కృష్ణాజీ యొక్క చంపకాయ కొట్టెను. బుచ్చెమ్మ మఱియొక చెంబెడు నీళ్ళుపోసెను. మఱికొంచెము తెలివివచ్చెను. 'చంపివేయుచున్నారేమి? యేమికావలయును'అని శ్రీనివాసుఁడడిగెను. లేచి నిలువఁబోయెను. కృష్ణాజీ యాతనిఁ గట్టిగా నూపివైచెను.

'మరి పోయిన తెలివిమాలిన వెధవా' అతఁడు తిట్టసాగెను. 'త్రాగుబోతు గుంటడా నల్లమందు దొరికినచో నీకు మఱియేమియు

నక్కఁ అలేదనుకొన్నావా ? పళ్ళు రాలఁగొట్టుదునా? ఈనల్లమందు మఱల నీకెక్కడ దొరికినది ?' కృష్ణాజీని తప్పించుకొని శ్రీనివాసుఁడు మంచమున కొక యంచునఁ గూర్చుండెను. చలినీళ్ళు గట్టిపని చేసెను. ఆపాదమస్తకము నాతఁడు వణకుచుండెను.

'నల్లమందు వేసికొనవని యొట్టుపెట్టుకొంటివిక దా.'

'తొందరపని యేమైన నున్నప్పుడు వేసికొనవని గదా చెప్పితిని. దేహమున జబ్బేమియును లేనప్పుడు జబ్బువచ్చినని వేషము వేయుట యెంత కష్టమో తెలియునా? నాకు బాగుగా నభ్యాసమై యుండుటచే నాకది విస్తారముగా తెలివి తప్పింపదే! అయినను నీ కిప్పుడు నాతో మాటాడుట కవసరముండునని నేననుకొనలేదు.'

'నీవు లక్ష్యపెట్టుటలేఁడ లేదు. ఏ నిముసమందు నీతో మాటాడవలసియుండునో నీవు కనిపెట్టుకొని యుండవలసిన దని యిది వరకుఁ జెప్పలేదా ? ఆయనవసరమిప్పుడు వచ్చెను.'

శ్రీనివాసుఁడు తెల్లబోయి చూచుచుండెను. శరీరమంతయును వడకుచుండెను. 'అనుకొనినపని సమముగా నైనదా? పోలీసువాఁ డెవఁడైన వచ్చినయెడల——'

ఆ విషయమైన చింత నీకవసరము లేదు. నీవిక్కడ నుండు వనియే యందఱు ననుకొందురు. మనము వీథిత్రోవను బోవద్దు. పెరటిత్రోవను వచ్చుచుఁ బోవుచుందము. ఎవ్వరయిన వచ్చిన యెడల రోగితో నెవ్వరును మాటాడకుండదు. అది వైద్యుల సెలవు. అని బుచ్చమ్మ జవాబు చెప్పుచుండును.'

'ఉదయమున నాయొద్దనున్న యవ్వ కాదే యిది. పడుచు దానివలె కన్పడుచున్నది. కాని ఎప్పుడో చూచినట్లు పొడగట్టు చున్నది.' అని శ్రీనివాసుఁ డనెను.

'నీకు నల్లమందు గిరయింకను పడువలేదు. అది మీ మేనత్త కూఁతురు బుచ్చెమ్మ.'

'మా మేనత్తకూతురా?—మా మేనత్తకూతురా? బుచ్చెమ్మయని పేరా—'

'అవును మీ మేనత్తకూతురు బుచ్చెమ్మయే—ఆబ్బా యీ నల్లమందుభాయిలతో మహా బాధగానున్నదికదా. మరల మాటాడినయెడల తన్నెదను. ఈమె మీ మేనత్తకూతురే—పేరు. బుచ్చెమ్మయే.'

'సరే—అయినా నిప్పుడు నన్నేమి చేయమందువు?' అని శ్రీనివాసుఁ డడిగెను.

'ముఖ్యమైన సంగతులు కొన్ని జరిగినవి. దీనితో మనము బాగుపడవచ్చును శంకరశాస్త్రి యింటిలోని చిట్టాపుస్తకముదొరకినదిగాని, యేమియును తెలియకపోవుటచే మనకు లాభములేకపోయినదిగదా. ఇప్పుడు దైవికముగా నొక లాభము కలిగినది. ఇదియేమో చూడుము' అని కృష్ణాజీ యొక కాగితము నాతనిచేతి కిచ్చెను. చిట్టాపుస్తకములోని యొక పుటవలె నది కన్పడెను.'

'ఆభాషకిది వ్యాఖ్యానమా యేమి?'

'కాకపోయిన మఱి యేమగును? అది యా రహస్యభాషకు దర్పణము. ఇది నాకెట్లు దొరికినదో నిపు పోల్చలేవు. ఆవీధిలో నొకచోట నొక కుఱ్ఱవాఁడు గాలిపటముతో నాడుచు పరుగెత్తుచుండెను. త్రోవలో రాయితగిలి యొకచోటఁ బడిపోయెను. నేను పరుగెత్తిపోయి వానిని లేవనెత్తితిని. గాలిపటమును దగ్గరకుఁ దీసితిని. అందు కొన్ని యంకెలుకనపడెను. బాగుగా పరీక్షించితిని? అది మనకుఁ గావలసిన కార్యమే యయ్యెను.'

'ఆకుఱ్ఱవాని కది యెట్లువచ్చెను!' ఆసంగతికూడఁ దెలిసికొంటిని. తన గాలిపటము చిరిగిపోయిన నొకఁడుదానికీ కాగితపుముక్క నంటించెనని చెప్పెను.

వీధిలో దొరికిన కాగితము నంటించెనా, లేక జేబులోది తీసి యంటించెనా యని మరల జ్ఞాపకము లేదని వాడు చెప్పివేసెను. జేబులో చెయ్యిపెట్టి కొన్ని పైసాలను దీసి వానిచేతిలోఁ బోసితిని. అప్పుడు వానిజ్ఞాపకశక్తి తిరిగి వచ్చెను. తన జేబులోనుండి యొక చిన్న పుస్తకమును దీసి, దానిలోని యొక పుటను జింపివైచి యా కాగితపుముక్క నంటించెనని వాఁడు చెప్పెను.'

'వాఁడెవ్వఁడో ఆసంగతి యడుగలేదా?'

'వెధవవు—నీపాటి తెలివినాకు లేదనుకొన్నావా? అదికూడ తెలిసికొంటిని ఒక వెఱ్ఱివాఁడు తన వీధిలోని బాలురకందరకును గాలిపటములు కట్టి యిచ్చుచుండునని చెప్పెను. పేరు చెప్పుమని మంచిమాటాడి మరి పిడికెడు డబ్బులు వాని చేతిలోఁ బోసితిని. వాని పేరు వెఱ్ఱి విస్సప్ప' యని యాబాలుడు చెప్పెను.

శ్రీనివాసుఁడు చిఱునవ్వు నవ్వెను. ఎంతయో యాత్రముగా వినుచుండెను. కాని, వినుటలో వారికన్న నెక్కువ యాత్రముకల వారందుండిరి. మంచముక్రింద నొకఁడును, మంచమునోర నొకఁడును

'ఇన్నాళ్ళకు వెధవదేవునకు గయవచ్చినది. అయినను, మనపై ఆవిశ్వనాథశాస్త్రిని నమ్మలేము. పుస్తకము నాపుట తోనే కెవ్వనవచ్చును. పుస్తకము రాత్రింబవళ్ళు జేబులో పెట్టుకొని తిరుగుచుండును. కాని, వెంటనే యాపుస్తకము వానియొద్దనుండి లాగుకొనిరావలెను.'

'అవసరమైనయెడల తన్నిరియునఁ దీసికొనిరావలెను. బుచ్చెమ్మ యిక్కడనుండును. కావున, నీవు నాతో రావచ్చును. ఎవ్వరికిని దెలియ నిరీతిగా మారువేషములు వేసికొని పోవుదము. ఆపుస్తకము మన చేతిలోఁ బడిపోయినచో లక్షలకొలది ధనము స్వేచ్ఛానుసరముగ ఖర్చుపెట్టుకొనవచ్చును.'

'అది యంతయును సరేగాని, విశ్వనాథశాస్త్రి మన కెక్కడ దొరుకను' అని శ్రీనివాసు డడిగెను.

'వేంకటరావుగారి యింటిలో దొరకును. వేంకటరావింటి యొద్ద నున్నయెడల వానిని మాటలలోఁ బెట్టి వీధిలోనికి నేను దీసికొని పోవుదును. నీవు విశ్వనాథశాస్త్రియొద్ద పుస్తకము తీసికొనిపొమ్ము. నీకుఁ గావలసినయెడల క్లోరోఫారము బుడ్డి యిచ్చెదను. నీవీకిటికీలో నుండి పైకిఁ బొమ్ము. నేను యింటిలోనుండి పెరటిలోనికిఁ బోయి, పెరటిగుమ్మముదాటి వచ్చెదను.'

కృష్ణాజీ వెళ్ళిపోయెను. శ్రీనివాసుఁడు కిటికీలోనుండి పైకిఁబోయెను. ఇంతలో దూరముగ మోటారుకారు చప్పుడయ్యెను.

---

## ఇరువదిరెండవ ప్రకరణము.

### చీకటి మొట్టికాయ.

రహస్యముగా వినుచున్నవారు కాలమును వ్యర్థముచేయలేరు వారికి మిక్కిలి యవసరమైన భోగట్టాయే దొరకినది. కృష్ణాజీగారు శ్రీనివాసులు చేయఁదలచుకొన్న పని ఘోరమైనది. దానికిభంగము కావింపవలెను. కావున వారికన్న ముందుగనే యక్కడకుఁ బోవలెను. కాని, యాగదిలోనుండి తప్పించుకొని పైకిఁ బోవుటకే మొదట చిక్కువచ్చినది. బుచ్చెమ్మ జాగిలమువలె గదిలోఁ గని పెట్టుకొనియుండెను. వానిని దప్పించుకొని పోవుట యసాధ్యము. ఏమిచేయుటకును దోఁచలేదు. ఇంతలో బుచ్చెమ్మ కిటికీలోనుండి పైకి తొంగిచూచుచుండెను. వేంకటరావు మంచము ప్రక్కనుండి తలత్రిప్పి చూచుచుండెను. అచ్చన్న మంచముక్రిందనుండి తలయెత్తి చూచు

చుండెను. ఇద్దరు నొకరి నొకరు చూచిరి. వారిద్దఱు నొకదానిగూర్చియే యాలోచించు కొనుచుండిరి.—ఎవ్వడును జూడకుండ తప్పించుకొనిపోవుటయెట్లు క్షణమొక యుగముగాఁ గన్పట్టుచుండెను. మోటారుకారు చప్పుడు సన్నగిల్లి పోయెను. ఇంకను దమగతి యేమగునోయనియే వారిద్దఱు నాలోచించుచుండిరి ఒంటిగా నుండుటచే బుచ్చెమ్మ కేమియును బుసుపోలేదు. అచ్చెన్న కేమో యనుమానము కలిగి బుచ్చెమ్మ మొగమువైపు చూచుచుండెను. మొగము నున్నగానున్నదిగాని, ముక్కు పెద్దదిగానున్నది. కారణమేమియనియచ్చెన్నయాలోచించుచుండగా, మొలనున్న యొకడిబ్బీలోనుండికొంచెము పొడుముతీసి యామె పీల్చెను. అచ్చెన్నకు మఱింత యనుమానమయ్యెను. కాని, యేమిచేయుటకు నాతని కింకను బోధపడలేదు. బుచ్చెమ్మదీపమార్పివేసెను. కారణమేమియని వారాలోచించుచుండిరి. 'మంచమువాల్చుకొని పండుకొన్నచో యుక్తముగా నుండును. జాగరణముచేయుట కష్టము.' అని బుచ్చెమ్మగట్టిగా ననుకొనెను ఇద్దఱకును గుండెలో రాయిపడినది బుచ్చెమ్మ చుట్టయొకటి పైకిదీసెను. అగ్గిపుల్లతో ముట్టించెను. బ్రాహ్మణ వితంతువు చుట్ట కాల్చుచుండెనని వేంకటరావు వింతగాఁ జూచుచుండెను. అచ్చెన్న తనయనుమానమును నిశ్చయము చేసికొనెను. బుచ్చెమ్మయమ్ముకొనుటకై కిటికీయొద్దకుఁ బోయి తొంగిచూచుచు నిలుచుండెను. చీఁకటిగా నున్నది బుచ్చెమ్మ పరధ్యానముగా నున్నది. అచ్చన్న మెల్లగా మంచముక్రిందనుండి పైకివచ్చి లేచి నిలువఁబడెను. పైనుండి వెలుఁగుకొంచెము వచ్చుచుండుటచేత బుచ్చెమ్మశిరస్సు కనుపడుచుండెను. ఆమెగుండుపై బట్ట తీసివేసెను. అచ్చెన్న జాగ్రత్తగా కనిపెట్టెను. తలకు వెనుకప్రక్క తాళముచెవివంటి చిన్నపిలక కనపడెను. 'ఇదియా దీని సంగతి!' యని యచ్చన్న యనుకొని,

మెల్లఁగా వంగిపో బుచ్చెమ్మ వెనుకకుఁ బోయి నిలువఁబడెను. ఏమి చేయవచ్చునని యొక్క నిముసమాలోచించెను. వంగి రెండుకాళ్ళు బట్టుకొని కటికీలోనుండి యామెను ద్రోసివైచెను. దొంగలతల్లి కేడువసిగ్గు బుచ్చెమ్మ—లేదు—బుచ్చెన్న, యేడవలేక పోయెను. క్రిందఁబల్లేరుముళ్ళలో వాఁడు పడిపోయెను. ముళ్ళుతీసికొను సందడిలో నుండెను.

'పైకి రండి—వేగముగా రండి—వ్యవధిలేదు. వాఁడు పల్లేరుముళ్ళు తీసికొనుచున్నాఁడు నోరుమూసికొని యల్లరిచేయకవాఁడు తిరిగివచ్చును. ఈలోపుననే మనము వెళ్ళిపోవలెను. వేగము—

వేంకటరావును అచ్చెన్నయును క్రిందికిఁబోయిరి. అంగణములో నుండి వీధి తలుపు తెఱచివీధిలోనికి వచ్చిరి. 'అయ్యామీరు కొందర పడక పోయినచో, వారిని కలిసికొనలేరు. నాకిక్కడఁ గొంచెముపని యున్నది. ఎవ్వరు బాదముచెట్టువద్ద నున్నారు?' అనియచ్చెన్న యడిగెను.

'పైవారెవ్వరునుగారు. భయములేదు. నేను బోయెదను.' ఎవ్వరిత్రోవను వారు పోయిరి. వేంకటరావు పుల్లయ్యవద్దకు వచ్చెను 'ఏమి యింత యాలస్యమయ్యెను.?' పుల్లయ్యయడిగెను. 'నీకేమో యాపదవచ్చియుండునని నేననుమానించితిని కృష్ణాజీ యిప్పుడే మోటారుకారులోఁ బోవుచున్నాఁడు. ఏమైనను దేలినదా?' అంతయును దెలిసినది. త్రోవలోఁ జెప్పెదను వడివడిగాఁ బోవలసియున్నదినాతో సమముగా నడువఁగలరా?'

ఏదోచూతమని పుల్లయ్య వేంకటరావు బయలుదేరెను. వేంకటరావు త్రోవలో నంతయును జెప్పుచుండెను. పుల్లయ్య యాశ్చర్యముతోను, విచారముతోను, వినుచుండెను కొంతసేపటికి. వారిద్దఱును వేంకటరావుగారి యింటివద్ద వచ్చిరి. వడివడిగాఁ దలుపు తీసికొని వేంకటరావు లోనికి ద్రోసి కొనుచుఁ బోయెను. ముసలివాఁడు

కనపడలేదు. వేంకటరావునకు భయమయ్యెను. బంట్రోతును గట్టిగా కేకలుపెట్టుచు బిలిచి విశ్వనాథశాస్త్రిగా రెక్కడకుఁ బోయిరని యడిగెను. 'శాపురము వెళ్ళిరి. కమలమ్మగారి కేదో కబురు చెప్పవలసియున్నదనియు, రాత్రి తిరిగివచ్చుట యాలస్యమగుననియు, మీతో నీసంగతి చెప్పవలసినదనియుఁ జెప్పి పోయినది. వారికిఁగూడ నట్టె సమాధానము చెప్పితి'నని వాఁడు చెప్పెను.

'వారెవ్వరు'అని వేంకటరా వడిగెను.

'అనఁగు, మోటారుబండిమీద యిప్పుడే వచ్చి వెళ్ళిపోయిన వారు' 'ఎవ్వరో తెలియదా?' లేదండి—తెలియదు. పోల్చ లేదు. కళ్ళకు సులోచనములు పెట్టిరి. లేరా—లేరాయని సణగుకొనుచు వారు పోయిరి. ఒక్క నిముసమైన నాగలేదు.'

ఇంతవర కాతని కేమియును హానికలుగలేదు. 'మనము వేగము పోవలెను. పుల్లయ్యగారూ, నా బైసికిల్ మీకిచ్చెదను మీరు త్రొక్కుకొని వేగముగా నక్కడకుఁ బొండు. నేను వడివడిగా నడచి సందులలోనుండి పరుగెత్తి వచ్చెదను.'

సరే—నేను బైసికల్మీదఁ బోయెదను. గాని యింటియొద్ద నాఁడుపిల్లలకుఁ దోడుగా నెవ్వరైన నున్నారా?'అని పుల్లయ్య యడిగెను.

'లేరు—పాపము. సూర్యారావునకు బంట్రోతులేఁడు. వంట బ్రాహ్మణుఁడు కూడ లేఁడు. ఒక వంటలక్క యున్నదిగాని యామె వంటచేసిపెట్టి యెక్కడికో పోవుచుండును. రాత్రులింటియొద్దఁ గని పెట్టుకొని యుండదు. ఆద్రోహు లిద్దఱును బోయియున్నారు. ఆడు పిల్లల కేమియాపద వచ్చునోయని భయమగుచున్నది.'

'సరే—చూతము'అని పుల్లయ్య బైసికిల్ త్రొక్కుకొని పోయెను.

వేంకటరావును వడివడిగాఁ బోవుచుండెను. ఇంతలో నా ద్రోహులిద్దరు నాత్రోవనే పోవుచుండుట నాతఁడు కనిపెట్టెను. పావుగంటలో నందఱును నక్కడకుఁ బోయిరి. కిటికీలోనుండి యొక లాంతరు వెలుగు కనుపడుచుండెను. తలుపులన్నియును వేసియున్నవి. నిశ్శబ్దముగా నున్నది. మనుష్యుల యలుకుఁడు లేదు. దొంగతనము నకును దోపిడికిని దేశకాలము లనుకూలించి యుండెను.

'ఏమిచేయుదము?' శ్రీనివాసుఁ డడిగెను. మోటారుదిగి, దానినొక యోరకుఁ ద్రోసి, కానాయొద్ద నిలచి వారు మాటాడు చుండిరి. 'కావలసినంత వ్యవధికలదు. వాఁడు తిరిగివచ్చువరకును జుట్ట కాల్చుచు మన మిక్కడనే కనిపెట్టుకొని యుందమా? లేక అక్కడకేపోయి వాని నీడ్చుకొని వత్తమా?'

'కనిపెట్టుకొని యుండుట మంచిదికాదు. ఆ ముసలివెధవ గంటకు తిరిగివచ్చునో, రెండు గంటలకు వచ్చునో లేక రాత్రి యంతయు నక్కడనే యుండిపోవునో, యెవ్వఁడు చెప్పఁగలడు? తిన్నఁగా యింటిలోనికిఁబోయి చేయవలసిన పనిచేసి తిరిగివత్తము.' ఆయింటివైపు వారిద్దరును బోయిరి. ఇంతలో తలుపు నెవ్వరో తెఱచిరి. దీపమునకు ముందుగావచ్చి కమలగుమ్మములో నిలువఁబడెను. 'ఆహా ఆకాశమెంత నిర్మలముగా నున్నది? చుక్కలెంత చక్కగా వెలుగుచున్నవి? సూరమ్మగారూ, ఒక్కసారి వీధిలోనికి వచ్చి చూడుఁడు—నాన్ననుగూడఁ దీసికొనిరండు.'

'ఈ వ్యవహారము బాగుగానే యున్నది.' శ్రీనివాసుఁ డనెను. కొంచెము కనిపెట్టుకొని యున్నచో వారు వీధిలోనికివత్తురు.'

ఇంతలో మఱియొక యాడుపిల్లపైకి వచ్చెను. వెంటనే నడుము వ్రేలవైచుకొని విశ్వనాధశాస్త్రి వచ్చుచుండెను. ఏదో పారవేసి కొనినట్లాతఁడు గొణుగుకొనుచుండెను.

'మీరు పోవుచుండుఁడు' అతఁడు చెప్పెను. 'నేను మీవెనుకనే వత్తును. నా జామిపండెక్కడనో పోయినది. ఇక్కడనే యెక్కడనో పెట్టితిని. కనుపడకున్నది. నావద్ద నేదో యొకటి యెప్పుడును బోవుచునే యున్నది. మొదట ధనము పోయినది. తరువాత మతి పోయినది. మతి తిరిగివచ్చినచో నాధనమెక్కడఁ బాతిపెట్టి యుంచితినో పోల్చుకొనియుందును. ఆవెధవలు నరికివేసెదమని నన్ను భయపెట్టినందున నాధనమున బాతివేసితిని—ఎక్కడఁ బాతితినో మఱచిపోయితిని. ఇప్పుడు భాషకూడ మఱచిపోయితిని.'

'నాన్నా, నేను చెప్పలేను. నీపండెక్కడఁ బోయినదో.' కమల మెల్లఁగా ననెను. విశ్వనాథశాస్త్రిగారి మాటలామె కేమియును బోధపడలేదు. ఎంతకాలమునుండియో యామె యామాటలనే వినుచుండెను. వెఱ్ఱిమాటలక్రింద వానిని కట్టివేసెను. 'జామిపండు మాటకేమిలెండి. ఈ సందులలోనుండి పెద్దరోడ్డువరకును బోయి యొక్కసారి తిరిగివత్తము. రేపు ఉదయము గంపెడు జామిపండ్లు మీకుఁ గొనియిచ్చెదను.'

'నీవు మంచిపిల్లవు—అమ్మా—' ముసలివాఁడు చంకలు గ్రుద్దుకొనెను. 'నీవు మంచిపిల్లవు నాకందఱును మంచివారే. మాటకు—వేంకటరావు చూడుము. నాకొఱకెంత కష్టపడుచున్నాఁడో. వేంకటరావును జూచినఁ బూర్వము నాకెప్పుడును గోపముగానే యుండెను. అయినను, నేను బీదవాఁడనైన తరువాత నాతఁడు నాకుఁ దిండిపెట్టి నన్నుఁ గాపాడుచున్నాఁడు. చిత్రము! ధనముకన్న పావనములైన వస్తువులు మఱికొన్ని కలవని యెంచువారు కూడ లోకమున నున్నారు! నాకు ధనమే దేవుఁడు. ధనమే ప్రాణము ధనమే మానము.'

'తెల్లవారువరకును జామిపండు వెతకుకొనుచుండుఁడు. మేము పోయెదము' అని సూరమ్మ యనెను.

ఇంతలో పుల్లయ్య యావీధికి వచ్చెను. ద్రోహులిద్దఱును బ్రక్కకుఁ దోసియుంచిన మోటారుబండిని చూచెను. ద్రోహులుకూడ నా ప్రక్కకే వచ్చుచుండిరి. ఒకమూలనొత్తిగిల్లి పుల్లయ్య దాగియుండెను. వారు జయించి వచ్చిరేమో పోల్చుకొందమని వారి మాటలు విను టకు కనిపెట్టుకొని యుండెను. మోటారుబండి పైకీడ్వఁబడుచుం డెను. 'ఛీఛీ, యీపర్యాయముకూడ సాధ్యమైనదికాదు, పుస్తకము దొరకలేదుగదా—శ్రీనివాసరావూ?' అని కృష్ణాజీ యడిగెను. 'లేదు. దొరకలేదు.' శ్రీనివాసుఁడు జవాబు చెప్పెను. 'ఇదిగో తాళము మాత్రము దొరికినది. దీనిపైని 306 అని అంకె వేయఁ బడియున్నది.'

పుల్లయ్య మఱి యాఁగలేదు. ఆతనికి నవ్వు వచ్చెనుగాని, యాపుకొనెను. సూర్యారావుగారి యింటివైపు బరుగెత్తసాగెను. ఇప్పటికి మేలే యైనది.' అని యనుకొనుచుండెను.

---

## ఇరువదిమూఁడవ ప్రకరణము.

### తాళము చెవి.

మోటారుబండి కదలువరకును కనిపెట్టుకొనియుండి, పుల్లయ్య బయలుదేరెను. ఇంత కష్టపడినను ద్రోహులకుఁ గావలసిన వస్తువు దొరకలేదు. తాళముచెవి దొరికినంతమాత్రమున నేమిలాభము? బహుశః తనకైశ్వర్యమున్న రోజులలో నదియుపయోగిప నేమో కాని, యిప్పుడు దానివలన నేమిప్రయోజనము? అటువస్తువుకన్న నెక్కువ విలువ దానికిప్పుడు లేదు. పోయిన పోనిమ్ము—నష్టములేదు.

వడివడి నడచుచు నాతఁడు సూర్యారావుగారి యింటికిఁ బోయెను. వేంకటరావుతోఁ గలిసి పోకపోయి యందుల విచారించెను

గాని, యెట్లయిన నక్కడకుఁ బోయెను. కొంచె మాలస్యమైన నేమి? లోపలికిఁ బోయెను. తాను వచ్చినసంగతి యింటి వారెవ్వరును గని పెట్టలేదు. అందరును పనితొందరలోనుండిరి. మంచముపైఁ బడి యున్న యెవ్వరినో వేంకటరావుపరీక్షించుచుండెను. అది విశ్వనాథ శాస్త్రి యని పుల్లయ్య యనుకొనెను.

'ఏమిది? ఘోర మేమియును జరుగ లేదుగద!' అని యాతఁ డడిగెను.

'అవునవును. కాదు కాదు.' అని వేంకటరావ నెను.

'అనఁగా? బోధపడ లేదు.' అని పుల్లయ్య చెప్పెను.

అనఁగా, కొంతవరకు ఘోరము—కొంతవరకు కాదు' వేంకటరావ నెను. 'కమలా, పాతగుడ్డముక్క యొకటి యున్నచోఁ దెమ్ము. తలపై బ్రద్దలైనట్లు కనుపడుచున్నది. పుల్లయ్యగారూ, ఈసంగతి పోలీసువారికి రిపోర్టుచేసిన బాగుగా నుండునేమో, ఆదుర్మార్గులు మితిమీరుచున్నారు.'

పుల్లయ్య మాటాడ లేదు. పోలీసువారి నివ్యవహారములోఁ గలుపకయుండుటయే మంచిదని యాతని యుద్దేశము. ఆడుపిల్ల లిద్దఱివైపు నాతఁ డొక్కసారి తేరిచూచెను. వేంకటరావు చెప్పిన పనులన్నియును వారు చేయుచుండిరి కాని, వారు తెల్లఁబోయి వణకుచు నిలుచుండిరి. ఏమిజరిగినదో బాగుగా వారికింకను బోధ పడనేలేదు. రోగికింకను దెలివి రాలేదు. కొంత కాలమువరకునునాతఁడా స్థితిలోనే యుంకునని వేంకటరావు చెప్పెను.

'అమ్మయ్యా, యెంతఘోరము జరిగినది.' నూరమ్మ యొక్క నిట్టూర్పు విడిచెను. 'వారు మరల వచ్చినయెడల—'

'వారు మఱిరారు. భయములేదు. ఇట్టి స్థితిలోమిమ్మిద్దఱను విడిచి నేనుబోయెదనని యనుకొనవద్దు రాత్రియంతయు నిక్కడనే

కనిపెట్టుకొని యుండును. మీరు పోయిపండుకొనుఁడు. సూరమ్మ వెళ్ళి పోయెను. పుల్లయ్యయును వెళ్ళిపోయెను. కమలయును. వేంకటరావును మాత్రమే యుండిరి. జరిగినదాని గూర్చి కమల తెలిసికొననెంచెను. 'ఏమియీఘోరము? వారెవ్వరు? పాపము. ముసలివాఁడుగదా మానాన్న పయివారి కేల యింతకోపము?' 'వారు నీవెఱిఁగినవారే. మారువేషమున నుండుటచే నీవు పోల్పలేక పోయితివి. వాఁగద్దెయును కృష్ణాజీయును శ్రీనివాసుఁడును.' రాత్రి మొదటినుండి తానుజూచిన దంతయును వేంకటరావామెకు చెప్పెను. 'మీతండ్రియొద్ద వ్యవహార సంబంధమైన యొకపుస్తకము కలదు. అదితీసుకొనిపోవలెనని వారి యుద్దేశము. కారణము నాకుదెలియదు. పుల్లయ్యగారికిఁ దెలియును. గాని, ఆయనయింకను మనతోఁ జెప్పడు. మీతండ్రియొద్ద ధనమేమియును లేదుగదా, బహుశః మా పినతండ్రి ధనముతో సంబంధించినదయి యుండును.'

'దిక్కుమాలి యున్న ముసలివాని నేల యిట్లు కొట్టవలెను?' అని యామె యడిగెను.

'వానిఁ జంపివేయవలెనని వారుద్దేశించియుండరు. మీతండ్రి యిప్పుడు నిర్బలుఁడయి యున్నాఁడు గాని, యొకప్పుడు బలశాలియైయే యుండెను. పూర్వపుసంగతు లేవో యతనికి జ్ఞాపకమువచ్చి యుండును. బలముగా నెదిరించియుండును. తలపయి దెబ్బతగిలినది. ఇప్పుడు తలపయి శస్త్రవైద్యము చేయవలసియున్నది. అన్నట్టు రాత్రి యగుచున్నది. నీవు నిద్రపోనిమ్ము.' కమల వెళ్ళిపోయెను. మంచము వద్ద వేంకటరావుకనిపెట్టుకొని యుండెను. రాత్రి రెండుగంట లగునప్పటికి రోగి కదలెను. కళ్ళు తెరచెనా 'తీసుకొనిపోయిరా? దొరకిపోయినదా?' అని యాతఁడడిగెను. వేంకటరావేమో చెప్పెను గాని, రోగికి బోధపడలేదు. 'పుస్తకము—పుస్తకము' ఆతఁడు మరలసర

చెను. 'పుస్తకమేదీ? అది వారికి దొరికినయెడల నాపనిసరి. చెడిపోవుదును. సాధనమంతయును బోవును. అయ్యో సాధనమేదీ—ధనమేదీ—యెక్కడ బెట్టితివి? పుస్తకమేదీ?'

రోగికి నుష్ణము హెచ్చగుచుండెను. ఉపశాంతికలుగఁ జేయవలెను. నిద్రమందిచ్చిన బాగుగనుండునని యూతఁడనుకొనెను. గాని, మందులేవియును దగ్గరలేవు. ప్రక్కనా తెల్లట్ట పుస్తకముండెను. అది తీసి ముసలి వానిచేతిలోఁ బెట్టెను. ఆత్రతతో నతఁడా పుస్తకమును బట్టుకొనెను. 'బ్రతికితిని' రోగి మెల్లఁగాననెను. 'ఇప్పటికి బ్రతికితిని. వెధవలను తన్ని వేసితిని. నాఁడు పడిపోయినప్పుడెట్లు నాకి తగులనిచ్చితినో నేడునట్లే తగులనిచ్చితిని. అప్పుడు భయమువేసినది. భయమెందుకువచ్చినచో తెలియలేదు. నాతాళముచెవి యేదీ?' తాళము గూర్చి వేంకటరావున కేమియును దెలియలేదు. అప్పుడే పుల్లయ్యాలో పలికివచ్చెను. 'ఏమిజరిగినదో నేను దారిద్దతివలననే వింటిని, వేంకటరావూ, నీవుపోయి కొంచెముసేపు నిద్రపొమ్ము. నేనిక్కడ కనిపెట్టుకొని యుందును'

'పుల్లయ్యగారూ, ఆపుస్తకము నిజముగా విలువగలదేనా, లేకున్న పోయినధనము తాలూకు చిరాఅవర్ధాలుమాత్ర మందుగలవా?' అని వేంకటరావడిగెను. 'అది మిక్కిలి విలువగలపుస్తకము. కొద్దిరోజులలోనే దాని యథార్థస్థితి యంతయును నేఁజెప్పెదను. శంకరశాస్త్రి యింటిలో ఆదుర్మార్గులు దొంగిలించిన పుస్తకములోని సంగతులకీపుస్తకము వ్యాఖ్యానము. ఇది బాగుగ దెలిసినగాని, యది బోధపడదు. మొట్టమొదట మనకదిదొరకవలెను.'

'కొంతవరకది కష్టమైనపనియే.' వేంకటరావనెను.

'కొంతవరకా!' పుల్లయ్య చిరునవ్వునవ్వెను. 'అదియెక్కడనున్నదో నాకుఁదెలియును. దానినెట్లు సాధించుటయోయని యాలోచించుచున్నాను.'

'తాళముచెవి' అని రోగికేకలు వేసెను. 'తాళముచెవియేదీ! ఇత్తడిచెవి. పయిని నంబరు వేసియున్నది.'

వేంకటరావు పుల్లయ్యవైపుచూచెను. 'తాళముసంగతిమీకే మయినఁ దెలియునా?' అని యడిగెను.

'తెలియును.' పుల్లయ్యచెప్పెను. 'వారిద్దఱును మాటాడుకొనుచుండగ వింటిని. చెవియొకటి దొరికినట్లు చెప్పుకొనుచుండిరి.' 'అవునదే.' రోగికేకలువయిచెను. 'తాళమే. చేవే పోయినది. యెత్తుకొనిపోయిరి. నంబరుజ్ఞాపకములేదు.' 'పాపము. వాని జేబులో నుండి తాళమును తీసికొనిపోయిరి. వారి సేపుతాలూకు తాళమయి యుండును. ధనమున్నరోజులలో దాని నాతడుపయోగించి యుండును కాని వారది యిప్పుడేలతీసికొని పోయిరో!'

'విశ్వనాధశాస్త్రిగారియొద్ద పెట్టియయినఁ గలదా?' వేంకటరావడిగెను. 'పెట్టిమరి యెక్కడనున్నది? ఇది మారు తాళమయి యుండును.' 'నంబరేమో మీకేమయినఁ దెలియునా?' వేంకటరావడిగెను. 'చెప్పఁగలను' వారుమాటలాడుచున్నప్పుడు నంబరుకూడ చెప్పుకొనుచుండిరి. నే నంకెలనెప్పుడును మరచిపోను. ఉండు చెప్పెదను. 306

'మీరు పుస్తకములో నెక్కడయిన వ్రాసియుంచుఁడు మరచి పోయినప్పుడు చూడవచ్చును. రేపు దానిని గుఱించి భోగట్టా చేయుదము. శంకరశాస్త్రిగారి వ్యవహారము చూచుచుండు వకీలో కఁడుకలఁడు. ఆతనికేమయినఁ దెలిసియుండునేమో. రోగిని గుఱించి యేమయిన క్రొత్తసంగతి కనుపడెనా?' అనిపుల్లయ్య యడిగెను. 'విశేషమేమియునులేదు.'

'ఆతని కంఠధ్వని మునుపటికన్న స్ఫుటమైనది. ఇంతదెబ్బ తగిలినను, చూడు మెంతధాటిగా మాటాడుచున్నాఁడో! మాటకు

ఆతాళము గూర్చి మాటాడు చున్నప్పుడు—' పుల్లయ్య యనుచుం డెను. 'తేవేమి? నా తాళము నాకీయవా?' అని రోగి మరల కేకలు వేసెను.

వ్యవహారస్థుని కంఠమువలె నాతనికంఠము 'ఖణీ' గా నుండెను.

'అవును. మీరన్నట్లు, కంఠమునందు వణకొకటి పూర్వముం డెను. ఇప్పుడది లేదు.' అని వేంకటరావనెను.

'ఇది వింతగానే యున్నది. కాని, యీయుష్ణ తీవ్రత యెంత వరకు నుండును?' పుల్లయ్యయడిగెను.

'రోజంతయు నుండును. రేపు ఆస్పత్రికిఁదీసికొనిపోయి శస్త్ర వైద్యము సర్జనుగారిచేఁ జేయింపవలెను.'

'సంగతులేవియును సర్జనుగారికి చెప్పవద్దు. నడచుచు కుర్చీ పైఁదిరుగఁ బడినందున దెబ్బతగిలినదని చెప్పుము. కొంచము శాంతించి యోపికచేసినచో మనముపడుశ్రమ వ్యర్థముకాదని నాయుద్దేశము.' పుల్లయ్యమఱి యేమియును జెప్పలేదు. వేంకటరావడుగను లేదు. తెల్లవారుజామున రోగికని నిద్రపట్టెను. వేంకటరావు యీజీ చైరుపైఁ బండుకొనెను. సూర్యారావెక్కడకో పోయియుండెను. రాత్రియంతయును నింటిలో లేనేలేడు. సూర్యోదయమగువేళ కాతఁడు వచ్చెను. ఉదయము సర్జనుగారిని దీసికొనివచ్చి చూపిరి. శస్త్ర చికిత్స యవసరమని సర్జనుగారు చెప్పిరి. క్లోరోఫారమిచ్చి శస్త్రము చేసిరి. తరువాత పుల్లయ్యకూడ నక్కడకు వచ్చెను. 'సంతోషమైనది. బాగుగా నిమ్మళించినట్లేనా?' అని పుల్లయ్య యడిగెను. 'అవును' వేంకటరావు చెప్పెను. 'ఇప్పుడు తగిలిన గాయము నకు శస్త్రము చేయుచుండఁగా, వెనుక తగిలిన గాయపు గుఱుతులు కనుపడెను. దానివలన మెదడునకు కొంచెము భంగము కలిగి యుండెను.

ఇప్పుడదికూడ శస్త్రము చేయఁబడెను?'

'ఓహో ఆరహస్యమిప్పుడు తెలిసిపోయినది.' అని పుల్లయ్య యనెను.

'ఆరహస్యము తెలిసిపోయినదిగాని, నీరహస్యము తెలియ లేదు.'

'అనఁగా?'

'అనఁగా మరేమియును లేదు. నీవు అత్యద్భుతమైన మనుష్యునివలెఁ గన్పట్టుచున్నావు. నాతో నీకింత పరిచయము కలదు. కాని, నీవెవ్వఁడవో నాకుఁ దెలియలేదు.'

'సరే—చెప్పెదను వినుము. నేను శంకరశాస్త్రికిఁ దమ్ముఁడను. నాపేరు నారాయణశాస్త్రి ఈ విశ్వనాధశాస్త్రి మాకు బినతండ్రి కుమారుఁడు. కావున, నేనుగూడఁ గమలకు బినతండ్రినే.' అని పుల్లయ్య చెప్పెను.

---

## ఇరువది నాలుగవ ప్రకరణము.

### సమాధానము.

పుల్లయ్య చెప్పిన క్రొత్తసంగతి వేంకటరావాశ్చర్యముతో వినుచుండెను. శంకరశాస్త్రిఁ దమ్ముఁడొకఁడుండెననియు నాతఁడు దేశద్రిమ్మరియై పోయెననియు నెప్పుడో తాను విన్నమాట యాతని కప్పుడు జ్ఞప్తికి వచ్చెను.

బ్రహ్మపురమున నేవో కొన్ని చిక్కులాతనికి వచ్చినట్లును, ఆకారణమున దేశభ్రష్టుఁడైనట్లు నొక వదంతి కలదు. తండ్రికెట్లున్నదో తెలిసికొనవలెనని కమల యక్కడకు వచ్చెను. వేంకటరావెన్నో కబురులామెతోఁ జెప్పెను. శస్త్రవైద్యము నేర్పుతోఁ జేయ

బడెను. రోగి నానాటికి బాగుపడుచుండెను. వారము దినములలో రోగికిఁ బెస్సగా నిమ్మళించుననియు, లేచి తిరుగఁగలడనియు, సర్జను గారు చెప్పిరి.

'మీతండ్రి పూర్వపుబలమును మరల పొందగలఁడు.' వేంకటరావు కమలతోఁ జెప్పెను. 'కొన్ని నెలల వరకును దృఢముగ పని చేయ లేకపోవునేమోగాని, జ్ఞాపకశక్తిమాత్రము తిరిగివచ్చును. కొద్దిరోజులలో నేను నిన్నుఁ బెండ్లియాడుదునను సంగతికూడ గ్రహింపఁగలడు.'

'ఇంతశీఘ్రముగా నేనా? అదియెట్లు సాధ్యమగును?' అని కమల యనెను.

'నేనీరోజుననే ప్రయత్నము చేయుచున్నాను. గడబిడలును, దూబరలును మరేమియును వద్దు. వేరేశలింగం పంతులుగారికి టెలిగ్రాం వేసెదను. వారువత్తురు. బెండ్లి చేయింతురు.'

నీచేతిలోఁబడినగాని నా సంసారము తిన్నబడదు. కమల తల వంచుకొని యూరకుండెను, తెలివితేటలుగల కమల తన సంసారమును ద్రిప్పుచున్నఁగాని తాను బాగుపడఁడని యాతనికి దృఢమైన విశ్వాసము కలదు.

'అంతయును సిద్ధముచేయుచున్నాను. వచ్చెడి వారమున నీరోజుననే పెండ్లి నీసహాయమున నేను మంచివాఁడను కాఁగలను.

అన్నట్టు—మీతండ్రి కిదివరకెప్పుడైన దెబ్బతగిలినదా?'

'అవును. ఒకసారితగిలినది. అప్పటినుండియే యాతనికి మతిపోవుట యారంభమయినది.' అప్పత్రినుండి కమల యింటికిఁబోయెను.

పుల్లయ్య మరలవచ్చెను. 'గొప్పసంగతులను దెలిసికొనివచ్చితిని' ఆతఁడు చెప్పసాగెను. 'మాయన్నగారి వ్యవహారమును జూచుచున్న వకీలువద్దకుఁ బోయితిని. ఆతఁడు కొంతముఖ్యమయిన విషయము

చెప్పెను. ఒక రహస్యస్థలమున ధనాగారము కలదని యాతఁడు చెప్పెను. తాళము మీఁదిఅంకెయెంతయని యడిగితిని.' '306 అని చెప్పెనా?' వేంకటరావు తొందరగా నడిగెను. "అవునదే. ఆతని యొద్ద ఆ తాళమొకరాత్రియుండెనట. ఆనెంబరు తనపుస్తకములో వ్రాసికొనెనట. వాఁడు చెప్పిన స్థలమునకుఁబోయితిని. అది గోపాల మునఁగలదు. అందు అక్కడ కొన్ని పుస్తకములున్నవి. వానిపయి మాయన్న పేరుకలదు. ఆయింటియద్దె యేడాదికొకసారి చెల్లింపఁ బడుచుండునట. గతవారమున ముందువారమే అద్దెచెల్లించిరట 'గత వారమునకు ముందువారమా?' వేంకటరావనెను. 'అట ధనాగార మా? ధనముంచుకొనుటకు అద్దెకొంపలుకలవా? అట్టివి దిట్టముగాఁ గట్టియుందురు కాఁబోలు. అద్దెకూడ జాస్తిగా పుచ్చుకొందురు కాఁ బోలు. అద్దెయెంత?'

'డెబ్బదిరూపాయిలు.' పుల్లయ్య చెప్పెను. 'అదినాకు చాల వింతగా కనుపడెను. విశ్వనాథశాస్త్రి కాపురముచేయుచు కొనుటకు దమ్మిడీలేక లేకయుండెను. ఎట్లు డెబ్బది రూపాయిలు చెల్లించెను? అను సంగతి—అయిల్లెవ్వరిది? అనుసంగతిభోగట్టా చేసితిని. ఇచ్ఛాపుర మున నే యున్న ఒకవర్తకునిదనియు నతని గుమాస్తాయిక్కడ నున్నా డనియుఁ జెప్పిరి. ఆగుమాస్తా యొద్దకుబోయితిని. నీవు ఆయిల్లెవ్వని కద్దె కిచ్చితివని యడిగితిని. విశ్వనాథశాస్త్రిగారికని చెప్పెను. ఆతని నీవెఱుగుదువాయని మరలనడిగితిని. ఎఱుగనని చెప్పెను. ఎట్లుసొమ్ము చెల్లింపబడుచున్నదని యడిగితిని మనియార్డరు మూలమున వచ్చుచున్న దని చెప్పెను మీసెట్టికి తెలిసియుండునా యని యడిగితిని. తెలిసియుండ వచ్చునని చెప్పెను. అక్కడనుండి మరల నిచ్ఛాపురమునకువచ్చి తిని సెట్టి యింటికేఁ బోయితిని. సెట్టియూరిలో లేఁడు. చెన్నపట్టణ మునకుఁ బోయెననియును, నెలదినములకుఁ గాని రాఁడని నింటివారు

చెప్పిరి. ఇంటిలో నాఁడువాండ్రును బల్లలుమాత్రమేకలరు. ఆడువాండ్రి నడిగితిని. విశ్వనాథ శాస్త్రియెవరో మాకుఁ దెలియదని చెప్పిరి. పిల్లలనడిగితిని. అందుపదియేండ్ల కుఱ్ఱవాఁడొకఁడుండెను. వాఁడే పెద్దవాఁడు వాడెఱుగుదును. చెప్పెను. బ్రదుకు జీవుఁడా యనుకొని, ఎట్లుండు నని యడిగితిని. పొడుగుగానుండుననియు, నల్లనిముఖమును, నల్లనికోరమీసములు నుండుననియుఁ జెప్పెను.'

వేంకటరావు వింతగానే వినుచుండెనుగాని. మాటాడక పుల్లయ్య చెప్పుచున్నది యూకొట్టుచు మాత్రముండెను.

దానిసంగతి యెట్లున్నదో చూచితివా?' పుల్లయ్యమరలఁ జెప్పసాగెను. బ్రహ్మపురములోని వారంఱును విశ్వనాథశాస్త్రి వెఱ్ఱివాఁడనియే యనుకొనుచున్నారు ఆతని ధనమంతయుఁబోయెను. ఏ కారణముననోగాని, మఱియెవ్వఁడో ఆతని పేరు పెట్టుకొని వ్యవహారము చేయుచున్నాఁడు నల్లనికోఱమీసములున్న పొడుగుపాటి మనుష్యుఁడొకఁడు విశ్వనాథశాస్త్రి పేరుగలవాఁడయ్యెను. ఇంటియద్దె ఎప్పటిదప్పుడు మనియార్డరుకట్టి పంపివేయుచుండుటచే వాఁడెట్టివాఁడో తెలిసికొనయత్నము ఇంటివానికక్కఱలేదుగదా ఇప్పుడున్న సందేహమేమనఁగా ఏడాదికి అంతయద్దె యేల చెల్లించుచున్నాఁడు అని? బహుశ? ఇనుపపెట్టెలో విలువగల వస్తువులుండి యుండును. ఆ కారణమున నెన్నటికయిన వానిని సంపాదింపలేమా యను ధైర్యము నద్దెచెల్లించి యిల్లుతన స్వాధీనములో నుంచుకొనుచుండెను. ఆ పెట్టెలో విలువగలవస్తువు లున్నవని నీయుద్దేశమా? అని వేంకటరావడిగెను.

'కాదు. చిత్రాపుస్తకములు, ఆవర్జాపుస్తకములవంటి వేవో యుండునని నాయుద్దేశము. ఆమహానుభావుఁ డెవ్వఁడయిననేమిగాని, ఇనుపపెట్టిదాళమునకుమాత్రము దేవులాడుచున్నాడు ఆతాళమెక్కడనున్నదో ఆసంగతి వానికిఁ దెలియవచ్చును, తెలియకపోవచ్చును,

అద్దెమాత్రము చెల్లించివేయు చున్నాఁడు. వానిసంగతి యంతయు నాకటిరెండు రోజులలో యథార్థముగా తెలిసికొందును క్రొత్తసంగతి యొకటిమాత్రము తెలిసికొంటిని. ఆయిల్లే అద్దెకు కావలెనని కృష్ణాజీ వర్తకుని పేర నుత్తరము వ్రాసియున్నాఁడట.'

'దాని తాళమువాఁడెత్తుకొని పోయెనుగదా' అని వేంకటరావనెను. 'ఔనవును. బాగుగా జ్ఞాపకము చేసితివి ఆసంగతి నేను మఱచియే పోయినాను' పుల్లయ్యయనెను. 'అది ప్రమాదమైనపనే కాని, వానిని వ్యర్థముగాఁ బోనిత్తునా.'

పుల్లయ్య దీర్ఘాలోచనలో మునిఁగెను. మౌనము వహించెను. కొన్నినిముసములలోనే యాతఁడక్కడనుండి వెడలిపోయెను. సాయంకాలము తిరిగి వచ్చెదనని చెప్పెను. వెంటనేయాతఁడు పోలీసు స్టేషనుకుఁ బోయి యచ్చన్నకొఱకు బోగట్టాచేసెను. రాత్రియం ...లో కేసు పైని పోయియుండి, నిద్రలేకపోవుటచే నింటియొద్ద నిద్రపోవుచుండెనని చెప్పిరి. ఇంటికిఁ బోయియాతని లేపెను. వాఁడు లేచి, పుల్లయ్యగారేపని చెప్పిన నాపని చేయుటకు సిద్ధముగా నున్నానని చెప్పెను.

'కృష్ణవేణి పరిచారికయగు పైడిని నీవు స్వాధీనము చేసికొంటివా?' అని పుల్లయ్య యడిగెను.

'చేసికొంటి'నని యాతఁడు చెప్పెను.

'నీవెట్లుచెప్పిన నట్లామె చేయునా?'

'తప్పక చేయును.'

ఆమె గుట్టంతయు అచ్చన్న తెలిసికొనెను. తానా సాయంతనము పయిడియొద్దకుఁ బోయెదననియు, నేమిచేయుమన్నఁ జేసెదననియు నాతఁడు చెప్పెను.

'దానికి బుద్ధివచ్చినట్లు చేయవలెను' పుల్లయ్య చెప్పెను. 'జెయిలులోఁ బెట్టుటకు మాత్రము నాకిష్టములేదు.'

'ఏమిచేయుమని సెలవు?'

'మఱేమియును లేదు. ఆ జిగినీసంగతి కమల కపకారము చేయనెంచి, కృష్ణవేణియే దొంగిలించి మరల కమల పెట్టెలోనే పెట్టెనని నీకును నాకును దెలియును. ఆసంగతి దానినోట చెప్పించవలెను. ఈరాత్రి కృష్ణవేణితో నేను మాటాడుచున్నప్పుడు సంగతి యొప్పింపవలెను. అదికాక, మఱికొన్ని పనులున్నవి. వానిలో నే నెట్లు చెప్పిన నీవట్లు చేయవలెను.'

అచ్చన్న తలయూచెను. పుల్లయ్యపయి నాతనికి గౌరవము కుదిరెను. కావున, నాతఁ డేమిచెప్పినను, చేయుటకు సిద్ధముగా నుండెను. 'అంతయును జేయఁగలను.' అచ్చెన్న చెప్పెను. 'పైడి చురుకైనదే. కాని నాగుట్టుమాత్రము తెలిసికోనలేక పోయినది. రాత్రులయందుఁ దనయొద్దకు వచ్చుచున్నవాఁడు తనయొద్ద జిగినీ గుట్టు తెలిసికొన్న పోలీసుఉద్యోగస్థుడే యని యామెకు తెలియదు. కృష్ణవేణియెదుట దానిచేత నిజము చెప్పించవలయునని గదా మీ యుద్దేశము?'

'అవునంతే. ఆమె కృష్ణవేణి యొద్దకుఁబోయి పోలీసువారికి రహస్యము దెలిసిపోయెనని చెప్పవలెను. నేనప్పుడు కృష్ణాజీగారిని చూచు మిషచే నక్కడకుఁ బోయెదను. సమయమున నాకు సంజ్ఞ చేసినచో నేను నీయొద్దకు వచ్చెదను. కొన్ని నిముసములలోనే ద్రోహపరంపర బయలుచేసెదను.'

రాత్రి భోజనమైన తరువాత అచ్చన్నపయిడిని చూడఁ బోయెను. ఆకాశము నిర్మలముగా నుండెను. చల్లనిగాలి వీచు చుండెను. 'నీతో కొన్ని ముఖ్యాంశములు మాటాడవలెను.' అచ్చన్న చెప్పెను, 'పెరటిలో నరఁటిచెట్లమూలకుఁ బోవుదము పద. మన రహస్యము నెవ్వరును కనిపెట్టరను కొందును.' అరఁటిచెట్ల మూల కిద్దఱును బోయిరి.

'హృదయేశ్వరీ! నాపయి నీకు సంపూర్ణమోహము కుదిరినట్టే కద.'

పైడి తెల్లబోయెను. తెప్పవాల్పక అచ్చన్నవయిపు చూచెను. మూతికిఁ గట్టుకొన్న గడ్డములును, మీసములును, అచ్చన్న పీకి వయిచెను. ఊర్కగా నున్నదని సమాధానము చెప్పెను.

'ప్రాణేశ్వరీ! ఇదివరకు నీవు తెలివిగలదానవని యనుకొంటిని. గాని తెలివిమాలినదానవని యిప్పుడు పోల్చితిని.'

'అవునవును. ఎఱ్ఱపాగా పెట్టుకొని, ఆవేళ నావద్ద సమాచారము పిలిసికొన్న పోలీసువాఁడనని నేనును బోల్చితిని. నేనేమి తప్పుచేసితిని చెప్పుము?'

'ఏమి యట్టి ప్రశ్నయడుగుచున్నావు? నీవు నాకుఁ గ్రొత్తదానవు కావు. నాఁడు శాపురములోని దొంగతనము నాటినుండి యును నిన్ను నే నెఱుఁగుదును. నేనొక్కసారి పెదవి విప్పినచో నీవేజయిలులో నుందువో తెలియునా?'

'పోల్చియుండిన, నీకు విషముపెట్టి యుండనా? పిల్లియెలుకను వలె వేఁటాడి యుండనా?'

'నాకెంతమాత్రము ననుమానము లేదు. నీవంతదానవౌదువు వీరియింట నేలఁ బ్రవేశించితివో ఆయూసు నాకక్కఱలేదు. కాని, న్యాయముచెప్పెదను వినుము. నీవొకపని చేయవలసి యున్నది. అది చేసినచో, నీమీఁద నేను చూపిన మోహమంతయును వాస్తవమగును. చేయకపోయిన నీపనియండే—'

పైడి యొకవిధమగు చిఱునవ్వు నవ్వెను. ఆతనిపయిఁ దీవ్రమగు కోపమువచ్చెను. వీలైనచో నాతనిఁజంపి వేయవలెననికూడ నుద్దేశించెను. కాని, యామె కింతలో భయమొకటి యంకురించెను. కారాగృహమున నుండవలసి వచ్చునేమోయని తలఁచుచుండెను.

'న్యాయమయిన పనియేమి చేయుమన్న జేసెదను' అని యామె చెప్పెను.

'ఆజిగినీ సంగతినాతో యథార్థముగాఁ జెప్పెదవా లేదా? అది కమల పెట్టెలోని కెట్లుపోయినది? కొంతవరకు నాకు దెలియును గాని, అంతయును దెలియవలెను. నిజముచెప్పినచో నీవు నేనే—నేను నీవే—చెప్పక పోయిన నీవు నీవే—నేను నేనే.'

ఇంతేనా? అయినఁజెప్పెదను. కృష్ణవేణి జిగినీదొంగిలించి తనపెట్టెలోఁ బెట్టికొనెను. హత్యసంగతి విన్నతరువాత జిగినీ దొంగిలించితినని నేను కృష్ణవేణిని నిందించితిని. మతిపోయి యామె నిజము నాతోఁజెప్పెను. ఆమెకు వేంకటరావుపయి మోహము. అందుచేత కమలపయి కోపము. కమల పెట్టెలోఁబెట్టివేయు మని నేనే యామెకుఁ జెప్పితిని. ఇంతెందుకు—నేనే కమలపెట్టెలోఁ బెట్టితిని.' 'నీవు తెలివి గలదానవు గదా, నీకెప్పుడు నపకారము చేయుమని కమలకు నీవేల యుపకారము చేసితివి?'

'నిజమే. నిజమే. పొరపాటే. అయినను, నేనిక్కడకు వ్యర్థముగా రాలేదు. తిండిలేక రాలేదు. కృష్ణవేణిని బుట్టలోఁబెట్టవలెనని వచ్చితిని. ఆపనిలో జయించితిని. ఇఁక నిక్కడనుండి పోవలెను. ఏల యిక్కడకు వచ్చితినో అదిమాత్రము చెప్పెను. బ్రహ్మాకయి నన్నుఁ జెప్పను. అచ్చన్న పైడిని ముద్దుపెట్టుకొనెను. 'ఈమాటలు కృష్ణవేణిచే ననిపింపగలవా?' అని ధైర్యముతోననెను. ముద్దుతో మోహమంకురించెను. ఇది యెంతపని. కృష్ణవేణివలననే యీసంగతి స్వయముగా వినవలెననియెంచినచో, నామె చేతనే చెప్పింపఁ గలను.' పైడిచెప్పెను.

'బాగు. బాగు నీవు తిన్నగా కృష్ణవేణియొద్దకుఁ బోయి యామెను బెదరించు చుండుము'

పైడి కృష్ణవేణియొద్దకుఁ బోయెను. పుల్లయ్యానీడ యాప్రక్క నుండి పోవుచున్నట్లచ్చెన్నకుఁ గనుపడెను.

---

## ఇరువదియైదవ ప్రకరణము.

### తప్పించుకొనుటకు త్రోవలేదు.

కృష్ణవేణి గది మనోహరముగా నలంకరింపఁబడి యుండెను. విషాదసూచకము లేవియు నందుఁ గన్పడలేదు. వస్తువులన్నియు నొక దాని కొకటి యీడుదీయకుండెను.

చిత్తరువులు, కుర్చీలు, బల్లలు, పూవుల గుత్తులు. చూచిన కన్నులు మఱఁగిపోవు చుండెను. పుల్లయ్య కిటికీప్రక్కను క్రీనీడలో నిలచి గదివైపు చూచుచుండెను. అంతయును చిత్రముగా నాతనికిఁ గన్పడెను. తన కార్యభారమునంతయు నొకమూలఁ ద్రోసి గదిలోని సౌందర్యముపై నొక్కసారి మనస్సు నిల్పెను. అంతటి ద్రోహచింత గల కృష్ణాజీకి ప్రకృతి సౌందర్యమునందింతటి యభిరుచి గలుగుట వింతయని యనుకొనుచుండెను. కాని, యిదియంతయు నెంతకాల మిఁక నిల్వఁగలదని కూడ తలఁచుచుండె.

కృష్ణవేణి హార్మోనియము వాయించుకొనుచుఁ బాడుకొను చుండెను. అదివరకెప్పుడు నామె యింత యానందముగ నుండలేదు. పైడి లోపలికి వచ్చెను. మెల్లగాఁ జల్లగాఁ వచ్చి ప్రక్కనొక కుర్చీపైఁ గూర్చుండెను. విసనకర్ర యొకటి తీసి విసరుకొనుచుండెను. ఇది యంతయును గనిపెట్టి పుల్లయ్యానవ్వుకొనుచుండెను. కృష్ణవేణి కొంతవఱకు పైడిని జూడలేదు. ఏదో పనిమీద మొగమెత్తుసరికి ప్రక్కను పైడి కనపడెను. వెంటనే యామె లేచి నిలువఁబడిహార్మో

నియమ్ కప్పవైచెను. 'మూర్ఖురాలా! ఏమి సాహసము నీయుత్సా తమునకు హద్దులేదా? నెత్తిపై గుడ్డవేసి, వీపుపై కొరడాదెబ్బలు కొట్టి, పీకపై జేయినైచి తగిలివేయించుకొనవలెనని బుద్ధిపుట్టినదా? నీకేమి మతిపోయినదా లేక త్రాగియున్నావా?'

పైడి లేవలేదు. 'నీకున్నపాటి మతి నాకు లేకపోలేదు.' ఎప్పటియట్లు విసరుకొనుచునే యుండెను. నీగతినీవు చూచుకొమ్ము

కృష్ణవేణి నిశ్చేష్టురాలవయ్యెను. పైడికి వెర్రియెత్తినను అదివరకు పైడీ పెంకెతన మప్పుడప్పుడు చేయుటకలదు. కాని, యెన్నడు నింతమితిమీరలేదు. కృష్ణవేణి యానందమంతయు మాయమయ్యెను ఏదియో విచార మామెకు గలిగెను. దాసి దానికి లొంగపోయితినని యామె యూహించెను. 'లేచిపో!' ఆమె కంఠధ్వని మారెను. 'లేచిపో! నిన్నుఁజూచిన నాకుఁ గోపము వచ్చుచున్నది. కిటికీలన్నియు దెఱచియున్నవి. ఎవ్వరయినను నిన్నుజూచిన నేమనుకొందును!'

పైడి తలయూచెను. లేచి నిలువఁబడెను. 'సరే—కాని, నా కేమియును భయములేదు. ఈయింటికిని నాకును ఋణము తీరినది. కొద్దికాలములోనే, నీకును నీయింటికినిగూడ ఋణముతీరును. మగవా డెవ్వఁడును నాగుట్టు తెలిసికొనలేడని యిదివరకు నేననుకొనుచుంటిని. ఇప్పుడది యసత్యమైనది మగవాఁడొకడు నన్ను మోసపుచ్చెను దానివలన నీకును నాకును గూడ నష్టమురాగలదు.' '... ... టాడుచున్నావు? కృష్ణవేణి యనెను. 'దానికి నాతో నేమి సం సంబంధము పెరటిలో నీతో నప్పుడప్పుడు మాటాడుచున్నవాఁడే—వాఁడే' పైడిచెప్పెను పైకిమెత్తగానే కనుపడెను. వాఁడు పోలీసు వాఁడట!'

'పోలీసువాఁడా! పోలీసువాఁడా' కృష్ణవేణి యనెను. 'పోనీ, పోలీసువానివలన నాకేమి భయము?'

'ఉన్నది. అమ్మా—భయముపున్నది పైడి గట్టిగా ననెను. 'అంతయును నిజముగాఁ జెప్పివైచెదను. పోలీసువాఁడు నాయొద్దకు వచ్చి నన్ను మంచిమాటలాడెను. పడుచు మగవానిని జూచిన నాకేదోలాగుండును. అందును వాఁడు మాజాతివాడని చెప్పెను. నామనస్సులో నెట్లుండవలెనో యట్లుండెను. వానికి లొంగిపోయితిని. వానిపేరు అచ్చన్నయఁట.'

కృష్ణ యులికిపడెను. ఆ పేరామెకు క్రొత్తదికాదు. కమల పెట్టెలోనుండి జగినీసోదాలోఁ బైకి దీసినవాఁ డచ్చెన్న యని యామెకు జ్ఞాపకము వచ్చెను. ఏదియో యాపద యామెకుఁ బొడ కట్టెను.

'మారువేషముతో వచ్చి నీతో స్నేహము చేసెనా? ఆమె సణగుకొనెను. 'ఆపనియేల చేయవలెను?'

'నిజము తెలిసికొనుటకు మరేమున్నది. నిజము తెలిసికొనుటకే. అంతయును వానితోఁ జెప్పివైచితిని.

నీవు నన్ను నమ్మినసంగతి, పిలిచినసంగతి, జిగినీ తీసినసంగతి, నాచేతిలో బెట్టినసంగతి, నన్ను పెట్టెవద్దకు వెళ్ళుమన్నసంగతి, నన్ను కప్పుతీయుమన్న సంగతి, నేను తీసిన సంగతి, జిగినీపెట్టెలోఁ బెట్టుమన్నసంగతి, నేను పెట్టినసంగతి, నన్ను వెళ్ళిపోయిరమ్మన్నసంగతి-యింక నేవేవో నడుమనుండిపోవచ్చును. జదువుకొన్నదానను కాను గదా—అన్నియును జెప్పివేసితిని. ఆపని చేయుటకు నాకిష్టము లేకుండెను. గాని నామనస్సు నేను చెప్పినట్లు విన్నదికాదు దాసి వాండ్రపై గీకలువేసినట్లు మనస్సుపైఁ గీకలు వేయగలమా? అమ్మా, అక్కడ నందరును దాసోహమే. ఏరాయియైననేమి పళ్ళూడ కొట్టుటకు—కాదు—కొనుటకు—చెప్పివేసితిని. కృష్ణ నేఁటికి ముక్కు మొగము కన్నులు అంతయు నెఱ్ఱవయ్యెను. పైడిని జుట్టుపట్టు

కొనెను. మొగమువైపు చూచెను. పైడి చూపులలో మార్పు కనుపడెను. కృష్ణకు భయముకలిగెను. జుట్టు విడచివేసెను. 'అమ్మా శాంతించుము.' పైడి చెప్పెను. 'నీయవస్థకు నాకు జాలియగుచున్నది. మనమందరము నాడువాండ్రము. మనగుట్టు మనకుఁ దెలియదా? పైడి యేల పిరికిదయ్యెనని యనుకొనుచున్నావు కాఁబోలు!' 'అవును నిజముగా నీవు పిరికిదానవే యైతివి. పోలీసువానికి గుట్టిచ్చితివి. లేకున్న బ్రహ్మకయినఁ దెలిసియుండ లేదు. వానిని దృణీకరించి, త్రోసివేసినచో నెంత బాగుగ నుండును?' 'అక్కడకు నీవు చేయగలిగినట్లు! అమ్మా, ఆడువాండ్రందఱు నొక్క గోతిలోని మన్నుతోఁ జేయఁబడినవారే. నీకుఁ దెలియదా? అందును మరియొక విశేషము కలదు. ఆ పోలీసువెధవకు నా భూతభవిష్యద్వర్తమానము లన్నియును దెలియును. నేనేమో నమ్మకమైన పరిచారికనని నీవనుకొంటివి. ఆ పోలీసు వానికిష్టమైన యెడల నన్ను జెయిలుకు పంపఁగలఁడు.'

కృష్ణవేణి విచ్చపోయి చూచుచుండెను!

'ఏల వింతగఁ జూచుచున్నావు? నాతోఁబాటు జెయిలుకుఁ బోవలసినవారు మఱికొందరీ యింటిలోనే యున్నారు. తెలిసినదా!'

కృష్ణవేణి యాపాదమస్తకము వణకుచుండెను. నిలువలేక హార్మోనియముపైఁ జేయూనెను.' ఏమనుచున్నావు? నేను ప్రమాణము చేసి—' 'వద్దువద్దు నీవు ప్రమాణము చేయవద్దు.' నీవు మా యింటికేల వచ్చితివి?'

'పనియుండి వచ్చితిని. నీవిచ్చు గుడ్డకు రాలేదు. పెట్టు తిండికి రాలేదు. పెద్దపనియుండి వచ్చితిని. నే నెవ్వతెనో నీకుఁ దెలిసినదా? దొంగల గురువును. ఏపని చేయుమన్నఁ జేయఁగలను. ఎవ్వరిని లక్ష్యము చేయను. కాని నాగుట్టు బైట బడినది. పోలీసువాఁడు నన్ను జెయిలుకుఁ బంపును. నిజముచెప్పి యాపద తప్పించుకొనుము.

'జిగినీ సంగతి యంతయును పోలీసువారికి చెప్పివేయుమందువా? అది నాకొంప ముంచును.'

'చెప్పకపోయిన యెడల మఱింతకొంప ములుగును.' పైడి శాంతముగాఁ జెప్పుచుండెను. బోనులోనికీడ్చెదరు. ప్లీడర్లు ప్రశ్నలు వేయుటతోనే మఱి తప్పించుకొనలేవు. జిడ్జీగారుడఁదీయుదురు. నీవివివర ముచెప్పుడును బోనెక్కియెఱుఁగవు. నేనెఱుఁగుదును. అదినాకుఁగొట్టిన పిండి—'

'నన్ను వారేలకొట్టకులాగెదరు?' కృష్ణవేణి యుత్కంఠతో జెప్పెను. "నిన్నొకఁడు మోసపుచ్చినందున, నీవంత నిజమును జెప్పితివి. నీవు చెప్పిన దానిని నే నేలబలపరచవలెను? నేన బోనెక్కిన యెడల నంతయు నసత్యమని చెప్పివేయుదును.'

'అప్పుడు పీకమొయ్యఁగఁ దెచ్చుకొందువు. నేను మరల బోనెక్కి నిజము చెప్పెదను. నాకథ న్యాయముగఁ గన్పడు చుండుటచే నామాట నమ్మెదరు. నీవు సణగుచు, నసగుచు, యెవ్వరును జెప్పుచున్న నీమాట నమ్మరు. దీనికంతటికిని వెనుక దాళము చిప్పపట్టుకొని భాగవతమాడించు మాయల మల్లిగాడొకఁడున్నాఁడు. వానికు పుల్లయ్యయట. ఆపుల్లయ్య పిచ్చిపుల్లయ్యవలెఁ గన్పడును గాని, వానికంతయును దెలియును, టక్కుటమారి విద్యలెఱుఁగును. చూచితివా? ఆవేళ చేరుమాలుమిష చేత నీచేత నెన్ని చెప్పించెనో, నేను చాటునుండి వినుచునేయుంటిని. సేవకులు కొందఱు కూడ దొంగతనముగా వినిరి. జిగినీ నీవేయెత్తుకొని పోయితివని లోకము కోడియై కూయుచున్నది.'

పంజరములోని చిలుకవలె నొక్కసారి కృష్ణచుట్టును దిరిగెను. ఏవైపు తిరిగిచూచినను, పైడిచెప్పినది సత్యముగానే కనుబడు

చుండెను. చేసినపని సిగ్గుపని. అది పైవారియెదుట నొప్పుకొనుట మఱింతసిగ్గు. పద్మవ్యూహమునఁ బడెను. తప్పించుకొనుటకు త్రోవ కనపడలేదు.

'అంతయు నీనెత్తిపయి వేసికొనలేవా? అంతయును నీవేచేసి తివని యొప్పుకొనలేవా? ఆపోలీసువాని కీవిధముగా చెప్పి యెక్కడి కయినఁ బారిపోలేవా? నానగల్నయును నీకిచ్చివేయుదును. నామా నము కాపాడవా?' అనికృష్ణ బ్రతిమాలు కొనెను.

'నీకు లోకజ్ఞానములేదు. నేరమంతయును ఋజువగునంతవర కును పోలీసువారు విడచెదరా? విడువరు. నీవును, నేనును, నిందుగ లసి యున్నాము. తప్పించుకొనుటకుఁ ద్రోవలేదు. శంకరశాస్త్రి హత్యకు జిగిసి వ్యవహారము చిన్నయంగము. మొదటిది బయలు పడినచో రెండవది బయలుకాక తప్పదు. అది యయినవెంటనే యీయిల్లు కూలిపోవును.'

కృష్ణమాటాడలేదు. కనులుచీకటిక్రమ్మెను. చెవులు వినబడ లేదు. మతిపోయెను. మూర్ఛవచ్చినట్లయ్యెను. ఇంతలోగొంచెము తెలివివచ్చెను. మొగమెఱ్ఱబారెను. ఆశయొకటికలిగెను.

నన్నేమి చేయుమందువు? పోలీసువారి యొద్దకుబోయి యంత యుఁజెప్పివేయుమందువా?'

'ఎట్లుతోచినట్లుచేయుము. నాకేమియును భయములేదు. నేను మంచిదానను. మిక్కిలి మంచిదానను. కాకున్ననీపాటికిఁ బారిపో యియే యుందును. నే నేపనిపయివచ్చినానో యదికాలేదు. ఈచిక్కు లలో నీవు మునిగితేలియుందువు. పోలీసు వారియొద్దకు నీవుపోనియె డల, వారే నీయొద్దకు వత్తురు. అంతయును బిగిసిపోవును. అప్పుడు నన్ను నిందింపవద్దు' వినకట్ట నేలఁబారవైచి పయిడిపయికిఁ బోనెం చెను. ఆమె చెప్పవలసినది మఱియేమియును లేదు. తన్ను గాపాడ

దనని యిచ్చెన్నవరమిచ్చెను. కావున, నామె వానియెడలఁ గృతజ్ఞురాలై యుండెను. చేయవలసిన పనిచేసెను. లేకున్న. దానిని నిర్బంధించి, జెయిలుకుఁబంపు సామర్థ్యమచ్చన్నకుఁ గలదు. పైడియేదో గొప్పకార్యము చేయఁదలచి యిక్కడకువచ్చెను. కార్యమునకు భంగముకలిగెను. కాని, కార్యభంగముల కిదిమొదలు కాదు. ఇట్టివెన్నో యిదివర కేజరిగినవి. కావున, నామె మొండిదేరెను. 'అమ్మా సెలవు. నేను జెప్పవలసినంతవరకుఁ జెప్పితిని. ఆపైని నీయిష్టము నీ బ్రతుకుచూచుకొమ్ము చదువుకొన్నదానవుగదా. నీవెంతయసత్యము జెప్పెదవో నీకంతనష్టము కలుగును.

క్రీనీడలో దాగియుండి పుల్లయ్య యంతయును వినుచుండెను. పైడి పైకి వచ్చెను. కృష్ణవేణి కన్నులనుండి నీరు కారుచుండెను. కుర్చీపై గూర్చుండబడెను. రెండుచేతులతో మొగము కప్పుకొనెను. మరల లేచెను. ఏమియో నిశ్చయము చేసికొనెను.

'సరే—అది యొకటియే సాధ్యమైనట్లు తోచుచున్నది. చేదు మందేగాని' మ్రింగక విధిలేదు. బోనులో నిలచుటకన్న మంచిదే.'

ధైర్యముతోఁ గృష్ణసామాను గదిలోనికిఁ బోయెను. నల్లని చీరయొకటి కట్టుకొనెను. నల్లని కమీజొకటి దొడుగుకొనెను. బండి వానిచే బండి కట్టించి యెక్కడకో బయలుదేరెను. అంతయును జాగ్రత్తగాఁ గనిపెట్టుచున్న పుల్లయ్యకుఁగూడ నామె యేమిచేయ నెంచెనో బోధపడలేదు. ఆమె వెనుక నెవ్వరయిన రహస్యముగ పోయినచో బాగుగ నుండునని యాతఁడనుకొనెను.

కృష్ణవేణి తిన్నగా సూరమ్మగారి యింటికిఁ బోయెను. కిటికీలో లాంతరు వెలుగుచుండెను. కమల యేమో వ్రాసికొనుచుండెను కృష్ణవేణి లోనికిఁ బోయెను. కమల యాశ్చర్యముతో జూచి, యొక కుర్చీవేసి యామెను గూర్చుండబెట్టెను.

‘ఎన్నడు ననుకొనలేదు. సంతోషముగా నున్నది.’ అని కమల యనెను.

‘నీవు నన్నుఁ గాపాడవలెను. నీకు నే నపకారము చేసితిని ద్రోహము చేసితిని. నిన్నుఁ బాధచేయ దలఁచితిని. కాని, నీకు, నాపైఁ గోపము రాలేదు. నీవు నన్ను గాపాడవలెను. కాపాడెదనని చెప్పుము. నా మర్యాదను గాపాడవలెను. మానము కాపాడవలెను. నన్ను బ్రతికింపవలెను.’ అని కృష్ణ దీనముగా వేడికొనెను.

---

## ఇదువదియాఱవ ప్రకరణము

### అగ్నిహోత్రము

కమల హృదయము వెంటనే కరఁగెను. తన కెంతయో యపకారము చేసినదే యయ్యెను, కృష్ణవేణి యిట్టి చిక్కులలోఁబడి పోయినదిగదా యని విచారము నొందెను. వెనుక నొకప్పుడు తన కామె చేసిన యుపకారములను స్మరించుకొనెను. ‘అక్కా, యీ నిలువుజీత మెవరికి? కూర్చుండి మాటాడకూడదా? నిన్నుఁజూచి యెన్నియో దినములైనది. వాచిపోయితిని. కూర్చుండి సావకాశముగా మాటాడుకొనెదము. నాకుఁ జేతనైన సహాయము నీకుఁజేసెదను. కూర్చుండుము.’ కరుణారసపూరితములగు కమల మాటలను వినుటతోనే కృష్ణవేణికి మనస్సులో నేదోయొక విధమగు బాధకలిగెను. వేయికొరడాలతో నొక్కసారి వీపునఁ గొట్టినట్లయ్యెను. కమల యుత్తమురాలనియు, నామెయొద్ద నిలచుటకుఁగాని యామెతో మాటాడుటకుఁగాని, తా నర్హురాలుకాదని కృష్ణకుఁ దోఁచెను. దిక్కులేనికాలమున దిక్కై యింటిలోఁబెట్టుకొని తుట్టతుదకు కమల

నుటికొయ్యకుఁ గట్టివైచెను. చేతులారా బెంచి పెద్దజేసిన మేకపిల్లను గత్తితో నఱుకు కఠినాత్ముని చరిత్ర యామెకుఁబోడకట్టెను. ఆబాధ వలన కృష్ణకుఁ గన్నులనుండి నీరొక్కసారిగఁ బ్రవహింపసాగెను. నోరెండజొచ్చెను. పెదవులదరఁజొచ్చెను. కమల తెచ్చియిచ్చిన మంచినీరు త్రాగి కొంచెము సేదతీరెను. కమల నవ్వుముఖముచూచి మఱికొంచెము తాపమడగెను. 'అక్కా, కమలా, నీకునేను ద్రోహము చేసితిని. నేనెంత ద్రోహముచేసితినో దానిపరిమితినీకుఁ దెలియదు కాబోలు.'

'నాకు దెలియును— తెలియునని యనుకొందును. నాజిగినీ నీవే దొంగిలించితివట.' కమల మెల్లగాఁననెను. 'దానిని నీవే నాపెట్టెలోఁ బెట్టించితివట.'

'అవును. నేనొప్పుకొందును. ఆక్షణమునఁ బుట్టినయొక పాపపుఁ జింతచే నాదొంగతనము చేసితిని. కాని—'

'వేంకటరావుగారును నేనును నాడుకొనుచున్న మాటలన్నియును పొంచుండి నీవు వింటివఁట. తరువాత హాలులోనికి వచ్చి జిగినీ యెత్తుకొనిపోయితివట.'

'అవును నిజమే.' అని కృష్ణ యొప్పుకొనెను.

'మా రహస్యమును నీవును గనిపెట్టితివి. వేంకటరావుగారు నన్నుఁ బెండ్లియాడ నిశ్చయించెనని తెలిసికొంటివి. నీవాయనపై ననురాగము చెందియుంటివి. మాయిద్దఱకు నెట్లయిన నెడబాపులు చేయనెంచితివి.'

'ఈసంగతి వేంకటరావు నీతోఁ జెప్పెనా?'

'లేదు.' ఆయన నాతో నీసంగతి యేలచెప్పును? నేనే పోల్చుకొంటిని. ఆడువారి కష్టసుఖములు తెలిసికొనలేని మూర్ఖురాలను గాను గాని, ఆయనను బెండ్లియాడనెంచుటకు నీకన్న నాకు నెక్కువ

కారణములున్నవి. నీతండ్రి భాగ్యవంతుఁడు. నీకుఁ గోరఁతయును లోపము లేదు నీభర్త యవివేకమున లగునేమి, నీతండ్రి యవివేకము వలననేమి? నీభర్త నిన్ను విడిచెను. అల్లుని చిత్తవృత్తి కనిపెట్ట వలసిన భారము నీతండ్రిది. మగని చిత్తవృత్తి కనిపెట్టవలసిన భారము నీది. మీయిద్దఱును లోపములు నెత్తిపైఁ బెట్టుకొని, భర్త గలిగియుండియు నీవు మఱియొక త్రోవ యాలోచించుట తగని పని. భర్తయన నేమియో యెఱుఁగని కాలమున నాభర్త చనిపోయెను. నాతండ్రి బీదవాఁడయ్యెను. వెఱ్ఱివాఁడయ్యెను. నాకు దిక్కు లేక పోయినది. నాపినతండ్రి నన్నక్కఱ చేయలేదు. నీవు నన్నుఁ గడుపులోఁ బెట్టుకొని పోషింపఁబట్టగాని లేకున్నను నాగతి యేమగునో అట్టి యవస్థలో నన్నుఁ బెండ్లియాడుదలఁచి పాపపు త్రోవలో బడకుండ నన్నుఁ గాపాడనెంచి నాతండ్రికి ప్రాణదానమును, నాకు మానదానము నొసంగిన మహానుభావుని నే పెండ్లియాడ గోరితిని. నాకూటిలో బుగ్గిపోయుచుండెనుకాక, నన్నుకౌఁగిటఁ జిక్కించుకొనుగూడఁ దగిల్చితివి.' 'నిజమే' కృష్ణవేణి చెప్పసాగెను. 'కాని, సబబులు చెప్పవలసిన తరుణము మించినది. నాకు కారణములు లేకపోలేదు. నాతండ్రి చేసిన నేరమునకును, నా భర్త యవివేకమునకును నేను జన్మాంతమును దుఃఖములపాలగుచు యుండవలసిన దేనా? నాభర్త నన్నింటఁ జేర్చుకొన్నఁగదా, యాలోచింప వలసిన సమయము నెట్లయినఁ గరగింపఁ బ్రయత్నించుట—అసలునకే మొట్టమొదన నేనేమి చేయఁగలను? సరే. కానిమ్ము. ఏదియైన నైనదే. గతించినది తిరిగి రాదుగదా. నే నపరాధము చేసితిని. నీపాదములపై బడితిని. క్షమింపుమని వేడుకొంటిని. క్షమించెదవా లేదా?'

కమల హృదయము కఱఁగిపోయెను. ఆమె కన్నులనుండి నీరు కారఁజొచ్చెను. 'నీకిప్పుడేమి యాపదవచ్చెను?' అని కమల

యడిగెను. 'పోలీసువారికంతయును దెలిసిపోయినది.' కృష్ణ చెప్పెను 'నాదాసియే నాకు ద్రోహముచేసెను. నన్ను పట్టి పైటఁ బెట్టెను. పైడి యిదివఱకు దొంగిలించుచుండెనట. నాకుఁ దెలియక యామెనిండ జేర్చితిని. పోలీసు వారికీసంగతి తెలిసి దానిని మంచిమాటలాడి దానిచే నంతయుఁ జెప్పించిరి. నేను గూడ కొట్టులోనికిఁబోయి యంతయును జెప్పవలసి వచ్చినదని చెప్పుచున్నారు.'

తప్పేమి?' కమల యనెను. 'కోర్టునకుఁబోయిన తప్పేమి? పెద్దమనుష్యులుండు స్థలముగాని పుండాకోరులుండు స్థలముకాదే. నీవు చేసినపని నాపీక తీసివైచునుగదా! అప్పుడు నీవుచచ్చి నన్నుఁ గాపాడియుందువా? నన్ను బోనులోఁ బెట్టినప్పుడు నీవే మొట్టమొదట వచ్చి నేరము నొప్పుకొనినన్నుఁ దప్పించియుండఁగూడదా?'

కృష్ణ వేఱి మాటాడలేదు. మొగము వంచి, రెండుచేతులతోఁ గప్పుకొనెను. దయమునహ్యానామెకేమో బాధగా నుండెను కమల యీసంగతి కనిపెట్టెను. ఆమెను బాధించుట గాని, సాధించుటగాని, తన యిష్టములేదు. మానవ శరీరముగావున కొంచెము కోపమువచ్చి యీమాటలవశముగఁ బైకి వచ్చుట గుర్తెరింగి మనస్సున ద్రిప్పుకొని పదిలము చేసికొని మరల మాటాడసాగెను. అక్కా జరిగినదేమో జరిగినది. నీవలన నేనుపకారముపొందినదానను గాని పైదానను గాను. వుప్పు పులుసు తిన్నదానను గావున నొడలు దెలియక యేమో యంటిని. తప్పుగాఁ దలపకుము.

నీపై నాకుఁ గోపములేదు. నీవుచేసిన పొరబాటు నేనప్పుడే మరచిపోయితిని నామూలమున నీకేమియును నాపద రానీయను. నాకుఁ చేతనైన సహాయ మేదియైనను జేసెదను. స్వామిద్రోహము చేసికొనుటకే యూరివారందరికిని నాపైఁ గోపముగనుండెను. అట్టిచో దొంగతనము, పైపెచ్చు హత్య, ఇన్ని నానెత్తిపైఁ బడిన నేభరింప

గలనా? లోకమేమైన ననుకొననిమ్ము లోకమునకు నేను జడియుదాననుగాను. కడుపారఁ గన్నతండ్రియును, చేయూర నన్నుధరించిన నా హృదయేశ్వరుఁడును, నేనమాయికురాలనియు, నిర్దోషురాలననియు నెఱిఁగినచో నాకంతేచాలును. వారిద్దఱకు నాపై నేయనుమానమును లేదు. లోకమునంతను మెప్పించుటకుఁ జంద్రమతి దమయంతి మొదలగువారికే సాధ్యముకాలేదుగదా, నాబోటిదే పాటిది? నాపాలిట భగవంతులగు వారిద్దఱును నాపై దయగలిగి యున్నారు. నేనంతకన్న నేమియును గోరను. పోలీసువారును నిర్దోషురాలవని చెప్పినారు. జిగినీ దొంగతనమునుగూర్చి వారేల యంత పట్టుదలతో నాకుఁ దెలియును. నేనంత సహాయమునకుఁ జేయగలిగిన నంతయును జేసెదను. నీపై నాకెంతమాత్రమును గోపములేదు. నామనస్సులో గోపచిహ్నములైన లేవు త్రిశుద్ధిగాఁ జెప్పుచున్నాను. నేఁడునీవు నాతోఁ జెప్పిన సంగతులు కోర్టులో నీవు చెప్పవలసిన యక్కఱ లేకుండ నాకు సాధ్యమైనంత ప్రయత్నము చేసెదను. ఇతరులను గూడ నా చెప్పుచేతలలో నున్నంతవఱకు [illegible] సహాయముచేసెదను. అంతకన్న నెక్కువ చేయఁగల[illegible]నేను.'

కృష్ణ [illegible] నిలువఁబడి, [illegible] పెదవులలో నేమేమో గొణుగుచుండెను. [illegible] కమలకు మ్రొక్కెను. 'వద్దు. నాకు నమస్కారము చేయవద్దు.' కమల యామె చేతులను బట్టుకొనెను. 'నీవు నాకుఁ బూజ్యురాలవు చేసినయుపకారము మరతునా? నీవు కోరకుండగనే యేసహాయమునైనను నీకుమేలు కోరవలసినదానను గదా, నీవుకోరినతరువాత మానివేయుదునా?' నేనుజెప్పవలసినది మఱేమియును లేదు.' కృష్ణదీనముగాననెను. 'నీ దేభారము.

'భయములేదు. గతించినదానిని త్రవ్వవద్దు మనస్నేహమునకు భంగమురావద్దు.'

'సెలవు' 'సెలవు' కృష్ణ బందులు దేరెను.

ఆమెకన్ను లెట్టినయ్యెను మొగమాయితి గ్రిక్కుమండెను నూతిలోఁబడి మరల బైకివచ్చినట్లయ్యెను. పోలీసువారికి తాను స్వయముగా దనగుట్టు చెప్పనక్కఱలేదని యామెకు సంతోషమయ్యెను కృష్ణాజీ యింటిలో నాతనిరాకకై కనిపెట్టుకొనియున్న పుల్లయ్య కృష్ణవేణి మొగమునందలి మార్పునుజూచి, జరిగెనోయని యాలోచింపసాగెను. లోనికిఁ బోనెంచి మరల నాగిపోయెను. పైడీయని కృష్ణవేణిగట్టిగాఁ బిలిచెను. పైడి తొందరగానచ్చెను.

ఏమికావలెను? పైడి యడిగెను. 'నేటికి నేఁజేయవలసినపని పూర్తియైనదని తలఁచితిని. బంట్రోతులతో బేకాడుచున్నాను. ఆట పోవును. వేగము చెప్పివేయుము. పోయెదను.'

బంట్రోతులను దాసీవాండ్రు కూడఁ బేకాడుచున్నారా?' కృష్ణవేణి యడుగెను. 'ఏమి కాలవిపరీతము? క్రొత్తనాగరికత మితి మీరుచున్నది. బ్రాహ్మణులే యనుకొనుచున్న బ్రాహ్మణులను మీరుచున్నారు శూద్రులు. మీరాడుచున్నయాట నేనొకసారినాడ వచ్చునునా'

కొద్దిరోజులలోనే నీకాయవస్థ పట్టింపను' తొందరపడకుము పైడిమోటుగానెను. 'నీకు వంట పెంట చేతకాదుగదా వంట లక్క పనిచేయుటకు—నావలె నంట్లు తోముగతియే పట్టును. నీకేమికావలెనో చెప్పుము.'

'చేయఁగలపని చేసితినని చెప్పుటకు నిన్నుఁ బిలచితిని.' కృష్ణ యనెను. కములయొద్దకుఁ బోయితిని. ఆమెపాదముల పైఁ బడితిని. ఈసంగతి బైలుకురానీయనని యామె నాతోఁజెప్పెను. పోలీసువారి భయము మరినాకేమియును లేదు.'

పైడికృష్ణవైపు చూచెను. ఆచూపులలో అసహ్యమును, ఆశ్చర్యమును, బెనగులాడుచున్నట్లు కన్పడెను.

నీవు తెలివిగలదానవే' పైడియనెను. ఆపని నీవుచేసెదవని నేనెన్నఁడు ననుకొనలేదు. నేను దుర్మార్గురాలనే గాని, నేనుగూడ నట్టి నీచపుపని చేయును. కమలమ్మ నిన్నుకాపాడెదనని చెప్పినదా? నేనే కమలమ్మనైనచో నాలాగునఁ జేసియుండను నీమెడ బొండములోఁ దగిల్చిచూచి యానందించుచుందును. కమలమ్మ వట్టి యమాయికురాలు. వెన్నవంటిది. నిన్నింటిలోనుండి పైకీడ్చివేయ వలసినది.'

'ఆపని నేను—రేపు—నిన్నుఁజేసెదనులే.' కృష్ణ యనెను. 'చేసెదవా? నన్నేనా? నీవేనా?' పైడి హెచ్చరించెను. 'ఉండుముండుము తొందరపడకుము ఇప్పుడే యంటుకొన్నది. నేను చిటికెవేసినంతమాత్రమున నిల్లంతయును నెత్తిపైఁ గూలిపోవును. నాదెబ్బ తెలియదు. నేనొక్కమాట మాత్రమే—చిన్నమాటమాత్రమే—చెప్పవలసియున్నది'

'ఆచిన్నమాట యేదో చెప్పివేయరాదా?' కృష్ణయడిగెను. పైడి విజృంభించెను. ఏమో యనఁ బోవుచుండెను. పుల్లయ్య యుట్టి పడెను. పైడినోరు కట్టఁబడెను. కృష్ణకేల పుల్లయ్యపై గోపము వచ్చెను. 'ఇప్పుడెట్లువచ్చినారు?' ఆమె యడిగెను. 'మాగోలయంతయును మీకేల?'

ఒక్కొక్క ప్రశ్నయొక్కొక్కమారడుగుము చెప్పెదను. నేను కిటికీలోనుండి వచ్చితిని. చల్లగాలికి పెరటిలోనుంటిని. మీతండ్రితో మాటాడుటకు వచ్చితిని ఆతఁడింకనురాలేదు. పువ్వులతో నాటలాడుచుంటిని. ఇది మొదటిప్రశ్నమునకు జవాబు. ఇఁక రెండవప్రశ్న నీగోలయంతయును నాకుఁ గావలెను. నీకు నేనొక బహుమాన మీయవలసి యున్నది. నీకీయవలెనని తెచ్చితిని. ఇదిగో.' ఏమియు నెఱుఁగని యమాయకునివలె పుల్లయ్య జేబులో నుండి ముత్తెపు

చిప్పల డబ్బీయొకటి పయికిఁదీసెను. 'జంకేల? తీసికొమ్ము. అదినీదే. నీవేగెల్చుకొంటివి నీ చేరుమాలునకు బహుమానము జ్ఞాపకమున్నదా?'

కృష్ణ మాటాడలేను. పెదవులు కదల్చుటకు నామెకు వశముకాకుండెను. పయిడిని బయికిఁ బొమ్మని యామె సంజ్ఞచేసెను.

'పైడి యుండిననే నాకిష్టము. ఆమె చేయవలసినపని కొంచెమున్నది. నా బహుమతి నీవు పుచ్చుకొనవా?'

'నీవు నన్నవమానము చేయుచున్నావు.' కృష్ణయనెను. నీ యుద్దేశమేమో నేనెఱుఁగుదును. నీవు నాకొఱకొక వలపన్నితివి. చూచిచూచి నేనా వలలోఁ దగులుకొంటిని. జిగినీ దొంగిలించితినని నానోటనే చెప్పించితివి. అవును. నిజమే కమల కపకారము చేయవలెనను పాపపుబుద్ధిచేతనే యారీతిని జేసితిని. కాని యీసంగతి యంతయును బోలీసువారు పయిడివలన తెలిసికొనిరి.'

'పైడి దొంగలగురువు.' పుల్లయ్యయనెను. 'దానిని లోకమంతయు నెఱుఁగును. మీయింటికిఁ బెద్దపని తలపెట్టియే వచ్చినది. అచ్చన్న కంతయును దెలిసిపోయినది. అంతేకదా పైడీ' 'అవును' పైడిచెప్పెను. 'పోలీసువాడు నన్ను వలలో వేసికొనెను. అంతయును వానితోఁ జెప్పివేసితిని. ఆసంగతి వినియే ఈమె కమలమ్మవద్దకుఁ బోయినది. నేనైనయెడల——

'ఓహో, కృష్ణా—కమల యొద్దకుఁ బోయితివా?' అతఁడు చిఱునవ్వు నవ్వెను. 'నీకేమియు నపకారము చేయనని యామె చెప్పెనుగాఁబోలు! కాని యంతతో నాగదు. జిగినీ వ్యవహారమునకన్న పెద్దవ్యవహారము కలదు. అది శంకరశాస్త్రిహత్య. అది యెవ్వరు చేసిరో నేఁడే బయలుపడును.'

'కృష్ణవేణికి దేహము కంపమెత్తెను. నిలువఁబడలేక, కుర్చీపై గూర్చుండఁబడెను. పుల్లయ్యవైపు తెల్లఁబోయి చూచుచుండెను.

'నీ వెఱుఁగుదువా?' అని యామె యనెను.

'నే నెఱుఁగుదును. నీవుకూడ నెఱుఁగుదువు.'

కృష్ణుఁ గనులచీకటి క్రమ్మెను. లోకమంతయు నంధకార బంధురమయిన ట్లామెకుఁ దోచెను. పైడికూడ మౌనము వహించి యుండెను. పుల్లయ్య పైడివయిపు తిరిగెను. దాని మొగమును దేరి పారఁజూచెను. 'పైడీ నీవేమైన గొంచెము చెప్పగలవా?' అతఁ డడిగెను. 'హత్యనుగురించి కాకున్న నాపని యేకారణమున జరిగెనో యదియైన?——'

పయిడిమాటాడలేదు. 'పోనీ నే నడిగిన మాట చెప్పుము.' మరల నాతఁడనెను. 'నీవు నరసయ్య యనువాని నెఱుఁగుదువా?'

పయిడి యులికిపడెను. లేదని తలయూచెను. 'సరే—నీకు జ్ఞాపకశక్తి కొంచెము తక్కువది కాఁబోలు' పుల్లయ్య యనెను. 'మొగముచూచినచో జ్ఞాపకము రావచ్చును.'

పుల్లయ్య కిటికీలో మొగముపెట్టి యీలగొట్టెను. వెంటనే యొక క్రొత్తవాఁడు లోనికిఁ జొరఁబడెను. పూర్వ మొకప్పుడు క్రొత్తదిగానుండిన కోటును, పాగాయును, వేసికొని, యాతఁడు మొదట భాగ్యవంతుఁడైన నాగరకుఁడే యయినట్లు కనుపడు చుండెను.

'పుల్లయ్యగారూ, నన్నుఁ బిలచితిరా? ఆతఁడడిగెను. మీ యుద్దేశమునాకు——ఓహో! ఇదిగో! పైడి!'

'పైడికి కన్నులెత్తఁ బాఱెను. వానివైపుచూచెను.

'నరసయ్యగారంతయును నాకుఁ జెప్పిరి.' పుల్లయ్యయనెను. 'ఈయన యొకప్పుడు విశ్వనాథశాస్త్రిగారి యొద్దగుమాస్తాగా నుండెను. తరువాత కృష్ణాజీగారియొద్ద గుమాస్తాగాఁ బ్రవేశించెను. పయిడీ, నరసయ్యగారేల యిక్కడకు వచ్చిరో తెలియనట్లు నటించుచు నేలయట్లు మౌనము వహింతువు?'

'నే నేమియును జెప్పఁదలఁచు కొనలేదు.' పయిడిచెప్పెను.'

'సరే ఎందుకు ... మంచిది. నరసయ్యగారిని కొన్ని ప్రశ్నము లడుగవలసి యున్నది.

ఆయన తనకు మేలగుననిధైర్యమునఁ దలచుకొని, యథార్థమును జెప్పెను.'

నరసయ్య ఏమి చెప్పునోవారు వినఁదలచియుండిరి కాని, యింతలో కృష్ణాజీ వడివడిగ నాగదిలోనికివచ్చెను.

'ఏమీ, యీఘోరము? పయిడికూడనా?'

'ఇక్కడ చమత్కారమైన నాటకమొకటి జరుగుచుండెను.' పుల్లయ్య యనెను. శ్రీనివాసరావునకు సింహాదిగా నున్నందుకు నాకు సంతోషముగానున్నది. ఎన్నిదినములుపట్టునోయని విచారించుచుంటిని. మొదట శరీరతత్త్వము మంచిది, అందుచేత వేగము గుణమిచ్చినది. ఈరాత్రి యందముగా నున్నదిగదా?' శ్రీనివాసుఁడేమో గొణుగుకొనెను. 'ఏమి యీయల్లరి?' అని కృష్ణాజీగట్టిగా నడిగెను. 'ఇదియొకసమస్య.' పుల్లయ్యయనెను. శంకరశాస్త్రినిజంపిరెవ్వరో?' అని కాని, ఎవరు శంకరశాస్త్రిని జంపిరోకదా? అని కాని, యిప్పుడొకసమస్య బయలుదేరినది. అది కష్టమోసులభమో నేఁజెప్పలేను. గాని, ఎంతమందినడిగినను వారు పూర్తిచేయలేదు. ఇదిగో ఇతడొకడు పూర్తిచేసెదనని బయలుదేరినాఁడు.'

కృష్ణాజీ కూపిరియాడలేదు. శ్రీనివాసునకు బుద్ధిమూడలేదు.

'ఆసమస్యయెవ్వరు పూర్తిచేయఁగలరు?ఎవ్వరును జేయలేదు. అని కృష్ణాజీయనెను. 'అది పొరబాటు. పుల్లయ్య యనెను.' ఇదిగో నీవు బరతరపుచేసిన యీ నీగుమాస్తా నరసయ్యగారు ఆసమస్య బాగుగఁ బూర్తిచేయగలరు. అని పుల్లయ్యచల్లగాఁ జెప్పెను.

## ఇరువదియేడవ ప్రకరణము

ఎట్లు జరిగినది

నరసయ్య మొట్టమొదట పుల్లయ్యవైపును, దరువాత కృష్ణాజీవైపును జూచెను. 'ఈసందర్భమంతయు నేమి?' కృష్ణాజీయరచెను. 'ఆకునుకువెధవ యెవఁడు ? ఈపుల్లయ్యను గొంతకాలమునుండి చూచుచున్నాను. రేయింబవళ్ళు రేచుక్కవలె నన్ను వెంటాడి తిరుగుచున్నాఁడు. కాని అకునుకునక్క యెవ్వఁడు?

'పుల్లయ్యను మీరెఱుఁగుదురని యనుకొనుచున్నారుకాని, వారెవ్వరో మీకేమియుఁ దెలియదు.' పుల్లయ్య నిశ్చలముగాఁ జెప్పెను. 'వారిసంగతి వెనుక మాటాడుదము. మొదట మీరనిన ఈకునుకువెధవ సంగతి వినుడు. నరసయ్యగారిని మీరు బాగుగా నెఱుఁగుదురు. ఒకప్పుడాయన మీయొద్ద కొలువులోనుండెను.'

'నేనెప్పుడును వీనినిజూచినట్లు జ్ఞాపకములేదు.' కృష్ణాజీయనెను.

'నీవాలాగే చెప్పెదవు. కాని దానివలన బ్రయోజనమేమి? విశ్వనాథశాస్త్రిగారును శంకరశాస్త్రిగారును వేఱుపడిన తరువాత నీయొద్ద గుమాస్తాగాఁ బ్రవేశించెను. శాస్త్రులిద్దఱ రహస్యములను జెప్పఁగలఁడుగదాయని నీవు వానినిఁ జేర్చుకొంటివి. ఆరహస్యమంతయును గ్రహించినతరువాత వానిని దీసివేసితివి. ఆతఁడు కాశీయాత్రకుఁ బోయెను నేనతనిని కాశీలోఁ జూచితిని.' కృష్ణాజీకి మొగమెఱ్ఱనయ్యెను. ఎగయూపిరి రాఁబోయెనుగాని, యాచుకొనెను. గుండెలు కొట్టుకొనుచుండుటచేఁగాఁబోలు నప్పుడప్పుడాతఁడు గుండెపై జేయివైచుకొనుచుండును. పెదవులు తెల్లబారెను. 'జ్ఞాపకము వచ్చినది.' కృష్ణాజీ చెప్పెను. 'కాని, వీని నేలతీసికొని

వచ్చితివి? తప్పులెక్కలు వ్రాసినందుకు వీనిని నేను దీసివైచితిని. వానిని జెయిలులో బెట్టించవలసినదేగాని—'

'కాని, సాహసింపలేక పోయితివి' నరసయ్య యందుకొనెను. 'అంతపని చేయలేక పోయితివి. నాగుట్టంతయును నీకుఁ దెలియును. నీగుట్టంతయును నాకుఁ దెలియును. నేనుకూడ మాటాడలేక పోయితిని. కావున, నేనును నోరుమూసికొని వెళ్ళిపోయితిని. నీకొంప యెట్లయిన ముంచవలెననియే యనుకొన్నానుగాని, యీనారాయణ శాస్త్రిగారు—'

'వీడు నారాయణశాస్త్రియా? శంకరశాస్త్రి తమ్ముడా! ఏమేమీ' కృష్ణాజీ వింతగాఁ జూచెను. 'ఏమేమీ, నేను మొదటనే యనుమానపడుచుంటిని. మొగమిదివరకు బాగుగా నెరిగినదానివలెనే గన్పడుచుండెను. అయినను పుల్లయ్యయని పేరుచెప్పినందున నేమో యనుకొంటిని. శాస్త్రిగారూ, మీకు వీనిమూలమున నా భోగట్టా తెలిసినది?'

'నన్ను పుల్లయ్యయనియే పిలువుము. నేను మొదట నారాయణశాస్త్రినేగాని, ఇప్పుడు పుల్లయ్యపేరే మంచిది. కాశిలో నుండిపోవలెననియే నా యుద్దేశము. కాని యీ నరసయ్య నాకుఁ గన్పడెను. నన్నుఁ బోల్చలేక యేమేమో సంగతులు చెప్పుచుండెను. కొంతకాలమున కిద్దఱకును బరిచయము కలిగెను. నీగుట్టంతయును నాతోఁ జెప్పెను, నీపిలక నిగుడదీయుటకు. నిన్ను మట్టివేయుటకు నేను వచ్చినాను. నాసామర్థ్యము నీకుఁ గొంతవరకప్పుడే చూపితిని కాని, నిన్ను గుఱించి నాకిదివరకేమి తెలియునో యిప్పుడు చెప్పఁదలచుకొనలేదు. నీకు మతియొకవిధముగఁ గొంపఁ మునుగఁ బోవుచున్నది. శంకరశాస్త్రి డబ్బంతయును దెచ్చుకొని మీరిద్దఱును పంచుకొనఁదలచుకొన్నారు. నాకంతయును తెలియును. కావున లేదని

నీవు చెప్పవద్దు. నీవు వ్యర్థశ్రమపడి రావు. మాయన్నగారివద్ద డబ్బేమియును లేదు. ఉన్నడబ్బంతయు నీయెదరిపైనే కొట్టెను. నీవు దొంగ దస్తావేజులు వ్రాసి యిచ్చితివి. తీర్చునది లేదు. చచ్చునది లేదు. నీయిల్లు వట్టి బోడిబండారమే.' కృష్ణాజీ వానివైపుజూచి గుడ్రు పెట్టెను.

ఇది యంతయును వట్టి బండారమేనా?' అని కృష్ణాజీ యడిగి వ్రేలితోఁ జూపెను.

'అవును. లోన లొటారము, పైన పటారము. నావంటివాఁడు పై మెఱుగులకు మోసపోఁడు.' పుల్లయ్య జవాబు చెప్పెను. 'ఇది యంతయు నేనుఁగు నోటిలోని వెలంకాయ. ఒకటి రెండు దినములలో అప్పులవారువచ్చి నిన్నఁటికట్టుదరు. మాయన్నగారి యిల్లు దోచి యేమైన సంపాదింపవలెనని తలఁచితివి. కాని యందేమియును లేకుండెను. నీవు తీసిన యీ చిట్టాపుస్తకము నీకెందుకును బనికిరాదు. ఆరాత్రి యీదండాసివానికి కన్నము త్రవ్వుటకిచ్చిన యిరువదిరూపాయిలును దండుగే. ఆరాత్రి విశ్వనాథశాస్త్రిగారికి తల పగుల వేసి తాళముచెవి యెత్తుకొనిపోవుటయును వ్యర్థమే. గోపాలపురములో విశ్వనాథశాస్త్రిగారి ధనాగారమున్న యింటికి నీవు చెల్లింపుచుండిన యద్దెయును వ్యర్థమే. మీరు దొంగిలించిన తాళమెందుకును బనికిరాదు.'

కృష్ణాజీ నోరు మూఁతపడెను. కోపమంతయు నాగిపోయెను. తరువాతిసంగతి చెప్పవలసినదని మొగ మెగురవేసెను.

'తరువాత నేమియున్నది?' పుల్లయ్య చెప్పెను. 'అంతయును పోలీసువారి పనే. అవసరమైనప్పుడు నా సాక్ష్యము నేను బలము చేసికొందును. నీయొద్దనున్న తాళమును లెక్కలపుస్తకమును నావి నాకిచ్చివేయుము.' శ్రీనివాసుఁడు ముందుకువచ్చెను. ఎంతయో

ప్రయత్నమున ముందుకు రాఁగలిగినట్లు స్పష్టపడెను. 'ఈ పిచ్చి పుల్లయ్య యుల్లరయంతయు నెంతసేపు భరింతువు? పీకమీఁదఁ జేయి వేసి గెంటివేయక యేల మిడుకుమిడుకుమని చూచుచున్నావు? బంట్రోతును బిలిచి గెంటివేయుము.'

ఆపని తాను చేయలేనని కృష్ణాజీ పెదవులు విఱచుచు సంజ్ఞ చేసెను. నిజముగా నాతని హృదయమున నేమో బాధగానుండెను. కృష్ణాజీ మొగమువైపుఁ జూచుచు నూరకుండెను. పుల్లయ్య శ్రీనివాసుని మొగముచూచి చిఱునవ్వు నవ్వెను. లేనిధైర్యము తెచ్చుకొని మాటాడినను, వానిమొగమునఁ బంచమహాపాతకములును బాటలు పాడుచుండెను. చేతితో వానిని బ్రక్కకొత్తిగిల్లించి నీవిక్కడ నుండుమని పుల్లయ్య చెప్పెను. 'శ్రీనివాసా, నీకిప్పుడు జోక్యము లేదు. నీకును గాలము సమీపించుచున్నది. అప్పుడే మెడబంటి వచ్చినది. అదిగో యెవ్వరో వీధితలుపు తట్టుచున్నారు. నీకొఱకే కాఁబోలు.'

శ్రీనివాసున కూపిరి యాడలేదు. కీలుకీలును విడిపోయినవి. అవశుఁడై కుర్చీపైఁ గూలబడెను. నాలుగు ప్రక్కలకును వెఱ్ఱివెఱ్ఱి చూపులు చూచుచుండెను. మొగమెఱ్ఱఁబాఱి మరల తెల్లఁబారెను. మరల నల్లబారి మసివలె మాడిపోయెను. ఇంతలో పోలీసుఇనస్పెక్టరుగారు వచ్చిరి. ఆయన యెందుకువచ్చెనో కృష్ణకుఁదప్ప తక్కిన యందఱకును దెలియును. అందఱును వానివైపే చూడసాగిరి. కృష్ణాజీ యొద్దకు కృష్ణవచ్చి నిలువఁబడెను. 'వద్దు వద్దు మాతండ్రిని తీసికొనిపోవద్దు. అతఁడానేరము చేయలేదు. లేదులేదు నేను చాటుగా నిలుచుండివింటిని' ఆతఁడాపని చేయలేదు. ఆతడు మంచివాఁడు. కాని, చెడ్డవాఁడు కానీ, ఆనేరమును——'

పుల్లయ్య కృష్ణవేణినిరెక్కలుబట్టి ప్రక్కకీడ్చెను. 'తెలివితక్కువ పిల్లా!' ఆతఁడు మెల్లగాఁ జెప్పెను. ఏలయంతయును బాడు

చేయుచున్నావు. నోరు మూయుము. ఆతఁడు నీతండ్రికొఱకురాలేదు. శ్రీనివాసునికొఱకుఁ వచ్చియున్నాఁడు.'

ఇనస్పెక్టరుగారాసంగతి కనిపెట్టిరిగాని, వారి కర్థముకాలేదు. శ్రీనివాసుని పిలిచి, 'అయ్యా! మిమ్ము అరెస్టుచేసితిని. మీరు నావెంట రావలెను.' అని చెప్పెను.

'నేరమేమి?' యని శ్రీనివాసుఁ డేకాంతమాడినట్లడిగెను.

చెన్నపట్టణములోనున్న విల్లియమ్ అండుకో వారిని దగాచేసి నందుకు, అవసరమైనయెడల వారంటు చదివెదను.'

శ్రీనివాసుఁడు చెప్పవలసిన దేమియునులేదు. ఇనస్పెక్టరు గారి వెంట మారుమాటాడక పోవుటకు సిద్ధముగా నుండెను. అంత యును నిశ్చలముగా నుండెను. పుల్లయ్య మరల తనకథ నారంభిం చెను.

'ఈరాత్రి నాయవసరము మఱి యుండదనుకొందును.' పుల్ల య్య చెప్పెను. 'ఇన్స్పెక్టరుగారూ. అవసరమయినయెడల నాబసకు రండు మాటాడెదము. మీరు పోవునప్పుడు పయిడినికూడ మీతో దీసికొనిపొండు.'

కృష్ణాజీయును, కృష్ణయును, పుల్లయ్యయునుదప్ప నందఱును వెళ్ళిపోయిరి. పుల్లయ్య కిటికీ తలుపులు మూసెను. 'పిల్లా, నిష్కార ణముగా వ్యవహారము చెడగొట్టియుందువుగదా. శంకరశాస్త్రిని మీతండ్రి చంపలేదనిచెప్పి వానినిగూడఁ బోలీసువారిచేతిలోఁ బెట్టి యుందువుగదా.

'నేననుకొంటిని. నేనిదివరకు విన్నదానినిబట్టి మా—మా—'
'మీతండ్రికి దానిభోగట్టా యంతయును దెలియునని. అంతేగదా— అవును. మీతండ్రి కది యంతయును దెలియును. హత్యనాటిరాత్రి జగినీని దొంగిలించినతరువాత నీకు నిద్రపట్టలేదు. ఏమేమో మాట

లను వింటివి. దానినిబట్టి మీతండ్రికాసంగతి తెలియునని యను కొంటివి. అంతేకదా.'

'అబద్ధము—అబద్ధము' కృష్ణాజీ మూల్గెను. 'ఆసంగతి నాకేమియును దెలియదు.'

'అబద్ధముకాదు. నిజము. నిజము. ముమ్మాటికిని నిజము' పుల్లయ్య ధాటిగా జెప్పెను. 'శ్రీనివాసుఁడు తిరిగివచ్చి యీసంగతి నీతోఁ జెప్పెను, నేనప్పు డిక్కడనేయుండి మీసంభాషణ యంతయును దొంగతనముగా వింటిని. శంకరశాస్త్రి అప్పుతీర్చుమని నిన్ను తొందరచేసెను. ఆబాధ భరింపలేక, హత్యజరిగినతరువాత నీవు—'

'ఋజువు—ఋజువు. నీవు ఋజువు చేయఁగలవా?'

'ఎందుకట్లు పళ్ళిగిలించెదవు? ఋజువు కావలెనా? నేనక్కడ నేయుండి యంతయును జూచుచుంటిని. హత్యకాదుసుమా, దొంగతనము—దోపిడి—కన్నము—తెలిసినదా, మిద్దెపైనుండి యంతయును గనిపెట్టుచుంటిని. వేంకటరావును సూర్యారావును నాయొద్దనే యుండిరి. శ్రీనివాసుఁడు మమ్ము లోపలపెట్టి తలుపు గొళ్లెము వేసెను. శంకరశాస్త్రినిగట్టిన త్రాడే నడుమునకు కట్టుకొని వేంకటరావు కిటికీలోనుండి క్రిందకు దిగెను. మరల మాకుఁ దలుపుతీసెను. మొట్టమొదట నీవు సేఫు బ్రద్దలుకొట్ట నెంచితివి. సాధ్యముకాలేదు. దండాసివాఁడువచ్చి బ్రద్దలుకొట్టుట మేముచూచితిమి. వానిని మేము పోల్చగలము. అవసరమైనప్పుడు కోర్టుకు దీసికొనిరాఁగలము. విశ్వనాధశాస్త్రి లోపలికివచ్చుట మేము చూచితిమి. మీచేతులనుండి వానిని మేమే తప్పించితిమి. తాళముకొఱకును, పుస్తకముకొఱకును సూర్యారావింటికిపోయి విశ్వనాధశాస్త్రిని మీఁద కుర్చీతోఁ గొట్టినప్పుడును. మేము చూచితిమి. అప్పుడుకూడ మేమేవానిని గాపాడితిమి. శ్రీనివాసుఁడు హత్యకుఁ గారకుడనియు, నీవుదానిని నెఱుఁగుదువనియు మఱియొకసారి నిర్ధారణగాఁ జెప్పుచున్నాను.'

కాదని కృష్ణాజీ చెప్పలేకపోయెను. వణఁకుచు మెల్లగా లేచి వంగి నిలువబడెను. తనతో రమ్మని పుల్లయ్యకు సంజ్ఞ చేసెను. 'పిల్లా, నీవుపోయి పండుకొనుము. చాలరాత్రియైనది. నీవిక్కడనున్నందున లాభమేమియును లేదు.'

కృష్ణాజీ యనెను. 'పుల్లయ్యగారూ, జెయిలులో నే నొక్క నిముసమైన నుండను. కోర్టుకుఁ దీసికొనిపోవుటకు ముందే చనిపోవుదును.' పుల్లయ్య మాటాడలేదు. కృష్ణాజీ వెంటబోయెను. ఒండొరులను జూచుకొనుచు, నిద్దఱు నూరక గొంతసేపు కూర్చుండిరి.

'నేను జేయవలసినదేమి?' కృష్ణాజి యడిగెను.

హెచ్చు లేదు. నీకంతయును దెలియును. దాచినలాభము లేదు నరసయ్య నీగుట్టంతయును జెప్పెను. వాస్తవముగా నీద్రోహము తానే చేయనెంచి యిక్కడకు వచ్చెను. నీకూతురు పరిచారిక పైడి యాతని ప్రోత్సాహమువనే వచ్చినది. అవసరమైనయెడల, ఇక్కడి సంగతులన్నియు నామె బైటబెట్టును. నరసయ్య చేయఁదలచుకొన్న పని నీవే చేసితివి. నేనును సమయమునకే వచ్చితిని. అన్నిటికన్న వింతయొకటి నీకుజెప్పెదను. ఆమార్బిలుఅట్ట పుస్తకమును, ఆతాళమును నాచేతికిమ్ము.'

'నావద్ద లేవు. రెండును నావద్ద లేవు.'

'అబద్ధము. అబద్ధము. తాళమీ నిముసముననే వాని జేబులోనే యున్నది. కాకపోయినఁ మాటిమాటి కేల గుండెపై జేయి వైచుకొందువు? ఇచ్చివేయుము. మర్యాదగ ఇచ్చివేయనియెడల బలవంతముగ లాగికొందును నీకన్న నేను బలవంతుఁడను.'

అరచుచు కృష్ణాజీ లేచి నిలువఁబడెను. పుల్లయ్య మెడపై జేయివైచెను. ఒక త్రోపున పుల్లయ్య యాతని నేలకుఁ ద్రోసెను. చచ్చినట్లు కృష్ణాజీ నేలపై బడెను. అతని జేబులన్నియును పుల్లయ్య

తడివెను. తాళము చెవులగుత్తియొకటి కనుపడెను. ఒకతాళముతో ప్రక్కనున్న పెట్టియొకటి తీసెను. అందున్న యొక తాళము చెవియును చిన్న పుస్తకమును బయికిఁదీసి, జేబులోఁ బెట్టుకొనెను. ఆతరువాత కృష్ణాజీవైపు చూచెను. 'భయములేదు. వేగముగానే తెలివివచ్చెను. చచ్చెనేమో యనుకొంటిని. చావలేదు. కళ్ళు తెఱచుచున్నాడు. అల్లరచేయకచల్లగా జారిబోవుటయేమంచిది.' పుల్లయ్య మెల్లగా వీధిలోనికిఁవచ్చి యూలకొట్టుకొనుచు తనదారిని బోయెను.

---

## ఇరువదియెనిమిదవ ప్రకరణము

### ఆరోగ్యము

బ్రహ్మపురము నందంతటను గ్రొత్త కలకలము పుట్టెను. శ్రీనివాసుఁడు నిర్బంధింపఁబడుట యర్థరాత్రివేళ జరిగినను తెల్లవారు సరి కాబాలగోపాలమునకును దెలిసిపోయెను. భాగ్యవంతుఁడను కొనుచున్న శ్రీనివాసునకేల యిట్టియవస్థ వచ్చెనోయని యందరు నాశ్చర్యపడుచుండిరి. కోర్టులో ఇసుక వేసిన రాలకుండెను. శ్రీనివాసుఁడు బోనెక్కెను. కాని చెప్పవలసిన సంగతులలో నొక్కటియును లేకుండెను. వాది కంపెనీవారివద్ద శ్రీనివాసుఁడు సరకుల నరువు పుచ్చుకొని పత్రము వ్రాసెను. మరికొంత ఋణమునకుఁ దణాకాయిచ్చిన బంగారు వస్తువులు చోరీఆస్తికిక్రింద లెక్కకు వచ్చెను. కావున వెంటనే ప్రతివాదిపై అరెస్టువారంటు ఇప్పించవలలినదని వాది కంపెనీవారు కోరిరి. ప్రతివాది తరపున వకీలు చెప్పవలసిన దేమియును లేదు. ప్రతివాది నిర్దోషియనియు, సమయము వచ్చినప్పుడా సంగతి ఋజువు చేసికొనఁగలడనియుఁ జెప్పెను. జామీనుపై విడుదల చేయ చేయవలసినదని కోరెను. పదివేలరూపాయిలవరకుగూడ జామీ

నీయగలడని చెప్పెను. అయిదు వేలరూపాయల జామీనుకు కోర్టువా రంగీకరించిరి. కృష్ణాజీ జామీనుగా నుండుటకు అంగీకరించెను. పుల్లయ్య యక్కడనే యుండెను. పకపక నవ్వసాగెను. 'సూర్యా రావూ' పుల్లయ్య చెప్పెను. 'చూచితివా? కృష్ణాజీ జామీనట' యెంతగొప్పజామీను! ఆ వెధవవద్ద గ్రుడ్డిగవ్వయైనను లేదు. విశ్వ నాథశాస్త్రి కెట్లున్నదో ఆసుపత్రికిపోయి చూడవలెను. కొంచెము నింపాదిగా నున్నదని వేంకటరావు చెప్పినాడు.'

వేంకటరావు చెప్పినది వాస్తవమే. శస్త్రవైద్యము నేర్పుతో జేయఁబడినది. మూఁడు రోజులలో విశ్వనాథుఁడు లేచికూర్చుండి బాతాఖానీ యారంభించెను. ఎన్నాళ్ళనుండియో యాతఁడట్లు మాట లాడి యెఱుఁగడు. పూర్వమున్నతస్థితిలో నున్నప్పుడెట్లు లధికారము చలాయించుచు మాటలాడుచుండెనో, ఇప్పుడుకూడ నారీతిగానే మాటాడసాగెను. కాని, జరిగినసంగతి వేంకటరావు స్పష్టముగాఁ జెప్పుటతోనే కొంతవరకు ధోరణి తగ్గించెను.

ఏదియో వింత కనిపెట్టినవానివలె నొక్కొక్కప్పుడు తనలోఁ దాను నవ్వుకొనుచుండెను. వేంకటరావు తనసంగతి యంతయును జెప్పుచున్నంతసేపును, ఆత్రముగ వినుచుండెను. వారముదినముల యినతరువాత నొకనాఁడు శుభ్ర వస్త్రములను గొడుగుకొని, మం చముపైఁ గూర్చుండి వేంకటరావుతో మాటాడుచుండెను. 'నాధన మంతయునుబోయి నేను బీదవాఁడ నైతినా? నాకూతురు నన్నుఁ బోషించుచుండెనా? పాపము. పోనీ, భగవత్కృపవలన నాకు మతి తిరిగి వచ్చినది. నారెక్కలవలన నిఁక జీవింపఁగలను. కొంతకాలము క్రిందటతలపై నొక దెబ్బ తగిలెను. దానివలన మెదడున కేదో యపాయముగలిగి మతిపోయియుండును దానివలన డబ్బంతయును దగులబెట్టియుండును. నాకితరులు వ్రాసిన బాకీపత్రము లేమయినను దొరికినవా?'

'పోయినవేమో, యెక్కడను గనుపడలేదు' వేంకటరావు చెప్పెను.

'నిజము. నిజము. నాకంతయును జ్ఞాపకమునకు వచ్చుచున్నది. కాని, ఆసంగతి యిప్పుడేల మాటాడవలెను. ప్రస్తుతము నేను బీదవాఁడనే నాపిల్ల పోషించుచుండుటవలన బ్రతికియుంటిని. తరువాత నీవు పోషించుచుంటివి నీవుచేయఁదలఁచుకొన్న పనియేమి?'

'కమలను నేను వివాహమాడెదను.' వేంకటరావు చెప్పెను. 'నేనదో యింత సంపాదించి తెచ్చెదను. మనము ముగ్గురమును కలియఁబోసికొని తిందము. నీవుకూడ మాయింటనుండవలెను.'

కొంతసేపువరకును విశ్వనాథశాస్త్రి మాటాడలేదు. సంతోషమును మాటలయిన ననలేదు. అతనికన్నులనుండి నీరుమాత్రము కారుచుండెను. తరువాత మెల్లగా మాటాడసాగెను. 'నాకుఁదగిన బుద్ధిచెప్పితివి. వేంకటరావూ, వెనుకనీవొకసారి కమలను పెండ్లియాడెదనని నాతోఁజెప్పినప్పుడు నీపైఁగోపించితిని. అప్పుడునాకు ధనమే పావనమై యుండెను. ఆధనము నాయొద్దనుండి పారిపోయెను. పిశాచము విడిచిపెట్టిన వానివలె నాకిప్పుడు తెలివివచ్చెను. ధనమే లోకమున నుత్కృష్టమైన వస్తువనియు, స్నేహబాంధవ్యములు ధనము వలననే కలుగుననియు, మనుష్యులొండొరుల కుపకారము చేయుట ధనార్జన కొఱకై యేయనియు, కృతజ్ఞత, పరోపకారము చేయుట కర్మము మొదలైనవి శాస్త్రపరిభాషికశబ్దములుగాని వ్యవహారిక శబ్దములు కావనియు, నేనప్పుడు తలఁచుచుంటిని. నాకూఁతురు నాపై నెంత భక్తిచూపుచున్నను, దిండిపెట్టిన డబ్బుఖర్చుగా నెంచి ముండమోసి మూలఁజేరితివని దానిని తిట్టుచుంటిని. నీవుదానినిఁ బెండ్లియాడెదనని చెప్పినప్పుడు నిన్నుతిట్టి దానిని కొట్టితిని. కాని

యిదియంతయును మఱచిపోయినాకుమారుడు నన్ను గనిపెట్టుకొని యుండి, కష్టపడి నన్ను బోషించెను. నా కూఁతురే నాకు వారసురాలు గనుక, దానిధనమునకై యాశించి, దానిని బెండ్లియాడి నాధన మెత్తుకొని పోనెంచుచున్నావని తలఁచి నిన్ను దిట్టుచుంటిని. అది యంతయును మఱచిపోయి నీయింటనుంచి, యెంతయో శ్రమపడి నన్నుఁ బోషించితివి. నాధనము నాకెప్పుడైనఁ దిరిగివచ్చిన, వెనుకటి త్రోవయంతయును నేనుగూడ మఱచిపోయెదను. విశ్వనాథశాస్త్రి క్రొత్తవాడయ్యెనని మీరందఱును ననునట్లు చేసెదను.'

'ధనవిషయమైన చింత మీరుపడకుఁడు ఉన్నదానితోనే కాలక్షేపము చేసెదము. కమలను ధనాశచే నేను బెండ్లియాడ నెంచలేదు. ఆమెపైఁగల యాశచేతనే ప్రేమించితిని. నాకు సహధర్మచారిణిగా నుండఁదగిన స్త్రీయామె తప్ప వేఱెవ్వరును నాకుఁ గనుపడలేదు. 'ధర్మపత్నీ సమేతస్య' యను సంధ్యావందన వచన మీకాలమున నేతిబీరకాయ యైనది. నోరెఱుఁగని పసికూనలకు, కన్నుల తెరవని చిన్నపిల్లలకు ముడిపెట్టి, 'నాతిచరామి' యని వారిచే ననిపించుచున్న వివాహములను నేను జూచుచున్నాను. భర్తయన నొకభూతమని తలఁచి దూరదూరముగా పారిపోవు భార్యలను భార్యయన నొకసేవకురాలని తలచి కసరుచుండు భర్తలను జూచుచున్నాను. దానికి వ్యత్యస్తముగా నుండు దాంపత్యములను గూడఁ జూచుచున్నాను. భార్య మేజస్ట్రీటుగారి కూఁతురు కావున చెఱువునకుఁ బోయి నీళ్ళు తీసికొని రాదు. తనకిరువది రూపాయీలు మాత్రము జీతము కావున నీళ్ళు బ్రాహ్మణునిచే దెప్పించుకొనలేఁడు. కావున, రాత్రులయందు చెఱువునకుఁ బోయి తానే బిందెతోఁ నీళ్ళు మోసికొని వచ్చుచుండును. అట్టిదాంపత్యములను జూచినాను. భార్య మునసబుగారికూఁతురు కావున వంటరాదు. తనకు వంట చేయుటకు తెలిసి

లేదు. కావున, తనకేబదిరూపాయిలు జీతమైనను, అందులో పది రూపాయిలు వెచ్చించి వంట బ్రాహ్మణుని పెట్టుకొని కాలక్షేపము చేయుసంసారములను జూచుచున్నాను. భార్య యప్సరసవలెనుండి సాహిత్య సంగీతములయందు నేర్పరియై, తనకువిధేయురాలై యున్నను, రేయింబవళ్ళు సానికొంపలయందు దేవులాడి, తరిమివైచినను, బంచలుపట్టి వ్రేలాడుచుండు కాపురములను జూచియున్నాను. అయ్యతిరపతి అమ్మ పరపతిగానుండు కుటుంబముల నెఱిగియున్నాను. భర్త ధనవంతుఁడై, విద్వాంసుఁడై రాజాధిరాజులచే మన్నింపఁబడువాఁడైనను, గుఱ్ఱపుదానితో దేవులాడుచుండు భార్యల నెఱుఁగుదును. అనుకూల దాంపత్యము—పరస్పర ప్రేమావిర్భూతమగు దాంపత్యము—దినదిన ప్రవర్ధమానమగు దాంపత్యము కానప్పుడు లోకమిట్టి పాటుపడుచుండును. ధనాశచేఁ గమలను బెండ్లియాడ నెంచితినని యనుకొనవద్దు. అనుకూలవతియగు భార్యయే నాకుఁ గావలసినధనము. అట్లని, ధనముపై నాకసహ్యము కలదని భావముకాదు. కాని, గుణసంపత్తికి ధనసంపత్తికి కుడియెడమ వాసికలదని మాత్రము నాయుద్దేశము దానిమాటకేమి. నీకు మతి తిరిగివచ్చినందుకు నాకానందమయినది. కమలపై నాకెంత ప్రేమముకలదో నీవు గ్రహింతువు. కమలకన్న పవిత్రమయిన వస్తువు వేరొకటి నాకులేదు.' ఇంతలోఁ గమల యక్కడకు వచ్చెను. ఆమెమొగము చిరునవ్వుతో గలకలలాడుచుండెను. ఆమెతండ్రి నొక్కసారి కౌగలించుకొనెను.

'నాన్నా, నీతో మాటాడుటకు వాచిపోయితిని. తండ్రీ' యని చెప్పెను. వెనుక జరిగినదానిఁగూర్చి యొక మాటయయిన నామె చెప్పలేదు. తండ్రి చెప్పిన వినుటకయిన నామె యిష్టపడలేదు

'నాన్నా, నీకు నింపాదిగా నున్నదిగదా,' ఆమె యడిగెను నాకానందముగా నున్నది.' 'అమ్మా, నాకుబాగుగానే యున్నది.

కొద్దిరోజులలోనే లేచి తిరుగఁగలను. అప్పుడుపోయి నాస్నేహితులను గొందరిని చూడవలెను.' కమల మాటాడలేదు. కొద్దిరోజుల క్రిందట శతవృద్ధునివలెఁ గనుపడుచున్న తనతండ్రి పడుచువానివలె నిప్పుడు కనుపడుటకు కమల యాశ్చర్యపడుచుండెను.

కొన్నిరోజులలోనే విశ్వనాథశాస్త్రి లేచి తిరుగసాగెను. తెల్లని మల్లుపంచకట్టుకొని, లోన నొకషర్టు తొడుగుకొని, పైనొక మడత వేసిన కోటు తొడుగుకొని, క్రొత్తటోపి యొకటి పెట్టుకొని, నాగరికునివలెఁ గన్పడుచుండెను. వేంకటరావువద్ద నొకరూపాయి యడిగి పుచ్చుకొని, సాయంకాలమునకుఁ దిరిగి వత్తునని చెప్పి బయలుదేరెను. చెప్పినట్లే సాయంతనమునకు మరలివచ్చి, రూపాయి వేంకటరావున కిచ్చివేసెను. ఆశ్చర్యముతో వేంకటరావతనివైపు చూచెను. ఆతని వాచిజేబువద్దబంగారు వాచిగొలుసొకటి కనుపడెను. వేంకటరావునకు మరింతయాశ్చర్యమయ్యెను. శ్రీనివాసుని కేసు మరునాఁడువిచారణ కావలసియున్నది. ఆసంగతి వారిద్దఱును మాటాడఁజొచ్చిరి. నేను గూడకోర్టుకు వచ్చెదనని విశ్వనాథుఁడు చెప్పెను.

---

## ఇరువదిపదియవ ప్రకరణము.

### అదిగో! అది—దానిసంగతి!

కోర్టుయథాప్రకారముగా కిటకిటలాడుచుండెను. కాని, క్రొత్త సాక్ష్యమేమియును లేదు. రావలసిన సాక్షియొకఁడు కారణాంతరములచే రాలేకపోయినందున కేసు మఱివారము దినములు వాయిదా వేయఁబడెను. వెనుకటి జామీనుపైనే ముద్దాయి విడువఁబడెను. చూడవచ్చుచున్నవారందరునునిస్పృహులైరి. తిరిగిపోఁజూచుచుండిరి,

శ్రీనివాసుఁడుకూడ బయలు దేరెను ఇంతలో ఇన్స్పెక్టరు వానివద్దకు నిన్నుమరల నరెస్టుచేసితినని చెప్పెను. శ్రీనివాసునకు నోటమాటరా లేదు. కారణమేమని శ్రీనివాసుని వాఁడడిగెను. 'నవంబరు నెల 5 వ తేదీని శంకరశాస్త్రియను వానిని జంపినందుకు. అని యతఁడు చెప్పెను. చూడవచ్చినవారి వేడుక మరల తిరిగివచ్చెను. పోఁబోవు చున్నవారందఱును మరల వెనుక దిరిగిరి. ముద్దాయిని మరల బోనిన్కెంచిరి. అతనికి పెదవులెండును. దాహము వేయుచున్నదని సంజ్ఞచేసెను. ఒక గ్లాసుతో మంచినీరు తెచ్చి యెవ్వరో యిచ్చిరి. త్రాగి, యున్నరనియొక కుర్చీపై గూలఁబడెను. క్రొత్తవిచారణము మొదటిసాక్షి పుల్లయ్య. అతఁడు చెప్పవలసినదంతయును జెప్పెను. రెండవ సాక్షి సరసయ్య ఈక్రొత్తవాఁడెవ్వఁడోయని సభ్యులందఱును జూచుచుండిరి. ఒక రిద్దఱు ముసలివారుమాత్రము మున్నెన్నఁడో యెఱిఁగినవాఁడే యనకొనుచుండిరి.

'నాపేరు సరసయ్య' సాక్షి చెప్పసాగెను, 'నేనీయూరులోనే పుట్టిపెరిగితిని. విశ్వనాథశాస్త్రిగారును శంకరశాస్త్రిగారును కలిసి వ్యవహారము చేసికొనుచున్న రోజులలో వారియొద్ద గుమాస్తాగా నుంటిని. వారి రహస్యములన్నియును గ్రహించితిని వారిద్దరును వేఱైపోయినతరువాత వారియొద్ద కొలువు విడిచితిని. కృష్ణాగారి యొద్ద బ్రవేశించితిని వారు నన్నుఁ గొలువునుండి తప్పించినతరువాత కాశీకిఁ బోయితిని.'

'దొంగపనులు చేసినందుకేనా నీవుపనిలోనుండి తప్పింపబడితివి అని ప్రోసెక్యూటింగు ఇన్స్పెక్టరుగారడిగిరి.

'అవును' సాక్షి తొణుకుబెణుకు లేక చెప్పెను. 'అందుకేతప్పింపఁబడితిని. ఆపైనిఁ కాశీకిఁబోయి కొన్నాళ్ళక్కడ నుంటిని. కొన్ని మాసములక్రిందట క్రొత్త సమాచారమొకటి తెలిసి యీప్రాంతములకు మరల వచ్చితిని.'

'ఏమి సమాచార' మని ప్రాసెక్యూటింగు ఇన్స్పెక్టరుగారడిగిరి.

'శాస్త్రిలిద్దఱయొద్దఁ గల డబ్బు దోచుకొనుటకు వచ్చితిని. నాకన్న ముందే కృష్ణాజీ యీ ప్రయత్నము చేయుచున్నట్లు తెలిసి నది నాకు రహస్యములను జెప్పుచుండుటకు పైడి యను నొకశూద్రస్త్రీని జాగ్రత్త చేసితిని. కృష్ణాజియింట నుంచితిని. దానిసహాయమువలన నాకుఁ గావలసిన సమాచారమంతయును దెలిసికొంటిని. నేను వెంటనే పనిచేయనియెడల వ్యవహారము చెడిపోవునని కూడ తెలిసికొంటిని. హత్యనాటి రాత్రి పదిగంటల వరకు శంకరశాస్త్రి యింటికిఁ బోయితిని.'

'శంకరశాస్త్రి నిన్నప్పుడు రమ్మనెనా?' అని ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరడిగెను.

'లేదు' అని సాక్షి ధైర్యముతోఁ జెప్పెను. 'అంత మర్యాదగ శంకరశాస్త్రిని జూడఁదలఁచుకోలేదు. అతఁడు వీధితలుపెన్నఁడును వేయఁడని నే నెఱుఁగుదును. ఇంటిలోనికిఁ జొరఁబడితిని.'

'దొంగతనమునకే వెళ్ళితివి కాఁబోలును?'

'ఆలాగే చెప్పవచ్చును తప్పులేదు. ఎట్లయిన నేమి? పోయితిని. ఒక మూలగా దాఁగుంటిని. శాస్త్రికి నేనున్న సంగతి తెలియదు. మేడక్రింది కచేరీగదికి ప్రక్క నున్న వంటగదిలో నేఁ గూర్చుంటిని. యంతయును గనిపెట్టుచుంటిని. రమారమి యొక గంట కనిపెట్టి యుంటిని. ఇంతలో ముద్దాయి యక్కడకు వచ్చెను.'

సభ్యులలోఁ గలకలమొకటి పుట్టెను, శ్రీనివాసుఁడు ముగము దించుకొనియుండెను. మొగమెత్తుమని ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరు చెప్పెను. బలవంతమున శ్రీనివాసుఁడు మొగమెత్తెను.

'ప్రమాణముపయిని జెప్పుచున్న సాక్ష్యమని మఱచిపోవద్దు' ముద్దాయి 'ప్రాణములతో సంబంధించిన పనియని యెంచుకొనుము. నీవు చూచిన యాసామి యితఁడేనా?'

'వాఁడే—వాఁడే—ముమ్మాటికిని వాఁడే—' సాక్షి చెప్పెను.

'నేను శ్రీనివాసరావుగారిని బాగుగా నెఱుఁగుదును. అదిగాక ఆరాత్రి నేను చూచితిననినఁ జూచితిననినట్లు చూడలేదు. బాగుగాఁ దేఱిపారఁజూచితిని. వంటగదిలోఁ జీకటిలో గూర్చుండుటచే నన్నాతఁడు చూడలేదుగాని, ఆతఁడు దీపపువెలుతురులో నుండుటచేతనే నేనతనిని బాగుగనే చూచితిని. అన్నిమాటలును జాగ్రత్తగనే వింటిని.'

'ఒక్కమాటయును దప్పలేదా? సరే—చెప్పుము.'

'వారు వ్యవహారము మాటాడిరి. ముద్దాయియును, కృష్ణాజీయును చాలవరకు వానికి బాకీపడ్డట్లు కనుపడినది. ఇతరులు తమకు వ్రాసియిచ్చిన దస్తావేజులు కొన్ని యతనికి తెణకా యిచ్చిరి. అది ఫోర్జరీ దస్తావేజులు. కొంతవరకు వాగ్వాదము జరిగెను.'

తాను మరల తిరిగిరానని చెప్పి ముద్దాయి వెళ్ళిపోయెను. శంకరశాస్త్రి మీఁదగదిలో మంచముమీఁదకుఁ బోయెను. డైరీ యతని చేతిలోనుండెను. 'అతని దినచర్య పుస్తకమును జూచుట కదియేనా కడసారి?'

'కాదు కాదు. అగ్గిపెట్టి పట్టుకొని కలమును సిరాబుడ్డియును వెదకుటకు మరల క్రిందకువచ్చెను. మరల మీఁదకుఁ బోయెను.'

'నీవు వెనుకనే పోయితివా?'

'అవును. నేనొకదానిగూర్చి వెదకుచుంటిని. అది దొరకలేదు. కావున మీఁదకుఁ బోయితిని. మత్తుమందాతని కెక్కించి త్రాడుతో వానినిఁ గట్టివేయవలెనని నాయుద్దేశము. ఒకషాపువద్దఁ గొని తెచ్చిన త్రాడు నాయొద్ద నుండెను. ఆసమాచారమదివరకే త్రాడు నాయొద్ద నుండెను. ఆ సమాచారమిదివరకే వర్తకుడు కోర్టులో జెప్పెను. నేను మీఁదకుఁ మెల్లగాఁ బ్రాకితిని. శంకరశాస్త్రి మంచముపైఁ బండుకొని

యుండెను. అతఁడు దినచర్య పుస్తకమును సేలపైఁ బెట్టబోవుచుండి నన్ను జూచెను. లేచి నిలువఁబడబోయెను. వెంటనే నాయొద్దనున్న క్లోరోఫారము డొక్కి యతని ముక్కుపై బెట్టితిని. చచ్చినట్లాతఁడు పడిపోయెను. త్రాళ్ళువేసి యతనిని మంచమునకుఁ గట్టితిని.

వెదక నారంభించితిని. శాస్త్రికి తెలివిలేదు. ఇల్లంతయును వెదకితినిగాని, నాకుఁ గావలసినది దొరకలేదు. వెదకుచున్న సమయమున నడుగుచప్పుడొకటివినఁబడెను. వెంటనే మంచముక్రింద దూరితిని. సందులోనుండి చూచుచుంటిని. శ్రీనివాసుఁడు లోనికి వచ్చెను. వాఁడుకూడ దేనికొరకో వెదకుచుండెను. ప్రక్కనున్న బల్లపై నొక చిన్న పెట్టియుండెను. దాని నాతఁడు కత్తితో బ్రద్దలు గొట్టఁ జూచెను. శంకరశాస్త్రికింతలోఁ గొంచెము తెలివివచ్చెను. 'శ్రీనివాసా' యని పిలచెను.

'వాఁడేమి చెప్పెనో జ్ఞాపకమున్నదా?'

'ఉన్నది, దొంగముండకొడకా, పదియేండ్లు నిన్ను జయిలులోఁ బెట్టించెదను,' అనెను, అంతకన్న నెక్కువ చెప్పలేకపోయెను

'తరువాత నేమి జరిగెను?'

'శ్రీనివాసునకుఁ గోపమువచ్చినట్లు కనుపడెను. మంచము వద్దకు బరుగెత్తుకొనివచ్చి కత్తితో శంకరశాస్త్రిని బొడిచెను. చేయెత్తి శంకరశాస్త్రి పట్టుకొనఁ జూచెనుగాని, సాధ్యముకాలేదు. ఉస్సుమని నిట్టూర్పు విడిచెను. ప్రాణము పోయినది. ముద్దాయి గదిలోనుండి పరుగెత్తి పారిపోయెను.'

చెప్పవలసినదంతయును జెప్పబడెను. ఊపిరి బిగఁబట్టి సభ్యులందరును వినుచుండిరి. ప్రోసిక్యూటింగుఇన్స్పెక్టరుగారు శ్రీనివాసుని తరపు వకీలువైపు చూచిరి. అడుగవలసిన దేమైననున్నదాయని యడిగిరి.

'ప్రస్తుతము లేదు.' అతఁడు చెప్పెను. 'నాప్రశ్నను వెనకకు దాచెదను. తన నేరమును తానే బయలుపెట్టుకొనుచున్న సాక్షి మాటలెంతవరకు నమ్మవచ్చునో నాకనుమానముగా నున్నది.'

'సరే—మింటియొక విషయమున్నది.' ప్రాసిక్యూటింగుఇన్స్పెక్టరు చెప్పెను. 'శంకరశాస్త్రి దినచర్య పుస్తకమును గూర్చి చెప్పవలసియున్నది. ఆరోజున శ్రీ—అనునది యెవనిఁగూర్చియని సందేహముగా నుండెను. ఇప్పుడు సాక్షి చెప్పినదానినిబట్టి 'శ్రీ—, అనగా శ్రీనివాసుఁడని తేలినదిగదా.'

శ్రీనివాసునితరపు వకీలేవేవో ప్రశ్నలడిగెను. జవాబు లన్నియును ముద్దాయికి వ్యతిరేకములే యయ్యెను. ప్రాసిక్యూటింగుఇన్స్పెక్టరు అంతటితో నాగలేదు. 'ఇప్పుడుసూర్యారావుసాక్ష్యము మరల విచారణ చేయవలసి యున్నది. డైరీ మొదట బయలు పెట్టినవాఁడతఁడు. ఈ కేసులో నది యెంతయో పనికివచ్చినది చిన్న చర్మముముక్క నతఁడే వెదకి తెచ్చెను. హత్యతో సంబంధించిన వారిద్దఱు నరసయ్యయును, శ్రీనివాసరావును, డాక్టరు వేంకటరావుగారు వ్రేలివెనుక చర్మ మైయుండుననని చెప్పినారు.

నరసయ్య వ్రేళ్ళకెక్కడ దెబ్బతగిలిన గురుతులులేవు. శ్రీనివాసరావు వ్రేలునకు మచ్చకలదు. అదిగో చూడుడు ఇక్కడనుండియే కనుపడుచున్నది. మూడవ వ్రేలిపై నున్నది.'

శ్రీనివాసుని నోరు మూతపడెను. సభ్యులందరు నొక్కసారి శ్రీనివాసునిచేతిపై పై కళ్ళుత్రిప్పిరి. చేయి సద్దుకొనఁబోయి, శ్రీనివాసుఁడు మరల బుద్ధిమార్చుకొనెను. వులికిపాటుచేయిమాత్ర మొక్కసారి కదలెను.

'అదిగో—చేతిపయి మచ్చ కావలసిన యెడల కోర్టువారు చర్మము ముక్కను ముద్దాయి వ్రేలిపయిఁబెట్టిమచ్చతో సరిపడునో లేదో పరీక్షింపవచ్చును.'

ముద్దాయి వకీలు మాటాడఁ బోయెను. గాని నోరురాలేదు. పరీక్షించుట యవసరములేదనియే చూచువారందఱు ననుకొనిరి. నేరము ఋజువయ్యెను. కాని, యుద్దేశము మాత్రము తెలిసికొన వలసి యుండెను. సంగతియేమో యని సభ్యులు వింతగా వినుచుం డిరి. ఇంతలో బంట్రోతు విశ్వనాధశాస్త్రిగారూ అని మూమ్మాలు గొంతుతోఁ బిలచెను. 'వెఱ్ఱివానినేల పిలచుచున్నారు యని యం దఱు నాశ్చర్యముతోఁ జూచుచుండిరి. 'నేరముతో నాతనికేమి సం బంధము చెప్పుమా!' యని యొకరితో నొకరు గుసగుసలాడుచుండిరి. కొంతకాలము క్రిందనుండియును విశ్వనాధశాస్త్రినిఁ జూచినప్పుడల్ల ప్రజలేవతో జాలితోఁ జూచుచుండిరి. మొట్టమొదట నాతఁడులతూ ధికారి. కాని ఎంగిలిచేతితో గాకినయిున గొట్టలేదు. తరువాత భిక్షా ధికారి యయ్యెను. మతిపోయి వీధులలో దిరుగుచుండెను. వెఱ్ఱివిస్స ప్పయని తాము హాస్యమాడుచుండువాఁడ సాక్ష్యము చెప్పుటకు బో నెక్కుటతోనే యందఱకును వింతగాఁగనుపడెను. చింకిగుడ్డలు కట్టి వీధిలోఁ దిరుగుచుండు వెఱ్ఱివిస్సప్పఆల్పాకా కోటుతొడుగుకొని, బంగారపు వాచీగొలుసు వేసికొని కోర్టులో సాక్ష్యము చెప్పుటకు వచ్చుట వింతగదా. పెద్దమనుష్యునివలెఁ గన్పట్టవలెనని పార్టీలు వానికి ముస్తాబుచేసిరి. కాఁబోలునని చూడవచ్చిన వారిలోఁ గొంద అనుకొనుచుండిరి.

'సాక్షి సాక్ష్యము చెప్పగలిగినస్థితిలోనున్నాడా' యనిముద్దాయి వకీలడిగెను.

''అవును.' ప్రోసిక్యూటింగు ఇన్స్పెక్టరు చెప్పెను. 'సర్జను గారు శస్త్రముచేసిరి. సాక్షికిమతి తిరిగివచ్చెను. కొంతకాలము క్రిం దట నెత్తిపయి దెబ్బతగిలి మెదడుచెడి, మతిపోయినది. శస్త్రవ యిద్యము చేయుటతోనే యది బాగయినది మతితిరిగివచ్చినదిసాక్ష్య ము చెప్పునప్పుడు కోర్టువారు కనిపెట్టవచ్చును.

విశ్వనాథ శాస్త్రి యారంభించెను. 'నాకిప్పుడు జ్ఞాపకశక్తి స్వచ్ఛముగా నున్నది. నా దురదృష్టము వలన నా కూతురు చిక్కులం బడిపోయెను. ఇంటి అద్దె ఈయలేక పోవుటచే ఇంటి వారుపైకి తరిమివేసిరి. వీధిలోఁ దిరుగుచు, కానాలపయి నిద్రపోవు గతిపట్టెను. హత్యజరిగిన మరునాటి రాత్రి కానాపయిఁ బండుకొనియుంటిని. ముద్దాయి నావద్దకువచ్చెను. ఒక యర్ధరూపాయి యిచ్చెదనని చెప్పెను. ఒకపని చేయుమని యడిగెను. చేసెదనని చెప్పితిని. మాపినతండ్రి కుమారుడు శంకరశాస్త్రి యింటికి నన్నుఁ దీసికొనిపోయెను. పేపు తెఱచియుండెను. నేను నేలపయి గూర్చుండ బడితిని.' 'ముద్దాయికాక మఱియెవ్వరైనఁ జెంతనున్నారా ?' 'ఉన్నారు. కృష్ణాజీగారుండిరి. కృష్ణాజీయును ముద్దాయియును గలసి మాతమ్ముని చిట్టాపుస్తకమును దిరుగవేయుచుండిరి, అదియొక రహస్యలిపిలోఁ వ్రాయఁబడియుండెను. ఆ లిపి నాకును శంకరశాస్త్రికిని దప్ప యితరులకుఁ దెలియదు. మేమిద్దఱమును గలసి వ్యవహారము చేసికొనుచున్నప్పుడు ఆ లిపి యుపయోగించు చుంటిమి. అందేమి వ్రాయబడియున్నదో చదువుమని శ్రీనివాసుఁడు నాతోఁ జెప్పెను. పుస్తకము తెఱచి చూచితిని. ఏమో గాని, కేకలు వేసితిని. ఏల కేకలు వేసితినో నేఁజెప్పలేను. కేకలు వేయుట మాత్రము వాస్తవము దీపమార్పి వేసిరి. ఇంతలో నాకు సాయము చేయుట కెవ్వరో పరుగెత్తివచ్చిరి వారు సూర్యారావు, పుల్లయ్య, వేంకటరావునని నాకు దరువాత తెలిసినదిఁ'

'తరువాత నేమిజరిగినది?'

'ఆ పుస్తకము చూచుటతోనే ఆభాషకు వ్యాఖ్యానము వ్రాసిన పుస్తకమును, ధనాగారము తాళము చెవియును నాయొద్ద నున్నట్లు నాకు జ్ఞాపకమువచ్చెను. అవి జాగ్రత్తగా నాయొద్ద నుంచు

కొనుచుంటిని. నేను సూర్యారావుగారి యింటనుండఁగా నొకనాటి రాత్రి ముద్దాయియును, కృష్ణాజీయు నక్కడకువచ్చిరి. వ్యాఖ్యానపు పుస్తక మెత్తికొని పోవలెనని వారి యుద్దేశము. కాని యది వారికి దొరకలేదు. నానెత్తిపయిగొట్టి వారు పారిపోయిరి. ఆ దెబ్బవలన నాకు మేలేయయినది. దానికొఱకు శస్త్రముచేయుటతో మొదట కలిగిన మెదడు లోపముకూడ పోయి మతి తిరుగవచ్చినది.'

విశ్వనాథశాస్త్రి యూరిగిపోయెను. క్రాసులో నడిగిన ప్రశ్నలు కూడ ముద్దాయికి వ్యతిరేకములే యయ్యెను. వేంకటరావును, అచ్చన్నయును జెప్పినసాక్ష్యముల కూడ ముద్దాయికి విరోధము లయ్యెను. ఒక్కొక్క సాక్ష్యము పూర్తియగుసరికి ముద్దాయి మొక్కంత క్రిందకు గూలఁబడుచుండెను. తప్పించుకొనవలసిన యూహా యాతఁడు చాలసేపటిక్రిందటనే విడచివేసెను.

ఇన్స్పెక్టరుగారూ గ్రామములో తగు మనుష్యుఁడుగా నున్న కృష్ణాజీయను నొకనిపయి బలమైన సాక్ష్యములన్నియును వచ్చుచున్నవి. దానిసంగతి మీరాలోచింపలేదు. ఆతనిఁగూడ మనము విచారణ చేయవలసి వచ్చునేమో! అవి యబద్ధములని ఋజువు చేయింపవలసిన భారమతనిపయిఁ గలదుగదా.' అని మేజస్ట్రీటుగా రడిగిరి. ఇన్స్పెక్టరుగారును, ప్రాసిక్యూటింగు ఇన్స్పెక్టరుకూడ నట్లే తలఁచిరి. కృష్ణాజి నేరస్థుడు కాకపోయినను నేరస్థునితోఁ గలసి మెలసి తిరుగుచున్నట్లు సాక్ష్యమువచ్చినది. కావున మరునాటికి కేసువాయిదా వేయఁబడినది. కృష్ణాజీని అరెస్టుచేయుటకు ఇన్స్పెక్టరు వారంటు పుచ్చుకొనెను.

'కృష్ణాజీ కోర్టుగుమ్మము త్రొక్కఁడు. వ్యవహార మాలోపు ననే ముగించును.' అని వేంకటరావు సూర్యారావుతో ననెను. నాటికి కోర్టు ముగిసెను. 'అదిగో. అది దానిసంగతి. అనుకొనుచు వేడుక చూడవచ్చినవా రందఱును వెళ్ళిపోయిరి.

## ముప్పదియవ ప్రకరణము

### మంచిరోజులు.

కృష్ణాజీతనగదిలోఁ గూర్చుండి దస్తావేజులు తిరుగవేయుచుండెను. ఒక్కొక్కటియును ద్రిప్పిచూచి, చింపివేయుచుండెను. ప్రక్కనొక రంయిలుసంచి ప్రక్కలు బిగియునట్లు నిండినది యుండెను. ఆనిసమునఁ గోర్టులోఁ జరుగుచున్నదేమో యతనికిఁ దెలియలేదు. ఆతడు వేఱుప్రయత్నమున నుండెను. కోర్టుకువచ్చి చేతనైన సాయముచేసెదనని శ్రీనివాసునితోఁ జెప్పెను. గాని, ఏకారణముననో వెళ్ళలేదు. కాగితములు కొంతవఱకుఁ జింపిచింపి, యొక్క నిట్టూర్పు విడిచి, వాచిచూచే లేచినిలువఁబడెను. 'సరే అదేబాగుగనున్నది.' ఆతఁడనుకొనెను. 'మొట్టమొదట—అక్కడనుండి—ఆతరువాత—'

ఇంతలో వీధితలుపు తట్టబడెను. సేవకులెవ్వరో తలుపుతీసిరి 'ఇన్స్పెక్టరు!' ఆతఁడు గొణిగెను. 'అతనికి నాయొద్దనేమి పనియున్నది? శ్రీనివాసుఁడు నన్నుఁగూడ—' ఇన్స్పెక్టరు మెల్లగ, మర్యాదగ లోనికివచ్చెను. ఏమియని ప్రశ్నించుచునట్లు కృష్ణాజీయతనివైపుచూచెను.

'అయ్యా' ఇన్స్పెక్టరు చెప్పెను. 'శంకరశాస్త్రిహత్యలో మీరు కలిసియున్నట్లు మీపయి నేరముకనుపడినది. మిమ్ము అరెస్టు చేయుటకు వచ్చినాను. మీరు నావెంటరానలెను.' కృష్ణాజీనిశ్చలముగాఁ గూర్చుండెను. ఆశ లేదని దృఢమయ్యెను. ఆతఁడు వ్యర్థమయిన యాశలెప్పుడును పెట్టుకొనుచుండువాఁడుకాఁడు. దెబ్బతగిలినది దిట్టముగాఁ దగిలినది. ఆసంగతి యాతఁడుగ్రహించెను. 'రెండునిముసము లాగుఁడు' 'ఆతఁడు అదరును బెదరును లేకచెప్పెను.' 'ఒకభోగట్టాకొఱకెదురు చూచుచున్నాను. అందాక, ఈట్టకాల్చుచుండుడు' ఒకచుట్ట పయికిదీసెను. వద్దని ఇన్స్పెక్టరుచెప్పెను. 'దాహము వేయుచున్నది కొంచెము లెమొనేడు త్రాగెదను. మీకుఁగూడఁ గావ

లెనా!—' ఇంతలో కృష్ణాజీకేదియో బాధకలిగెను. పెదవులు నల్లఁ బాఱెను. భూమితిరుగుచున్నట్లాతనికిఁదోఁచెను. కొంచెము శాంతించెను. లేచినిలువఁబడెను. కుర్చీపయిఁ గూలబడెను. 'నేను మఱిరానక్కఱలేదు. నేననుకొని నట్లే యైనది. నాఁడు వేంకటరావు చెప్పెను అప్పటినుండి అదివచ్చుచునే యున్నది. నేఁడు తీవ్రముగనున్నది. ఊపిరియందలేదు. సరి—' కృష్ణాజీ మఱిమాటాడలేదు. మొగము దయ్యమువలె వికృతరూపమయ్యెను. కొఱఁడుబాఱెను. కాళ్లుచేతులు నిగుడఁబాఱెను. ఇన్స్పెక్టరుగారు పరుగెత్తుకొనిపోయి వైద్యునితీసికొనివచ్చిరి. ఆతఁడు మరణించెనని వైద్యుఁడు చెప్పెను. మరణవార్త బ్రహ్మపురమంతయు నల్లుకొనెను. ఊరంతయును గడబడగా నుండెను. అందఱినోట నీమాటయే యుండెను. మఱునాఁడు మఱల కోర్టులోలో విచారణయారంభమయ్యెను. వేగమేపూర్తి యయ్యెను ముద్దాయీనేరము నొప్పుకొనెను. ఉద్దేశమిదివరకే ఋజువయ్యెను. ఆలస్యముచేయక తన్నురితీయవలెనని ముద్దాయి బతిమాలుకొనెను. కేసుసెషన్సుకుబోయి కావలసినచర్యయంతయును జరిగెను. కొన్ని దినము లూరంతయు నిదేకబురుగా నుండెనుగాని నానాటికితగ్గిపోయెను.

కాలమొక్క రీతిగానుండదు. ఒకరివిచారము మఱియొకరి వేడుకకుఁ గారణము. వివాహమును గూర్చి వేంకటరావు తొందరపడెను. ఆటంకపరచుట కేమియునులేదు. విశ్వనాథశాస్త్రియొప్పుకొనెను. కూతురితో బాటు వెలిలోనుండుటకుదానుగూడ నంగీకరించెను. పదునైదుదినము లాపవలసినదని మాత్రము చెప్పెను. విశ్వనాథశాస్త్రియెప్పటివలె దృఢముగానుండెను. 'అమ్మా, నాకున్నయైశ్వర్యమంతయు నీకిచ్చివేసెదను.' అని చెప్పెను. కమల కర్థము కాలేదు. చిఱునవ్వునవ్వెను. చూచితివాయని వేంకటరావువైపు కనుసంజ్ఞచేసెను. 'మీనాన్నకు వార్థకముచే డబ్బు వెఱ్ఱియెత్తినది.' అని వేంకటరావు హాస్యమాడెను. మఱునాఁడువిశ్వనాథుఁడును పుల్లయ్యయు నేమేమోచాలసేపుమాటాడిరి. 'తమ్ముఁడా, నీవునాకుఁ జాల

యుపకారము చేసితివి. నీయుపకారము మఱచిపోను.' అని విశ్వనాధుఁడనెను. ఇద్దరునుబయలుదేరి గోపాలపురమునకుఁ బోయిరి. ధనాగారము చూచుకొనిరి. అక్కడనుండి పుల్లయ్య యెక్కడకోపోయెను కొద్దిరోజులలో వచ్చెదనని చెప్పెను. విశ్వనాధుఁడుతిరిగి యింటికి వచ్చెను. వివాహముహూర్తము నిశ్చయింపఁబడెను. అందఱును గోపాలపురమునకుఁ బోయిరి. సూర్యారావును, సూరమ్మయును వచ్చియుండిరి. బ్రహ్మపురములోనుండిన మఱికొందఱు పెద్దమనుష్యులుకూడ వచ్చియుండిరి. పుల్లయ్యకూడనావేళకుఁ దిరిగివచ్చెను. సంఘసంస్కరణమునం దభిలాషగల తరుణపురోహితుఁ డొకఁడు యథావిధిగాఁబెండ్లిచేయించెను. పెద్దవారుతిట్టిరి. నడిమివయసువారూరకుండిరి. తరుణవయస్కులు సంతోషించిరి. సభమధ్యకువచ్చి విశ్వనాధశాస్త్రిగట్టిగానిట్లని చెప్పెను.

'స్నేహితులారా నేను బీదవాఁడనని మీరందఱనుకొంటిరి. కాని, నాయొద్దరెండు లక్షలరూపాయిల యాస్తియును, నగలును, వడ్డివ్యాపారము లున్నవి. నాధనమీయూరులోనే యొకయింటిలో బాతియుంచితిని. ఇంతలో మతిపోయినది. ఎక్కడదాచితినో మఱచిపోయితిని. అందుచేత అడుగుకొని తినవలసివచ్చెను. మొన్న మరల నిక్కడకు పుల్లయ్య—కాదుమాపినతండ్రి కుమారుఁడును నారాయణశాస్త్రితో కలసివచ్చితిని. నాధనము యథాస్థితిగానేయుండెను. కాని నాపినతండ్రి కుమారుఁడు నారాయణశాస్త్రియన్న శంకరశాస్త్రి ధనమంతయును కృష్ణాజీ, శ్రీనివాసుఁడు మొదలగువారి కప్పిచ్చుటలోఁ బోయెను. నారాయణశాస్త్రి నావిషయమయి చాల కష్టపడెను. కావున నాయాస్తిలో సగమతనికిచ్చితిని. కృష్ణాజీ కుమార్తె కృష్ణవేణి నాకుమార్తెను గొన్నాళ్ళింటిలోఁ పెట్టుకొని పోషించుచుండెననివింటిని. తండ్రిచనిపోవుటచేతను, ఆ స్తియంతయు నప్పులవారు అమ్మివేయుట చేతను, కృష్ణవేణికి తిండిలేకుండెను. కావున ఆమెకు రెండు వేలరూపాయి లిచ్చితిని. మఱినాలుగు వేల రూపాయిలు దానిభర్తకిచ్చి బ్రతిమాలుకొంటిని. సంతోషించి

యూతఁడు తనయింటికి కృష్ణనుదీసికొని పోయెను. క్షులకు సంవత్సరమునకు నాలుగు వేల రూపాయలు ఖర్చునిమిత్త మిచ్చుచుందును. ఇదిగో, ఎగ్రిమెంటు వ్రాసితిని. కమలా, ఇదిగో—'

కమల కన్నులనుండి నీరు కారెను. అందఱు నాశ్చర్యపడిరి. కమలతండ్రిని కౌగలించుకొనెను. 'నేనంత మర్యాదకు పాత్రురాలను కాన' ని యామె మెల్లఁగాఁ జెప్పెను.

'అమ్మా, నీవునాకు జేసిన మేలు మఱచిపోవుదునా?' ఆతఁడు చెప్పెను. 'తిండికిలేని రోజులలో నీవుపరుల పంచలలోఁ జేరియుండిన, నాకు నెలకు మూఁడు రూపాయిలుగడించి యిచ్చితివి. నాకుఁగుమారులు లేరని విచారములేదు. నీవే నాకు కుమారుఁడవు. ఆ స్త్రీమెడ వేయుటకుఁ బ్రయత్నించు కుమారులే గాని, కష్టకాలమున సంరక్షించు కుమారులరుదు. నన్ను గడుపులోఁ బెట్టుకొని పోషించినావు. నాజన్మమెత్తి నిన్ను నేనెప్పుడును మంచిమాటాడలేదు వేంకటరావుతో నెప్పుడును గౌరవముగ మాటాడలేదు. ధనమునకన్నఁ బరోపకారమే ప్రభాతమని తలఁచువారు లోకముననున్నారని నాకిప్పుడు తెలిసినది. భ్రమపడి గోచిలోపుడివేసి ధనము దాచుచుందురు. గాని, కాలమువచ్చినప్పుడాధన మెగిరిపోవునని నాచరిత్రమువలనను మాతమ్ముడు శంకరశాస్త్రి చరిత్రమువలనను లోక మెఱుఁగవచ్చును. నాకాబుద్ధియిప్పుడు తిరిగినది. దెలివివచ్చినది. ఇఁక ముందౌదార్యము సంపాదించుటకుఁ బ్రయత్నింతును. నేనిచ్చిన యీస్వల్పద్రవ్యము మీరు పుచ్చుకొనుచుండుఁడు. అన్నట్టు మరచితిని. సూర్యారావునకు రెండువేలరూపాయిలియ్య నెంచితిని. రేపుప్రొద్దునే యిచ్చెదను. నాయనంతరమున నాధనమంతయు మీకేచేరునట్లు మరణశాసనము వ్రాసితిని. ఇదిగో రేపు బ్రహ్మపురమున రిజిస్ట్రీ చేయించెదను. బ్రహ్మపురమున—నెంబరుగల మేడకొంటిని. వసంతవరు

ఇద్దరును సంతోషముగ నాయింటఁ గాపురముండవచ్చును. నేను కాశీ, రామేశ్వరము మొదలగు యాత్రలు చేసికొని, దానధర్మములు చేసికొని, పితౄణము తీర్చుకొని తిరిగివత్తును.'

'ఎప్పుడు బయలుదేరుదువ'ని కమల యడిగెను. 'రేపురాత్రి మెయిలులోఁ బోయెదన'ని యాతఁడు చెప్పెను.

'పదిపూటలు మాతోఁ గలసి మెలసియుండి పోఁగూడదా' యని వేంకటరావ నెను.

'లేదు. నేనుపుట్టినది మొదలు రాగిదమ్మిడీ యెవ్వనికి నీయలేదు. మా తమ్ముఁడు శంకరశాస్త్రి మంత్రోపదేశమునకు నేకశాస్త్రులుగారికి నూరురూపాయిలిచ్చెను. కాని నేనదియు నీయలేదు. ఆమంత్రమే వానిఁ బెడిసికొట్టినదని యూరిలోనందఱు ననుకొనుచున్నారు. కాని యూసునా కేమిగాని, నేనుపోయి, బీదసాదలకు దానధర్మములు చేసికొనుచు కొన్నిదినములు యాత్రలుతిరిగివత్తును. తిరిగివచ్చి మీయింటనే యుందును.' అందఱకును సంతోషమయ్యెను. పెండ్లిముగిసెను. ఎవ్వరియిండ్లకు వారుపోయిరి. విశ్వనాథశాస్త్రి దేశయాత్రకుఁ బోయెను. కమలయును వేంకటరావును సంతోషముతోఁ గాపురముచేయుచుండిరి. సూర్యారావును, సూరమ్మయును అప్పుడప్పుడు వారియింటికివచ్చుచుఁ బోవుచుండిరి. కమలయొద్దను వేంకటరావు యొద్దను, అనుజ్ఞ తీసికొని, నారాయణశాస్త్రి–పుల్లయ్య తనత్రోవనుఁబోయెను. కథ కంచికిఁ బోయెను. మనమింటికిఁబోదము.

---

కొండపల్లి ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము.